మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.1.2025



నవ్వే నగ

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



నగలే నవ్వు

మాసపత్రిక, ఫిబ్రవరి, 2025 ₹ 50/-

ISSN 2454–4329



కాయ బరువా



కాయమే బరువు

# మిసిమి

మాసపత్రిక

సంపుటి 36 సంచిక 2

ఫిబ్రవరి - 2025

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : వల్లభనేని అశ్వినీకుమార్

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR

**Ph: 994 951 6567**

**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : జి. ఉమాసుందరి
040-27645536

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

UGC Care

LCCN 91-903060

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com

YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## ఫిబ్రవరి నెల సూచికలు...


తరలిపోతున్న తరాలు : ఎడిటర్ డైరి ... 3
జీవన మకరందం : ఎ.కె. ... 4
నోబెల్ సాహిత్య పురస్కారం - భారతీయులు : డా. గుజ్జు చెన్నారెడ్డి ... 5
లలిత సంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 8
కళ - ఖరీదు : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ ... 13
ప్రశ్నోపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు... 18
వేమన మానవతా దృక్పథం : ఆచార్య లక్ష్మీ ప్రసన్న ... 24
మనసు - మెదడు : కురుమయ్య యాదవ్ మేనుగొండ ... 27
జీవన గమనం : వేంకట ప్రసాద్ ... 29
**మిసిమి** గ్రంథాలయంలో రచయితలు : సి.ఎస్. రాంబాబు ... 30
శిష్టా : డా॥ నల్లపనేని విజయలక్ష్మి ...34
అష్టాధ్యాయి అద్వితీయ వ్యాకరణం : డా. బాశెట్టి లత ... 37
బహుమానం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 41
సమీర పద్య తారావళి : ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి ... 42
ఇంగ్లీష్ రివియేరా : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 47
కవి అంతరంగం : అలజంగి మురళీధర రావు ... 56
డా. పులిగడ్డ విజయలక్ష్మి : డా. గిన్నారపు ఆదినారాయణ ... 59
రెంటాల కూనలమ్మ పదాలు : పేపకాయల ప్రసాద్ ... 63
ఒగ్గు కథ : డా.ధరంసోత్ సరిత... 66
ప్రజలు, సమాజమే నా సాహిత్య పాఠ్యపుస్తకాలు : జూకంటి జగన్నాథం ... 69
జీవితం తెలిసిన కవి : ఆచార్య పి. హరినాథ్ ... 70
అందమే ఆనందం : రాయవరపు సత్యన్నారాయణ ... 71
నాట్య శాస్త్రం : ఐ.వి.రామరాజు ... 73
కథాహృదయం-అరికాళ్ళకింద మంటలు : రాజా ... 76
ఒక మంచి ప్రేమ కల : ఐ.వి.రామరాజు ... 77
మన సినిమా -ఫస్ట్ రీల్ : సి.ఎస్. రాంబాబు ... 78
చదవండి **మిసిమి** ... 79


**మిసిమి** సంస్థాపకులు ఆలపాటి రవీంద్రనాథ్ 29వ వర్ధంతి

### అట్టమీది బొమ్మలు



నగలే నవ్వు



కాయ బరువా



కాయమే బరువు



నవ్వే నగ

# తరలిపోతున్న తరాలు

ఒకతరం అంటే ముప్పయి సంవత్సరాలు – మేము పంతొమ్మిది వందల నలభై, యాభై దశకాల్లో ఈ భూమ్మీదకి అతిథుల్లా వచ్చినవాళ్లం. యాభైల్లో గోచీలుపెట్టి పెరిగినవాళ్లం – ఊళ్లో బళ్లో నేలమీద కూర్చొని పలకమీద బలపంతో అమ్మా అని రాయటం – తర్వాత హైస్కూల్లో బెంచీలమీద సాహసగాళ్లతో కూర్చుని ఎ.బి.సి.డిలు, ఆల్జీబ్రాలు నేర్చినవాళ్లం – అరవైల్లో కాలేజీల్లో కమ్యూనిస్టుల్లా ఆవేశపడినవాళ్లం – ప్రేమలేఖలు రాయటం – ప్రేమలో పడటం నేర్చినవాళ్లం. డెబ్భైలలో పెళ్లిళ్లు చేసుకుని కాపరాలు పెట్టినవాళ్లం. పిల్లలను కని, చదువులు చెప్పించాం. ఎనభైలలోనే సాహసాలు, వ్యాపారాలు చేసి సంపాదించినవాళ్లం. శతాబ్దం చివరికి వచ్చేసరికి ఒక ఇంటివారమయి కుటుంబాన్ని నిర్మించుకున్నాం – తెలివితేటలు మీరి లోకాన్ని కాచి వడపోశాం – రెండువేల పదిలో పాతుకుపోయాం. ఇరవైలలో ప్రపంచాన్నే జయించాం. చూశారా? ఎనిమిది దశాబ్దాలు – అన్ని భిన్నమైనవే– అన్ని ఛాలెంజింగ్‌గా జరిగినవే – రెండు శతాబ్దాల మధ్యలో సంధి కాలంలో నెగ్గుకొచ్చాం. చూడండి – ఆపరేటర్ టెలిఫోన్ దగ్గర్నుంచి – అబీడ్స్‌లో లాంగ్ డిస్టెన్స్ కాల్ కోసం 20 రూపాయలు డిపాజిట్ కట్టి బూత్‌లో నిలబడ్డాం. తర్వాత తిప్పేడయల్ – నొక్కే బటన్‌లు – కార్డ్‌లెస్ ఫోన్స్ – పేజర్లు – సెల్‌ఫోన్ – వీడియో కాల్ వరకూ వచ్చేశాం. స్మార్ట్ ఫోన్ చేతిలోకొచ్చేసింది.

ఫోటోగ్రఫీ – కెమెరాలే లేనికాలం – స్లైడ్స్ వేసేకుని చూశాం – ఇప్పుడు యూట్యూబ్‌కి చేరాం. కార్డ్‌ముక్క దగ్గర్నుంచి ఈమెయిల్ – వాట్సాప్ –పేపర్ టెలిగ్రాం నుంచి ఇప్పటి ఇన్‌స్టాగ్రామ్ వరకూ చూశాం – ఇంటిమీద ఆంటినా పట్టుకుని రేడియో విన్నాం – ట్రాన్సిస్టర్‌లో క్రికెట్ చూశాం – బ్లాక్ & వైట్ టి.వి వదిలి హెచ్.డి. సోనీ 4కె –ఓలెడ్ సామ్‌సంగ్ కొనేసాం. టూరింగ్ టాకీస్‌లో రోజులు మారాయి సినిమా నాలుగు ఇంటెర్వెల్స్‌తో నేలమీద కూర్చుని చూసాం. మాట్నీకి మాయాబజార్ చూసినవాళ్లం – ఐమాక్స్‌లో అవతార్ చూశాం! 35 ఎమ్.ఎమ్ – 70 ఎమ్.ఎమ్, సినిమా స్కోప్ ఐమాక్స్ – ఒటిటి – నెట్‌ఫ్లిక్స్ అన్ని అన్ని మా కళ్లముందే వచ్చేశాయి. పెద్ద గది పరిమాణంలో వుండే కంప్యూటర్ – పంచ్‌కార్డ్స్ – ఫ్లాపీ – డిస్క్ – ఇప్పుడు గిగా బైట్ – మెగాబైట్ వచ్చాయి – మేము ఇక్కడే వున్నాం – చేతిలో స్మార్ట్ ఫోన్ – అన్నింటికి వాడేస్తున్నాం. చెక్కు బుక్కులు – బ్యాంకులు మర్చిపోయాం – సైకిల్ గోచీపెట్టి నిక్కర్లు వేసి – పక్కతొక్కుడు తొక్కి – గాయాలు చేసుకున్నాం – పాంట్లు – అమెరికన్ స్లాక్స్ – టీషర్ట్స్ వాడేశాం – బాటా, నైకీ, రీబాక్‌లు తొక్కేశాం. చిన్నప్పుడు ఆట్లమ్మ దగ్గర్నుంచి – పోలియో వరకు – చివరకి కోవిడ్–19న్ని కూడా జయించాం – సైకిళ్లు, మోపెడ్లు , రాజ్‌దూత్, బులెట్లపై తిరిగాం. పెట్రోలు – డీజిల్ కార్లు వాడేసాము. ఇప్పుడు ఇవిలు – హైబ్రిడ్‌లు డ్రైవ్ చేస్తున్నాము. పొగబండిలో ప్రయాణం చేశాం – కళ్లల్లో బొగ్గు నలుసులు – బట్టలు పొగవాసనలతో తిరిగాం – ఇప్పుడు వందేభారత్ – బులెట్ రైళ్లను చూశాం – డకొటా విమానం నుంచి జంబోజెట్ ఎయిర్‌బస్ 380లో కూడా ప్రయాణం చేస్తున్నాం – చేతి రాకెట్లు దీపావళికి వదిలాం – చంద్రయాన్ మూడులో చంద్రుణ్ణి చుట్టాం – బీడీ నుంచి హవానా చుట్ట వరకు రుచి చూశాం – విప్పసారాకు స్కాచ్ విస్కీకి తేడా చెప్పేశాం – మాది అరుదైన తరం – ముళ్ల గడియారం నుంచి స్మార్ట్ వాచీ వరకు వాడేసాం. మమ్మల్ని మాలాంటి తరం ఎక్కడుంటుంది చెప్పండి – గుడ్డి దీపాల వెలుగులో చదివాం – ఇప్పుడు ఎల్.ఇ.డి. కాంతుల్లో తిరుగుతున్నాం – గోచీలు పెట్టాం – తరువాత గ్లోబంతా తిరిగాం – అన్నీ చూసిన తరం – అన్నీ చేసిన తరం – ఇప్పుడు తరలిపోతున్న తరం – బాజా భజంత్రీలతో – బంతిపూల దండలతో పండుగ చేసుకుందాం –



–

(ఆంగ్ల పోస్ట్ స్ఫూర్తి)

# జీవన మకరందం

- ❖ అదృష్టం నీ ముందు నడవాలి – కీర్తి నీ వెనుక రావాలి!
- ❖ చీకటి – ఒంటరితనం నిన్ను కృంగదీస్తాయి.
- ❖ విశ్వమంతా విద్యుదయస్కాంత తరంగాలతో నిండి వుంది. అందులోనే మన ఉనికి, మన ఉలికిపాటు!
- ❖ నక్షత్ర ధూళి ఊహాజనితం కాదు. నువ్వూ అందులో రేణువే సుమా!
- ❖ భూమికి సూర్యుడే దైవం!
- ❖ ఒక జీవితం చాలదు! మరో జీవితం ఉండదు!
- ❖ పేరు ప్రఖ్యాతులు నీ వ్యక్తిత్వాన్ని హరిస్తాయి.
- ❖ జ్ఞానం జీవితాన్నిస్తుంది! విజ్ఞానం జీవికనిస్తుంది!
- ❖ పవిత్ర గ్రంథాలు చదివితే సన్యాసం లభిస్తుందా?
  బ్యాంకు కేషియరు – కోటీశ్వరుడవుతాడా?
- ❖ చూడగలిగినవాడికే అన్నీ కనపడతాయి. వినగలిగితేనే అన్నీ వినపడతాయి!
- ❖ నీ ఇంద్రియాలన్నీ నీ చైతన్యానికి లోబడి వుంటాయి.



- ❖ నీవు ప్రేమించగల వ్యక్తే నీ స్నేహితుడు!
- ❖ అనుభవాలతో కోరికలు తీరవు. నేతితో నిప్పు ఆరదు కదా!
- ❖ నిన్ను నువ్వు విడిగా చూడగలగటం – ప్రేరణకు రహస్యం!
- ❖ నువ్వు అజాగ్రత్తగా వుంటే – ప్రపంచం నిన్ను శిక్షిస్తుంది!
- ❖ చీకట్లో నుంచి వెలుగు వస్తుందా? అలాగే జడత్వంలో నుంచి
  చైతన్యం రాదు!
- ❖ విద్య ద్వారా నీ తెలివితేటలు పెంచుకోవచ్చు
  నీ హృదయాన్ని దయ, ప్రేమతోనే నింపుకోవాలి!
- ❖ నీ ఆలోచనలే నీ మాటలకు, చేతలకు మూలం!
- ❖ ఏమి చేయాలో నిర్ణయించుకో – నీవే ఆచరణలో పెట్టగలవు!
- ❖ నిన్ను నీ చేతల ద్వారానే అంచనా వేస్తారు. నీ చదువు నీ వరకే పరిమితం!
- ❖ మనసు ప్రశాంతంగా వుంటే – బుద్ధి సరిగా పని చేస్తుంది!
- ❖ కోపం నిన్ను ప్రమాదంలో పడవేస్తుంది. గర్వం నిన్ను అక్కడే వుంచుతుంది!
- ❖ విశ్వానికి నువ్వు దర్పణం! అద్దంలో కనపడే బొమ్మలు చేతికందవు!
- ❖ విశ్రాంతంగా వున్న మనసు ఆనందానికి సేతువు.
  కోరికలతో బంధాలతో నిండిన మనసు దుఃఖానికి హేతువు!
- ❖ రాళ్లూ రప్పలు – ముళ్లు మొసళ్లూ వున్న మార్గమో,
  చిగురు తీవెలు – పూల పొదరిళ్లు పరిచిన దారో – ఎంచుకునేది నీవే సుమా!
- ❖ నీ ఆలోచనలే నీ చర్యలకు మూలం
  నీ సంస్కారమే నీ ఆలోచనకు ధాతువు!
- ❖ అద్వైతం అంటే అన్నింటికీ అతీతం కాదు.
  అద్వైతం అంటే అన్నిటితో మమేకం కావటం!



# నోబెల్ సాహిత్య పురస్కారం - భారతీయులు

– డా. గుజ్జు చెన్నారెడ్డి

రెండువేల సంవత్సరాలకు పూర్వమే నోబెల్ బహుమతులు ఇచ్చి ఉంటే గ్రీకు తత్త్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్‌లకు అవి దక్కి ఉండేవి. అయితే వారు స్వీకరించేవారో లేదో అనుమానమే. స్వీడిష్ రసాయనవేత్త, ఇంజినీర్, ఆవిష్కర్త, మిలటరీ ఆయుధాల తయారీదారు, విధ్వంసానికి మారుపేరైన డైనమైట్ సృష్టికర్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరున అతని డబ్బుతో ఇచ్చే బహుమతి తీసుకోవడానికి వారు ఏమనేవారో తెలీదు. అతను 1895లో రాసిన వీలునామా ప్రకారం అతని గౌరవార్థం అతను దాచిపెట్టిన డబ్బుతో నేడు ప్రపంచవ్యాప్తంగా పెద్ద బహుమతిగా భావిస్తున్న నోబెల్ బహుమతి ఇవ్వడం 1901లో ప్రారంభమయింది. అతని పేరున శాంతి బహుమతి కూడా అందుతోంది. ఈ 122 ఏళ్ళలో 8మంది భారతీయులు నోబెల్ బహుమతి అందుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అందులో మొదటిది విశ్వగురుగా గాంధి మొదటిసారిగా అనిపించుకున్న రవీంద్రునికి సాహిత్యంలో 1913లో దక్కింది. సాహిత్యంలో ఆ బహుమతి అందుకున్న మొదటి ఆసియావ్యక్తిగా అతనికి గుర్తింపు ఉంది. మరి ఈ 110 ఏళ్ళలో మరో భారతీయుడు సాహిత్యంలో ఆ బహుమతి ఎందుకు అందుకోలేకపోయాడో అన్నది చిన్నప్రశ్న ఏమీకాదు.

ఇప్పటివరకు సాహిత్యంలో ప్రపంచవ్యాప్తంగా 121 మందికి ఈ పురస్కారం దక్కగా అందులో రచయిత్రులు 18 మంది, ఆంగ్లేయులు 29 మంది, ఫ్రెంచ్ దేశస్తులు 16 మంది, జర్మనీదేశ రచయితలు 16 మంది ఆయాదేశాల తరపున గరిష్ఠంగా నోబెల్ అందుకున్నారు. ఆ నూట ఇరవైఒకటిలో మనది ఒకటి. వందేళ్ళ క్రితమే ఒక భారతీయునికి నోబెల్ బహుమతి అందుకోగల సత్తా ఉందని నిరూపించాడు ఠాగూర్. బెంగాలీ భాషలో రాసిన అతని 'గీతాంజలి' అతనే ఆంగ్లంలోకి అనువదించి ఆ బహుమతి సంపాదించిన అతనిని బెంగాల్ రచయితగానే గౌరవించింది నోబెల్ కమిటి. అనువదించినపుడు బెంగాలీలో ఉన్న రుచి ఆంగ్లంలో రాలేదని అతను వాపోయాడు.

సాహిత్యం అనేమాటకు అర్థం కళాత్మక రచన అంటుంది కేంబ్రిడ్జి నిఘంటువు. ఆ కళకు ఆధారం సంస్కృతి. తమ దేశ సంస్కృతి, సౌందర్యం ప్రపంచానికి బ్రిటీష్ రచయితలు తెలిపినంతగా ఏ దేశస్తులు చెప్పలేకపోయారు. ప్రకృతి రచయితగా పేరుగాంచిన సీనియర్ రొమాంటిక్ కవి వర్డ్స్‌వత్ ఇంగ్లాండ్‌లో దొరికే డేఫడిల్స్ అనే పూలను పొగిడిన తీరు, మన కైలాసంలో దొరికిన బ్రహ్మపుష్పం కంటే అందమైనదని వర్ణించాడు. నేను విశాఖపట్టణంలో ఆచార్యునిగా పనిచేస్తున్నప్పుడు అప్పటి మా సహచర ఆచార్యులు ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగ ఆచార్యులు డా॥ ఎస్.ఎస్.వి.యన్.శకుంతల గారు ఇంగ్లాండ్‌లో ఆరునెలలు ఉండి వచ్చారు. ఆంగ్ల ఆచార్యులు కాబట్టి షేక్స్‌పియర్ జన్మస్థలం స్ట్రాట్‌ఫర్డ్ ఎవన్‌తో సహా వర్డ్స్‌వత్ సాహిత్యంలో పొగిడిన ప్రకృతి అందాలను పరిశీలనగా చూసారు. ఆమె తిరిగి విశాఖపట్టణం వచ్చినప్పుడు నేను అడిగిన ప్రశ్న "మేడమ్ వర్డ్స్‌వత్ పొగిడిన ఆ డేఫడిల్స్ పూలు అంత అందంగా ఉన్నాయా?" అని. ఒక్క ముక్కలో ఆమె చెప్పిన సమాధానం నాకు ఇంకా గుర్తుంది. "సర్, ఆ అందం మన అరకువేలీ ముందు నథింగ్", అన్నారు. మంచుకురిసే వేళలో మన అరకువేలీలో పూసే వలిసెపూలు డేఫడిల్స్ కంటే అందమైందా అని నేను ఆశ్చర్యపోయాను.

ప్రకృతే కాదు. మన సంస్కృతిని కూడా ప్రపంచానికి తెలియజేయడంలో మనది వెనుకంజే. మా తాతలు నేతులు మాటలు మనకు తక్కువేమీలేవు. మన కాళిదాసు సాహిత్యం ఆంగ్లంలోకి అనువదిస్తే ఇరవై నోబెల్ బహుమతులు వచ్చి ఉండేవన్నవారు లేకపోలేదు. మన తెలుగుకథలు పెంటకుప్పల దాటడంలేదు అనేవారూ ఉన్నారు. ఎవరేమన్నా మన

చరిత్ర, సంస్కృతి, సాహిత్యం ప్రపంచానికి సాహిత్యం ద్వారా అందించడంలో మనం వెనుకబడి ఉన్నామనడంలో సందేహంలేదు. ఐరోపా ఒక దేశంకాదు. అందులో ఎన్నో దేశాలు ఉన్నాయి. దేశానికో భాష, ఒక సంస్కృతి. గత వెయ్యి సంవత్సరాల చరిత్ర పరిశీలిస్తే ఐరోపాలో జరిగినన్ని యుద్ధాలు ఎక్కడా జరగలేదు. ఆ తరువాత భారత ఉపఖండానిదే రెండవస్థానం. భారతదేశంలో ఎన్నో యుద్ధాలు జరిగినా ఐరోపావాసుల్లా భారతీయులు విడిపోలేదు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ దేశాల్లా ఇండియాలో బెంగాలీదేశం, పంజాబీదేశం, తెలుగుదేశం, కన్నడదేశం లేవు. ఇక్కడ ఉన్నది ఒక్క భారతదేశమే. భారతీయులందర్నీ మతం కలిపిందా అంటే, ఐరోపాలో కూడా ఒకే మతం ఉంది. బహుశా భారతీయుల్ని కలిపి ఉంచింది ఈ కర్మభూమే.

ప్రపంచంలో మూడే మానవజాతులు. తెలుపు, నలుపు, గోధుమరంగు. మనం గోధుమరంగట. ఆర్య సంతతికి చెందిన ఉత్తరభారతీయులు గోధుమరంగులో ఉండొచ్చు. భూమధ్యరేఖకు దగ్గరగా ఉండి సూర్యుని కిరణాలు నేరుగా తాకి దక్షిణభారతీయులు లంకతో సహా అటు తెలుపు, నలుపు కాకుండా ఇటు బ్రౌన్ కాకుండా డార్క్ బ్రౌన్‌గా ఉంటారు. ఇక రాష్ట్రానికో భాష, రాష్ట్రానికో సంస్కృతి, ఉపసంస్కృతులు. భారతదేశమే ఒక చిన్న ప్రపంచం అని పరదేశీయులతో కితాబు అందుకున్న సంస్కృతి మనది. హిమాలయాలు దాటి దేశంలో ప్రవేశించడం ఎంతకష్టమో తెలిసిన గ్రీకువీరుడు అలెగ్జాండర్ భారతదేశం సందర్శించాలని ప్రాణాలను అడ్డుపెట్టి వచ్చాడు. ఒకప్పుడు ఏడు డాలర్లు ఒక ఇండియన్ రూపాయికి సమానమట. ఏమైపోయిందీ సౌభాగ్యం? ఎటుపోయింది? ఇంగ్లాండ్‌లో అ, ఆ లు నేర్చని రోజుల్లో మన దగ్గర నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలలో ఉన్న విజ్ఞానం ఏమైపోయింది? ఆనాడే అరిస్టాటిల్ భారతదేశ గొప్పతనం అతని శిష్యుడు అలెగ్జాండర్‌కు తెలియజేసి ఉండాలి. మళ్ళీ మనం నేతులవైపు వెళ్ళిపోతున్నాం.

ఇక నేటి ప్రపంచ సాహిత్యం పరిశీలిస్తే, పుస్తకాలన్నీ దొంతుపెడితే, చంద్రున్నిదాటి పైకి వెళ్ళిపోతాయి. అదృష్టవశాత్తు కంప్యూటర్ తెరలు, అంతర్జాలం వచ్చి అందులో ఒదిగిపోతున్నాయి. ఒకప్పుడు ప్రపంచ ప్రఖ్యాత పుస్తకాలు చదవాలని ఉండేది. నేడు ఏమి చదవాలో తెలియడంలేదు.

సాహిత్యం వరకు వస్తే షేక్స్‌పియర్ నుండి విక్టోరియన్ నవలాకారుల వరకు ఇంగ్లాండ్‌లో ప్రతిగోడ, ప్రతి అరుగు ప్రపంచానికి తెలియజేసారు. కీట్స్ 'ఏ థింగ్ ఆఫ్ బ్యూటీ ఏ ఇజ్ జాయ్ ఫర్ ఎవర్' అంటే వర్డ్స్‌వత్ 'ఇమోషన్స్ రికలెక్టడ్ ఇన్ ట్రాంక్విలిటి' అన్నాడు. అవే పదాలు మనం నేటికి వల్లెవేస్తున్నాం. మౌర్యసామ్రాజ్యాధినేత బింబిసారుడు కంటె మనకి ఎలిజబెత్ మహారాణి, విక్టోరియ మహారాణులు ఎక్కువగా తెలుసు. సరే ఆంగ్లేయులు ఒకటిన్నర శతాబ్దాలు పరిపాలించారని సమర్థించుకున్నా మనకు మనం పరిపాలించుకోవడం ప్రారంభించి అందులో సగం సమయం అయింది కదా! ప్రపంచంలో భారతీయత వెనుకబడిపోయిందని మనం నూతన జాతీయ విద్యావిధానం 2020లో పలికిన బీరాలు ఎంతవరకు ముందుకు వెళ్ళతాయో చూడాలి.

ఆంగ్లేయులు, ఫ్రెంచ్‌వారు, జర్మనీ దేశస్తులు వారి చరిత్ర, సంస్కృతులు రాసి, రాసి ఒక్కొక్కరు పదికిపైగా నోబెల్ బహుమతులు తీసుకుపోగా, గత కొంతకాలంగా ఆఫ్రికన్ రచయితలు ఆయా తెగల చరిత్ర, సంస్కృతి, జీవనవిధానం సాహిత్యరూపంలో తెలియజేసి నోబెల్ బహుమతులు అందుకుంటున్నారు. ఆయాదేశాలలో ఎక్కడ పరిశీలించినా దాదాపుగా ఒక సంస్కృతి కనిపిస్తుంది. ఆఫ్రికన్ దేశాలలాంటి తెగలు ఇండియాలో ఎన్ని ఉన్నాయో చెప్పలేము. వారి సంస్కృతి అత్యంత అరుదైనది. వారి భాష, వేషం, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, నీతి, నిజాయితీ మిగతా భారతీయులకే తెలీదు. ఇక ప్రపంచానికి మనమెప్పుడు చాటిచెప్పగలం! నార్త్ ఈస్టర్న్ రాష్ట్రాలలో చెప్పలేనంత సంస్కృతి ఉంది. అంతెందుకు, తెలుగు రాష్ట్రాలలో లక్షలాదిగా నివసిస్తున్న ఆదిమ సంచారజాతుల జీవనవిధానం, సంస్కృతి సాహిత్యంలో మనం ఎంతవరకు ప్రపంచానికి తెలియజేసాం? ఈమధ్యకాలంలో వలస వెళ్లేవారు కొత్తదేశంలో సంస్కృతిని ఆహ్వానించేటప్పుడు భిన్నసంస్కృతులు ఘర్షణగా రాసిన రచనలను డయస్పోరా సాహిత్యంగా పిలుస్తున్నారు. అందుకు కొలమానం దేశం దాటడమే. దేశమంటే గీతలు గీచుకుని, కంచెలు వేయడమే. పైనుండి విమానాల్లో ఎగిరి మళ్ళీ కలిసిపోతున్నారు. ఈ డయస్పోరా సాహిత్యం ప్రస్తుతం ప్రపంచ సాహిత్యాన్ని ఆకర్షిస్తుంది. మన రచయితలు విదేశాలకు వెళ్ళి అక్కడిదో ముక్క, ఇక్కడిదో ముక్క రాసి డయస్పోరా సాహిత్యంలో రాణిస్తున్నారు.

ఒకప్పుడు దేవలోకంలో పుష్పాలను పొగిడే మన కవులకు అగ్గిపుల్లా, కుక్కపిల్ల గురించి కూడా కవిత్వంలో రాసుకోవచ్చని అన్నారు మన అభ్యుదయకవులు. కాని మన రచయితలు ఉన్నత, మధ్యతరగతి బ్రతుకుల వరకే రాసి అంతకంటే కిందకి దిగడంలేదు. సరే ఆ దిగువన ఉన్నవారు రాస్తారా అంటే వారంతా అతి పేదరికంలో ఉన్నారని ప్రపంచ నివేదికలు తెలియజేస్తున్నాయి. కాలే కడుపుతో దేశభక్తుడైనా ఒకరు కాగలరేమో కాని డొక్క మాడ్చుకుని బడికి వెళ్ళడం సాధ్యంకాదు. మరి వారి గురించి రాసే రచయితలు ఎవరు?

భిన్న భాషల, సంస్కృతుల నిలయమైన భారత దేశంలో దొరికే కథావస్తువులు కుప్పలతెప్పలు. మూడు వైపుల సముద్రం, ఒకవైపు హిమాలయ సౌందర్యం మనోహరం. ఇక చెట్టు, పుట్ట, పూలు ప్రకృతి అంటే చెప్పనలవి కానిది. ఐరోపాలో క్రీస్తుపుట్టక మునుపే మనదేశంలో బుద్ధుడు పుట్టాడు. చరిత్ర ఎంత తోడినా తరగదు. ఇక నదులు, వాటి అందాలు వర్ణనాతీతం. జంతువులు, పక్షులు ఎవరూ పెంచకపోయినా కోట్లాది సంవత్సరాలుగా మనుగడ సాగిస్తున్నాయి. అందులో చాలావరకు మన దేవతలకు వాహనాలు. వీటిని కూడా తక్కువగా ఏమీ మనం పూజించం. జాన్‌కీట్స్ రాసిన 'ఓడ్ టు ఏ నైటింగేల్' పద్యంలో ఆ నైటింగేల్ అనే పక్షి అరుపు మన కోయిల అరుపు ముందు దిగదుడుపు. కాని నైటింగేల్ పాటను అతను స్వర్గంలో వీణవాయించి పాడిన మన లక్ష్మీదేవి పాటకంటే గొప్ప శ్రావ్యంగా ఉందని రాసాడు.

ప్రపంచంలో ఎక్కడైనా మన స్త్రీల చీరకట్టు ఉందా? వారు ధరించే వస్త్రాలు మన చీరలో పావొంతు కూడా ఉండవు. సంస్కృతికి ఆవలవైపు గోచిగుడ్డలు కట్టుకుంటున్నామని ఆఫ్రికన్స్ రాసి బహుమతులు అందుకుంటున్నారు. మన దగ్గర తక్కువ గోచీలు ఉన్నాయా? నేటికి జాకెట్ వేసుకొని స్త్రీలు మన సంస్కృతిలోనే కదా ఉన్నారు! ఇది సంస్కృతికి ఆవలవైపు కాదు. అదే మూలం. ప్రపంచం మొత్తం జరిపే ఉత్సవాలు మనం జరిపే ఉత్సవాలలో సగం ఉండవు. మనకి ఊరికోదేవతే ఉంటే ఐరోపా అంతట ఇద్దరు ముగ్గురే. వాళ్లనే తిప్పితిప్పి రాస్తున్నారు. మన వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు నుండి వచ్చిన సాహిత్య సంపద అంతా ఇంతా కాదు.

ఐరోపావాడో, అమెరికావాడో, ఆస్ట్రేలియావాడో కథా వస్తువు కోసం వెతుక్కోవాలి. మనం ఉన్నదే కథావస్తువుల మధ్య. అది పద్యంగాని, నాటకంగాని, నవలగాని మనకున్నన్ని 'థీమ్స్' ప్రపంచంలో ఎవరికున్నాయి? ఇక మన పేదరికం కోసం రాయాలంటే ఎన్నో గిగాబైట్ల సైట్లు నిండిపోతాయి. అవి చదివేటప్పుడు కారిన కన్నీటితో ఒక కొత్త కడలి ఏర్పడుతుంది. ప్రపంచాన ఎక్కువగా భారతదేశంలోనే 28కోట్ల మంది నిరుపేదలున్నారని అంతర్జాతీయ సంస్థలు చెబుతుంటే మన దగ్గర కథావస్తువులు లేవంటే ఎలా? నగరాల్లో మురికివాడల్లో మక్కిపోతున్న వారి జీవితాలు సరిపోవా? గూడులేకున్నా తరతరాలుగా జీవిస్తున్న తెలుగోళ్ళున్నారు. కొండలు కోనల్లో నేటికీ కందమూలాలు తింటున్నవారు వెతికితే దొరుకుతారు. ఈ నగ్నసత్యాలు రాయాల్సిన బాధ్యత రచయితలది కాదా? భారతీయులు క్రికెట్ రంగంలో ప్రపంచ రికార్డులు తిరగ రాసారు. బహుశః ఒక కోటిమంది యువకులు ప్రతిరోజు ఎంతో నిష్టతో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటారు. మరి మనదేశంలో రచయితలు ఎంతమంది? తమ వృత్తిని కొనసాగిస్తూ రచనలు చేసేవారే ఎక్కువ. కవితలు రాసే కొడుకుంటే పెళ్ళి సంబంధం చూసేటప్పుడు ఆ విషయం దాచే తల్లిదండ్రులు లేక పోలేదు. ఇక రచయితకు ప్రోత్సాహం తక్కువే. రాసినవాళ్ళు ప్రచురణకు అష్టకష్టాలు పడినవారు తక్కువేంలేరు. క్రికెట్‌లో ఉన్న కృషి, ప్రోత్సాహం రచయితకు ఎక్కడుంది?

నేడు ప్రపంచం నలుమూలలా భారతీయులు దూసుకుపోతున్నారు. కొన్ని రంగాలలో ముందుకు వెళుతున్నా ఒలింపిక్స్‌లాంటి క్రీడలు, రచనల రంగంలో వెనకబాటు స్పష్టంగా కనిపిస్తుంది. సాహిత్య సమావేశాలు, గోష్టులు జరుగుతున్నా ప్రోత్సాహం తక్కువే. అపారమైన మన రచనా వస్తువులు ఉపయోగించి భారతీయతను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం ఉంది. ఇదీ మేకిన్ ఇండియాలో భాగంగానే భావించాలి. అటుదిశగా వర్ధమాన రచయితలను ప్రోత్సహించాలి. చైనాలో ఇరవై ఏళ్ళ తరువాత జరగబోయే ఒలింపిక్స్‌లో పాల్గొనేవారిని ఇప్పుడే ఎంపికచేసి, పిల్లల దశలోనే తర్ఫీదు ఇస్తారట. దేనికైనా ప్రణాళిక ఉండాలి. రచనా వ్యాసంగంలో అటువంటి ప్రణాళిక మనకు ఉంటే సకాలంలోనే భారతీయులు నోబెల్ పురస్కారం అందుకుంటాగా

డా॥ గుజ్జు చెన్నారెడ్డి
ప్రొఫెసర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
సెల్ నెం : 9849254826

# లలిత సంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

### 2. ఏడుకొండలసామి

రచన : రావులపర్తి భద్రిరాజు

సంగీతం, గానం : ఘంటసాల

శుద్ధ ధన్యాసి–మిశ్ర చాపు

ఏడుకొండలసామీ! ఎక్కడున్నావయ్యా
ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా ॥ఏడు॥

1. ఆకాశమంటు ఈ కొండ శిఖరమ్ముపై
మనుషులకు దూరంగా మసలుతున్నావా ॥ఏడు॥

2. ఎచ్చోట గాంచిన నీవుందువందురే
ఏమిటో నీ మాయ తెలియకున్నామయ్యా
ఈ అడవిదారిలో చేయూత నీయవా
నీ పాదసన్నిధికి మము జేరనీయవా ॥ఏడు॥

**భావం :** ఓ ఏడుకొండల వేంకటేశ్వరస్వామీ ! ఎన్ని మెట్లెక్కి వస్తున్నా ఇంకా కనిపించడం లేదు. ఎక్కడున్నావయ్యా స్వామీ? ఓహో…ఈ మనుషులందరికీ దూరంగా, ఆకాశమంత ఎత్తున ఉన్న ఈ తిరుమల కొండ శిఖరాలపై కొలువున్నావా స్వామీ ! ఎక్కడ చూసినా నువ్వే ఉంటావని యోగులు, మహర్షులు చెబుతారుగదా ! మరి ఈ అడవిదారిలో కనిపించవేమి ? ఏమిటి నీ మాయ స్వామీ ! మాపై కరుణించి కాస్త మాకు చేయూత నందించి నీ పాద సన్నిధికి చేర్చుకో. నీ దర్శనమిచ్చి మమ్ము ఏలుకో స్వామీ!

దీన్ని రచించిన రావులపర్తి భద్రిరాజు గారు 1929లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురంలో జన్మించారు. సుప్రసిద్ధ కవి, చిత్రకారులు అడవి బాపిరాజు గారికి ఈయన మేనల్లుడు. భద్రిరాజు గారు చిన్నప్పట్నించి మేనమామ దగ్గరే కవిత్వం, చిత్రకళ అభ్యసించారు. 1952 తరువాత "శశికళా నిలయం"ను చేరుకుని ఎన్నో పాటలు, నాటికలు రాశారు. వీరి పాటలను ఘంటసాల, సాలూరి, రాజేశ్వరరావు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, బాల సరస్వతి, పి. సుశీల మొ.వారు ఆలపించారు. భద్రిరాజు గారు "వెల్ల" గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ నిర్వహణ కమిటీ సభ్యునిగా కొంతకాలం పనిచేశారు.

'ఏడుకొండలసామి'లో 'స్వామి' బదులు 'సామి' అనడంలోనే సామాన్యుని ఉచ్చారణ సౌందర్యం కనిపిస్తుంది. మెట్లెక్కి వెళుతున్న భక్తుని ఆర్తి, ఆవేదన ఈ పాటలోని ప్రతి అక్షరంలోనూ ధ్వనిస్తుంది. ఈ మనుషులంటే, వీళ్ళ ప్రవర్తన అంటే దేవునిక్కూడా భయం వేసిందేమో ! వీళ్ళందరికి దూరంగా, అందనంత ఆకాశపుటెత్తులో దేవుడు వెలిశాడని కవి చమత్కరించారు. "సర్వం విష్ణుమయం జగత్" అనే పురాణవాక్యాన్ని మనసులో పెట్టుకుని, దాన్ని సామాన్యుని నోట అతి సామాన్యంగా పలికించడానికే "ఏ చోట గాంచిన నీ వుందువందురే" అనే పంక్తిని కవి నిర్మించారనిపిస్తున్నది. భక్తుని అమాయిక విశుద్ధహృదయం అంతా "ఈ అడవిదారిలో చేయూత నియ్యవా" అనే పాదంలో విస్తరింపజేయడం ఈ రచనలోని ఒక విలక్షణత. అయితే ఘంటసాల గారు మొదటిసారి ఆలిండియా రేడియోలో పాడినప్పుడు రెండవ చరణం రెండవ పాదంలో "ఏమిటో నీ జాడ" అని పాడారు. తరువాత హెచ్.యం.వి. వారి రికార్డుకు పాడేటప్పుడు భద్రిరాజు వారు 'జాడ' పదాన్ని మార్చి 'మాయ' చేర్చారు. కనుక రికార్డులో 'ఏమిటో నీ మాయ' అని వినిపిస్తుంది.

లలితసంగీతానికి ఒక క్రొత్త రూపును ఏర్పరచి, తన అమృతగానంతో ప్రాణం పోసినవారు ఘంటసాల మాస్టారు. ఆయన శాస్త్రీయ సంగీతపు మూలాలతో లలిత గీతాలకు, సినిమా పాటలకు మెఱుపులు, జిలుగులు అద్దారు. ఈ పాటను ఘంటసాల గారు శుద్ధధన్యాసి రాగంలో బాణీ చేశారు. ఈ రాగానికే 'ఉదయరవిచంద్రిక' అనే మరో పేరు కూడా ఉంది. దీన్ని హిందుస్తానీ సంగీత సంప్రదాయంలో 'ధాని' అని పిలుస్తారు. 22వ మేళకర్త అయిన ఖరహర ప్రియరాగజన్యమైనది. ఈ శుద్ధ ధన్యాసి 'స గ మ ప ని స' అనే స్వరాలతో ఔడవ రాగంగా ప్రసిద్ధి పొందింది. ఘంటసాలగారి ఒక రసవంతమైన అలవాటు వల్ల రెండో చరణం, రెండో పాదంలో 'తెలియకున్నామయ్య' అనేచోట రిషభ స్వరాన్ని అందంగా స్పృశిస్తూ జారడంవల్ల

"ఏమీ తెలియని అమాయక భావం" చక్కగా స్ఫురించేట్లు చేశారు. ఈ పాటను ఆలిండియా రేడియో వారు ప్రసారం చేయగా గ్రామఫోన్ కంపెని (హెచ్.యం.వి.) రికార్డింగ్ మేనేజర్ మంగపతి గారు విని ఆకర్షితులైనారు. దాని గురించి అప్పటి వారి సీనియర్ సేల్స్ రిప్రజెంటేటివ్ ఆల్‌ఫ్రెడ్ తంగయ్య గారితో ప్రస్తావిస్తే "కాకినాడ హెచ్.యం.వి. డీలర్ గిరి కంపెనీ వారు ఈ పాటను రికార్డుగా విడుదల చేశారా" అని తంగయ్య గారిని అడిగారని చెప్పారుట. అంటే పబ్లిక్ డిమాండ్ బాగా ఉందని గమనించిన మంగపతి గారు రేడియో వారి అనుమతి తీసుకుని ఆయన దీన్ని రికార్డు చేయటానికి సన్నాహం చేశారు. ఇక్కడ తగిన స్వాతంత్ర్యం లభించడం వల్ల ఘంటసాల గారు పల్లవికి ముందు "గోవింద" నామాన్ని చేర్చారు. మెట్లెక్కే భక్తులు స్వామిని ఎలా తల్చుకుంటారో సరిగ్గా అలాంటి నినాదాన్నే ప్రారంభ నేపథ్యసంగీతం మీదుగా ఎత్తుకోవడం ఎంతో కమనీయంగా ఉన్నది. పల్లవిని, చరణాలను రేడియోలో లాగ కాక, ఖచ్చితమైన సంగతులతో రూపొందించుకుని ఎంతో భక్తి ప్రపత్తులతో ఈ పాటను ఆలపించారు. "ఈ అడవి దారిలో చేయూత నీయవా" దగ్గర ఒక మనోహరమైన ఆలాపనను సంగ్రహంగా చేర్చారు. పాట ముగింపుతో పల్లవిని ఆపి సాకీలాగా రేడియోలో పాడారు. కాని రికార్డులో పల్లవిని లయతోనే కొనసాగించి 'సామీ' దగ్గర ముగించారు.

నిజానికి ఈ పాట సాహిత్యపు పోకడను బట్టి చూస్తే భద్రిరాజుగారు 5 మాత్రల ఆవర్తంతో, ఖండగతిలో రాసినట్లు తోస్తున్నది. కాని ఘంటసాల గారికి ఖండగతి కన్న మిశ్రగతి బాగుంటుందనిపించింది. అందుకే మరో రెండు మాత్రల కాలానికి లాగి మిశ్రచాపు తాళంలోకి ఒదిగేట్టు చేశారు. ఈ తాళాన్ని హిందుస్తానీ పద్ధతిలో 'రూపక్' అని పిలుస్తారు. దీనికోసం 'ఏడూ, ఎక్కాడున్నా, కానారాక" వంటి అసాధు దీర్ఘస్వరూపాలు అనివార్యమయ్యాయి. అయితే గ్రామీణుల గానంలో ఈరకమైన దీర్ఘాలు సర్వసామాన్యమే కనుక ఆబాల గోపాలం ఈ పాటను తలకెత్తుకున్నారు. గుండెలకు హత్తుకున్నారు. అంతకంటె గాయకులకు కావలసిన ధన్యత వేరే లేదు.

**3. నమో వెంకటేశా**

**రచన : రావులపర్తి భద్రిరాజు**
**సంగీతం,గానం : ఘంటసాల**

**ఆరభి–ఆది**

**సాకీ॥ నమో వెంకటేశా! నమో తిరుమలేశా!**
**నమస్తే.....నమస్తే....నమః**

**పాట॥ నమో వెంకటేశా! నమో తిరుమలేశా!**
**మహానందమాయె ఓ మహాదేవదేవా! ॥నమో॥**

**1. ముడుపులు నీకొసగి మా**
**మొక్కులు దీర్తుమయా**
**ముక్తి కోరి వచ్చే నీ**
**భక్తుల బ్రోవుమయా ॥నమో॥**

**2. నరకతుల్యమౌ ఈ భువి**
**స్వర్గము చేయవయా**
**మనుజులు నిను చేరే పర**
**మార్థము తెలుపవయా ॥నమో॥**

**భావం :** దేవదేవుడవైన ఓ తిరుమలేశ్వరా ! నీకు నమస్కారాలు. ముడుపులు గట్టి నీకు సమర్పించుకుని, మా మ్రొక్కులను తీర్చుకుంటాం. మమ్మల్ని రక్షించి మాకు మోక్షాన్నియ్యవయ్యా ! నరకబాధల ననుభవిస్తున్న ఈ భూలోకాన్ని స్వర్గంగా మార్చు స్వామీ ! మానవులందరు నిన్ను సులభంగా చేరుకునే పరమార్థాన్ని మాకు ఉపదేశించు దేవా ! వేంకటేశ్వరా ! నీకు నమస్కారాలు.

ఈ పాట రికార్డుగా విడుదలైనప్పటి నుండి ఇప్పటిదాక కూడా సజీవంగా, అన్ని తరాల హృదయాల లోనూ మారు మ్రోగుతున్నదంటే ఘంటసాల గళ మహిమమో, భద్రిరాజు కలం మాయో, మంగపతి నోటి చలువో రసజ్ఞులకే తెలియాలి. ఒకనాటి కాలంలో ఈ పాట తోటే సినిమా థియేటర్లు, వ్యాపార సంస్థలు తమ తమ పనులను ప్రారంభించేవి. ఏ పనికైనా ముందుగా పూజించవలసిన 'గణనాయక స్తోత్రం' బదులు ఈ పాటను వేసుకుని, తర్వాతనే వినాయకపూజను చేశారనడంలో పరమానందభరిత విచిత్రమే తప్ప అత్యుక్తి ఎంత మాత్రం లేదు. నేటి ఆధునికతరానిక్కూడా ఈ పల్లవి ఆనందాన్నిస్తున్న దనడానికి ఈ పేరుతో విడుదలైన వెంకటేష్ సినిమా 'నమో

వెంకటేశ' ప్రబల సాక్ష్యం. ఈ సినిమాలో ఈ పాట పల్లవిని మెరుపులాగా కొన్ని క్షణాల పాటు ఉపయోగించు కోవడంలోనే దీని జీవంత లక్షణాన్ని మనం చక్కగా అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు. "మల్లీశ్వరి" (వెంకటేష్) సినిమా టైటిల్స్‌కు నేపథ్యంలో ఈ పల్లవిని ఆధునికగాయకులు పాడారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ వారు తమ ప్రతి ప్రసారంలోనూ ఈ పాట పల్లవిని 'మంత్రం' లాగా జపించి ప్రారంభించడం విశేషమే కదా !

'ఏడుకొండలసామి' పాటను రికార్డు చేయాలనుకున్న మంగపతి గారు 'ప్లేట్'కు రెండోవైపు ఇంకో పాట కావాలి గదా అని ఆలోచించి భద్రిరాజు గారిని పిలిపించి, వేంకటేశ్వరస్వామిని వర్ణించే ఇంకో పాట రాయమన్నారు. కవిగారికి వెంటనే ఏమీ తోచలేదు. మంగపతిగారే "ఏడుకొండల సామి అని పాడుతూ మెట్లెక్కి వచ్చిన భక్తుడు స్వామిని దర్శించబోయి, ''నమో వెంకటేశా'' అని పాడుతున్నట్లు రాయమని సలహా ఇచ్చారు. ఈ సూచనలో అలవోకగా వినిపించిన 'నమో వెంకటేశ' నే పల్లవిగా తీసుకుని కవిగారు ఈ పాటను స్టూడియోలోనే గబగబా రాశారు. వెంటనే ఘంటసాల దానికి ఆరభి రాగంలో బాణీ చేసి పాడగా మంగపతిగారు రికార్డు చేశారు. మానవులందరికి 'భద్రం' ప్రసాదించే ఈ పాట ఉద్దేశించింది అలవేలు మంగపతి అయిన శ్రీ వేంకటేశ్వరస్వామిని, రికార్డు చేసింది మంగపతి, ఆలపించింది ఘంటసాల వేంకటేశ్వరరావు. ఎంత యాదృచ్ఛికంగా ఈ పేర్లు స్వామి సేవకు కలిసిపోయాయో ఆలోచిస్తే ఎంతో విచిత్రం అనిపిస్తుంది. పల్లవి సాకీని 'ద సా' అనే స్వరాలతో భావోద్వేగంలో ఎత్తుకోవడంలోనే ఈ పాటకు దశ దిరిగిన లక్షణం విలక్షణంగా కనిపిస్తుంది. సాకీలోని ఆ రెండు పంక్తులలోనే 'ఆరభి' స్వరూపాన్ని మన కళ్ళ ముందు నిలిపిన మహా గాయకులు ఘంటసాల. సాకీని అనుసరించి వాద్యసంగీతంలో ఘంటానినాదం కూడా తోడై, మనల్ని తిరుమల దేవాలయంలో స్వామి సన్నిధిన నిలబెడుతుంది.

పాట సందర్భాన్ని సృష్టించిన మంగపతి గారి ఆలోచనను దృష్టిలో పెట్టుకుని ఘంటసాల ఈ పాటను సామాన్యుడు పాడుతున్నట్టుగానే భావించి, బాణీని చాలా సులభతరంగా రూపొందించారు. కనుకనే రెండు చరణాలు ఒకే విధంగా ఉండి, ఏ ఆర్భాటాలూ లేక సాఫీగా సాగిపోతాయి. వారి ఆలోచన, అంచనాకు తగినట్టుగానే ఈ పాట పండిత పామరులందరినీ ఆహ్లాదపరిచింది. అందరినీ పాడుకునేట్లు చేసింది. 'ఏడుకొండల సామి' అంటూ పాడుకుంటూ మెట్లెక్కి వచ్చి 'నమో వెంకటేశా' అని భక్తి ప్రపత్తులతో పాడిన భక్తుని వేషంలో అక్కినేని నాగేశ్వరరావును, ప్రత్యక్షమైన వేంకటేశ్వరస్వామి రూపంలో ఎన్.టి. రామారావును ఒక్కసారి ఊహించుకోండి, మనసంతా ఆనందానుభూతితో నిండిపోతుంది.

సంస్కృత వ్యాకరణసూత్రపరంగా చూస్తే "నమో తిరుమలేశా" కాక 'నమస్తిరుమలేశా' అని ఉండాలి కాని ఇక్కడి అవసరం సాహిత్యతత్త్వ రచన కాదు. కనుక సంబోధనతో పదం విరిగిపోయాక వ్యాకరణ సూత్ర అన్వయం అవసరం లేదు. అందువల్ల ప్రజాసామాన్యానికి అనువుగా ఉండేందుకు వీలుగా 'నమో తిరుమలేశా' అనేదే సుందరంగా కుదిరింది. మొదటి చరణంలో "ముడుపులు, మొక్కులు, ముక్తి, బ్రోవు" అనే చోట్లలో చక్కని యతి కుదిరింది. అయితే ఇది అనుకోకుండా సహజంగానే జరిగింది. ఎలాగూ అనుకోలేదు కనుక రెండో చరణంలో యతిని పాటించలేదు. ఈ రెండు పాటలు కలిపి ఒక రికార్డుగా 1958లో విడుదల కాగా కాకినాడ గిరి అండ్ కో వారు ఈ పాటల గ్రామఫోన్ రికార్డును వేల సంఖ్యలో అమ్మి వేలాది రూపాయలు లాభం గడించారని చెబుతారు.

'నమో వెంకటేశా' పాటను అనుకరిస్తూ 'నమో ఏసునాథా' అనే పాటను క్రైస్తవసోదరులు రూపొందించగా జిక్కి పాడి రికార్డు ఇవ్వడం చెప్పుకోదగిన చక్కని విశేషం.

### 4. నీ కొండకు నీవే రప్పించుకో

**రచన : సి.సుబ్బారావు**

**సంగీతం,గానం : ఘంటసాల**

**చక్రవాకం-తిశ్ర ఏక**

**నీ కొండకు నీవే రప్పించుకో**
**ఆపద మొక్కులు మాచే యిప్పించుకో ॥నీ॥**
**ఓ తిరుపతి వేంకటేశా! ఓ శ్రీనివాసా!**
**నీవిచ్చిన ఈ జన్మకు విలువకట్టుకో ॥నీ॥**

**1. కొండంత సంసారం మోయలేని మానవులం**
**ఏడుకొండల నెక్కి రమ్మంటే రాలేము**
**సాటిమనిషి సౌఖ్యానికి సాయపడని దుర్బలులం**
**స్వర్గానికి నిచ్చెనలు వేయలేము ॥నీ॥**

2. మా మనస్సు, మా హృదయం పరస్పరం శత్రువులై
మాలోపలి దివ్యజ్యోతి మసకేసిపోతున్నది
అహంకారమణగించి,మమకారం తొలగించి
చేయూత నిచ్చి మమ్ము చేరదీసుకో ॥నీ॥

**భావం :** ఓ వేంకటేశ్వరా ! నీ కొండకు నువ్వే మమ్మల్ని రప్పించుకో. మా చేత మొక్కులు చెల్లింప జేసుకో. అంతా నీ సంకల్పమే కదా ! సంసారమే కొండంత. ఆ ఒక్క కొండనే మోయలేక పోతున్నాం. ఇంక ఏడుకొండలు ఎలా ఎక్కి వస్తామయ్యా? సాటి మనిషికి ఏ మాత్రం సహాయం చేయలేని బలహీనులం, స్వర్గానికి నిచ్చెనలెలా వేస్తాం? మనస్సు, హృదయం శత్రువుల్లాగా పోరాడుతున్నాయి. విజ్ఞానజ్యోతి మసకబారి పోతున్నది. మాలోని అహంకార మమకారాలను తొలగించి మమ్మల్ని ఆదుకో ప్రభూ!

ఈ పాటను రచించిన సి. సుబ్బారావు గారు ఎంతో కృతార్థులు. ఘంటసాల గళసీమ నలంకరించిన స్వరమాలికవంటి పాటను రచించిన భాగ్యవంతులలో సుబ్బారావుగారు చెప్పుకోదగినవారయ్యారు. వీరు 1932 ఏప్రిల్ 5న గుంటూరులో జన్మించారు. వీరి ఇంటి పేరు చింతగుంట. వీరు ఆంగ్లసాహిత్యంలో మాస్టర్ డిగ్రీ పూర్తిచేసి, చీరాల వి.ఆర్.ఎస్ & వై.ఆర్.ఎన్ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్గా పనిచేసారు. వీరు తెలుగు, ఆంగ్లం, సంస్కృతం, హిందీ భాషల్లో పండితులు. వీరు తెలుగులో 18, ఆంగ్లంలో 10, సంస్కృతంలో 6 గ్రంథాలను రచించారు. అన్నమయ్య కీర్తనలు కొన్నిటిని హిందీ, ఆంగ్లభాషల్లోకి అనువదించి ప్రచురించారు. వీరికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి "లలితసంగీత విశారద" అనే బిరుదు లభించింది. వీరు రచించిన "అమృతవర్షిణి" అనే పాటల సంకలనంలో నుండి ఈ పాటను తీసుకుని కె.యస్.వీరరాఘవులుగారు 1968-69 మధ్యకాలంలో విజయవాడ రేడియోలో పాడారు. ఘంటసాలకు ఒక భుజం సంగీతరావు గారైతే, మరో భుజం వీర రాఘవులు గారు. వీర రాఘవులు టి.టి.డి. ఉద్యోగిగా పనిచేస్తూనే ఘంటసాలతో ఎన్నో కచేరీలలో పాల్గొన్నారు.

ఒక కచేరీలో రాఘవులుగారు పాడిన ఈ పాట విని ఘంటసాల ముచ్చటపడి పాట రాసుకున్న కాగితం తీసుకుని, పాట రచించినవారు, వారు ఎక్కడ ఉండేదీ మొదలైన విషయాలు తెలుసుకుని సుబ్బారావు గారిని పరిచయం చేసుకున్నారు. తరువాత ఘంటసాల తాను జబ్బుపడిన సందర్భంలో ఈ పాటను రికార్డు చేయిస్తానని మొక్కుకున్నారట. జబ్బు తగ్గాక వెళ్ళి గ్రామఫోన్ కంపెనీలో దీన్ని రికార్డు చేసి విడుదల చేశారు. ఉద్యోగరీత్యా తిరుపతికి వెళ్ళడం కుదరని రచయిత,అనారోగ్యకారణాన తిరుపతికి వెళ్ళలేని ఘంటసాల మనోభావాలు ఒకటి కావడంతో ఘంటసాల "మన ఇరువురి మొక్కుబడికి సంబంధించిన పాట ఇది" అని రచయిత సమక్షంలో వ్యాఖ్యానించడం ఈపాటకున్న పవిత్రనేపథ్యం. ఈ విషయాలను డా॥కె.వి.రావు గారికి శ్రీమతి సావిత్రిగారు కొన్ని, రచయిత కొన్ని వివరించారు. ఇది జరిగిన మరునాడే నల్లగొండలోని శ్రీ భక్తాంజనేయ దేవాలయంలో జరిగిన 'అర్చక మహాసభల'కు ఘంటసాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధ్యాత్మిక తత్త్వం, అర్చకుల విధినిర్వహణ, దేవాలయ ప్రాశస్త్యం మొదలైన అంశాల గురించి చక్కగా ప్రసంగించారు. శ్రోతలందరు "పాట పాడమని" కోరగా "ఇదుగో ... నిన్ననే రికార్డు చేసిన పాట ఇది" అంటూ "నీ కొండకు నీవే" పాటను ఆలపించారు. ఈ పాట రచనలో లోతైన తాత్త్వికత, సామాన్య జీవనశైలి, నిరాడంబరంగా కనిపిస్తాయి. "తే వినా తృణమపి న చలంతి" అనే పురాణోక్తి ఈ పాటకు ఆధారం. "శివునాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు" అనేది జనవ్యవహారంలో ఉన్న సామెత. ' దేవుని సంకల్పం లేకుండా సృష్టిలో ఏదీ జరగద'నేది వీటి సారాంశం.

భక్తులు కొండెక్కాలన్నా, మొక్కులు చెల్లించాలన్నా వేంకటేశ్వరుని సంకల్పం, ఆశీస్సులు లేకపోతే జరిగేవి కావు. కొంతమంది రోజుల తరబడి వేచియుండి స్వామిని తృప్తిగా దర్శించుకుని వెళ్ళేవారు, ఇంకొంతమంది ఏవో కారణాలతో వేచియుండలేక వెనుదిరిగి వెళ్ళిపోతారు. ఇవే స్వామి సంకల్ప వికల్పాలు. జన్మనిచ్చింది అతడే, తన దర్శనానికి రప్పించుకునేది అతడే, మొక్కులు తీసుకునేది అతడే, ఇప్పుడు కాదు, తర్వాత రమ్మని ఆదేశించేదీ అతడే. భక్తుడెప్పుడూ నిమిత్త మాత్రుడే. ఆత్మజ్ఞానం కలిగిన స్పృహ మొదటి చరణంలో చక్కగా కనిపిస్తుంది. కొండను నెత్తిమీద పెట్టి, ఇక ఏడుకొండలు ఎక్కరా అంటే ఎలా? అని అడుగుతూనే, సాటివాడికి సాయం చేయకుండా ఎన్నో

ఉన్నత పదవులందుకుందామని ఆశపడే దుర్బలత్వాన్ని ఒప్పుకుంటున్నారు. ఆత్మ, బుద్ధి, మనస్సు, హృదయం అనేవి చూడడానికి అన్నీ ఒకటే అనిపిస్తాయి. కాని సూక్ష్మంగా పరిశీలిస్తే ఇవి వేటికవే గొప్ప శక్తులు. ఈ నాలుగిటిని సమర్పణ భావంతో భగవంతునికి అప్పగించగలిగి, శరణాగతి కోరితే ముక్తి తప్పకుండా లభిస్తుంది. దానికి బలమైన యోగసాధన కావాలి.

మనస్సు భౌతికసుఖాల మీదికి పరుగెత్తుతుంది. హృదయం తనలో ఉన్న పరమాత్మను దర్శించమంటుంది. ఇలా పరస్పరం విభిన్న ధోరణులతో విభేదిస్తూ శత్రువుల్లా పోరాడుతుంటే మనిషి బుద్ధి చైతన్యరహితమైపోతున్నది. ఆత్మ తన జ్యోతిస్వరూపాన్ని కనిపించనీయకుండా అహంకార మమకారాలనే తెరలను కప్పుకున్నది. ఇది జీవుని వేదన. ఈ వేదన నుండి బైటపడేసి తనను ఆదుకొమ్మని భక్తుని ఆర్తి, తపన ఈ గీతంలో పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఘంటసాలకు బాగా ఇష్టమైన రాగాల్లో చక్రవాకం ఒకటి. దీన్ని హిందుస్తానీ సంప్రదాయంలో "ఆహిర్‌భైరవ్" అని పిలుస్తారు. ఈ పాటను చక్రవాక రాగంలో త్రిశ్రగతిలో స్వరపరిచారు. తత్వగీతాలను, భక్తిగీతాలను స్వరపరచాల్సి వచ్చినప్పుడల్లా ఆయన ఈ రాగాన్నే ఉపయోగించారు. ఉదాహరణకు 'చుట్టరికాలు' సినిమా టైటిల్స్ నేపథ్యంలో వినిపించే "గాలి వీచెను" *'ఏడుకొండల వాడా వెంకట రమణ'* (పెళ్ళి చేసి చూడు) *'విధి వంచితులై విభవము'* (పాండవ వనవాసం) మొదలైనవి. 'నీ కొండకు' పాటలో "మాచే" అన్నచోట ఆయన "ఆహిర్ భైరవ్" పోకడను స్పృశించి పాటకొక కొత్త అందాన్ని తెచ్చారు. "ఓ తిరుపతి వేంకటేశా, ఓ శ్రీనివాసా" అనే పంక్తిని తారస్థాయి సంచారంలో ఎలుగెత్తి పాడుతూ సంబోధనాపద సహజ సౌందర్యాన్ని చక్కగా పరిపోషించారు. చరణాల్లో మొదటి పాదం కాగానే క్లారియోనెట్ వాద్యం ఇచ్చిన చిన్న 'బిట్' కూడా భావప్రకటనకు బాగా తోడ్పడింది. నిచ్చెనలు వేయలేములో లే అనే అక్షరం మీదుగా ఆయన పలికిన సంగతులను గమనించినపుడు 'నిచ్చెన మెట్లు' స్ఫురిస్తాయి. 'చేరదీసుకో' దగ్గరున్న ఇలాంటి సంగతే "పైకి లాక్కునే" భావన నందిస్తుంది. చరణాల ముందు వినిపించిన నేపథ్య సంగీతం (Interlude)లో చిన్నపాటి కౌంటర్‌ను వయోలిన్స్, క్లారియోనెట్, వేణువులపై పలికించడం సుశ్రావ్యంగా ఉంది.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

## కమ్మతెమ్మెరలు




ఆదిత్యుని చిత్రంతో వెలువడిన **మిసిమి** జనవరి 2025 సంచిక చూసి చూడగానే మనసును హత్తుకుంది. సాంకేతిక సాధనాలు నేడు విస్తృతంగా వినియోగించబడుతున్న సమయంలో ఒక విభిన్న విశిష్ట చింతనాత్మక సారస్వత పత్రికను నిర్వహించడం గొప్ప సాహసకార్యం. పుస్తక పరిచయాలు చదివేసినా చదవలేకపోయినా చదవాలనిపించే విధంగా ఉంటున్నాయి. సంపాదకీయం పదేపదే చదవాలనిపిస్తోంది. నాకేమనిపిస్తోందంటే ఈ పత్రికలో స్పృశించని ప్రక్రియ గాని అంశంగాని ఇంకేమి వదలడంలేదేమో! ఈ పత్రిక నిర్వాహక వర్గానికి అభినందనలే కాక ధన్యవాదాలు.

*- దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం, ఫోన్ : 7780594995.*

# కళ - ఖరీదు

**- టి.వి. ప్రసాద్**

జెఫ్‌కూన్స్‌ది వెండితో మెరిసిపోతున్న కుందేలు శిల్పం 1986 మేలో 91.1 మిలియన్ డాలర్లకు క్రిస్టీస్ వేలంలో అమ్ముడు పోవడం, వర్తమాన ఆర్టిస్టు కళాకృతికి అంత ధర పలకడం ఒక రికార్డు. చాలా కాలంగా కనబడకుండా పోయిన, లియోనార్డో డావించీదిగా భావించబడుతున్న 'సాల్వేటర్ ముండి' పెయింటింగు 2017 నాటి క్రిస్టీస్ వేలంలో 450 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి అత్యంత ఖరీదైన చిత్రంగా రికార్డు సృష్టించింది.

వందేళ్ళుగా కనుమరుగై ఇటీవల వెలుగు చూసిన గుస్తావ్ క్లిమ్ట్ చివరి పెయింటింగుల్లో ఒకటి ఫ్రాలేన్ లీజర్ పోర్ట్రేట్ 54 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోవచ్చని వియన్నా వేలం సంస్థ కిన్‌స్కీ అంచనా వేసింది (1917). హాంగ్‌కాంగ్ ఆర్ట్‌గాలరీ 'హెూమ్ ఆర్ట్' ఈ చిత్రాన్ని చిటికలో 32 మిలియన్ డాలర్లకు ఎగరేసుకుపోయింది (జనవరి 25, 2024 వార్త). అంతకుముందు క్లిమ్ట్‌దే మరో పెయింటింగ్ 'లేడీ విత్ ఫాన్' 74 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి ఆశ్చర్యపరిచింది (**మిసిమి,** నవంబర్ 2023). దీనికి పోటీగా ప్రముఖ వేలం సంస్థ సథబీజ్ ఎడ్వర్డ్ మానే పెయింటింగ్ గడ్డివాము వేలానికి రాబోతోందని ప్రకటించింది (మే 2024). 20వ శతాబ్ద సాయంత్రపు అమ్మకం పేరిట క్రిస్టీస్ విన్సెంట్ వాంఘో పెయింటింగుల్ని వేలంవేయడానికి సిద్ధమైంది. వాటి విలువను ఊహించడం సాధ్యం కాని పని.

ప్రఖ్యాత పెయింటర్ రాజా రవివర్మ తన మనవరాలు మూడు-నాలుగు సంవత్సరాల వయసునాటి పోర్ట్రేట్ ఆయిల్ పెయింటింగ్, ఇంతకుముందెవ్వరూ చూడనిది వెలుగుచూసి వార్తల కెక్కింది (ఆ పాపయే ఇప్పటి మహారాణి సేతులక్ష్మి). దాని విలువెంతో తెలుసు కోవాలంటే వేచి చూడాల్సిందే! తోట వైకుంఠం పెయింటింగ్ 'భక్తులతో శివనాట్యం' గత సంవత్సరపు 'మోడరన్ ఇండియన్ ఆర్ట్ వేలం'లో రూ. 1.41.35,220ల ధరకు అమ్ముడుపోవడం (డక్కన్ క్రానికల్ 20-6-2024 నాటి వార్త). సామాన్యునికి అంతుపట్టని విషయం. భారత ప్రభుత్వం అమృతాషేర్‌గిల్ చిత్రాలను జాతీయ సంపదగా ప్రకటించి, 1978 ఆమె గౌరవార్థం పోస్టల్ స్టాంపును విడుదల చేసి, ఢిల్లీలోని ఒక రోడ్డుకు 'అమృతాషేర్ గిల్ మార్గ్' అని పేరు పెట్టడం మనకు తెలుసు. 1964లో విడుదలై విజయం సాధించిన మెట్రో యునైటెడ్ ఆర్టిస్టు వారి 'ద ట్రెయిన్' సినిమా ఇతివృత్తం కళా ఖండాలను కాపాడుకోవడం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జర్మన్ నాజీలు ఫ్రాన్స్ మ్యూజియాన్ని కొల్లగొట్టి పికాసో, సెయిజాన్, విన్సెంట్ వాంఘో, డెగాస్, మానే మొదలైన ప్రసిద్ధుల పెయింటింగుల్ని ట్రెయిన్‌లో జర్మనీకి తరలించే ప్రయత్నాన్ని ఫ్రెంచివారు తిప్పికొట్టడం, దేశ కళా సంపదను కాపాడుకోవడం సినిమా సారాంశం.



'సాల్వేటర్ ముండి' పెయింటింగు

ఇలా కళాకృతులు - శిల్పాలు, చిత్రాలు పదుల, వందల మిలియన్ డాలర్లకు అమ్ముడుపోవడం; ఆర్టు గాలరీలు, వేలం సంస్థలు పోటీలు పడి వాటిని వేలం వేయడం, అత్యంత సంపన్న వర్గాలవారు వాటిని క్షణాల్లో ఎగరేసుకుపోవడం కళా విపణిలో అసాధారణ విషయమేమీ కాదు. కానీ సామాన్యునికిది ఎంత మాత్రం అర్థం కాని విషయం. కళకు ఇంత ధర ఎందుకు? అని ఆశ్చర్యపోతాడు.

చిత్ర కళకు ఇంతటి ప్రాధాన్యత ఎందుకు? కళ ఖరీదైనదిగా ఎందుకు భావించబడుతుంది? కళాకృతి విలువ మిలియన్లలో ఎందుకు ఉంటుంది? దాని ధరను అంచనా వేసేది ఎవరు? ఏజంట్లు, కళాసేకరణ సంస్థలు, వ్యక్తుల పాత్ర ఏమిటి? కళాకృతి అమ్మకం జరిగిన తర్వాత

కళాకారునికి దక్కేదెంత? మొదలైన విషయాలు తెలిస్తే కళా విపణిని అర్థం చేసుకోవడం సులువౌతుంది.

ప్రపంచ దేశాలన్నిటా కలిపి ఏడాదికి 67.4 బిలియన్ డాలర్ల కళా వ్యాపారం జరుగుతుంది అని ఆర్ట్ బాసల్ & యు.బి.ఎస్ వారి గ్లోబల్ ఆర్ట్ సర్వేలు చెబుతున్నాయి. అంతేకాదు, ప్రతి సంవత్సరం ఈ వ్యాపారంలో ఆరు (6%) శాతం అభివృద్ధి జరుగుతుందని ఇటీవలి సర్వే తెలియజేస్తుంది.

**కళావిలువల్లో మార్పు :** 17వ శతాబ్దానికి పూర్వం, అంటే మధ్య యుగాలతో మొదలైన రినైసెన్స్ కాలం నాటి విలువలకు, ఆ తర్వాత ఇప్పటి కళా ప్రపంచ విలువలకు చాలా తేడా వుంది. అప్పట్లో చర్చీ పెద్దలు, చక్రవర్తులు, ధనిక కళాపోషకులు చిత్ర కళాకారులను పోషించేవారు. ప్రత్యేకంగా పురమాయించి చిత్రకారులతో తమకు కావలసినట్లు చిత్ర రచన చేయించుకునేవారు. చిత్ర ఇతివృత్తం, దాని పరిమాణం, చిత్ర రచనలో వాడవలసిన వస్తువులు, ఎంత సమయంలో చిత్ర రచన ముగియాలి – మున్నగు విషయాల్లో పోషకులకూ, ఆర్టిస్టులకు మధ్య అవగాహన ఉండేది. పేరు గాంచిన చిత్రకారులకు తగిన డిమాండు, ఆదరణ ఉండేది. చర్చీ అలంకరణ, ఆల్టర్ పీస్ నిర్మాణంలో వీరి చిత్రాలకు, శిల్పాలకు ప్రాముఖ్యత ఉండేది. మరికొందరు రాజ కొలువుల్లో స్థిరపడి రాజకుటుంబీకుల పోర్ట్రేట్లు రచిస్తూ హోదానుభవిస్తూ మనుగడ సాగించేవారు. నాటి (ఆర్టిస్టు) గిల్డులు సాధారణ ఆర్టిస్టులకు తమ కళను వ్యాపారం చేసుకోవడానికి వెసులుబాటు కల్పించినా, తర్వాతర్వాత ఉన్నత వర్గాల, అకాడమీల ఆధిపత్యం పెరిగిపోవడంతో కళాకారునికి తగిన స్వేచ్ఛ లభించలేదు. తన యిష్టానుసారం కళాకృతి నిర్మాణం చేసే వెసులుబాటు పరిమితమైపోయింది.

నేటి కళాకారునికి స్వేచ్ఛ ఎక్కువ. కళా స్వేచ్ఛ వల్ల తనకు నచ్చిన ఇతివృత్తాన్ని ఎన్నుకుని, దానికి అనువైన రంగులు, ఇతర హంగులు ఏర్పరుచుకోగలగడం, తన అభిరుచికి తగినట్లుగా కళాసృష్టి చేయగలగడం అతడు సాధించిన విజయం. కళాకారుడు స్టార్ హోదాను పొందగలగడం ఆధునిక యుగంలో అదీ 19వ శతాబ్దం నుండి మొదలైంది. పాబ్లో పికాసో, ఆండీ వార్ హోల్, జెఫ్‌కూన్స్, డేమియన్ హర్స్ట్ మొదలైనవారు అలాంటి గొప్ప కళాకారుల్లో కొందరు.

కళా విలువ కొన్ని మౌలికాంశాలు, పరామితులు కళా నిర్మాణంలో ముఖ్యాంశాలు, చిత్రాశయం ఒక దానికొకటి పూరకాలుగా పని చేస్తాయి. అన్నీ సరిగా అమరితే కళాకృతి సౌందర్య విలువను, చెప్పే విషయం (ఇతివృత్తం) నైతిక విలువలను, అది తయారైన సందర్భం సాంఘిక విలువను కలిగి వుంటుంది. కళా విలువను నిర్ణయించడంలో ఈ మూడు విలువలు ప్రధానంగా పరిగణించబడతాయి.

**కళాకృతి – అంతర్గత విలువలు :** స్వాభావిక విలువ, ఇది పూర్తిగా వస్తు, విషయ గతము. ప్రేక్షకుని భావావేశం. పొందే అనుభూతి, జ్ఞానేంద్రియాల సంతృప్తికి ఇది అవసరం. ఈ నిలకడలేని అంశాలు వీక్షకుని నేపథ్యంపైనా, సాంస్కృతికాంశాలపైనా ఆధారపడి వుంటాయి. వారికి తగినంత కళా విజ్ఞానం లేకపోతే కళాకృతికి న్యాయం జరగడం కష్టం.

**సాంఘిక విలువ :** కళ యొక్క ప్రాథమిక ఆశయం సమాచారాన్ని అందించడం. కళా విలువను నిర్ణయించడంలో దీనిది ముఖ్య పాత్ర. సందేశాన్నివ్వడం, నమ్మకాలు, భావోద్రేకాలు, సిద్ధాంతాలను, యితరులతో పంచుకునే సాధనం. కళాకారుని సెంటిమెంట్లను, అనుభవాలను, అనుభూతులను చూసేవారు సులభంగా గ్రహించగలిగితే అప్పుడది కమ్యూనిటీ అనుభవంగా మారుతుంది. ఇది సాంఘిక విలువల పుట్టుకకు కారణమౌతుంది.

**వాణిజ్య విలువ :** కళా విలువ ఇతర వస్తువుల విలువలాగా వెలకట్టలేనిది. ముందుగా చెప్పుకున్న రెండు విలువలు కళాకృతి మార్కెట్ విలువను నిర్ణయిస్తాయి. వాణిజ్య విలువను నిర్ణయించడంలో రెండు అంశాలు ముడిపడి వుంటాయి. ప్రాథమిక వాణిజ్యంలో కళాకారునికి కొనే వారికి మధ్య నేరుగా ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. కళాకారునికి తన కృతి ధరను నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. మొదటి అమ్మకం తర్వాత ఎన్ని చేతులు మారినా (అనంతర వాణిజ్యం) దాని చుట్టూ జరిగే వ్యాపారం అంతా సెకండరీ మార్కెట్ అవుతుంది. ఇక్కడ డిమాండ్ – సప్లై సూత్రం వర్తిస్తుంది. ఒకసారి కళాకృతి అమ్మకం జరిగిన తర్వాత కళాకారుని ప్రమేయం అంతటితో ముగిసిపోతుంది.

సెకండరీమార్కెట్‌లో ఏజంట్లు, గాలరీలు, వేలం సంస్థల పాత్ర అనివార్యం. కళాకారుని కృతి ఒక్కటైనా అమ్ముడుపోతే వారి మిగతా కృతులు అమ్ముడుపోవడానికి మార్గం సుగమం అవుతుంది.

**కళాకృతి విలువను నిర్దేశించే అంశాలు :** కళాఖండం లేదా కళాకృతి విలువను (ధరను) నిర్ణయించడంలో గేలరీలు, ప్రదర్శనలు, కళాభిమానులు, సేకరణ కర్తలు, వేలం సంస్థలు, ఏజంట్లు, కళాపండితులు మొదలైన ఎందరిదో పాత్ర వుంటుంది. ఈ విధానంలో చోటు చేసుకునే అంశాలు – కళాకారుని కీర్తిప్రతిష్ఠలు, కళాకృతి పుట్టిన సందర్భం. కృతి చారిత్రక ప్రాధాన్యతను నిర్ణయించడంలో ఇది ముఖ్యంగా పరిగణించబడే అంశం. కళాకృతి పుట్టుక, చరిత్రలకు సెకండరీ మార్కెట్‌లో విలువ ఎక్కువ. ముందటి యజమాని ఎంత గొప్ప వ్యక్తి ఐతే కళాకృతి విలువ అంత ఎక్కువ. మ్యూజియానికి గానీ, గేలరీకి గాని సొంతమైతే అది మరింత ధర పలుకుతుంది. విలువ పెరిగి పెరిగి బహిరంగ మార్కెట్ నుండి మాయమైపోతుంది. అప్పుడు కళాకృతికి అరుదైన గౌరవం, డిమాండు కలుగుతుంది. ఒకే కళాకారుని చిత్రాలకు, శిల్పాలకు వారి ఇతర కృతులకు విపరీతమైన డిమాండు ఉంటుంది. కళాకృతి ఉన్న పరిస్థితి కూడా ముఖ్య విషయంగా పరిగణించబడుతుంది. సమకాలీన నిష్ణాతులు కళాభిరుచిని బట్టి కళాకృతి విలువను నిర్ణయిస్తారు. కృతి మౌలికతకు భంగం కలిగించని మార్పులు, చేర్పుల శల్యపరీక్ష తర్వాత అది చెక్కుచెదరని రూపం అని తేలితే, దానికి విలువ ఇంకా ఎక్కువ.

చిత్ర ప్రామాణికత, విశ్వసనీయతలను సాంకేతికంగా అంచనా వేసిన తర్వాత, వస్తు నాణ్యత లాంటి మిగతా అంశాలు తృప్తిగా వుంటే వస్తువు తయారైన విధానం, మాధ్యమం, శైలి, కాలం ప్రమాణాలుగా తీసుకోబడతాయి. చివరగా కళాకృతి పరిమాణం, తయారీకి ఉపయోగపడ్డ మాధ్యమం, వస్తు సముదాయం లెక్కలోకి తీసుకోడతాయి. కళాకృతి పరిమాణం పెద్దదిగా; కాన్వాస్‌పై తైలవర్ణాలతో రూపొందిన పెయింటింగులకు కానీ, పాలరాతిలో చెక్కిన శిల్పాలకు గానీ విలువ ఎక్కువ. పురుష సంబంధిత ఇతివృత్తాలకన్నా, స్త్రీ సంబంధిత ఇతివృత్తాలకు విలువ అధికం. కళ హద్దులు లేనిది, భావ వ్యక్తీకరణలో, ఆలోచనలను రేకెత్తించడంలో భావోద్రేకాలను తృప్తి పరచడంలో దీనికి పరిమితులుండవు.

పైన చెప్పుకున్న అంశాలన్నింటినీ క్రోడీకరిస్తే సంగ్రహంగా కళా విలువను నిర్ణయించే అంశాలు వరసగా– కళా కృతి చిత్ర నేపథ్యం, దాని పుట్టుక చారిత్రక ప్రాధాన్యత, కృతికర్త నేపథ్యం, కళాకృతి ఎన్ని చేతులు మారింది. వారి ప్రాధాన్యత మొదలైన అంశాలు. పరిమిత సంఖ్య అధిక గిరాకీ కళకు బాగా వర్తించే ప్రాథమిక ఆర్థిక సూత్రం–ఉత్పత్తి. అవసరం. తక్కువ చిత్రాలు సృజించిన కళాకారుల కృతులకు ఎక్కువ గిరాకీ వుండటం, గొప్ప కళాకారుల అరుదైన కళాకృతుల ధరలు తారస్థాయిలో ఉండడం సహజం. కళాకృతి తయారీలో వాడబడిన వస్తువులు (శిల్పమైతే రాయి, చెక్క; చిత్రమైతే కాన్వాస్, వర్ణాలు) పనితనం, శ్రద్ధ, జాగ్రత్త, తయారుకావడానికి పట్టిన టైమ్, విలువను నిర్ణయించడంలో పరిగణించబడతాయి. సౌందర్యాంశం, అసాధారణ ఇతివృత్తం మార్కెట్ ధోరణులు, భిన్న శైలులు, ఆర్టిస్టుల అభిరుచులు, ఫ్యాషన్లు కళాకృతుల విలువను ప్రభావితం చేస్తాయి.

**గేలరీల ప్రాతినిధ్యం :** కళాకారులకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టడానికి గాలరీలు వనరులను, తగిన సమయాన్ని కేటాయిస్తాయి. వారి కృతులకు ప్రచారం కల్పిస్తాయి. ప్రదర్శనల ద్వారా కళాకృతికి విలువ కల్గిస్తాయి. ఎంత ఎక్కువమంది కళ్ళలో పడి నోళ్ళలో నానితే ఆ కళాకృతికి అంత ఎక్కువ ప్రచారం కలిగి విలువ పెరుగుతుంది. దాని సైజు, స్థితి కూడా దాని విలువను నిర్ణయిస్తాయి. నిపుణులుల మెచ్చుకోలు, విమర్శకుల ఖండనలు కళాకారుని భవితను నిర్ణయిస్తాయి. ప్రశంసలు కళాకృతికి విలువను పెంచితే, విమర్శలు కళాకారుని వృత్తి జీవితాన్నే నాశనం చేస్తాయి. ఉన్నత స్థాయి ప్రశంస అందలమెక్కిస్తే, విమర్శ శాపంగా పరిణమిస్తుంది.

వ్యాపారానికి మూలధనం, పెట్టుబడి ఎంత అవసరమో ఆర్టుకు కూడా అంతే అవసరం. కళాకృతి మీద పెట్టిన పెట్టుబడి ఎప్పటికీ లాభదాయకమే. కొనగలిగే ఆర్థికస్థాయి, ఆర్థిక పరిపుష్టి వుంటుందికనుక సంపన్నులు కళాకృతిని మార్కెట్ ధరకన్నా ఎక్కువ ధర పెట్టి కొనగలుగుతారు. వారి అభిరుచులు, కళాకారులపై గల

అభిమానాలు, వ్యక్తిగత భావోద్రేకాలు కళాకృతుల ధరలపై అమిత ప్రభావం చూపుతాయి.

**సాంస్కృతిక ఔచిత్యం :** సాంఘిక ప్రాసంగికతల నేపథ్యం కలిగి వున్న కళాకృతులకు, సామాజికాంశాలు, సమస్యలకు అద్దం పట్టే కృతులకు విలువ ఎక్కువ. ఉద్యమాలతో ముడిపడి వున్న కృతులకు ప్రాధాన్యత మరీ ఎక్కువ. కళాకృతుల మీద పెట్టుబడి పెట్టడం లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. సంపన్నులు తమ ప్రయోజనాల కోసం టాక్స్ నుండి తప్పించుకోవడానికో, హోదాను ప్రదర్శించడానికో కళాఖండాలను ఖరీదు చేయడం జరుగుతుంది. నిజానికి కళాభిరుచి వుండి కొనడం అరుదుగా జరుగుతుంది. మిలియన్లు వెచ్చించి ఇవాళ కొన్న కళాకృతి రేపు ఇబ్బడి ముబ్బడిగా పెరుగవచ్చునన్న ఆశ వారిని ముందుకు నడుపుతుంది. కళావ్యాపారంలో నిజానికి కళాకారునికి దక్కేదేమీ ఉండదు. గేలరీలు, ఏజంట్లు వేలపు గృహాలు డబ్బు చేసుకోవడం తప్ప మ్యూజిక్, సినిమా పాటల రికార్డులు, రచయితల పుస్తకాలు అమ్మకం జరిగేకొద్దీ రాయల్టీ రూపంలో వారికి ఆదాయం సమకూరుతుంది. కానీ కళాకారుడు ఒకసారి తన కృతిని అమ్ముకుంటే ఇక దానిపై వారికి ఏ హక్కు ఉండకపోవడం విచిత్రం, విషాదం. మొదటిసారి అమ్మినప్పుడు వచ్చిందే అతనికి దక్కే ప్రతిఫలం.

**కళావ్యాపారం-ప్రస్తుత పరిస్థితి :** గత 25 సంవత్సరాలుగా కళావ్యాపారం విపరీతంగా పెరిగిపోయింది. 2010ల్లో ఆర్టు డీలర్ల ద్వారా, వేలం సంస్థల ద్వారా ఏటా 20-25 బిలియన్ డాలర్ల వ్యాపారం జరిగితే ఇప్పుడది రెండు, మూడు రెట్లు పెరిగి 65-70 బిలియన్ డాలర్లకు చేరుకుంది అని ఆర్టు ఇకానిమిస్ట్ డా॥ క్లేర్ మెక్ ఆండ్రూ పరిశీలనలో తేలింది. కళా వ్యాపారం ఇంతగా పెరిగిపోవడమే కాక, నూతన ఆర్థిక విధానాల వల్ల పెనుమార్పు వచ్చింది. ఒకప్పుడు కొన్ని దేశాలకే పరిమితమైన వ్యాపారం ఇప్పుడు ప్రపంచ వాణిజ్య స్థాయికి చేరుకుంది. అమెరికా, ఐరోపాల ఆధిపత్యాన్ని గత రెండు మూడు సంవత్సరాలుగా చైనా కైవశం చేసుకుంది. కళపై విపరీతంగా పెట్టే ఖర్చు ఇప్పుడు అన్ని దేశాలకూ వ్యాపించింది. ప్రపంచ కళావ్యాపారంలో చైనా ఒక్కటే 25% అమ్మకాలకు ప్రాతినిధ్యం వహిస్తూ అగ్రస్థానంలో వుండగా అమెరికా, ఐరోపా దేశాలు మిగతా ప్రపంచ దేశాలన్నీ కలిపి తర్వాతి స్థానంలో ఉంటాయి.

గల్ఫ్ దేశాలు, ముఖ్యంగా ఖతర్ యూ.ఏ.ఆర్‌లు పెద్ద సంఖ్యలో కళాఖండాలను సేకరించడంపై దృష్టి పెట్టాయి. ఖతర్ రాజకుటుంబం నుండి అమీర్ కుమార్తెది కళాఖండాలను సేకరించడంలో చురుకైన పాత్ర. ప్రపంచంలోనే అత్యంత ధర పెట్టి కొనగలిగే కళాభిమాని. మాడరన్ ఆర్టుకు అధిక ప్రాధాన్యతనిచ్చే ఈమె ఇంత వరకు ఎవరూ పెట్టని ధరకు సెయిజాన్ 'కార్డ్‌ప్లేయర్స్' 1890 నాటికి ఆయిల్ పెయింటింగ్‌ను 250 మిలియన్ డాలర్లకు సొంతం చేసుకుని, ఆధునికానంతర కళా విపణిని ఆశ్చర్య పరిచింది. మ్యూజియాల సామ్రాజ్యం నిర్మించాలనుకునే దేశానికి ఇదో లెక్కే కాదు. మార్కెట్ స్వరూపాన్నే మార్చివేసిన ఈ సంఘటనను గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. నవతరం అపర కుబేరులు అత్యంత విలువైన కళా ఖండాలను వందల మిలియన్ డాలర్లకు కొనడం వారి జీవన శైలిని ప్రతిబింబిస్తుంది. ఏడాది పొడవునా ఎక్కడో ఒకచోట జరిగే కళామేళాలకు, వార్షిక, ద్వైవార్షిక కళా మేళాలకు, ప్రదర్శనలకు వేలాలకు అంతే ఉండదు. గేలరీలు, ఆక్షన్ హౌజ్‌లు అట్టహాసంగా ఏర్పాటు చేసే కళా కూడళ్ళకు, విందు వినోదాలకు ఫాషన్ మాగజైన్లు, విలాస వస్తు వ్యాపారులు, ఖరీదైన గడియారపు సంస్థలు, ఇతర కంపెనీలు తోడ్పడతాయి. బేంక్‌లు కూడా కళా వ్యాపారంలో పెట్టుబడిని లాభసాటి వ్యాపారంగా భావించి ప్రోత్సహిస్తాయి. నూతన ఆర్థిక విధనాల వల్ల, నూతన ఉన్నతశ్రేణి సంపన్న వర్గం కళపై పెట్టుబడి పెట్టడానికి తయారుగా వుంటుంది. చాలా దేశాలు ఇప్పుడు కళ మీద పెట్టుబడికి ప్రాధాన్యతనిస్తున్నాయి.

నాణేనికి అటువైపు చూస్తే మధ్యతరగతికి కళా వ్యాపారం ఏ విధంగానూ అందుబాటులో ఉండదు. దిగువ తరగతి వారికిది ఊహకే అందదు. అత్యంత సంపన్నులు అతి కొద్ది మంది మార్కెట్‌ను గుప్పెట్లో పెట్టుకుని కళా విలువను పెంచడంలో ముఖ్య పాత్ర నిర్వహిస్తారు. దీనివల్ల లాభపడేది గేలరీలు, వేలం సంస్థలు. బ్లూచిప్ కళాకారులు మాత్రమే. కళాకారుల కృతుల ధరల్లో అంతరం మరీ పెరిగి పోతుంది. మధ్యస్త వ్యాపరరంగంలో కొన్ని

గాలరీలు మూతపడడం మిగతావి కష్టంగా మనుగడ సాగించడం జరుగుతుంది. పేరు ప్రతిష్టలున్న లండన్ గేలరీ హొటల్ ఈ మధ్యనే మూత పడింది. చాలా న్యూయార్క్ ఆర్ట్ గాలరీలు కళా ప్రదర్శన శాలల్ని మూసివేసి వేరే వ్యాపారంలో నిమగ్నమయ్యాయి. కళావిపణి ధనికుల ఆట స్థలంగా మారిపోవడం విచారకరం. గొప్ప కళాకారులకు వారి కృతులకు దక్కుతున్న గౌరవం, వాటికి పలికే ధరలను చూస్తే కలలు కనే చిన్న కళాకారులకు, కొత్తగా ఈ రంగంలోకి ప్రవేశించే కళాకారులకు కళా విపణి కలల ప్రపంచం కానే కాదు, ఎండమావి. హైదరాబాద్ నగరంలో 2024 జూన్ 7–9 తేదీల్లో జరిగిన కళా ప్రదర్శన సాధించిందేమిటో చూద్దాం. 'ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్' నిర్వహణలో జరిగిన ఈ ప్రదర్శనలో దేశం నాలుగు చెరగుల నుండి, 30 ఆర్టు గాలరీలు, 290 మంది కళాకారులూ పాల్గొనగా అందులో వందమంది మహిళా కళాకారులుండడం విశేషం. పెయింటింగులు, శిల్పాలు మొదలైన 3500 కళాకృతుల ప్రదర్శన పేరు పొందిన కళాకారులు జోగెన్ చౌదరి, నీమా కోహ్లీ, అతుల్ దోడియా, లక్ష్మణ్ గౌడ్ తోట వైకుంఠం, యూసఫ్ అరక్కల్, మనూ ఫరేఖ్, ఏలే లక్ష్మణ్ లాంటి వారు; స్వతంత్ర, కొత్త కళాకారులు ఒకే వేదికను పంచుకోవడం ఈ ప్రదర్శన ప్రత్యేకత. 2011లో ప్రారంభమైన ఐఏఎఫ్ ఇప్పటివరకూ వివిధ పట్టణాలలో 25 ప్రదర్శనలు నిర్వహించి, హైదరాబాద్‌లో తొలిసారిగా నిర్వహించిన ప్రదర్శన ఇది. వర్తమాన కళాకారులకు పెరుగుతున్న ఆదరణకు ఇది తార్కాణం. పేరు పొందిన కళాకారులతో కొత్తగా కళారంగ ప్రవేశం చేసిన కళాకారులు ఒకే వేదికను పంచుకునే అవకాశం కలగడం ప్రదర్శన సాధించిన విజయం. సాంప్రదాయ, వర్తమాన, పురాణ ఇతివృత్తాల అనంత వైవిధ్యం కళాప్రియుల్ని కళాభిమానుల్ని, కళా బేరగాళ్ళను ఆకర్షించగలిగింది. కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌లో జరిగిన ఇటువంటి ప్రదర్శనల వల్ల కళాకారుల మధ్య సత్సంబంధాలు కలిగి, వారు నూతన భావాలతో ఉత్తేజితులై, కొత్త అభిమానుల్ని ఆకర్షించడం జరుగుతుంది. ప్రదర్శనలో సూచించిన ధరలు పదివేల నుండి, లక్షల రూపాయిల్లో ఉండడం ప్రవేశ రుసుము కొంచెం ఎక్కువగా ఉండడం కళ ఖరీదైనదని చెప్పకనే చెబుతుంది.

కళ సంపన్న వర్గాల వారికి విలాసవస్తువు, సామాన్యులకు కలల వస్తువు; సంపన్న వర్గాలవారికి అది ప్రదర్శనా యోగ్యమైతే సామాన్యులకు అదికేవలం దర్శనాయోగ్యం. ఉదాహరణకు నిన్న మొన్న జరిగిన ఐఏఎఫ్ ప్రదర్శన. కళాకారుడు బతికినంతకాలం గుర్తింపు గౌరవం, ఆదాయం లేకుండా బతకడం మరణించిన తర్వాత వారి కృతులు కళాఖండాలుగా కీర్తింపబడడం, మిలియన్ డాలర్లకు అమ్ముడుపోవడం విచిత్రం.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

## సామల సదాశివ



సామల సదాశివ

సామలగారు ఆదిలాబాద్ జిల్లా తెనుగుపల్లెలో జన్మించారు. హిందీ, ఉర్దూ, సంస్కృతం, మరాఠీ, పార్సీ, ఇంగ్లీషు భాషలలో పండితులు. ఈ అన్ని భాషలలోనూ 425 పుస్తకాలు రచించారు. అన్ని భాషలలోంచి తెలుగులోకి అనువాదాలు చేశారు. హిందుస్తానీ సంగీతం గురించి "స్వరలయలు" రాశారు. దీనికి జాతీయస్థాయి అవార్డు పొందారు. ఉర్దూ కవుల కవితా సామగ్రి, ఉర్దూ సాహిత్య చరిత్ర, మలయ మారుతాలు, ఉర్దూభాషాకవితా సౌందర్యం, సంగీత శిఖరాలు, ఫారసీకవుల ప్రసక్తి, యాది, మీర్జా గాలిబ్ గజళ్ళు మొదలైనవి వీరి తెలుగు రచనలు. తెలుగు యూనివర్సిటీ నుంచి, కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు. రాజీవ్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

*కలం రేఖలు - ఎస్. శంకర్ నారాయణ*

# ప్రశ్నోపనిషత్తు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

ఉపనిషత్ ఉద్యానవనం శీర్షికతో ఉపనిషత్తులపై వ్యాఖ్యానాన్ని ప్రారంభించిన సాహితీవేత్త వప్పు వేణుగోపాలరావు గారు పమరపదించడం సాహితీ లోకానికి తీరని లోటు. ధార్మిక విషయపరంగా ఒక ముఖ్యమైన కార్యక్రమం అర్థంతరంగా నిలిచిపోవడం విచారకరం. వేణుగోపాలరావు గారు బహుభాషా పండితుడు, సాహితీవేత్త, గొప్ప సంగీతశాస్త్రజ్ఞుడు. యక్షగానంపై వారి అవగాహన ప్రామాణికం. ఉపనిషత్ ఉద్యానవనం శీర్షిక ప్రారంభించి, ఒక్కొక్క ఉపనిషత్తుపై వ్యాఖ్యానం ప్రచురితమవుతున్న సందర్భంలో 'మిసిమి' పాఠకులలో చాలా మంది ఆసాంతాన ఇవన్నీ గుదిగ్రుచ్చి ఒక సంపుటంగా వెలువడితే బాగుంటుందని ఆశించారు. దురదృష్టవశాత్తూ ఆ ప్రయత్నానికి విరామం ఏర్పడింది. ఆశ్చర్యకరమైన సందర్భం ఏమంటే, వేణుగోపాలరావు గారు మరణ రహస్యాన్ని తెలుసుకొనగోరిన 'నచికేతుని' వలె 'కఠోపనిషత్తు'పై వ్యాఖ్యానం పూర్తయిన తరువాత, వారు అదే పనిగా పెట్టుకొని యముని ఆహ్వానంపై యమపురికి ఏగినట్లనిపిస్తుంది. గౌరవ సంపాదకులు అశ్వనీకుమార్‌గారు ఆశించినట్లు 'యముని నుండి మరణ రహస్యాన్ని తెలుసుకొని వచ్చి కఠోపనిషత్తు తరువాయి భాగం ఇస్తారేమో!' 'జాతస్య మరణం ధ్రువం' అన్నట్లు పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదు. సృష్టి వలయాన్ని ఛేదించడం ఎవరి తరం కాదు కదా!

వేణుగోపాలరావు గారు ఉపోద్ఘాతంతో ప్రారంభించి, మూడు ఉపనిషత్తులకు వ్యాఖ్యానాన్ని పూర్తి చేసారు. ఉపనిషత్తుల సంఖ్యపై వాదోపవాదాలు ఉన్నా, 11 ఉపనిషత్తులను వారు ప్రధానంగా పరిగణించారు. అవి: ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తరీయ, ఐతరేయ, చాందోగ్య, బృహదారణ్యక, శ్వేతాశ్వతర. వీటిలో మొదటి మూడింటికిగాను, వ్యాఖ్యానం పూర్తయి, మిసిమి పత్రిక ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ సంపుటాలలో ప్రచురితమైనాయి. పాఠకుల ఆదరణ చూరగొన్నాయి. అదే పంథాలో ఈ శీర్షికను కొనసాగించే బాధ్యతను అశ్వనీకుమార్ గారు నాకు అప్పగించడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఇది చాలా సాహసమైన కార్యమని నేనెరుగుదును. అయినా, దీనిని ఒక సవాలుగా స్వీకరించి సఫలీకృతం చేయాలని ఆకాంక్ష.

వరుస క్రమంలో నాల్గవదిగా చెప్పబడిన ప్రశ్నోపనిషత్ పై వ్యాఖ్యానంగా ఈ వ్యాసం కొనసాగుతుంది. పాఠకులు గమనించగలరు. పేరులో ఉన్నట్లుగానే ఇది ఆరు ప్రశ్నలకు సంబంధించినది. అథర్వవేదంలో భాగం. పిప్పలాదుడనే గురువును తన ఆరుగురు శిష్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఈ ఉపనిషత్తు రూపు దిద్దుకున్నా, అసలు పిప్పలాదుడు ఎవరు అనే ప్రశ్నకు, అనేక వ్యాఖ్యానాలున్నాయి. శివపురాణం ప్రకారం పిప్పలాదుడు ఎవరో కాదు, కేవలం శివుడే గురువుగా సృష్టి రహస్యాన్ని బోధించాడు. పద్మపురాణం ప్రకారం పిప్పలాదుడు వేదాలు, శాస్త్రాలు క్షుణ్ణంగా ఎరిగిన బాలుడు. తన విజ్ఞానం ద్వారా బ్రహ్మత్వాన్ని పొందినవాడు. వేరొక అభిప్రాయం ప్రకారం పిప్పలాదుడు ఒక ముని. క్రీస్తుపూర్వం 600–200 సంవత్సరాల మధ్య జీవించి, 'గర్భ ఉపనిషత్' అనే గ్రంథాన్ని రచించాడు. ఇది జీవం ఎలా ఏర్పడుతుంది అనే విషయాన్ని విడమర్చి చెప్తుంది. అధమంగా పిప్పళ్ళను ఎక్కువగా తినడం వలన పిప్పలాదుడు అనే నామం స్థిరపడిందనేది మరొక భాష్యం. పిప్పళ్ళను ఒక ఆయుర్వేద ఔషధంగా ఉపయోగిస్తారు. వీటిని మనం పొడవాటి మిరియాలుగా చెప్పుకోవచ్చు. పిప్పలాదుని ప్రస్తావన 'జైనిజం'లో కూడా ఉన్నది. దాని ప్రకారం పిప్పలాదుడు ఒక జైనముని. దధీచి, అతని భార్య సువర్చలకు జన్మించాడు. రుద్రుని అంశగా భావింపబడ్డాడు.

గురువైనటువంటి పిప్పలాదుని శిష్యులుగా ఉన్నటువంటి ఆరుగురు మునికుమారులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఈ ఉపనిషత్తు కూర్చబడినది. ఈ ఆరుగురు శిష్యులు ఎవరనగా భరద్వాజునికి కుమారుడైన సుకేశుడు, శిబి కుమారుడైన సత్యకామ, గార్గ్య

వంశానికి చెందిన సూర్యుని మనుడమైన శౌర్యాయని, అశ్వల పుత్రుడైన కౌశల్య, భృగు వంశానికి చెందిన భార్గవ, కత్య వంశానికి చెందిన కబంధి కాత్యాయను. ఇతనినే 'కబంధి'గా పిలుస్తారు. ఒక విధంగా ప్రశ్నోపనిషత్తును 'ముండక' ఉపనిషత్తుకు కొనసాగింపుగా భావించవచ్చు. ఎందుచేతననగా ముండక ఉపనిషత్తులో పేర్కొనబడిన కొన్ని అంశాలను ప్రశ్నోపనిషత్తు మరింత విపులంగా తెలియజేస్తుంది. ఇక అడగబడిన ప్రశ్నల విషయానికి మళ్ళితే, కాత్యాయనుని కుమారుడైన కబంధి పిప్పలాదుని ఈ విధంగా ప్రశ్నించాడు. గురోత్తమా! ''ఎప్పుడు భూమిపై జీవం ఉద్భవించింది? దీనికి సమాధానంగా పిప్పలాదుడు ఈ విధంగా తెలిపాడు.

"సృష్టికర్త, జీవులను సృజించే ఉద్దేశ్యంతో, శక్తిని, పదార్థాన్ని సృష్టించాడు. ఆయన ఉద్దేశ్యంలో, ఈ రెండూ తమ కలయిక ద్వారా జీవులను సృష్టించగలుతాయని భావించాడు". ఇక్కడ పదార్థం అంటే ఆహారంగాను, శక్తి అంటే అగ్ని లేదా సూర్యునిగా అర్థం చేసుకోవాలి. కావున, ఆహారము, అగ్నిల కార్యకారణ సంబంధం ద్వారా జీవం ఏర్పడుతుంది. ఇంకొక అర్థంలో అగ్ని అంటే సూర్యుడు, ఆహారం అంటే చంద్రుడుగా భావించి, సూర్యచంద్రుల కలయిక ద్వారా జీవం ఏర్పడుతున్నట్లుగా చెప్పబడినది. సూర్యుడు తన వేడిమి చేత, చంద్రుడు తన చల్లని కిరణముల చేత జీవానికి అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తాయి. ఆ విధంగా పిండము మొక్కగా గాని, కీటకంగా గాని, మానవునిగా గాని పరిణామం చెందుతుంది. విశ్వంలోని జీవులన్నింటికి కర్త, అతనే 'ప్రజాపతి'గా పిలవబడుతున్నాడు. బ్రహ్మ యొక్క ఒక రూపవమే ప్రజాపతియని చెప్పబడుతున్నది. ఇచ్చట, రయి అంటే పదార్థము.

మొదటి ప్రశ్న **"భగవన్!కు తోహవా**
**ఇమాః ప్రజాః ప్రజాయంత? ఇతి!**
**మొదటి ప్రశ్న జవాబు : ప్రజా కామోవై ప్రజాపతిః!**
**సతపో అతప్యత?**
**సమిథునమ్ ఉత్పాదయతే?**
**"రయించ-ప్రాణంచ" ఇతి?**
**"ఏతౌయే బహుధా ప్రజాః**
**కరిష్యత?"...ఇతి**

శక్తి అంటే ప్రాణము. ఈ రెండు కలసి, జీవజాలం బయల్వెడలడం జరుగుతున్నది. ప్రాణశక్తి యొక్క రూపము నిరాకారము (అంటే అమూర్తము), పదార్థము లేదా శక్తి యొక్క సాకారమే మూర్తము లేదా ఇంకొక వ్యక్తీకరణలో పదార్థము, శక్తి యొక్క మరొక రూపము. ఆ విధంగా భావించిన యెడల పదార్థము, శక్తి వేరు కాదు. అందుచేత ఈ విశ్వంలోని ప్రాణులు, ప్రాణశక్తి యొక్క వివిధ రూపములే.

**రెండవ ప్రశ్న :** భృగువంశానికి చెందిన భార్గవుడు ఈ రెండవ ప్రశ్నను సంధించాడు. "పూజనీయమైన గురూజీ, ప్రాణం కలిగిన జీవిని ఎంతమంది దేవతలు సంరక్షిస్తారు? అందులో ఎవరు జీవికి ప్రాణం పోస్తారు? వారిలో ఎవరు సర్వోత్తములు?

**"భగవన్! కతి ఏవదేవాః ప్రజాం విధారయంతే?**
**కతిర ఏతత్ ప్రకాశయంతే?**
**కః పునః ఏషాం వరిష్ఠ?**
**ఇతి??"**

అందుకు సమాధానంగా పిప్పలాదుడు ఈ విధంగా ప్రవచించెను. పంచభూతములనబడే ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి ఈ భౌతిక సృష్టికి కారణ పదార్థములు. ఈ విధంగా ఏర్పడిన ప్రాణశక్తి యొక్క ప్రదర్శనలే ఇంద్రియాలు. ఇంద్రియాలు రెండురకాలుగా చెప్పబడ్డాయి. అవి : కర్మేంద్రియాలు, వాక్కు పాణి (చేయి), పాదం, పాయువు (పురీష నాళం చివరన ఉండే బాహ్య శరీర కక్ష్య. ఇది జీర్ణం అయిన తరువాత మిగిలి ఉన్న వ్యర్థాలను బయటకు పంపే క్రియను సులభతరం చేస్తుంది. కావున గుదము అనవచ్చునేమో!), ఉపస్థ (లింగము లేదా సంతానోత్పత్తికి ఉపకరించే అంగము). జ్ఞానేంద్రియాలుగా పిలవబడేవి. త్వక్కు (చర్మం), చక్షువు (కన్ను), రసన (నాలుక), శ్రోతం (చెవి), ఘ్రాణం (ముక్కు). వీటి ద్వారా మానవుడు ప్రకృతిని తన అనుభవంలోనికి తెచ్చుకుంటాడు. 'మనస్సు' అన్నది ఆరవ ఇంద్రియంగా చెప్పబడుతున్నది. ఇది పై వాటివలె బాహ్య ప్రపంచానికి గోచరించేది కాదు. ప్రాణశక్తి దేహంలో ప్రవేశించగానే ఇంద్రియములన్నీ, తమ కార్యనిర్వహణను ప్రారంభిస్తాయి. కాబట్టి ప్రాణశక్తియే వివిద రూపాలలో అంటే అగ్నిగా, వర్షముగా, వివిధ ప్రకృతి రూపాలుగా

వెలుగొందుతున్నది. రథచక్రం యొక్క ఇరుసులో 'ఆకులు' ఇమిడి ఉన్నట్లుగా ప్రాణశక్తి యందే, సర్వము ప్రతిష్ఠాపితమై ఉన్నది. ఈ విధంగా ప్రశ్నలోని మొదటి భాగానికి జవాబు చెప్పినట్లైనది. భౌతిక సృష్టికి కారణభూతులైన కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, మనసు మొత్తంగా జీవుని పరిపాలిస్తాయి లేదా నియంత్రిస్తాయి.

ఆ పైన ప్రశ్నలో రెండవ భాగమైన మొత్తం దేవతలలో ఎవరు జీవికి ప్రాణం పోస్తారు? దీనికి పిప్పలాదుడు ఈ విధంగా సమాధానం చెప్తాడు. ప్రాణం యొక్క శక్తి రూపం సూర్యునిగా బహిర్గతమవుతుంది. అదే మేఘంగాను, వర్షంగాను, గాలిగాను, నీరు గాను వ్యక్తీకరించబడుతుంది. ప్రాణం చంద్రునిగా వ్యక్తీకరించబడవచ్చు. ఈ విధమైన 'ప్రాణం' ప్రకృతిగా అనేక రూపాలను సంతరించు కొంటుంది. అంతిమంగా ప్రకృతే ప్రజాపతి లేదా విశ్వం యొక్క సృష్టికర్త లేదా ప్రభువు. ప్రశ్నలో మూడవ భాగమైన జీవికి ప్రాణం పోసిన దేవతలలో ఎవరు అధికులు లేదా సర్వోత్తములు? దీనికి సమాధానంగా పిప్పలాదుడు, ప్రాణమే ముఖ్యదేవతని ప్రకటించాడు. రథచక్రము యొక్క ఇరుసులోని 'ఆకులు' వలె మిగిలిన ఇంద్రియాలన్నీ ప్రాణం ఆధారంగా పనిచేస్తున్నాయి. ఓ భార్గవా! పంచభూత, దశేంద్రీయ, మనో విశేషాలన్నింటిని శరీర దేవతలుగా భావిస్తే, ప్రాణమును ముఖ్యదేవతగా భావించవచ్చు.

**మూడవ ప్రశ్న :** అశ్వల పుత్రుడైన కౌశల్య మూడవ ప్రశ్నను అడిగాడు. ఈ ప్రశ్నలో ఆరు చిన్న ప్రశ్నలు ఉన్నాయి. అవి : 1. ఈ ప్రాణము ఎవరి నుండి లేదా ఎచటి నుండి పుట్టుచున్నది? 2. శరీరంలోనికి ఏ విధంగా ప్రవేశిస్తున్నది? 3. తనను తాను వివిధ రూపాలుగా ఏ విధంగా విభజించు కొంటూ తనను తాను ఏ విధంగా బద్ధురాలిని చేసుకొంటున్నది? 4. అది ఏ విధంగా శరీరం నుండి బయట పడుతుంది (అంటే శరీరాన్ని నిర్జీవం చేస్తుంది)? 5. బయటనున్న చైతన్యానికి ఏ విధంగా సహాయకారిగా ఉంటున్నది? 6. అదే విధంగా అంతర్జ్ఞానాన్ని ఏ విధంగా ధరిస్తున్నది? మూడవ ప్రశ్న

**"భగవన్!**
**కుత ఏ ష ప్రాణో జాయతే?**
**కథమ్ ఆయాత్ అస్మిన్ శరీరే?**
**ఆత్మానం వా ప్రవిభజ్య**
**కథం ప్రాతిష్ఠతే?**
**కేన ఉత్క్రమతే? కథం బాహ్యమ్ అభిధత్తే?**
**కథం అధ్యాత్మమ్? ఇతి??"**

ఇంద్రియాలన్నింటికి అధి దేవత లేదా ముఖ్య దేవతైనటువంటిది 'ప్రాణం'. దాని యొక్క నిర్వహణ మొదలైన విషయాల విపులీకరణ ఈ ప్రశ్నకు జవాబుగా చెప్పబడింది. ప్రాణం, ఆత్మ నుండి జనించుచున్నది. అట్లే ప్రాణాన్ని ఆత్మ యొక్క నీడ అని చెప్పవచ్చు. అయితే, ఆత్మ అంటే ఏది? దేహంలో ఉన్న చైతన్యాన్ని ఆత్మగా చెప్పవచ్చు. దేహానికి ముఖ్యమైన గుండె, సుమారుగా 72,000 ధమనులు కలిగి, శరీరం నిలుపుదలకు దోహదం చేస్తుంది. దేహానికి, బాహ్య ప్రకృతి, పంచ ప్రాణాలకు మధ్య ఉన్న బాంధవ్యాన్ని ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

| క్రమ సంఖ్య | వివరం | సూక్ష్మ రూపం | స్థూల రూపం | సంబంధం |
|---|---|---|---|---|
| 1 | ప్రాణం | కన్ను | సూర్యుడు | శ్వాస |
| 2 | అపాన | గుదము లేదా మల ద్వారాము | భూమి | గురుత్వాకర్షణ |
| 3 | సమాన | పొత్తికడుపు | ఆకాశం | జీర్ణశక్తి |
| 4 | వ్యాన | గుండె | గాలి | రక్తసరఫరా |
| 5 | ఉదాన | శరీర వెచ్చదనం | అగ్ని | శరీర ఉత్పాతాలు |

ఈ విధంగా సూక్ష్మ, స్థూల రూపాలుగా ఉన్న పంచప్రాణాలు తమను తాము బద్ధులుగా చేసుకుంటూ శరీరాన్ని జీవం ఉన్నదానిగాను, లేదా నిర్జీవంగాను చేస్తున్నాయి. ప్రాణం శ్వాసలోను, గురుత్వాకర్షణ శక్తి అపానంలోను, జీర్ణశక్తి పొత్తికడుపులోను, వ్యానం, గుండె ద్వారా దేహానికి రక్తసరఫరా చేస్తూ, శరీరానికి వెచ్చదనాన్ని కలిగిస్తున్నాయి. ఈ శక్తులన్నీ అచేతనం అయినప్పుడు ప్రాణం, పునర్జన్మ కోసం అన్ని ఇంద్రియాలతో సహా ప్రయాణించి వేరొక శరీరాన్ని చేరుతుంది. పునర్జన్మ అంశం హిందూమత సంప్రదాయంలో ముఖ్యమైన భావన. నిర్జీవమయ్యేది శరీరం లేదా దేహమే కాని చైతన్యం లేదా ప్రాణం కాదు అన్నది ఇందులోని ముఖ్యమైన ప్రతిపాదన. ప్రాణం దేహం నుండి ఏ విధంగా బయటకు పోతున్నది అన్న విషయంగా గురువైన పిప్పలాదుడు ఈ విధంగా తెలియజేసాడు. ప్రాణం ఏ విధంగా అయితే వివిధ రూపాలలో దేహాన్ని చేరిందో అదే విధంగా వేరే

దేహంలోకి తన ప్రయాణాన్ని సాగిస్తుంది. దీనినే ఆత్మ అనిగాని, చైతన్యం అనిగాని చెప్పవచ్చు. దీనినే ప్రాణం యొక్క సూక్ష్మ రూపంగా చెప్పెదరు. దేహం అనే గృహం నుండి చైతన్యం బయలువెడలిన తరువాత, కేవలం దేహం లేదా 'కట్టె' ఒక్కటియే మిగులుతుంది. ఈ విధంగా శరీరం నుండి బయలు వెడలిన చైతన్యం ఎక్కడికి పోతుంది అన్నది ప్రశ్న? దీనికి సమాధానంగా మహర్షి ఈ విధంగా చెప్పాడు. 'పంచ ప్రాణాలలో ఒక్కటైన 'ఉదానం' జీవి యొక్క తరువాయి ప్రయాణాన్ని నిర్దేశిస్తుందని, ప్రస్తుత జీవనంలో 'మిగిలి ఉన్న కోరికల ఆధారంగా తరువాతి గమ్యం నిర్ణయించబడుతుందని తెలిపాడు. గమ్యాన్ని నిర్దేశించడంలో ఉదానం, ఎన్నడూ తప్పు చేయదని చెప్పబడింది. ఈ సందర్భంలోనే హిందూతత్వం, కర్మ, ఫల సిద్ధాంతాన్ని నమ్ముతుంది. ప్రస్తుత జీవనంలో చేసిన కార్యాలు, కర్మలు, ఫలితాలను నిర్ణయించడం ద్వారా తరువాతి గమ్యం నిర్దేశించబడుతుంది. అయితే, ఆ గమ్యం ఏది? ఏ విధంగా లేదా ఏ జాతి ద్వారా చైతన్యం కలిగి పునర్జన్మ పొందుతాము అన్నవి మరింత ఆసక్తి కలిగించే అంశాలు. స్థూలంగా చెప్పబడినది, ఆత్మకు లేదా ప్రాణానికి లేదా చైతన్యానికి నశింపు లేదు. భగవద్గీత ద్వారా చెప్పబడినట్లు మానవుడు ఏ విధంగానైతే జీర్ణ వస్త్రాన్ని వదలి నూతన వస్త్రాన్ని ధరిస్తాడో, అదే విధంగా చైతన్యం కూడా కృశించిన దేహాన్ని వదలి వేరొక దేహాన్ని ఆశ్రయిస్తుంది. ఆ దేహము లేదా జీవి ఏది అన్న విషయంగా 'కర్మ-ఫలము' దానిని నిర్దేశిస్తుందని చెప్పబడింది. కొన్ని కోట్ల జీవరాశులలో పునర్జన్మ ద్వారా ఏ రూపాన్ని పొందుతాము అన్నది 'కర్మ-ఫలం' నిర్ణయిస్తుంది. చావుపుట్టుకలు ఒక వలయం. జీవి మోక్షం పొందేవరకు ఈ వలయంలో మరల, మరల జీవం పొందుతూ కర్మలు చేస్తూ, అనుభవిస్తూ ఉంటుంది.

**నాల్గవ ప్రశ్న :** సూర్యుని మనుమడైన గార్గ్య వంశానికి చెందిన శౌర్యాయని ఈ క్రింది ప్రశ్నను అడిగాడు.

**"భగవన్! ఏ తస్మిన్ పురుషే**
**కాని స్వపంతి?**
**కాని అస్మిన్ జాగ్రతి?**
**కతర ఏషదేవః స్వప్నాన్ పశ్యతి?**
**ఏతత్ సుఖం భవతి?**
**కస్మిన్ను సర్వే సం ప్రతిష్ఠితా**
**భవంతి? ఇతి??"**

ఓ భగవంతుడా! మనిషిలోని ఏ యే అంగాలు నిద్రిస్తాయి? ఏవి మెళుకువగా ఉంటాయి? ఏ దేవుడు కలను ఆస్వాదిస్తాడు లేదా అనుభవిస్తాడు? ఎవరికి ఈ ఆనందం కలుగుతుంది? ఇవన్నీ కూడా అంతిమంగా ఎవరిలో లీనం అవుతాయి? దీనికి సమాధానంగా పిప్పలాదుడు ఈ విధంగా వివరిస్తాడు. సూర్యాస్తమయం కాగానే ఇంద్రియాలు, మనస్సు నిద్రలోనికి జారుకుంటాయి. 'విశ్వం' ఒక్కటే మెళుకువగా, చేతనత్వంతో ఉంటుంది. మరల సూర్యోదయానికి అన్ని కిరణాలు సూర్యుని నుండి బయలువెడలి, చేతనత్వాన్ని కలిగిస్తాయి. ఈ ప్రక్రియ ఒక చక్రంలా జరుగుతుంటుంది.

మానవునిలోని చేతనకు సంబంధించి మూడు దశలను పేర్కొనడం జరిగింది. అవి : జాగ్రదావస్థ, అంటే మెళుకువ కలిగి ఉండడం, మానవునికి సంబంధించి, సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు అని భావించవచ్చు. రెండవది స్వప్నావస్థ. ఈ అవస్థలో ఇంద్రియాలు చేతన నుండి దూరం చేయబడతాయి. దీనినే సంస్కృతంలో 'తైజస' అంటారు. మూడవ దశ ప్రజ్ఞ, గాఢనిద్రావస్థ లేదా సుషుప్తావస్థ అనవచ్చు. ఈ దశలో మనస్సు కూడా దేహం నుండి వేరుపడుతుంది. ఈ దశలోనే దేహానికి అమితానందం కలుగుతుందని చెప్తారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు దేహాన్ని తొమ్మిది ద్వారాలు కలిగిన పట్టణంతో పోల్చినాడు. రెండు చెవులు, రెండు కళ్ళు, ఒక నోరు, రెండు నాసికా రంధ్రాలు, అపానము మరియు జననేంద్రియము. దేహంలోని చేతన తనను తాను ఈ నవరంధ్రాలు లేదా ద్వారాలు గల పట్టణంతో సంధానం చేసుకుంటుంది. అదే పట్టణానికి రాజు. అన్ని అవస్థలలోను జాగురూకంగా ఉండేది చైతన్యం ఒక్కటే. అందుచేత జ్ఞానులైన యోగులు తమను తాము శరీరం లేదా దేహంగా భావించరు. శరీరము దాని ద్వారా జరుపబడే కార్యము లన్నియు భగవంతునికి చెందినవని భావిస్తారు.

పక్షులు ఏ విధంగానైతే పగలంతా ఆహార సంపాదన కోసం తిరిగి, తిరిగి సాయం సమయానికి ఏ విధంగా గూటికి చేరి విశ్రమిస్తాయో, అదే రీతి దేహం, దానితో పాటు ఉన్న ఇంద్రియాలన్నీ, నిద్రావస్థలో విశ్రాంతిలోనికి

జారుతాయి. గాఢనిద్రావస్థలో మానవుడు పరమాత్మను సమీపించి, పరత్వమును పొందుతాడు.

కల యొక్క స్వభావాన్ని వివరిస్తూ, కలకు ఏ బంధనాలు లేవని, చూచిన దానినే, మరల చూచునని, విన్నదానినే మరల వింటుందని, ప్రాంతాలతో సంబంధం లేకుండా ఎక్కడెక్కడో తిరుగుతూ అవే అనుభవాలను మరల మరల పొందుతూ ఉంటుంది. మనస్సు ఏదైతే కోరుకుంటుందో వాటిని కల చూపిస్తుంది. ఇవే విషయాలను మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఇంకొక రకంగా వివరిస్తారు. జాగ్రదావస్థలో తీరని కోరికలు, లేదా ఆశలు, అనుభవాలు, జ్ఞాపకాలు అన్నీ కలగలిపి కలలుగా రూపొందుతాయని వారి వివరణ. అయినా, ఆ అంశం జోలికి పోవడం లేదు. మెళుకువగా ఉన్నప్పుడు మనస్సు, గాఢ నిద్రలో ఉన్నప్పుడు, అంటే మనస్సు కూడా అచేతనంగా ఉన్నప్పుడు ఆత్మ కలను అస్వాదిస్తుంది. గాఢనిద్రలో ఉన్నప్పుడు పేదవాడు, ధనవంతుడు, జ్ఞాని, అజ్ఞాని అందరూ ఒక్కటే. ఈ దశలో జీవులన్నింటికి సమాన స్థాయి ఏర్పడుతుంది. అన్ని స్థాయిలలోను చైతన్యం లేదా చేతన జాగురూకంగానే ఉంటుంది. దీనినే ఆత్మ లేదా సెల్ఫ్ అంటారు. ఇది కూడా విశ్రాంతి తీసుకోవడం అంటే, పరమాత్మలో లీనం కావడమే. కావున పిప్పలాదుడు అంతిమంగా చెప్పదలిచినది ఆత్మ యొక్కటే నిజం. దానికి విశ్రాంతి లేదు, స్థిరమైనది, నశింపులేనిది. అది ఒక శరీరం నుండి మరొక శరీరానికి మారుతుంటుంది తప్ప, కనుమరుగయ్యే అవకాశం లేదు. యోగులైన వారు ఈ ఆత్మను పరమాత్మలో లీనం చేయాలని శ్రమిస్తుంటారు. అదియే మోక్షంగా చెప్పబడింది.

**ఐదవ ప్రశ్న :**

శిబి యొక్క కుమారుడైన సత్యకామ ఈ ప్రశ్నను అడగడం జరిగింది. "ఏ మానవుడైతే ప్రయాణాంతము (అంటే మరణం) వరకు ఓం కారమును ధ్యానిస్తూ ఉంటాడో అట్టి అభిధ్యానము చేత అతనిచే ఏ ఏ లోకములు జయించబడతాయి?"

**"సయోహవై, తత్ భగవన్?**
**మనుష్యేషు ప్రాయణాంతమ్**
**'ఓం'కారమ్ అభిధ్యాయత...**
**కమతం వావ**
**సతేన లోకం జయతి?"**

ఈ ప్రశ్నకు సమాధానం ద్వారా పిప్పలాదుడు 'ఓం' యొక్క స్వరూపాన్ని విశదీకరించాడు. అట్లే ధ్యానం అంటే ఏమిటి? ఏ విధంగా ఆచరించాలి? ఇహము, పరము అంటే ఏవి? వంటి ప్రశ్నలకు సమాధానాలను తెలియజేసాడు. 'ఓం' కారములో మూడు అక్షరాలు కలిసి ఉన్నాయి. అవి : అ-ఉ-మ. వీనిలో ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. ఎవరైనా మొదటి అక్షరాన్ని మాత్రమే ధ్యానిస్తే సిద్ధి స్థానము పొందుతాడు. ఆపైన తిరిగి మానవ లోకానికే తిరిగి వస్తాడు. ఒక వేళ అతను 'ఓం'లోని రెండు అక్షరాలు, అంటే 'అ-ఉ'లను మాత్రమే ధ్యానిస్తే, దాని ద్వారా మనుష్యుడు మనస్సుతో ఏకత్వాన్ని పొంది, ఉపాసన స్వభావం చేత చంద్రలోకానికి చేరి, అచ్చట అనుభవాన్ని పొంది, తిరిగి మరల మానవలోకానికే చేరతాడు. అదీ అతను 'ఓం'కారం యొక్క 'త్రిమాత్ర' రూపాన్ని ఉపాసిస్తాడో అతను సూర్యతేజస్సుతో ఏకత్వం పొందుతాడు. దానినే బ్రహ్మలోక ప్రాప్తి అని చెప్పెదరు. ఒకవేళ అజ్ఞానంతో ఎవరైనా ఓంకారంలోని మూడు మాత్రలు (అక్షరాలను), విడివిడిగా దేనికదే ఉపాసించడం జరిగితే, ఆ సాధకుడు మృత్యువును అధిగమించలేడు. దాని పరిధిలోనే ఉండిపోతాడు. కాబట్టి ఓంకారం యొక్క శక్తి ఈ విధంగా బలమైనదిగా గుర్తించాలి. మరింతగా వివరిస్తూ ఓంకారమంటే బ్రహ్మమే. నాణెమునకు రెండు వైపులు ఉన్నట్లుగా, ఒక వైపు 'ఓంకారము', రెండవ వైపున 'బ్రహ్మము' ఉండెను.

అట్లే, ఇహము-పరము లేదా అపరము-పరములను గూర్చి విడమరచి చెప్తూ, 'అపరము' అంటే సాకారమైనది, నామరూపాత్మకము లేదా కనిపించేది అని, పరము అంటే అవ్యక్తమైనది, నామ-రూపాలు లేనిది, నిరాకారమైనది అని తెలియజేసాడు. ఓంకార ఉపాసకుడు, తన సాధనలో ఈ రెండింటిలో ఏదో ఒకదానిని పొందుతాడు. సాధనను పరిపక్వం చేసుకొన్నప్పుడు లేదా శిఖరాగ్రస్థాయి చేరినప్పుడు ఈ 'ఇహ-పర' లేదా 'అపర-పర' బేధం నశిస్తుంది. ఇదియే అంతిమలక్ష్యం అవుతుంది.

'ఓం'కారం యొక్క స్వరూపాన్ని మరింతగా విడమర్చి చెప్తూ, పిప్పలాదుడు ఈ విధంగా వివరించాడు. ఓంకారంలో ఇమిడి ఉన్న త్రిమాత్రలను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు.

**1. 'అ' :** ఏకమాత్రోపాసన భౌతికతతో ఏకత్వము లేదా భౌతిక రూపధ్యానము. ఎవరైతే ఈ ఒక్క అక్షరాన్నే ధ్యానిస్తున్నాడో అతను పరమాత్మను తృతీయ పురుషగా ధ్యానిస్తున్న వానిగా భావించాలి. దానినే స్థూల రూపోపాసనగా చెప్పవచ్చు.

**2. 'అ-ఉ' :** ద్విమాత్రోసాపన. దీనిని మనోరూప ధ్యానంగా చెప్పవచ్చు. ఇదియే సూక్ష్మరూపోపాసన. ఈ సందర్భంలో మానవుడు మనస్సుతో ఏకత్వాన్ని పొందుతాడు. దీని ద్వారా తనకు ఎదురుగా కనిపించేదంతా పరమాత్మగా గోచరిస్తుంది. దీనినే ద్వితీయ పురుషగా చెప్పవచ్చు.

**3. 'అ-ఉ-మ' :** త్రిమాత్రోపాసకుడు, సమగ్రమైన ఉపాసన ద్వారా పరలోకము లేదా బ్రహ్మలోకమును చేరుతాడు. దీనిని సూక్ష్మాతిసూక్ష్మమైన స్థితిగా చెప్తారు. దీనినే ప్రథమ పురుషగా భావించాలి. ఆ సందర్భంలో సాధకుడు తనతోసహా సర్వము బ్రహ్మమయమేనని భావిస్తాడు. స్థూలంగా చెప్పాలంటే ఒక్క మాత్ర (అ) నే ధ్యానించినవాడు, మరల మానవ జన్మనే బహుమతిగా పొందుతాడు. అంటే మరల 'హిరణ్యగర్భమే' సంప్రాప్తిస్తుంది. రెండు మాత్రలు (అంటే అ-ఉ) ధ్యానించిన వాడు ఊర్ధ్వలోకాలు పొందుతాడు. అయినప్పటికి భూమికే చేరతాడు. మూడు మాత్రలు సంపూర్ణంగా ధ్యానించినవాడు 'బ్రహ్మత్వాన్ని' బహుమతిగా పొందుతాడు. దీనినే 'అమరత్వం'గా చెప్తారు.

**ఆరవ ప్రశ్న :** భరద్వాజ గోత్రుడైన సుకేశుడు ఈ ప్రశ్నను అడిగాడు. మహర్షీ! కోసల దేశానికి చెందిన నా మిత్రుడైన హిరణ్యభరాజపుత్రుడు నన్ను అడిగిన ప్రశ్ననే నేను ఇప్పుడు మిమ్ములను అడుగుచున్నాను. అదేమంటే "షోడశ (పదహారు) కళల పురుషుడంటే ఎవరు? ఆ కళలు ఏవి?" దీనికి సమాధానంగా పిప్పలాదుడు, సుకేశా, పదహారు కళల పురుషుడంటే ఎవరో కాదు నీవే. నీ ఆత్మయే ఈ కళలను కలిగి ఉన్నది అని చెప్పాడు. తమలోనే ఉన్న ఆ పురుషుని లేదా 'ఆత్మను' ఎవరికి వారే దర్శించుకోవాలి. నీవు, నేను, నీ మిత్రులందరము షోడశ కళాపురుషులమే. ఆ పురుషుడే ఆలోచనలకు ఉత్పత్తి స్థానమై ఉన్నాడు. సర్వాంతర్యామి అయినట్టి ఆత్మదేవుడు, తనకుతానుగా తన కొరకై 'విశ్వప్రాణము' అను హిరణ్యగర్భతత్వమును సృష్టించుకొనుచున్నాడు. నీ ఆత్మయే పురుషునిగా నీ ముందు ప్రత్యక్షమై నీకు ఎదురుగా నిలుచుచున్నది. ఇదియే ఆత్మ యొక్క లీలా వినోదంగా చెప్పబడింది.

ఆపైన పదహారు కళలు అంటే అయిదు పంచభూతాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు జ్ఞానేంద్రియాలు, ఒక మనసు, కలసి పదహారు కళలుగా ఆవిష్కృతమవుతున్నాయి. వాటిని గురించి ఇంతకుముందు వివరించడం జరిగినది. ఈ సందర్భంలో పిప్పలాదుడు ఒక మంచి ఉదాహరణతో వీని అర్థాన్ని వివరించడం జరిగింది. సముద్రంలోని జలమే, ఆవిరిగా మారి నదులుగా ప్రవహించి, మరల ఏ విధంగా తననే చేరుతాయే అట్లే 'ఆత్మ' వివిధ రూపాలుగా మారి, మరల ఆ పరమాత్మనే చేరుతుంది.

**సంగ్రహం :** సంగ్రహంగా చెప్పాలంటే ఈ ఉపనిషత్తును ఆధ్యాత్మికంగాను, కొంత శాస్త్రీయతతోను, కొన్ని మౌలిక విషయాలను విడమర్చిచెప్పే ప్రయత్నంగా భావించవచ్చు. కొన్ని ప్రశలు మానవ మస్తిష్కాలను తొలచివేసేవే. శాస్త్రీయ పరంగా, ఆధునిక విజ్ఞానంతోడుగా కొత్త ప్రయత్నం జరుగుతున్నా పూర్తి జవాబు లభించినట్లు భావించలేము. భూమిపై జీవం ఏ విధంగా ఉద్భవించింది? జీవం ఏ విధంగా ఏర్పడుతుంది? దాని ఉనికి ఎక్కడ? ఏ రూపంలో ఉంటుంది? ప్రకృతికి దానికి ఉన్న సంబంధం ఎంత? ప్రాణం అంటే ఏమిటి? మరణం అంటే ఏమిటి? మరణం తరువాత ఏమౌతుంది? చైతన్యం అంటే ఏది? దాని స్వరూపం ఏ విధంగా ఉంటుంది? ఇంద్రియాలు, వాటి స్వభావం, కలల యొక్క మూలం ఏది? అవి ఎలా ఏర్పడతాయి? ఆత్మకు - పరమాత్మకు ఉన్న సంబంధం ఓంకారం యొక్క విశిష్టత మొదలైన అంశాలు చాలా లోతుగా విశదీకరించబడినాయి. రచయిత ఉద్దేశ్యంలో ఈ విజ్ఞానాన్ని, శాస్త్ర, సాంకేతిక అంశాలతో జోడించి, పరిశోధన గావిస్తే పై ప్రశ్నలకు మరింత హేతుబద్ధమైన జవాబులు, పరిష్కారం లభించగలవని నమ్మకం. స్వస్తి!

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

# వేమన మానవతా దృక్పథం

– ఆచార్య లక్ష్మీ ప్రసన్న

మన సంస్కృతి సాహిత్య సంప్రదాయాల్లో మానవతా విలువలు వెల్లివిరిసి ప్రతిబింబిస్తాయి మానవులకు మానవత్వం ఉంటే లోకమంతా ఆనందంగా ఉంటుంది. మానవత్వపు ఉత్తమ లక్షణం సహనం, ఓర్పు. సహనం ఎప్పుడైతే కోల్పోతామో అప్పుడు మానవత్వం లోపిస్తుంది. ఏ సమాజంలోనైనా భిన్న నమ్మకాలు, విభిన్న దృక్పథాలు ఉంటాయి. మనసులందరిలో ఒకే విధమైన ఆలోచనలు ఉండవు. విభిన్న తాత్విక దృక్పథాలు ఉంటాయి. మానవత్వం ఉంటే నైతిక విలువలు వాటంతట అవే వస్తాయి. కాబట్టి మనుషులకి మానవత్వం, సహృదయత ఉండాలి. అశాశ్వతమైన వస్తువులపై మమకారాన్ని పెంచుకుని శాశ్వతమైన బంధాలను, కీర్తిని అవసరాలకు అర్థంగా మార్చేసుకుంటున్నాము. నిస్వార్థ భావంతో, త్యాగంతో నీగ్గతేలే మన విలువలను పనికిరాని వస్తువులుగా భావిస్తున్నాము. మనిషి అశాశ్వతం, మనిషికి హోదానిచ్చే ఆడంబరాలు అశాశ్వతం. కానీ వాటికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాము. మనిషి యొక్క విలువలను చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోయేటట్లు చేసేసేవి మానవతా విలువలే. నిజం చెప్పాలంటే మనిషికి మానవతా విలువలే అసలు సిసలైన ఆస్తిపాస్తులు, అండదండలు, చెరగని చిరునామాలు. మానవతా విలువలు అనేవి ఎక్కడో గ్రంథం నుంచి కాని, గురువుల నుండి గాని బోధించ సాధించేటటువంటివి కావు. మానవునితోనే ఆవిర్భవించినటువంటివి. మన నిత్య జీవితంలో ఎటువంటి కర్మలను ఆచరించి, సత్యమైన భావములను మనము అభివృద్ధి పరుచుకుంటామో అప్పుడే మానవతా విలువలు మన వెంట ఉండి మనలను కాపాడుతూ ఉంటాయి. మానవతా విలువలు అనేవి మనకు సమాజంలో గౌరవ మర్యాదలను సంపాదించి పెడతాయి. విలువలతో కూడిన నడక ప్రతి ఇంటిలోను, సమాజంలోను ఉండాలి. శాంతి, ప్రేమ, ఓర్పు, సహనం, అహింస వంటి మానవతా విలువలు అందరూ ఆచరించినట్లు అయితే సమాజంలో అందరూ బాగుంటారు. మానవతా విలువలు లేని జీవితం పునాది లేని ఇల్లు వంటిది. సామాజిక రుగ్మతను రూపుమాపడానికి తన పద్యాలతో విశ్వకవిగా యోగివేమన కీర్తి పొందారు. వేమనకు తెలుగు సాహిత్య లోకంలో ఒక మంచి గుర్తింపు ఉంది. ఈయన తెలుగు ప్రజలలో ఒక మహాయోగిగా, ప్రజాకవిగా చిరస్థాయిగా నిలిచిపోయారు. మానవుల జీవిత సత్యాలను లోకానికి అందించిన మహానుభావుడు వేమన. చిన్నపిల్లల మొదలుకొని పెద్ద వారి వరకు వేమన తెలియని తెలుగు వారు అంటూ ఎవరూ ఉండరు. వేమన శతక పద్యాలు వివిధ భాషల్లోకి కూడా అనువదించబడ్డాయి. ఏది ఏమి అయినా సమాజంలో జరుగుతున్న సంఘటనలు, మూఢనమ్మకాలు, సంస్కృతీ సంప్రదాయాలు, దైవభక్తి, తత్వజ్ఞానము మొదలైన ఎన్నో అంశాలతో వేమన శతక పద్యాలు ఉన్నాయి. సరళమైన చిన్న మాటలతో ఎంతో విలువైన జీవిత సత్యాలని చెప్పారు వేమన. బ్రౌన్ దొర వీటిని మెచ్చి, ఇంగ్లీష్ భాషలోకి తర్జుమా చేసి రాసారు. ఇంత గొప్ప వేమన పద్యాలు మన సంపద. పిల్లలకి ఇవి నేర్పగలిగితే, వారి బుద్ధి చక్కగా వికసిస్తుంది. వేమన పద్యాలను పాఠాలుగా పిల్లలకు నేర్పడం నుండి వేమన పద్యాలలోని మాధుర్యాన్ని ఇప్పటికీ రోజువారీ సంభాషణల్లో గుర్తు చేసుకోవడం జరుగుతూ ఉంటుంది. వేమన పద్యాలు ఎంతగా ప్రాచుర్యం పొందాయంటే ఆయన పద్యాలలోని పంక్తులు సామెతలుగా స్థిరపడ్డాయి.

**ఉదాహరణకు కొన్ని : తాటి చెట్టు కింద పాలు తాగడం** తాటి చెట్టు కింద కూర్చుని పాలు తాగినా అవి పాలని ఎవ్వరూ నమ్మరు. అలానే చెడ్డవారితో సావాసం చేస్తే మనల్ని కూడా చెడ్డ వాడిగానే చూస్తోంది సమాజం.

**తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు** తోటి వారిలో ఎన్నో తప్పొప్పులను విశ్లేషించే వారు తమలోని అంతరాత్మను ఎప్పటికీ ప్రశ్నించరనీ, వేరే ఎవరైనా వారిలో తప్పులను ఎత్తి చూపిస్తే అసలు ఒప్పుకోరనే మానవ నైజాన్ని, చేదు నిజాన్నీ తేట తెలుగు పదాలలో చెప్పాడు వేమన.

**వాన రాకడయును ప్రాణంబు పోకడ** వ్యవసాయం వాన నీటి మీద మాత్రమే ఆధారపడే రోజుల్లో రైతులు నీటి కోసం ఆకాశం వైపు చూసి వాన రాకకోసం ఆశగా చూసేవారు. కానీ ఊహించినట్టుగా వానలు రాని రోజుల్లో వాన రాకడ ప్రాణం పోకడ రెండూ మన చేతుల్లో ఉండవు అని నిట్టూర్పులు విడిచేవారు. ఇటువంటి సామెతలు కూడా వేమన శతకంలో మనకు కనపడతాయి.

**వేమన మానవతా దృక్పథం :** ఈ లోకంలో ఎంత సంపాదించినా చివరికి చనిపోయేటప్పుడు మనతో ఏమీ రాదని తెలిసి కష్టాల్లో ఉన్న వారికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా ఉంటే ఆ ధనము నిన్ను చూసి నవ్వుతుంది అంటాడు వేమన. మానవతా దృక్పథంతో కష్టాల్లో ఉన్నవారికి నీకు తోచిన సహాయం చేసి తోటి మనసున్న మనిషిగా ప్రవర్తిస్తే బాగుంటుంది అని వేమన ఈ పద్యం ద్వారా తెలియజేశారు.

**ధనము కూడబెట్టి ధర్మంబు చేయక/తాను తినక లెస్స దాచు గాక/తేనెటీగ గూర్చి తెరువరి కియ్యదా...**

తేనెటీగ ఎంతో కష్టపడి సంపాదించి దాచుకున్న తేనెను ఎవడో దారిన పోయే వాడు తన్నుకుపోయినట్లు కూడబెట్టిన ధనం తినకపోయినా, ధర్మం చేయకపోయినా, ఆ ధనాన్ని వేడెవడో ఒకడు దోచుకుంటాడు. నీవు బ్రతికివున్నంత వరకు కష్టపడి సంపాదించిన ఆ ధనమును నువ్వు అనుభవించక, ఇతరులకు సాయం చేయక దాచి ఉంచితే నీవు పోయిన తర్వాత ఆ ధనమును ఎవరు తీసుకుంటారో నీకు తెలియదు కదా! కావున నీవు జీవించి వున్నప్పుడే తోటివారికి నీకు చేతనైన సహాయం చేసి భువిలో స్థిరస్థాయిగా మానవత్వం ఉన్న మనిషిగా నిలిచిపో అంటారు వేమన. కావున నీకు ఉన్న దానిలో కొంత లేని వారికి మనస్సున్న మనిషిగా సాయపడు అని వేమన చెప్పిన మాట నిత్య సత్యం.

**పెట్టి పొయ్యలేని వట్టి నరులు భూమి/పుట్టనేమి? వారు గిట్టనేమి?/పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా?...**

ఇతరులకు సాయంచేయని, పెట్టిపోతలు గురించి తెలియని, దానం, ధర్మం గురించి ఆలోచించని మనుషులు పుట్టటం (ఉండటం) వలన ఎటువంటి ఉపయోగం లేదు. అట్టి వారు చచ్చినా నష్టమేమి లేదు. వేమన దృష్టిలో వారి జీవితాలు పుట్టలు పెట్టి కుప్పలు తెప్పలుగా పుట్టి, చచ్చే చెదపురుగుల వలె వ్యర్థం. కొంచం కటువుగా అనిపించినా, ఈ పద్యం మనకు పరోపకారం / దానం యొక్క విశిష్టత / ప్రాధాన్యత తెలుపుతున్నది. అంతే కదా! ఎంత సంపాదించినా దాన్ని ఖర్చు పెట్టకుండా, పేదలకు సైతం కొంచం కూడా దానం చేయకపోవడం వలన అది వృధా అవుతుంది కదా! అందుకే ఇతరులకు, పేదలకు దానం చెయ్యడం వల్ల పుణ్యం వస్తుంది. వాళ్ళు చల్లగా వుంటారు.

**కలిమినాడు నరుడు కానడు మదమున/లేమినాడు మొదలె లేదు పెట్ట/కలిమి లేమి లేని కాలంబు గలుగునా?...**

సంపద ఉన్నప్పుడు ధనమదముతో (అహంకారముతో) మనిషికి ఇతరులు కనుపించరు కనుక ఇతరులకు పెట్టడు (సాయం, దానం చేయడు) ధనము, సంపదపోయి బీదతనమువస్తే పెట్టడానికి, సాయం చేయడానికి అతని దగ్గరేముండదు. మరి కలిమి–లేమి లేని కాలము, ధార్మిక బుద్ధి అతనికి కలిగేదెప్పుడు? అని వేమన పరోక్షంగా జనులకు ధార్మిక బుద్ధి అలవర్చుకొని కలిమితనాన్ని సద్వినియోగపర్చుకొనమని ఈ పద్యంలో హెచ్చరిస్తున్నారు.

**కనియు గానలేడు కదిలింపడానోరు/వినియు వినగ లేడు విస్మయమున/సంపద గలవాని సన్నిపాతక మిది....**

ధనము, అధికార సంపద కలిగినవారు, ఎవరన్నా వారి దగ్గరికి వచ్చి వారి సహాయము అర్థిస్తుంటే, గర్వము చేత, మిడిసిపాటుతనంతో వారికి కన్నులున్నా చూడనట్లు, చెవులున్నా వినబడనట్టు, నోరున్నా మాటలు మాట్లాడ లేనట్లు వింతగా ప్రవర్తిస్తుంటారు. అవతలి వారి ఉనికిని సైతము అసలు పట్టించుకోరు ఈ పద్యంలో సంపద (ఐశ్వర్యము) గలవారి ప్రవర్తనను వేమన కటువుగానే తెలియజేశారు. వారిని సన్నిపాతక జ్వరము వచ్చినవారితో అంటే కఫ, వాత, పిత్త లక్షణాలు మూడూ ప్రకోపించి తీవ్ర జ్వరముతో మాటపడిపోయి, కళ్లు మూతలు పడిపోయి, చెవులు దిమ్మర్లు పోతూ అపస్మారక స్థితికి చేరి అవసాన దశలో ఉన్న రోగితో పోల్చారు. అందరూ అలా ఉంటారని చెప్పలేము. కాకపోయినా ఎవరూ అలా ఉండకూడదు అని మానవులకు హిత బోధ చేసి కాస్త అన్నా మానవత్వం కలిగిన మనుషులుగా జీవించమని చెప్పారు.

**తాను గుడుప లేక తగ వేది యాప్తుల/జేరనివ్వడట్టి చెనటి గోవు/చేని లోన బొమ్మజేసి కట్టిన యట్లు**

తాను తినడు పెట్టవలసి వస్తుందని ఆప్తులను, బంధువులను (ఇతరులను) దగ్గరకు చేరనీయడు. అవును పంటచేల్లో లేదా అడవిలో బొమ్మలాగా కదలకుండా

కట్టిపడేస్తే ఆవుకు, తద్వారా ఇతరులకూ ఎలా ఉపయోగం ఉండదో అలాగా అట్టి కుత్సితుడు వల్ల ఉపయోగములేదు, వ్యర్థము. కనుకనే ఎవ్వరూ కూడా అలా ఉండకుండా అందరితో సఖ్యతతో మెలుగుతూ, వీలు ఉన్నంత వరకు సహాయం చెయ్యడం మంచిది అని వేమన అన్నారు.

**వెళ్లి వచ్చునాడు మళ్లిపొయ్యే నాడు/వెంటరాదు ధనము కొంచ బోడు/తాను యేడ బోనో ధనమేడ బోవునో?...**

పుట్టినపుడు ధనము వెంటపెట్టుకొని రాడు అలాగే చనిపోయినపుడూ ధనము తన వెంట తీసుకొని పోలేడు. ఎంతో కష్టపడి లేదా నానాగడ్డి కరచి సంపాదించి పోగేసుకొన్నా ధనము (సంపద) తనవెంట రాదు. చివరికి తానే ఎక్కడికి పోతాడో ( ఏ జన్మ ఎత్తుతాడో) తెలియదు. తన మరణానంతరము తన సంపద, డబ్బు ఏమవుతుందో కూడా తెలియదు. కనుక అటువంటి ధనము మీద మోహము కూడదు అని వేమ భావన. ఎంతటి రాజైనా, కోటీశ్వరుడైనా రిక్త హస్తాలతోనే ఈ లోకము విడవలసిందే కదా! కనుక, ఓ మనిషీ (ముఖ్యంగ లోభీ) బ్రతికినన్నాళ్లు సంపాదించిన ధనమును సత్కర్మలకు వినియోగించి, ఎత్తిన మానవజన్మకు, సంపాదించిన ధనమునకు, సంపదకు సార్థకత చేకూర్చుకో అని వేమన బోధిస్తున్నారు.

**పుట్టు బిత్తలి వలె పోవు బిత్తలి వలె/తిరుగు బిత్తలి వలె దేహి ధరణి/యున్ననాటికైన నుపకారి గాలేడు..**

మనిషి పుట్టినపుడూ ఒంటిమీద నూలుపోగు లేకుండా ఈ లోకంలోకి వస్తారు. అలాగే చనిపోయిన తరువాత కూడా దిశవెొలతోనే పోతారు. ఈ భూమిమీద బ్రతికినన్నాళ్లూ పరోపకారము అనేది చేయకుండా (పరోపకారత్వము లేకుండా) సిగ్గులేకుండా ప్రవర్తిస్తుంటాడు అని వేమన మానవ నైజాన్ని ఎండకట్టుతూ, బ్రతికి నన్నాళ్లూ పరోపకారిగా బ్రతకటం నేర్చుకోమని ఉద్బోధిస్తున్నారు.

**బొంది యెవరి సొమ్ము పోషింప పలుమారు**
**ప్రాణ మెవరి సొమ్ము భక్తి సేయ**
**ధనము యెవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము**

మానవుడు, దహింపబడె దేహము (కృశించిపోయె శరీరము) తనదనే మోహంలో అనేక రకాలుగా దాన్ని పోషించి పెంచుకుంటాడు. అలాగే క్షణ భంగురమైన ప్రాణము తనదనుకొని సుఖవంతంగా ఉండటానికి ఎన్నెన్నో సేవలు చేసి ప్రయాస పడుతుంటాడు. అంతేకాకుండా తనువు చాలించినడు తన వెంట తీసుకొని వెళ్లలేని ధనము తనదని భ్రమలో పడి, తనవి కానివి తనవని భావించి అవివేకముగా ప్రవర్తిస్తుంటాడు. ధర్మయుక్త (అహింస, న్యాయము) జీవనము వలన సంపాదించుకొన్న పుణ్యము మాత్రమే తన వెంట వచ్చే నిజమైన సంపద (ధనము) అని గుర్తెరిగి వివేకంతో మసలుకోమని వేమన ఒక సద్గురువుగా హితవు పలుకుతున్నారు.

**అరయు తరుచు కల్లలాడెడు వారిండ్ల/వెడల కేల లక్ష్మి విశ్రమించు?/ఓటి కుండ నీరు పోసిన చందాన..**

మనం పరిశీలించి చూస్తే, తరచూ అసత్యములాడెడి (అబద్ధాలు మాట్లాడే) వారిండ్ల లక్ష్మీదేవి నిలకడగా ఉన్నట్లు కన్పించదు. అవును, ఆమె ఎందుకుంటుంది? ఓటి కుండ (పగులు బట్టిన కుండ)లో ఎంత నీరు పోసినా ఎలా నిల్వకుండా బీట (పగులు) నుండి కారిపోతాయో అలాగే వారి అసత్య ప్రవర్తన వలన వారింట సిరి, సంపదలు నిలువవు. సంపద (ధనము) ఉన్నా లేదని చెప్పుతూ ఎవరికీ (పరులకు) సాయం చేయని, ధర్మకార్యాలు, పుణ్యకార్యాలు చేయడానికి ఇష్టపడని, ఎంత సంపద ఉన్నా అత్యాశతో ఏమీలేదని అసత్యాలు పలికే వారిండ్లలో ఆ సిరి, సంపదలు నిలకడగ ఉండవు కనుక ఉన్న సిరి, సంపదలను సద్వినియోగించాలని, డబ్బుకు కక్కుర్తి పడి అబద్ధాలు పలుకరాదని వేమన హితవు పలుకుతున్నారు.

**ముగింపు :** వేమన ప్రతి పద్యంలోని నాలుగో పాదంలో విశ్వదాభిరామ వినుర వేమ అని ఉంటుంది. ఇందులో విశ్వద అనే పేరు అతని వదినదని, అభిరాములు అనే పేరు అతని స్నేహితుడిదని కథనాలు ఉన్నాయి. వారిద్దరే అతని ఆర్గాన్ని సంస్కరించిన వ్యక్తులని, అందుకే వీళ్ళ పేర్లని శాశ్వతంగా అంతా తలుచుకునేట్టుగా చెయ్యాలనే తలంపుతో ఇలా రాశాడని కొందరి పండితుల అభిప్రాయం. ఏది ఏమి అయినా సమాజంలో జరుగుతున్న సంఘటనలు, మూఢనమ్మకాలు, సంస్కృతీ సంప్రదాయాలు, దైవభక్తి, తత్వజ్ఞానము మొదలైన ఎన్నో అంశాలతో వేమన శతక పద్యాలు ఉన్నాయి. సరళమైన చిన్న మాటలతో ఎంతో విలువైన జీవిత సత్యాలని చెప్పారు వేమన. ప్రజలకు శాస్త్రీయ దృక్పథం కలిగించిన వాడు వేమన. ఆయన వేసిన ప్రతి అడుగు భావితరాలకు బాట. ఆయన చెప్పిన ప్రతి మాట నీతి ముత్యాల మూట. వేమన పద్యాలలో ఎంత తరచిచూసినా తక్కువే అవుతుంది. ఇంకా సమగ్రమైన పరిశోధన చేయవలసిన అవసరం ఉంది.

ఆచార్య లక్ష్మీ ప్రసన్న
*(దక్షిణ భారత హిందీ ప్రచార సభ కార్యదర్శి, చెన్నై)*



# మనసు - మెదడు

- కురుమయ్య యాదవ్

నేటి కాలంలో కథ అనగానే తమ కారణాన్ని బలపరుచుకునేందుకు సృష్టించుకునే ఒక సన్నివేశంగానే గుర్తిండిపోయింది. తమ కారణాన్ని అందమైన ఊహలతో ఎదుటి వ్యక్తిని మభ్యపెట్టగలిగితే తామ గొప్ప కథకులమని మురిసి పోతుంటారు. సాహిత్యంను కాలం, రచనా విధానాల ఆధారంగా చూసినప్పుడు అది ప్రాచీన మరియు ఆధునిక సాహిత్యంగా విభజించబడుతుంది. కథ సాహిత్యంపై పూర్తి అవగాహన లేని వారు కథను ఆధునిక సాహిత్యంగానే పరిగణిస్తారు. అలా కథాపరిధిని, సాహిత్యంలో దాని స్థాయిని సరిగా అర్థం చేసుకోలేక పోతున్నారు. ఒక అంశం/విషయం గురించి వివరించాలంటే దాని గురించి కొంత తెలిస్తే సరిపోతుంది కానీ ఒక అంశాన్ని విమర్శించాలంటే మాత్రం దాని గురించిన పూర్తి సమాచారాన్ని అంటే దాని పుట్టుక, పరిధి, విస్తృతి గురించి క్షుణ్ణంగా తెలుసుకోగలగాలి. అప్పుడే ఆ విమర్శకతకు విలువ ఉంటుంది. కథ గురించి పూర్తి అవగాహన రావాలంటే మొదట దాని పుట్టుక గురించి తెలుసుకోవాలి. అందరూ అనుకుంటున్నట్లుగా కథ అనేది ఆధునిక సాహిత్యం కాలంలో పుట్టిన పసిపాప కాదు, సాహిత్యం ఊపిరి పోసుకోవటానికి ముందే పుట్టి, ప్రపంచాన్ని, ప్రజల మనోసామ్రాజ్యాన్ని పాలించిన నిత్య నూతన అమర చక్రవర్తి.

కథ గురించిన మొదటి ప్రస్తావన మనకు అగ్ని పురాణంలో కనపడుతుంది అందులో సహజమనిపించే అసహజమే కథ అని వర్ణించబడింది. దీన్ని బట్టి చూస్తే కథ అనేది లిఖిత పురానేతిహాస సాహిత్యం కంటే ప్రాచీనమైనది అని తెలుస్తుంది. అంతేకాక అందులో కథను ఏడు రకాలుగా వర్గీకరించారు.అవి కథ, ఆఖ్యాయిక, పరికథ, ఖండ కథ, ఉప కథ.. మొదలగునవి. ఇందులో ఆఖ్యాయిక వాస్తవిక ఇతివృత్తం గలది అని, కథ అంటే కల్పిత ఇతివృత్తం కలది అని వర్ణించబడింది. అక్షర యుతభాష సైతం నేర్వకమునుపే భావ ప్రసారమే సాధనంగా గల కాలంలో మానవుడు తనలోని కళాత్మకతను వ్యక్తీకరించడానికి మొదట ఎన్నుకున్న సాధనమే కథ. తను చూసిన విడివిడి పూసల వంటి సన్నివేశాలు, సంఘటనలకు తనలోని ఊహ శక్తి సూత్రాన్ని జోడించి దాన్ని ఒక మంచి హృదయాకర్షణీయమైన రూపంగా సృష్టించగలిగాడు. ఆ ఊహ శక్తి అతనిలోని కళాత్మకతకు, అతని అభివృత్తికరణకు ప్రతీకలు. ఆ ఊహ శక్తి కథకుడి ఆలోచనలకు సంతృప్తిని ఇచ్చినప్పటికీ, ఎక్కువ కాలం శ్రోతకుడి మనసును ఆకట్టుకోలేక పోయింది. అందువల్ల అతడు కథను మరింత రసవత్తరంగా తీర్చిదిద్దులకు అందులో సందర్భానుచితంగా అందమైన, మనసును ఆకట్టుకునే అల్లికలను, వర్ణనలను మిళితం చేయసాగాడు.

అలా కథకు రూపం ఇచ్చే అల్లికలు రచయిత మెదడుకు సానపడుతూ, శ్రోతమనసును మరింతగా ఆకట్టుకో సాగాయి. కథకు ప్రాణం పోసే వర్ణనలు రచయిత మనసులోని అనుభూతులకు ఒక సజీవ రూపాన్ని కల్పిస్తే, శ్రోతను మరో ఊహాలోకంలోకి ఎత్తుకెళ్లి, మధుర జ్ఞాపకాలను అందించసాగాయి. అంతేకాక కథ యొక్క ప్రసరణ ముఖ్యంగా ఆశురూపంలోనే సాగుతుంది. అంటే ఒకరు విన్నది గుర్తుంచుకొని, మరొకరికి చెప్పటం. అలా కథయొక్క సారాంశాన్ని గుర్తుంచుకొని, తమదైన ఊహల్ని, అనుభూతులను, తమలోని చిలిపి ప్రణయ భావాలను కొత్తగా జత చేస్తూ, దానిని నిరంతరం సరికొత్తగా ముస్తాబు చేస్తుంటారు. అందుకే కథ అనేది మనసు (అనుభూతులు) - మెదడు (ఆలోచనలు)ల మేలిమలుపుగా అభివర్ణించ బడుతుంది. ప్రవహించే నీరు మాత్రమే స్వచ్ఛంగా ఉండగలిగి, సమాజ అవసరాలను తీర్చడంతో పాటు, తన అస్తిత్వాన్ని సజీవం చేసుకోగలదు. అలాకాక ఎలాంటి మార్పులను అంగీకరించక, తటస్థంగా నిలిచి ఉండే నీరు మలినమై ఎందుకు పనికిరాక చివరికి తన అస్తిత్వాన్నే కోల్పోతుంది. అలాగే ఏదైనా ఒక అంశం కాలానుగుణంగా వచ్చే మార్పులను తనలో అంతరలీనం చేసుకోగలిగినప్పుడే

అది సమాజంలో ఆదరణను సంపాదించుకొని, మనుగడ సాగించగలదు. మొదట్లో కేవలం వచనరూపేణా మాత్రమే ప్రసరణ జరిగిన కథ కథనంతర కాలంలో క్రమబద్ధమైన పదవిరుపుల చేత లయను పొంది, మధురమైన గాత్ర రూపేణ, పాటలుగా తన ఉనికిని మెరుగుపరచుకుంది. అలా కథ జనాకర్షణకు అవసరమైన మార్పులను అందుపుచ్చుకుంటూ, తన అస్తిత్వాన్ని పదిల పరుచుకుంది. ఇదంతా అక్షర రూపం పొందని భాషా ప్రయోగం కంటే ముందే జరిగింది. అంటే కథ అనేది లిఖిత సాహిత్యం కంటే ప్రాచీనమైనది మరియు సంఘమానవుని తొలి కళాభివ్యక్తి రూపంగానూ ప్రసిద్ధమైనది.

లిఖిత అక్షరజ్ఞానం పొందిన అనంతరం పురాణం ఇతిహాసాలు, కావ్యాదులు వెలుపడ్డాయి. పురాణేతిహాసాలలో దైవత్వఅంశాలు, ఆయుష్మిక జీవితాంశాలు ప్రధాన ఇతివృత్తాలుగా వెలువడ్డాయి. కావ్యాదులు కారణజన్ములు, చక్రవర్తులు, ప్రణయ తత్వాలు ఇతివృత్తాలుగా వెలువడ్డాయి. అంతేకాక ఈ సాహిత్యం జటిల గ్రాంధిక భాషలో ఉండటం మరియు సామాన్య ప్రజల జీవితాలను స్పర్శించకపోవడం వలన ఇవి సామాన్య జనబాహళ్యంపై అంతగా ప్రభావం చూపలేకపోయాయి. దాంతో సామాన్యుల జీవితాలను, వారి సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడానికి మరియు లిఖిత సాహిత్య జ్ఞానాన్ని సామాన్యులకు పరిచయం చేయడానికి సాహిత్యకారులకు కనపడిన ఒకే ఒక్క మార్గం కథ. అలా మొదటగా కథలు కావ్య ప్రక్రియలోప్రవేశించి, కథకావ్యాలుగా పరిణతి చెందాయి. ఆ పరంపరలో తొలిసారి కేతనగారు దశకుమార చరిత్ర అనే కావ్యమును కథారూపేణ అనువదించారు.

కథలను కావ్యాలలో ప్రవేశపెట్టి కథాకావ్యాలుగా మార్చే క్రమంలో ఒక పెద్ద సవాల్ ఎదురైంది. అదే అటు లిఖిత సాహిత్య కారులను, ఇటు నిరక్షరాస్యులను ఆకట్టుకోవాల్సి రావటం. అందుకోసం రచనా ప్రకారం అందులో సాహిత్య నియమాలను జొప్పించి అటు శిష్ట సాహిత్య వేత్తలను, ఇతివృత్తంలో సామాన్య జీవన విధానాలను, వారి సంస్కృతి సాంప్రదాయాలను మిళితం చేస్తూ ఇటు జానపదులను మెప్పించటంలో కథాకావ్యాలు మరింత సఫలం అయ్యాయనే చెప్పవచ్చు. అందుకు జక్కన్నగారు రాసిన విక్రమార్క చరిత్రను సజీవ సాక్ష్యంగా చూపించవచ్చు. ఉజ్జయిని చక్రవర్తి అయినా విక్రమార్కుడు జీవితాన్ని అద్భుతమైన వర్ణనలతో వివరిస్తూనే, అతడి సాహస గాథలను, అద్భుతమైన మానవాతీత శక్తులను సామాన్య జీవన విధానం సంస్కృతులతో సందర్భోచితంగా ముడిపెడుతూ ఎంత గొప్ప కథాకావ్యంగా తీర్చిదిద్దారంటే ఎన్ని శతాబ్దాలు గడిచినప్పటికీ విక్రమార్కుడు పేరు తెలియని వారు ఉండరు అనటం అతిశయోక్తి కాదు అనేంతలా. అలా ప్రజాదరణ కొరకు, తమ అస్తిత్వాన్ని పదులపరుచుకోవడం కొరకు అనేక ప్రక్రియలు, రచనలు కథారూపంలోకి మార్చబడ్డాయి. ఉదాహరణకు రాజశేఖరుడు విద్యసాల భంజిక అనే నాటకంను తర్వాతి కాలంలో కేయూరబాహు చరిత్రగా, భాగవత పురాణంను హరికథలుగా మార్చడం. కథ అంటే కేవలం వర్ణనలు, అద్భుతమైన కథలు కూర్చటం మాత్రమే కాదు కాలాతీతంగా మనస్సుల్ని హత్తుకోగలప్రతిభాసాత్మిక భావననుముందు పరుచుకోగలిగినదై ఉండాలి. అప్పుడే అది ఉత్తమ కథగా కాలాలకు పరిమితం అవ్వకుండా పాఠకమనోఫలకంపైశిలక్షరంగా నిలిచిపోగలదు. అందుకు చక్కని నిదర్శనమేబృహత్కథ ,చందమామ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, బట్టి విక్రమార్క కథలు...

రూపాత్మకతదృష్ట్యా కొన్ని కథలు కాలాలకు అతీతంగా నిలిచిపోతే, నిర్మాణాత్మకత దృష్ట్యా మరికొన్ని కథలు కథకు నిదర్శనంగా గుర్తుండి పోతాయి.అందులో తొలి వరుసలో నిలువదగినదిబృహత్కథ. తెలుగువాడైనా గుణాఢ్యుడురాసిన బృహత్కత ప్రపంచ కథా సాహిత్యానికే నడకలు నేర్పిన సూత్రప్రాయ ఉద్గ్రంథం. తర్వాత కాలంలో సాహిత్యం అనేక రూపాలుగా మారుతూ వచ్చింది. తొలినాల్లలో పురాణేతిహాస కావ్య ప్రబంధాల వలనే కథలో కూడా కొన్ని రసాలు నిబద్ధం చేయబడ్డాయి.అవిఅది – భయానక, మధ్య-కరుణ, అంత్యంలో-అద్భుతం. కానీ జానపదులు వీటితోపాటు మరో రసం కూడా కథలో చేర్చుకున్నారు. అదేవీర రసం. ఒక రకంగా చెప్పాలంటే అదే వారి కథల్లో ప్రధాన అంశం.

సమాజంలో ఉన్న అన్యాయాన్ని ఎదిరించిన వారిని, మంచి కొరకు, సమాజం కొరకు, జన్మభూమి కొరకు

ప్రాణాలు సైతం లెక్కచేయకపోరాడిన వీరుళ్ళను దేవుళ్ళుగా అభివర్ణిస్తూ, వారి సాహసాలను, పోరాటాలని, పూర్తి జీవితాన్ని ఒక కథగా కూర్చుతూ, భవిష్యత్ తరాలకు ఉగ్గుపాలతో పాటు నేర్పిస్తారు.అవేవీరగాథలు. ఉదా:- పండుగ సాయన్న మియ్యసాబ్కథలు... వీరు ఆ వీరుల త్యాగాలను, స్ఫూర్తిని మరుగున పడకుండా, వారు చూపిన ధైర్య సాహసాలను భావితరాలు అలవర్చుకోవాలని వాటిని గానం కట్టి పాటలుగా పాడుతారు, అవే వీరగాథ గేయాలు. తర్వాత వాటిని ప్రదర్శన రూపాలుగా మలిచి, రంగస్థలంపై కూడా ప్రదర్శించసాగారు. ఆ వీరగాధ ప్రదర్శన కళారూపమే బుర్రకథ.

ప్రాచీన కాలంలో వర్ణన ప్రధానంగా సాగిన సాహిత్యం తర్వాతి కాలంలో భావ ప్రధానంగా పరిణామం చెందింది. అలాగేవర్ణన ప్రధానంగా ఉన్న కథ కూడానవల రూపేణవిషయ ప్రధానంగా మారి, క్రమంగాకథానికగా పరిణతి చెందింది. నాటిఅద్భుత, వీర సమన్వయ గర్భిత కాలం నుంచి నేటి విషయ వ్యక్తీకరణ కాలం వరకుకథ భౌతిక రూపంలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ రచన, కూర్పు, వ్యక్తికరణ, పాఠక ఆకర్షణ మొదలగు అంశాల సఫలత అనేది మనసు (అనుభూతులు)-మెదడు (ఆలోచనలు) లతోపెనవేసుకున్న అవినాభావ సంబంధాన్ని మాత్రం నేటికి ఆవిరళంగా కొనసాగిస్తూనే ఉంది.

కురుమయ్య యాదవ్ మేనుగొండ
పరిశోధక విద్యార్థి, ఫోన్ : 7799553493

## జీవన గమనం

ఇవి మీకు తెలిసిన మాటలే అయి ఉండచ్చు, కానీ ఇవి మరో మారు మీ మనసును స్పృజించడం వల్ల మీ మనసుకేమైనా సాంత్వనం చేకూరుతుందేమో అన్న చిన్న స్వార్థపూరిత ప్రయత్నం! నాదృక్కోణంలో మనిషి జీవితాన్ని మూడు మాటల్లో సంక్షిప్తపరచవచ్చు. అవి: 1. కర్మ! 2. ఋణం!! 3. మాయ!!!

కర్మ, మనం తెలిసో, తెలియకో, మనకు గుర్తుండో, గుర్తులేనంత గతం నుండో మనతో ప్రయాణం చేస్తూ, మన జీవిత గమనంలో మనల్ని, ఎద్దు కాళ్ల గిట్టలను వెంబడించే బండి చక్రాల వలే వెంబడించేది కర్మ! కర్మ మనిషి జీవిత ప్రయాణాన్ని నిర్దేశించే ఓ కీలక సూత్రధారి అని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. మన ఈ శరీరం, ఈ నాటి స్ఫురణలో ఉన్న ప్రపంచ అనుభవాలకంటే మించిన శక్తి కర్మ! మన గురించి మనకు తెలియని ఎన్నో గత, వర్తమాన, భవిష్యత్ విషయాలు మన కర్మకు తెలుసు. తదనుగుణంగా మన జీవిత ప్రయాణ మార్గం ఏర్పడుతుంది.

కర్మ నుండి ఓ అడుగు ముందుకు వేస్తే ఋణంలోకి ప్రవేశిస్తాం. పైన చెప్పుకున్నట్లుగా కర్మద్వారా మార్గం ఏర్పడుతుంది. కానీ మార్గంలో మనం కలిసే పాత్రలు ఆ పాత్రలు మనతో ప్రయాణం చేసే కాలాన్ని, వారితో మనకున్న ఋణం నిర్ణయిస్తుంది. ఇది ఎంత గమ్మత్తైనదంటే, ఋణ శేషం ఉన్నంత వరకూ, మనం ఎంత విడిపించుకోవాలని ప్రయత్నించినా, ఆ ఋణం ఉన్న వ్యక్తిని కానీ, వస్తువును కానీ, సంస్థను కానీ విడిపించుకోలేము. ఋణం తీరిపోయిన తర్వాత, మనం విశ్వప్రయత్నం చేసినా, ఓ క్షణం కంటి చూపుకు కూడా నోచుకోలేం. అంత బలమైనది ఋణానుబంధం. ఇక చివరగా మాయ, ఇది పేరుకు తగ్గట్లుగానే చిత్రమైనది! ఎంత తమాషాగా ఉంటుందంటే... మనిషి జన్మిస్తాడు, ఊహ తెలియదు! కొన్ని సంవత్సరాలు గడుస్తాయి, ఓ రోజు తెలుస్తుంది, ఈవిడ నా అమ్మ, ఇతను నా నాన్న అని, అప్పటి వరకూ వారున్నారు, కానీ వారు మనకు అమ్మా-నాన్న అని తెలియడం ఉంది చూశారు... అదే, మాయ మన జీవితంలోకి ప్రవేశించడం అంటే. ఆ తరువాత మాయ క్రమక్రమంగా పెరిగి ఓ మహా వృక్షమవుతుంది.

నా డబ్బు, నా భర్త/భార్య, నా పిల్లలు, నా కారు, నా ఇల్లు... ఇలా కానీ ఇది పరిస్థితులను బట్టి ఎలాంటి రూపాన్నైనా తీసుకోగలదు. అదే మాయ అంటే. ముక్కు మొహం తెలియని మనిషి మీద ప్రేమ వర్షం కురిపించగలదు, సొంతవాళ్లను కూడా అంతమొందించగలదు. ఓ అనామకుడిని సొంతవాడిని చేయగలదు. సొంతవాళ్లను పరాయివాళ్ళుగా చేయగలదు. ఎక్కడో ఎవరికో ఏదో జరిగిందంటే, మనలో వచ్చే స్పందనకూ, మాయ ద్వారా మనవాళ్లు అనుకోబడే వాళ్లకు అదే జరిగితే మనలో వచ్చే స్పందనకూ, అదే మాయ ద్వారా, నా అనుకోబడే ఈ శరీరానికో, మనసుకో అదే జరిగితే వచ్చే స్పందనకూ ఎంత వ్యత్యాసమో మనకు అనుభవైక వేద్యమే. అదే మాయ ఆడించే ఆట! నేను మనవి చేస్తున్న ఈ మాటలలోని ఆంతర్యాన్ని, తద్వారా నేను మీకు చెప్పకనే చెప్పాలనుకుంటున్న మనసులోని మాటలు మీ మనస్సును చేరాలని ఆశిస్తూ...!

*వేంకట ప్రసాద్, 7997001237*

# మిసిమి గ్రంథాలయంలో రచయితలు

**భో**గినాడు నవ్వులు -పువ్వుల భాషణలు -సంభాషణలు

తెలుగు వారికి ప్రియమైన రోజు భోగి పండుగ రోజు. అదేరోజున నవ్వుల పువ్వుల మధ్య రచయితల ఇష్టాగోష్టి జరిగింది. సంపాదకులు అశ్వినీ కుమార్ అందరికీ అరిసెలతో నోరు తీపిచేసి తీపి చర్చకు తెరతీశారు. ముఖ్యంగా ఈమధ్యే వెలువడిన మూడు పుస్తకాల రచయితలను ఆహ్వానించి వారితో సంభాషణ సాగించారు. మధ్య మధ్యలో వేడి తేనీరుతో అందరినీ చల్లబరిచారు. దాదాపు రెండు గంటలు పైగా ఈ చర్చ జరిగింది. ఇందులో పాల్గొన్న పుస్తక రచయితలు డా. నిమ్మగడ్డ శేషగిరిరావు, రాపోలు సీతారామరాజు, పులగం చిన్నారాయణ, రవి పాడిలతో వారి పుస్తక నేపథ్యాలు గురించి సంభాషించినవారు దిగంబర కవి నగ్నముని, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, ఆర్ట్ రచయిత తంగెడ విశ్వేశ్వర ప్రసాద్, దూరదర్శన్ పూర్వ ప్రయోక్త వోలేటి పార్వతీశం, ఆకాశవాణి పూర్వ ప్రయోక్త సి.యస్.రాంబాబులు. అశ్వినీ గారు సారథ్యం వహించారు. వీరిలో డా.నిమ్మగడ్డ శేషగిరిరావు **మిసిమి** పాఠకులకు తన రచనల ద్వారా సుపరిచితులు. "మనకు తెలియని లాటిన్ అమెరికా" శీర్షికతో తను పర్యటించిన లాటిన్ అమెరికా దేశాల విశేషాలు వివరిస్తూ పుస్తకం తెచ్చారు. రాపోలు సీతారామరాజు దక్షిణాఫ్రికాలో స్థిరపడ్డారు. నెల్సన్ మండేలా long walk to freedom పుస్తకాన్ని "స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం"గా తీసుకొచ్చారు. ఇక పులగం చిన్నారాయణ సినీ జర్నలిస్ట్.

IRTS అధికారి రవి పాడితో కలిసి "మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ -హిచ్ కాక్" శీర్షికతో కొత్త పుస్తకం వెలువరించారు.

లాటిన్ అమెరికా దేశాల గురించి చాలా ప్రశ్నలు వచ్చాయి. వారి భాష ఏమిటి, ఆహార విహారాలెలా ఉంటాయి.. ఏయే దేశాలు తిరిగారు.. ఇలాంటి ప్రశ్నలకు డా.శేషగిరిరావు ఓపికగా సమాధానాలిచ్చారు.

**ప్రయాణం గురించి ఏమన్నారంటే!**

రెండుసార్లు పర్యటించాను. మొదటిసారి పందొమ్మిది రోజులు ప్రయాణించాను. 2022-23 సంవత్సరాల్లో జరిగిన ఈ ప్రయాణంలో సెంట్రల్ అమెరికా, సౌత్ అమెరికా దేశాలు తిరిగాను. సెంట్రల్ అమెరికా గ్వాటెమాల, బెలీజ్ దేశాల సందర్శనతో మొదలై పనామాలో నా ప్రయాణం ముగిసింది. నాయాత్ర ప్లాన్ చేసుకోకుండా సాగించాను. ఎక్కువగా ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకున్నాను. దానివలన స్థానికుల గురించి మరింతగా తెలుసుకోగలిగాను. ఇక్కడ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ బస్సులను చికెన్ బస్సులంటారు. రంగురంగులతో ఉండి ఆకట్టుకుంటాయి. అమెరికాలో కాలం చెల్లిన స్కూల్ బస్సులకు ఇక్కడ రంగులేసి తిప్పుతారు.. నేను తిరిగిన దేశాలు గ్వాటెమాల, బెలీజ్, హొండురాస్, ఎల్ సాల్విడార్ అక్కడి నుంచి నికరాగువా తర్వాత పనామా.. వీటిని ప్రమాదకరమైన దేశాలుగా పిలుస్తుంటారు. ఎన్నో దేశాలు తిరిగినవాడిగా నిజమేదో తెలుసుకోవాలను కున్నాను. నేను గమనించినదేమిటంటే వారిలో వారికి గొడవలుంటాయి కానీ మీరొక యాత్రికుడిగా వెళితే మాత్రం మీకేమి ఇబ్బంది ఉండదు. పైపెచ్చు మీ గురించి అడిగి తెలుసుకుంటారు. కావలసిన సాయం చేస్తారు.



(ఎడమ నుంచి) నగ్నముని, డా. శేషగిరి, ఎడిటర్, రవి పాడి, పులగం చిన్నారాయణ, రాపోలు సీతారామరాజు, ఓలేటి, అనుమాండ్ల భూమయ్య, టి.వి.ఎస్. ప్రసాద్




అక్కడి భాష ఇతర అంశాలు గురించి చెప్పాలంటే ముందే చెప్పుకున్నట్లు ఎక్కువగా వినిపించే భాష స్పానిష్.. ఈ దేశాలను లాటిన్ అమెరికన్ దేశాలెందుకంటారంటే స్పానిష్, ఫ్రెంచ్ పోర్చుగీసు భాషలపై లాటిన్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ దేశాల్లో చెలామణీ అయ్యే భాషలివి. అందుకని లాటిన్ అమెరికన్ దేశాలంటారు. ఒక్క గయానా దేశంలో మాత్రం ఇంగ్లీషు ఉంటుంది. అది బ్రిటిష్ కాలనీ కాబట్టి.

సూరినామ్ దేశం డచ్ పాలిత ప్రాంతం కావటం వలన డచ్ భాష ఎక్కువగా ఉంటుంది. సెంట్రల్ అమెరికా దేశాల్లో బెలీజ్ తప్ప అన్ని దేశాల్లో స్పానిష్ మాట్లాడతారు. బెలీజ్‌లో మాత్రం ఇంగ్లీషే.. మొదటి పర్యటన విశేషాలు మనమెరుగని లాటిన్ అమెరికా (దాసరి అమరేంద్ర తెలుగులో అనువాదం చేశారు) పుస్తకంగా వచ్చాయి. (జనవరి 18న ఆవిష్కరణ జరిగింది.) తర్వాత పర్యటనలో పెరూ, బొలీవియా, ఛిలీ, అర్జెంటినా దేశాలు వెళ్లాను. ఇక మిగిలిన దేశాలు సౌత్ అమెరికాలో ఫ్రెంచ్ గయానా, డచ్ గయానా, వెనిజులా దేశాలు. వాటితో రెండు ఖండాలు పూర్తవుతాయి. ఈ దేశాల్లో కామన్‌గా కనిపించే అంశాలు ఒకటి స్పానిష్, రెండు కేథలిక్ మతం. ఇక ఇక్కడ స్థానిక తెగలు చాలా ఉన్నాయి. అందరిలో కొంచెం చైనీస్ లక్షణాలుంటాయి. మెక్సికో, గ్వాటెమాలలో 'మాయన్'నాగరికత కనిపిస్తుంది. సౌత్‌అమెరికాలో 'ఇంకా' నాగరికత కానవస్తుంది. మాయన్ నాగరికత మొదట ఆఫ్రికన్ దేశాలనుంచి ఇక్కడకు వేల సంవత్సరాల క్రితం వలస వచ్చింది..

**ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉందా? నియంతృత్వం ఉందా?**

అమెరికాకు అన్ని దేశాలనుంచి కుటుంబాలతో వలస వెళ్ళటం చూస్తాం. ఈ దేశాల్లో మాత్రం స్పానిష్ మగవారు వలస వచ్చి రాచరిక స్త్రీలను వివాహమాడి వారి ప్రాబల్యం పెంచుకున్నారు. ఇక్కడి ఈ మిక్స్‌డ్ రేస్‌ను "మెస్టిజో" అంటారు. ఎనభై శాతం వారు ఈ మెస్టిజో రేసుకు చెందినవారే. వీరందరికీ సిమన్ బొలివార్ గురువు. అతను మెస్టిజో. వెనిజులా నుంచి తన పోరాటం నడిపాడు. 1880ల్లో స్పెయిన్ నుంచి స్వాతంత్ర్యం పొందినా అంతర్యుద్ధాలు పోలేదు. దానికి కారణం ప్రొటెస్టెంట్ ఎథిక్స్ లేకపోవటం అంటారు. తర్వాతి కాలంలో అమెరికా ఇక్కడి వనరులు ఉపయోగించు కోవటానికి తన అవసరాలకు అనుగుణమైన నియంతలను అధికారంలో ఉంచేది. అదే సమయంలో రష్యన్ రివల్యూషన్ (1917) ఇక్కడి దేశాలపై ప్రభావం చూపింది. కమ్యూనిజంకు పునాదు లేర్పడ్డాయి. ధనిక,పేద వర్గాల మధ్య అగాధం దానికి తోడ్పడింది. ఈ దేశాల నుంచి స్పెయిన్ వెళ్ళిపోయినా, భూస్వామ్య వ్యవస్థ పోలేదు. మధ్యలో డ్రగ్స్ వ్యాపారం ప్రధాన వనరయింది. రెండు వర్గాలు లాలూచీ పడటం మొదలయింది. గ్వాటెమాల వంటి దేశాల్లో పోలీసింగ్ ఎక్కువగా ఉంటుందంటే దానికి కారణం పరిస్థితులు. ఎప్పుడు దోపిడీ జరుగుతుందో చెప్పలేం.

**భాషా సమస్య ఉందా మీకు** నాకు స్పానిష్ రాకపోయినా గూగుల్ ట్రాన్స్లేషన్‌తో ఆ సమస్యను అధిగమించాను. నేనో యాత్రికుడిని, ఇండియా నుంచి వచ్చానని గూగుల్ సహాయంతో చెప్పేవాడిని. వాళ్ళకు భారతదేశం గురించి తెలుసు. ఇండియా అనగానే జనాభా

**గూస్ బంప్స్ తెప్పించిన గ్వాటెమాల సరిహద్దు ప్రయాణం – డా.శేషగిరిరావు**

బొలీవియాలోని ఒక పట్టణం "కోపాన్" యాత్రికులు చూడాల్సిన పట్టణం అని చదివి ఉండటంతో గ్వాటెమాల సరిహద్దు నుండి బయలుదేరాను. అప్పుడు కోపాన్ ప్రాంతంలో దేనిగురించో బంద్ పాటిస్తున్నారు. నన్ను గ్వాటెమాల సరిహద్దు వరకు తీసుకొచ్చిన టాక్సీ డ్రైవర్ ఓ సలహా ఇచ్చాడు. మీరు అక్కడినుండి మోటార్ సైకిల్ ప్రయాణం చేసి వెళ్లమంటూ.. అదేదో బావుందని పాటించాను. రెండు స్కూటర్లపై వెళ్ళాం. ఒకదానిలో నా లగేజ్ ఉంచాను. బ్యాక్ పాక్ వెనక తగిలించుకున్నాను. ప్రయాణాలలో బ్యాక్ పాక్ బాడీలో ఒక భాగమని నేను నేర్చుకున్న సత్యం. (నవ్వు). ఇంతకీ ఆ ప్రయాణం పదిహేను కిలోమీటర్ల దూరం. పొలాల్లోంచి వెళ్ళాం. మధ్యమధ్యలో రాళ్ళు అడ్డంగా పెట్టారు. కర్రలు పడేశారు. అక్కడక్కడా బంద్‌కు మద్దతు పలికేవారు అడ్డంగా నిలబడ్డారు. వీటినన్నిటిని దాటి కోపాన్ చేరగానే, నేను బుక్ చేసుకున్న హోటల్ మూసేసి ఉంది. నా కోపం నషాళానికి అంటింది కానీ, ఏం చేస్తాం. మళ్ళీ వచ్చిన దారినే తిరుగు ప్రయాణం. మళ్ళీ చుట్టూ తిరిగి వెళ్ళాల్సి వచ్చింది. నన్ను చాలా టెన్షన్ పెట్టిన ప్రయాణం ఇది. కానీ జాగ్రత్తగా తిరిగి గ్వాటెమాల సరిహద్దు చేర్చిన ఆ ఇద్దరు వాహన చోదకులకు వేలవేల దండాలు చెప్పాను. నిజంగా నన్ను కొట్టి, నా లగేజ్, డబ్బు దస్కం దోచుకుంటే అడిగేవారెవ్వరు.. కానీ వారలా చేయలేదు. నా భద్రత తమ బాధ్యత అనుకున్నారు.. గొప్ప మనుషులు.. వారి మనసులు గొప్పవి..

గుర్తొస్తుంది వీరికి. అంతమంది ఎలా ఉంటారోనని తెగ ఆశ్చర్యపడిపోతుంటారు. రెండవది మనదేశపు ఆధ్యాత్మికత వీరికిష్టం. మూడవ అంశం ఇక్కడి పేదరికం. చివరిగా ఈ దేశాల్లో బాలీవుడ్ సినిమాలు చాలా ప్రాచుర్యం పొందాయి ఆ సినిమాలో డాన్సులు చూసి థ్రిల్లయిపోతుంటారు.

**జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి?** పల్లెటూరి ప్రదేశాల్లో అక్షరాస్యత తక్కువగా ఉంటుందేమో కానీ, నగరాల్లో మాత్రం మనలాగానే ఉంటుంది మొత్తమ్మీద మనకంటే ఎక్కువ అక్షరాస్యులున్నారనిపిస్తుంది. ఇక్కడ కరెన్సీ నోట్లు చూస్తే వారి చరిత్ర చెప్పేయొచ్చనిపిస్తుంది.అంత చక్కగా ఉంటాయవి.

ఈ దేశాల్లో మూల వాసులు మనకు గ్వాటెమాలలో కనిపిస్తారు సంప్రదాయ దుస్తుల్లో మార్కెట్లు, సంతల్లో రంగురంగుల దుస్తుల్లో కనిపిస్తారు. ఈక్వెడార్, పెరూ, బొలీవియా దేశాల్లో కూడా మూల వాసులు కనిపిస్తారు.ఈ దేశాల్లో ప్రధాన పంట మొక్కజొన్న. మనకు వరి అన్నంలా ఇక్కడ వరి & బీన్స్ చాలా సాధారణంగా తీసుకునే ఆహారం. అలాగే మనకు నిత్యము అవసరమయ్యే బంగాళదుంప, మిర్చి, టొమాటో ఇవన్నీ ఇక్కడి నుండి వచ్చినవే. ఇక్కడ మామిడి తోటలు ఎక్కువ. అవి మనదేశం నుండి ఇక్కడికి వచ్చాయి. కానీ మన రుచి రాలేదు (నవ్వు). ఇవన్నీ మూడవ ప్రపంచ దేశాలు.ఆ దేశాల్లో ఉండే సమస్యలు ఇక్కడున్నాయని డా.శేషగిరిరావు ముగించారు.

**అనంతరం "స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం" రచయిత రాపోలు సీతారామరాజు మాట్లాడారు..**

నేను పదహారు సంవత్సరాల నుంచి ఇక్కడున్నాను. దక్షిణాఫ్రికా చరిత్ర, సంస్కృతిలపై వ్యాసాలు రాద్దామని మొదట అనుకున్నాను. నేనున్న జోహన్స్ బర్గ్ లో పదివేలకు పైగానే తెలుగు వారున్నారు. వీరంతా ఎక్కువగా 2006 ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చారు. జోహన్స్ బర్గ్, ప్రిటోరియాలు విజయవాడ, గుంటూరులా కొద్ది దూరంలో ఉంటాయి. కానీ ఇప్పుడు కలిసిపోతున్నాయి. ఈ రెండింటి జనాభా కోటి ఉంటుంది. దక్షిణాఫ్రికా మొత్తం జనాభా ఆరుకోట్ల వరకూ ఉంటుంది. నేనిక్కడ సాఫ్ట్వేర్ రంగంలో ఉన్నాను. అందరూ in-house అవసరాలకు పనిచేసేవారే. మనలాగా బయటి దేశాల ప్రాజెక్టులకు పనిచేయరు. భారతీయ సంతతి మొత్తమ్మీద రెండు శాతం ఉంటారు. బ్లూ కాలర్ జాబ్స్‌కు కొరత ఉందిక్కడ. ఈ పుస్తకం రాసే క్రమంలో ఇక్కడ పదాల ఉచ్చారణ ప్రత్యేకంగా ఉంటుందని అర్థం అయింది. ఆ పదాలను ఎలా రాయాలో గైడ్ చేసింది ఇక్కడి భారతీయ సంతతికి చెందిన వ్యక్తే. ఇక్కడ మనలాగా ఋతుపవనాలుండవు. వర్షపాతం కూడా తక్కువే. ప్రపంచ సగటులో సగం ఉంటుందేమో. అయితే వీరిక్కడ నీటిని వినియోగించుకునే విధానం మెరుగ్గా ఉండటంతో నీటి కొరత సమస్య కాలేదెప్పుడూ.. అయితే కేప్ టౌన్‌లో నీటి కొరత కొంత వచ్చింది. మీడియా దాన్ని భూతద్దంలో చూపించింది...

**వివక్ష గురించి** అధికారికంగా లేదు. మనసుల్లో ఉంటుందేమో తెలీదు. జూలియస్ మనేమాన్ అనే అతను అధికార పార్టీ నుంచి బహిష్కరణకు గురవటంతో  కొత్త పార్టీ పెట్టాడు. అతనిలాంటి వారు తీవ్రంగా మాట్లాడతారు. భారతీయులు వెళ్ళి పోవాలని నినదిస్తుంటారు. ఎక్కవగా కింది స్థాయి ఉద్యోగులలో కొంచెం సమస్య కనిపిస్తుంది. దక్షిణాఫ్రికా చుట్టూ ఉన్న దేశాల నుంచి వలస మొదలయింది. దానివలన చిన్న ఉద్యోగాలు చేసే ఇతర దేశాల వారిపట్ల కొంత వ్యతిరేకత కనిపిస్తుంది. గనుల తవ్వకం మొదలయిన తర్వాత దక్షిణాఫ్రికా అందరి దృష్టిని ఆకర్షించింది. దాంట్లో భారతీయులు ఎక్కువున్నారు. దక్షిణాఫ్రికా అనగానే గుర్తుకు వచ్చేది దర్బన్ నగరం. గాంధీజీ ఉన్న ప్రదేశం. దక్షిణాఫ్రికాలో దర్బన్‌లో భారతీయులు ఎక్కువున్నారు. ఇక్కడివారికి సామాజిక ఉద్యమాలు చేయటం నేర్పింది గాంధీజీయే అని చెప్పాలి. ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ఆ సూత్రం నేర్చుకుంది. ఇక్కడ పదకొండు అధికార భాషలున్నాయి. ఈ భాషలన్నింటికి రోమన్ ఇంగ్లీష్ లిపి వాడతారు. ఈ భాషలన్నీ ట్రైబల్ భాషలుగా అనుకోవచ్చు. ఒక భాషలో కేవలం ధ్వని మాత్రమే ఉంటుంది. మాటలుండవు. ఒక భాషను ఇంకో తెగవారు ఇట్టే గుర్తుపడతారు. అందరూ చాలా స్నేహంగా ఉంటారు. గుడ్ మార్నింగ్ చెప్పకపోతే నొచ్చుకుంటారు. ఇక్కడ నేను CEO, నేను కంపెనీ ప్రెసిడెంట్‌ను అనేటువంటి భేదభావనలుండవు. ఇది అన్నిచోట్లా గమనించవచ్చు. అందరూ కలిసిపోయి ఉంటారు. సాయంత్రం పూట దుకాణాలు, షాపులు తొందరగానే మూసేస్తారు. వారాంతాల్లో మాత్రం నగరాలు బిజీగా ఉంటాయి...



**నెల్సన్ మండేలా పుస్తకం ఎందుకు అనువాదం చేశానంటే** తెలుగు పాఠకులకు ముందు మండేలా ఆత్మకథను పరిచయం చేస్తే బావుంటుందని అనిపించింది.ఆయన ఉన్న సమయంలో వచ్చిన మార్పులు చెప్పటానికి వీలవుతుంది అని ఒక ఉద్దేశ్యం. Long Walk to Freedom లో ఉన్న ఇండెక్సింగ్ నే నా పుస్తకానికి వాడుకున్నాను. ఎక్కడికక్కడ పాద సూచికలను ఇచ్చాను. మూలంలో ఆయన ప్రమాణ స్వీకారం వరకే ఉంటుంది. ఆయన పందొమ్మిది సంవత్సరాల పాలన గురించి ఉండదు. ఆయన ఎయిడ్స్ వ్యాధిపై చాలా పోరాటం సలిపారు. అదికూడా చెబితే బాగుంటుంది అనిపించింది.కొంతమేర చెప్పే ప్రయత్నం చేశాను. ఆయన చనిపోయేంతవరకూ నేను కొంచెం పెంచి రాశాను. ముందూ, వెనుక ఆయన గురించి చెప్పుకోని విషయాలు తెలియచేశాను. తన గురించి ఆయన కొన్ని చెప్పుకోలేదు.ఆయన గురించి వచ్చిన వేరే పుస్తకాలు చదివి ఆయన మహాత్ముడు ఎలా అయ్యాడో చెప్పే ప్రయత్నం చేశాను.ఆయన విన్నీ మండేలాను వదిలేయటానికి కారణం మన రామాయణంలో రాముడు పాటించిన రాజధర్మం ఉందని నాకనిపించింది. నాలో పురుషాహంకారం చాలా ఉండేది. జైలు జీవితం గడిపాక దాన్ని తగ్గించుకున్నాను అంటాడాయన." అని ముగించారు రాపోలు సీతారామరాజు

**పులగం చిన్నారాయణ** అందరికీ నమస్కారం నేను పదకొండు పుస్తకాలు రాశాను. ప్రధానంగా సినిమా జర్నలిస్టును. నా మొదటి పుస్తకం *జంధ్యా మారుతం.* అది హాసం పత్రికలో సీరియల్‌గా వచ్చింది. తర్వాత వచ్చిన పుస్తకం *సినీ పూర్ణోదయం.* అందులో *శంకరాభరణం, సాగర సంగమం, స్వాతి ముత్యం* సినిమాల నిర్మాత ఏడిద నాగేశ్వరరావు గారి సినిమాల మీద విశేషాలతో కూడిన వ్యాసాలు రాయటం జరిగింది. ఆ తర్వాత *అలనాటి ఆనవాళ్లు* పుస్తకం వచ్చింది. విజయా వారు పబ్లిష్ చేశారు. మన ఓల్డ్ క్లాసిక్స్ గురించి తెలియ చేశాను. అంటే ఆ సినిమాల బ్యాక్ గ్రౌండ్ విశేషాల గురించి ప్రస్తావించాను. కొనసాగింపుగా ఇంకో డెబ్బై ఐదు సినిమాల విశేషాలతో *పసిడి తెర* అని రాశాను. అందులో 80,90 దశకాల సినిమాల విశేషాలు ఉంటాయి. ఆ తర్వాత *సినిమా వెనక స్టోరీస్* అని రెండు వేల సంవత్సరం తర్వాత వచ్చిన సినిమాలను పరిచయం చేశాను. ఈ జనరేషన్ వారికి కనెక్ట్ అయ్యే సినిమాలను ఎంచుకుని రాయటం జరిగింది. అలాగే *మాయా బజార్* మీద ఒక డాక్యుమెంటరీ రూపొందించాను. దాన్ని పుస్తకంగా కూడా తెచ్చాను. ఆ సినిమాకు పనిచేసిన అక్కినేని, గుమ్మడి, మిక్కిలినేని, పీతాంబరంలను ఇంటర్వ్యూ చేయటం జరిగింది. *వెండి చందమామలు* అనే చిన్న పుస్తకంతో వెండి తెర నవలలపై ఒక చిన్న పుస్తకం రాశాను. 1932నుంచి, ఒక యాభై సంవత్సరాల కాలంలో తెలుగు సినిమా సంగీతం ఎలా మారుతూ వచ్చింది, ఆ సంగీత దర్శకులను పరిచయం చేస్తూ *స్వర్ణయుగ సంగీత దర్శకులు* అనే పుస్తకం తెచ్చాను. హెచ్ ఆర్ పద్మనాభ శాస్త్రి, పెండ్యాల, రాజేశ్వరరావు.. ఇలా అనేకమంది సంగీత దర్శకుల గురించి చెప్పే పుస్తకం ఇది. దాదాపు ఎనిమిది వందల పేజీల పుస్తకం ఇది. నా అదృష్టం ఏమిటంటే బాలు గారు పుస్తకాన్ని సరిదిద్దటం. ఈమధ్య లేటెస్టుగా విఠలాచార్యపై ఒక పుస్తకం వచ్చింది. అలాగే సాక్షిలో ఉండగా హాలీవుడ్ సినిమాలపై ఒక ఫీచర్ నిర్వహించాను. *పడమటి సినిమా పరిమళంగా* ఆ పుస్తకం వచ్చింది. దాసరి, సింగీతం, గొల్లపూడి వంటి ప్రముఖులతో కూడిన వ్యాసాల పుస్తకం. వాళ్ళకు నచ్చిన సినిమాలను విశ్లేషించారు. ఇప్పుడు హిచ్ కాక్ చిత్రాలపై పుస్తకం వచ్చింది. అదే *మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ –హిచ్ కాక్.* ఆయన మొత్తం యాభై మూడు సినిమాలు డైరెక్ట్ చేశారు. ఒకొక్క సినిమాను ఒక్కో తెలుగు దర్శకుడు విశ్లేషించారు. పైరెండు పుస్తకాలు రైల్వే అధికారి రవి పాడి గారు సహరచయితగా సంకలనం చేశాను. వీటిలో హిచ్ కాక్ పుస్తకం ఐదురోజుల్లో రెండో ముద్రణకు వచ్చింది.. ఇదండీ నా ప్రయాణం




ఇలా భోగి పండుగ రోజున ముగ్గురు రచయితలు తమ పుస్తకాల నేపథ్యాన్ని, ఇటీవలి పుస్తకాన్ని నవ్వుల మధ్య..నువ్వుండల సాక్షిగా పంచుకోవటం తెలుగు వారి పెదపండుగను పెద్దల మధ్య జరుపుకున్న అనుభూతినిచ్చింది..



ఎడిటర్‌తో రాంబాబు

*సి.యస్.రాంబాబు*

# శిష్ట్లా

– డా॥ నల్లపనేని విజయలక్ష్మి

మారో మారో మారో మారో అంటూ సంప్రదాయ ఛందస్సులు, మాత్రా ఛందస్సుల మీద దాడి చేసి తెలుగు కవిత్వానికి వచన కవిత్వ ద్వారాలు తెరిచినవాడు శిష్ట్లా ఉమామహేశ్వరరావు. శిష్ట్లా 1909 నవంబర్ 2 న గుంటూరులోని కుగ్లర్ ఆసుపత్రిలో జన్మించాడు. వీరి తండ్రి వెంకట కృష్ణయ్య, తల్లి వెంకట సుబ్బమ్మ. వీరికి ఒక తమ్ముడు (రాధాకృష్ణ మూర్తి), ఒక చెల్లెలు (కనక దుర్గాంబ) ఉన్నారు. తండ్రి వెంకట కృష్ణయ్య స్వాతంత్ర్య సమర యోధుడు. శిష్ట్లా తొలి వచన కవిత రాసినవాడు మాత్రమే కాదు. తొలి వచన కవితా సంపుటాలను వెలువరించిన వాడు కూడా అతడే. 1938లో కొద్ది నెలల తేడాతో 'విష్ణుధనువు' వచన కావ్యాన్ని, 'నవమి చిలుక' వచన కవితా సంపుటాన్ని వెలువరించాడు. శిష్ట్లా బాలగేయాలు, కథలు, వ్యాసాలు, రూపకాలు కూడా రాశాడు.

శిష్ట్లా బాల్యంలో పురాణ గాథలు, జానపద సాహిత్యం బాగా జీర్ణించుకున్నాడు. జానపద సాహిత్యం జీర్ణించుకున్న ప్రభావం ఆయన రాసిన బాలగేయాల మీద బాగా కనిపిస్తుంది. ఆ ప్రభావం వల్లనే పూర్తిగా వచనరూపంలో రాసినపుడు కూడా గొప్ప అంతర్లయను సాధించగలిగాడు. పురాణగాథలను జీర్ణించుకున్న ప్రభావం 'విష్ణుధనువు' కావ్యం మీద బాగా కనిపిస్తుంది.

శిష్ట్లా ఆంగ్ల సాహిత్యంలో ఎం.ఏ చేసి ఆంగ్లంలో నూతనంగా వెలువడుతున్న కవితా ధోరణులను ఆకళింపు చేసుకున్నాడు. ఆ ప్రభావం తెలుగులో కవితా రచనలో ప్రయోగాలు చేసేలా ప్రేరేపించింది. భిన్న ఆసక్తులు ఆయనను నిలకడగా ఉండనివ్వలేదు. కొన్నాళ్లు దివ్యజ్ఞాన సమాజంలో చేరాడు. మరి కొన్నాళ్లు ఒక యతి వద్ద శుశ్రూష చేశాడు. జ్యోతిషం, సంగీతం కూడా అభ్యసించాడు. మొదట ఒక కళాశాలలోనూ, తరువాత ఒక ఫర్మ్ లోనూ పని చేశాడు. చివరికి సైన్యంలో చేరి చిత్ర విచిత్రమైన అనుభవాలు సంపాదించాడు. ఆ అనుభవాలనే 'సిపాయి కథలు'గా వెలువరించాడు.

**విష్ణుధనువు :** ఇది తెలుగులో వెలువడిన తొలి వచనకావ్యం. 'విష్ణుధనువు' లోని కవితలకు శీర్షికలు ఉండవు. మొదటి నుంచి చివరి వరకు వస్త్వైక్యతతో వినూత్న భావాలతో నడిచిన 'విష్ణుధనువు'ను తొలి దీర్ఘకవితగా గుర్తించవచ్చు.

**'ప్రేమ యనగా/చూచుట గాదు/పలుకుట గాదు/ విహ్వలచిత్తముతో/వాపోవుట గాదు!/ప్రేమ యనగా/ మంత్రము గాదు/తంత్రము గాదు/ఆత్మనిర్వాణముచే ఆరాధించుటయే'** అంటూ ప్రేమను నిర్వచిస్తూ ప్రారంభమైన 'విష్ణుధనువు' కావ్యంలో కనిపించేది సాధారణ ప్రణయ కవిత్వం కాదు. ఇందులోని నాయికా నాయకులు సీతారాములు. కానీ ఇది రామాయణ గాథ కాదు. ఇందులోని రాముడు సందర్భానుగుణంగా కృష్ణుడు, కపిలుడు, ఉదయనుడు, ప్రవరాఖ్యుడు, లక్ష్మీ నరసింహ స్వామి, వేంకటేశ్వరుడు, శివుడు, అభిమన్యుడు–ఇలా అనేక పురాణ పాత్రలకు ప్రతీకగా కనిపిస్తాడు. సీతలో చెంచీత, పరాశక్తి, ద్వాపర లక్ష్మి, అలమేలు మంగలను కవి దర్శించాడు. పురాణ పాత్రలను, కథాంశాలను తీసుకొని నవీన భావానుగుణంగా సమన్వయించటం కనిపిస్తుంది. **"దారులు పదివేలు లేవు నీ మనః పద్మవ్యూహమును జొచ్చుటకు"/"నా వేదనం దెలుపుటకు దూతికా మరాళములు లేవు! ఇది నల దమయంతుల యుగంబు గాదు!"/"గీతా రహిత భారత గతి నీరసమయ్యె నా హృదయ గ్రంథము"/"విగత కౌస్తుభాభరణ అశ్వత్థామ శిరము వోలె నిస్తేజమయ్యె నా మస్తకము నీ ప్రేముడి ముద్ర లేక" "కృష్ణుడు లేని యర్జునుని రథము విధి నా జీవిత మెటకో యీడ్చుచున్నది గదే ప్రియా"/"నిరాశా నీరధ సముద్రాంతర్గతం బయ్యె నామేధ స్పైంధవము నే కపిలుడు బంధించెనో/కాకోలమున, నాతని కనుంగు కూతురవేమో/ నీవు! నీ కవచారము సల్పెనా నా మనస్సంకల్ప రక్షక సైన్యము?"/"భావనారూఢవై యేల యింక నీ అశ్వమేధ యాత్రలు మనసా?"** 'విష్ణుధనువు' కావ్యం ప్రేయసి దర్శనాన్ని, సాన్నిధ్యాన్ని కోరుకుంటున్న ప్రియుడి తపనగా పైకి కనిపిస్తుంది. అంతర్లీనంగా ఆత్మ పరమాత్మలో లీనమవడానికి పడే తపన చిత్రించబడింది.

**"...నీ హృదయ/వైకుంఠమున నున్న మూల బలముతో నొకేసారిగా వేయుము నా గర్భ కుహరాంతర/కుండలినీ నాడిపై నీ యందు గలియుదు/వివశప్రాణినై నెచ్చెలీ సీతా!" "ఆ నదికి అద్దరిని ఇద్దరం కలుద్దాము/ఇవ్వాళో రేపో! అంధకారము దాటి అద్దరిని కలుద్దాము/ఇవ్వాళో రేపో! అద్దరికి జేరుకొని నాగస్వరము ఊదుదాము!"**

ప్రేమలన్నింటిలో స్వయంప్రేమ (అహమ్) మాయ అంటాడు శిష్ట్లా. అది వెన్నున్న విష్ణుధనువుగా

ఉంటుందని, ఆ విష్ణుధనువు నుంచి వెలువడే శరాలే భావతరంగాలని, అవి భ్రమలలో ముంచుతాయని అంటాడు. అందుకే అహంకారమనే విష్ణుధనువు విరిగినపుడు సీత సాన్నిధ్యము - అనగా ముక్తికాంత సాన్నిధ్యము లభిస్తుందనే సూచనతో కావ్యం ముగుస్తుంది.

మనస్సంచార గతిని నియంత్రించడం, ఉద్వేగాలను అదుపులో పెట్టుకోవడం ఎంత కష్టమో వర్ణించాడు శిష్ట్లా. అమూర్తమైన మనస్సంచారానికి మూర్తిమత్వాన్ని కల్పించి వర్ణించడంలో కవి భావనాశక్తి, అపూర్వం.

**"దాగుడుమూత పడవీ మనస్సంచారములు!**
**కత్తెర బెట్టినన్ తెగవు! ఎక్కడ కేగుచుంటిరని**
**పోవునపుడడిగిన నవి పకపక నవ్వు! అక్కడ**
**నేమి చేసితిరన సిగ్గుచే నోర మోమున లోనికి**
**జొత్తురు వెంటనె యుప్పెన వచ్చినట్లు మహ**
**ర్నవమి పిల్లల వలె అల్లరి చేతురు ఈ హృద**
**యమునకు నీతి యెక్కడ ప్రేయసీ!**

**చంచలమైన మనసును పది తలల రావణుడితో పోల్చాడు శిష్ట్లా.**

**"నాకు నేనే రావణుడ నేమో యను నటుల/అణచిన నణగక చంచలమై దశముఖముల/చూడ్కులు నిగిడించు నా చిత్తము పై నీ చిరు/వీక్షణ కటాక్షముల కటారి పోటులు/శిరముల ద్రుంచుగాని మరల న్మరల/ప్రాణములు వచ్చు"**

పరి పరి విధాలుగా పరిగెత్తే మనసును ఎంత అదుపు చేసినా అదుపులోకి రాకపోవడాన్ని తుంచినా మళ్లీ పుట్టే రావణుడి తలలతో పోల్చి వర్ణించడం వినూత్నంగా ఉంది. 'విష్ణుధనువు'లో భాష విషయంలో, ఛందస్సు విషయంలో అనేక ప్రయోగాలు చేశాడు శిష్ట్లా. 'ఝంఝూ మారుత ఝర&ఝరీ ధ్వను'లని శార్దూలము వలె సాగిపోయిన గేయం వెంటనే 'జముకుచు జముకుచు అలలై' అని చతురస్ర గతిలో పరుగులు తీస్తుంది. కొన్ని పద్యపు తునకలు, కొన్ని మాత్రాబద్ధ గేయ ఖండాలు, కొన్ని వచన పాదాలు ఇష్టం వచ్చినట్టు పేర్చి సరికొత్త భావ చిత్రాలతో కవితాశ్వాన్ని అతి నవ్యమార్గంలో పరుగులు పెట్టించాడు. గ్రాంధిక, వ్యావహారిక రూపాలను కలగలిపి ప్రయోగించాడు. 'సుదిన ఉదయ', 'కేయూర వయారి' వంటి అపరూపాలను వాడాడు. 'శ్రీ కుచోపరి చేలాంచలము' అన్న పోతన ప్రయోగాన్ని మధ్యలో విరిచి 'శ్రీ పరి చేలాంచలము' అని, 'గజ ప్రాణావనోత్సాహియై' అన్న దానిని 'గజ ప్రాణోత్సాహియై' అని మార్చి ప్రయోగించాడు. ఇవేవీ తెలియక చేసిన తప్పులు కావు. ఒకానొక తిరుగుబాటు మనస్తత్వంతో ప్రయత్నపూర్వకంగా భాష విషయంలో, ఛందస్సు విషయంలో చేసిన ప్రయోగాలు.

**నవమి చిలుక :** 'నవమి చిలుక మున్నుడి' గేయంలో "నవ్య నవ్య కవిత్వం ఇది నూతనములో బహు నూతన కవిత్వం/ ఇది పూర్వ కవిత్వం గాదు ఇది నవ్య కవిత్వం గాదు ఇది భావ కవిత్వం గాదు" అని ప్రకటించాడు. తన కవిత్వం ప్రాహ్లాద కవిత్వమని ఆయన చెప్పుకున్నాడు. అది పండితులను, పామరులను సమానంగా రంజింప జేస్తుందని ఆయన అభిప్రాయం. "ప్రాహ్లాద కవిత్వంలో సావిత్రీ సత్యవంత జీవితమున్నది" అన్నాడు. తన కవిత్వం ప్రజలలోని పామరత్వాన్ని, జడత్వాన్ని తొలగించి వారిలో చైతన్యాన్ని, జాగృతిని కలిగించే శక్తి కలిగినదని ఆయన అభిప్రాయం. 'నవమి చిలుక' లోని వస్తువు ప్రజా సామాన్యానికి సంబంధించినది. ముఖ్యంగా గ్రామ జీవితంలోని వివిధ సంఘటనలను తీసుకొని రాయబడింది. 'పూల రంగడు', 'చిన్నమ్మాయి', 'అగ్రహారబ్బడితె', 'పైనం', 'ఊట్ల వెర్రెమ్మ' తదితర కవితలన్నీ గ్రామీణ నేపథ్యంలోనివే.

స్త్రీ జీవిత చిత్రణ కలిగిన 'ఊట్ల వెర్రెమ్మ', 'పుట్టింటి పిల్ల', 'ఆడవాళ్లు', 'జ్ఞాపకాలు' ఖండికలు హృదయాన్ని కదిలిస్తాయి. ప్రేమించిన వాడిని నమ్మి అయినవారందరినీ వదిలి పొరుగూరికి వస్తే వాడు మోసం చేసి వెళ్లిపోయాడు. ఆమెకు మిగిలింది తన వాళ్ల జ్ఞాపకాలు, కలత కలలు. ఏ మూలో మనసులో అణగి ఉన్న తల్లి కావాలన్న కోరిక, మగ పిల్లవాడు పుడితే మాయదారి కాకుండా, ఆడపిల్ల పుడితే అర్థాన్నమవకుండా పెంచుకోవాలన్న కోరికలు కలలుగా కలత పెడుతుంటే ఆర్ద్రంగా పలకరించే దిక్కు లేక రాయిలా బ్రతుకుతున్న ఒకానొక స్త్రీ కథ 'జ్ఞాపకాలు' కవిత. కొన్ని కవితలలో పాదాల విరుపు లేకుండా పేరాలా రాయడం కనిపిస్తుంది.

**'బీదమందు' కవితను పామరుల భాషలోనే రాశాడు.**

**"తూర్పు తెల్లారింది, వాన వెలిసింది! అమ్మ/పోయే మందెట్టుకు రాయే!/కాండబ్బైనా లేదు, కాసైనా లేదు! కాత్తె కూత్తైకైతే డాక్టరు రాడే!**

గురజాడ 'దేశభక్తి' గీతంలో వెల్లడించిన భావాలను తీసుకొని స్వరాజ్యం వచ్చిన తరువాత దేశం పరిస్థితి ఎలా ఉందో వ్యంగ్యంగా వ్యక్తీకరించిన కవిత 'జాతీయ 'తత్వం".

**"దేశమనియెడి దొడ్డవృక్షం/అన్నదెవరుర తమ్ముడా!**
**దేశమనియెడి దొడ్డవృక్షపు/దుంప తెంపిరి తమ్ముడా!**
**దేశమంటే మట్టి కాదని/నమ్ముతావుర తమ్ముడా?**
**మట్టి కాకుంటేను ఏమిటి?/మంత్రి పదవులు తమ్ముడా!"**

**కథా సాహిత్యం :** గొబ్బి జాతక కథలు, బాల వినోద కథలు, ఆకాశవాణి కథలు, సిపాయి కథలు – ఇవి కాకుండా వివిధ అంశాల మీద రాసిన కథలు 39 వరకు ఉన్నాయి. గొబ్బి జాతక కథలు లోని గొబ్బి పాత్ర తెలివితేటలు, ఆత్మవిశ్వాసం, పరాక్రమం, నైతికత కలిగిన స్త్రీ పాత్ర. రామాయణ గొబ్బిగా, భారత గొబ్బిగా, భీష్మ గొబ్బిగా, బౌద్ధ గొబ్బిగా, పరాక్రమ గొబ్బిగా అలరిస్తుంది. సిపాయి కథలు తాను సిపాయిగా పనిచేసిన నాటి అనుభవాలను కథలుగా మలచినవి. శిష్ట్లా రాసిన కథల్లో కొన్ని చాలా సున్నితమైన అంశాలను స్పృశించినవీ ఉన్నాయి. 'రామరాజ్య రహస్యాలు' ప్రభుత్వాల పని తీరును వ్యంగ్యంగా చిత్రించిన కథ. ఈనాటికీ ప్రాసంగికతను కోల్పోని కథ. 'కలలో... కథ...!' చలం అభిప్రాయాలను గురించి ఆలోచనాత్మకంగా సాగిన కథ.

**రూపకాలు :** శిష్ట్లా వైవిధ్యభరితమైన వస్తువుతో రూపకాలు రాశాడు. ఆయన రూపకాలలోని స్త్రీ పాత్రలు ఉన్నత వ్యక్తిత్వం కలవి. సమస్యల సాగరాన్ని ఈది ప్రేమను పండించుకున్న బాల వితంతువు ఒకరైతే, ఆంగ్లం తెలియని పామరురాలని తేలికగా చూడబోయిన భర్తకు సంస్కృత కావ్యాల గొప్పదనాన్ని తెలియజెప్పి తన తెలివితేటలతో, చమత్కారంతో ఆకట్టుకున్న గడుసరి యువతి మరొకరు. 'రైతు సిపాయిలు' రూపకంలో తమ భర్తలు సిపాయిలుగా యుద్ధంలో పాల్గొనడానికి వెళితే, ఒంటరిగా పిల్లల పెంపకాన్ని, కుటుంబపోషణను నిర్వహించిన పడతుల సామర్థ్యం చిత్రంచాడు. శిష్ట్లా కవిత్వంలో, కథల్లో, రూపకాల్లో చిత్రించిన స్త్రీ జీవిత వాస్తవికతను గమనించినపుడు స్త్రీల సమస్యలను స్త్రీల కోణం నుంచి ఎంత ఆర్ద్ర హృదయంతో ఆలోచించి స్పందించాడో అర్థమౌతుంది. బిడ్డలు పుట్టాక అందం తరిగిపోయిందని మరొక స్త్రీతో సంబంధం పెట్టుకున్న భర్తను వారించటానికి ప్రయత్నించి విఫలమై ఆత్మహత్యకు సిద్ధమైన స్త్రీ స్వగతంలో స్త్రీల పరిస్థితిని ఎంత వాస్తవికంగా చిత్రించాడో చూడండి. (ఆత్మహత్య రూపకంలో) "పురుషుడు స్త్రీలను మార్చినట్లు స్త్రీ పురుషులను మారిస్తే భాగ్యంలో ఏ మార్పు ఉండదు. మోహమే ప్రధానం కాదు. స్త్రీ పురుషులు జీవితం కోసం, జీవితాభివృద్ధి కోసం కలిసి ఉండాలి. కరుణతో ఉండాలి. ప్రణయము లేనిదే కలిసి ఎలా ఉండగలరు? ఒకరిపై ఒకరికి గౌరవం లేనిది పూర్ణ ప్రణయము ఎలా ఉదయించ గలదు? ఒకరెక్కువ, ఒకరు తక్కువ స్థితిలో, ఒకరు విద్యా ప్రతిభతో, ఒకరు అజ్ఞానంతో జీవిస్తే గౌరవం ఎలా సంభవిస్తుంది?ప్రపంచం మార్పు చెందాలి. అందాకా మనకు దిక్కు లేదు." పురుషులతో సమానమైన విద్యా ప్రతిభ, జ్ఞానం స్త్రీలకు ఉన్నప్పుడే స్త్రీ పురుషుల మధ్య పరస్పర గౌరవం సాధ్యమని, ఆ పరస్పర గౌరవమే అసలైన ప్రణయానికి నాంది అని చెప్పిన ఆధునికుడు శిష్ట్లా.

**వ్యాసాలు :** శిష్ట్లా వచనం ఆయనకు గల భిన్న ఆసక్తులను తెలియజేస్తుంది. సినిమాల మీద రివ్యూలు, హెన్రీవాలెస్, ట్రిగ్వీ-లీ, మావో, టిటో వంటి విదేశీ ప్రముఖులను పరిచయం చేస్తూ రాసిన వ్యాసాలు, విభిన్నమైన అంశాలకు సంబంధించిన వ్యాసాలు కనిపిస్తున్నాయి. కథైనా, కవిత్వమైనా, వ్యాసమైనా, రూపకమైనా అలవోకగా చదివించే శైలి, కవితాత్మక వాక్య నిర్మాణం ఆకట్టుకుంటాయి. ఏకబిగిన చదివిస్తాయి. తన సృజనాత్మక ప్రతిభ, ప్రయోగశీలతలతో సమకాలిక కవులకు ప్రేరణగా నిలిచిన గొప్ప కవి శిష్ట్లా. "ఈనాడు అతి నవీనులమని బోర విరుచుకు తిరుగుతున్న అతి నవీనులకు కూడా అతి నవీనుడు శిష్ట్లా. ఏనాడో అతి నవీనమైన మార్గంలో కవిత్వం వ్రాసి లోకం చేత విస్మరింపబడ్డాడు. అతి నవ్య కవిత్వం ఎన్ని పోకడలు పోగలదో అన్నిటినీ పోయి చూచాడు. భావ కవిత్వం నుంచి అధి వాస్తవికత వరకు." అన్నాడు శ్రీరంగం నారాయణ బాబు.

ఆధునిక కవిత్వానికి గల కవిత్రయంలో (శ్రీశ్రీ, శిష్ట్లా, నారాయణ బాబు) ఒకడుగా శిష్ట్లా గుర్తించబడినప్పటికీ అతడికి రావలసినంత గుర్తింపు రాకపోవడానికి గల కారణాలను కుందుర్తి విశ్లేషించాడు."శిష్ట్లాకు అభ్యుదయ కవిత్వానికి కావలసిన మార్క్సిస్టు అవగాహన లేదు. అందువల్ల వచన కవితకు ప్రారంభకుడైనా అభ్యుదయ యుగంలో విస్మృతపథంలో పడిపోయాడు" అని కుందుర్తి వ్యాఖ్యానించాడు.

మహాకవి శ్రీశ్రీ మరో ప్రపంచ గీతానికి ప్రేరణ నందించిన 'మారో మారో' కవితా కర్తగా ఆయన ప్రతిభ లోక విదితం. కారణాలు ఏవైనా గొప్ప ప్రతిభ కలిగిన కవి, కథకుడు చిన్న వయసులోనే మరణించడం, తన ప్రతిభకు తగిన గుర్తింపుకు నోచుకోకపోవడం విషాదం.

డా॥ నల్లపనేని విజయలక్ష్మి
ఫోన్ : 9701667350

# అష్టాధ్యాయి అద్వితీయ వ్యాకరణం

డా. బాశెట్టి లత

**పత్రాంశ పరిచయం :**

**"ధర్మమనుదు తత్త్వమనుదు యోగమనుదు**
**ప్రాణి సాధింపగల సకల పరమార్థములకు**
**తల్లి భాష ప్రధాన సూత్రంబు యగుట**
**భాషకంటె నవ్యులకు తపస్సు లేదు"** అని రాయప్రోలు సుబ్బారావు గారు మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. మాతృభాషను ఆరాధించడం, దాని గొప్పతనాన్ని ప్రజలకు రుచిచూపించడం శ్రీహరి గారిలో కన్పించే విశేషగుణం. ఈ గుణమే నన్ను ఒక సంస్కృత విద్యార్థిని దశ నుండి ఇప్పుడు సంస్కృతాంధ్ర భాషల పట్ల పరిశీలనకు అడుగులు వేయడానికి మార్గదర్శకం అయింది. ఈ కారణం వల్లనే సంస్కృతం – తెలుగు భాషల్లోనూ 40 గ్రంథాలు రచించి, సంస్కృత – తెలుగు భాషలకు ఎంతో సేవ చేసిన ఉభయభాషా నిష్ణాతులు ఆచార్య రవ్వా శ్రీహరి గారు.

మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరిగారు అంటే నాకు చాలా గౌరవం, ఇష్టం. నేటి దృశ్య ప్రపంచంలో ఇలాంటి పండితులు తారసపడడం అరుదు అనడంలో అతిశయోక్తి ఏమి లేదు. పాండిత్య సముపార్జనకు పేదరికం అడ్డుకాదని నిరూపించిన ప్రజ్ఞాశాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని నేటి తరానికి తన జీవితాన్నే ఆదర్శబాటగా నిలిపిన ఆదర్శ గురువులు.

**వ్యాకరణం :**

**"యద్యపి బహునాధీషే తథాపి పఠపుత్ర వ్యాకరణం**
**స్వజనః శ్వజనో మాభూత్ సకలం శకలం సకృత్ సకృత్ ॥**

ప్రతి మనిషికి సంస్కారం లాంటిది భాషకు వ్యాకరణ. వ్యాకరణం మనిషికి క్రమశిక్షణ నేర్పుతుంది. వ్యాకరణం భాషను శాసిస్తుంది అని అనేవాళ్ళు లేకపోలేదు. కానీ అది నిజం కాదు. ప్రతి భాషలోని భాషామూలాలు, సహజత్వాన్ని పోగొట్టకుండా ఆయా భాషా వ్యవహర్తల అవసరాల్ని ఎప్పటికప్పుడు తీర్చడమే వ్యాకరణ పరమ లక్ష్యం. తెలుగు భాషకి ఇరవైఐదు (25)కి పైగా వ్యాకరణాలు వచ్చాయి. ద్రావిడభాషల్లో ఏ భాషకూ ఇన్ని వ్యాకరణాలు రాలేదేమో! 1. కావ్యరచన చేసేవాళ్ళ కోసం పద్యాంధ్రవ్యాకరణాలు 2. పాణినీయ ప్రభావంతో సంస్కృతంలో వచ్చిన ఆంధ్రవ్యాకరణాలు 3. ఆధునిక కాలంలో ఆంగ్లంలో వచ్చిన తెలుగు వ్యాకరణాలు. 4. విద్యార్థి వ్యాకరణాలు 5. లఘువ్యాకరణాలు 6. సూత్ర వ్యాకరణాలు 7. వ్యావహారిక వ్యాకరణాలు 8. ప్రామాణిక భాషా వ్యాకరణాలు మొదలైనవి. ఇలా వచ్చిన చాలావ్యాకరణాల్ని గమనించినట్లైతే కాలానుగుణమైన మార్పుల్ని, అవసరాల్ని తీర్చడానికే తెలుగు వ్యాకరణం ఇన్ని రూపాల్ని పొందింది అని చెప్పొచ్చు. వాటిల్లో పాణిని అష్టాధ్యాయికి ఆంధ్రాకృతి కల్పించిన "అపరపాణిని" ఆచార్య రవ్వా శ్రీహరిగారు అనువాదం చేసిన అష్టాధ్యాయి గురించి ఈ నా పత్రంలో వివరించ దలిచాను.

**పాణిని – అష్టాధ్యాయి :**

**"నసోస్తి ప్రత్యయోలోకే/యశ్శబ్దానుగమాదృతే**
**అనువిద్ధమివ జ్ఞానం/సర్వం శబ్దేన భాసతే"** – వాక్యపదీయంలో చెప్పినట్లుగా ప్రపంచ భాషా చరిత్రలో, నాటికీ నేటికీ పాణిని రాసిన 'అష్టాధ్యాయి' సాటిలేని వ్యాకరణ మణిదీపంలా వెలుగుతుంది. అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. అలాంటి పాణినీయ అష్టాధ్యాయిని తెలుగులోకి అనువాదం చేసినవారు ఆచార్య రవ్వా శ్రీహరిగారు. **ప్రముఖ భాషావేత్త లియోనార్డ్ బ్లూం ఫీల్డ్ మాటల్లో 'అష్టాధ్యాయి' గురించి :** క్రీ.పూ. 350 నుండి 250 మధ్యకాలంలో సంస్కృత వ్యాకర్త పాణిని రాసిన అష్టాధ్యాయి అత్యున్నత మానవమేధకు తార్కాణం అనీ, ఇప్పటి వరకు ప్రపంచ భాషల్లో ఏ భాషకూ ఇంతటి గొప్ప వ్యాకరణశాస్త్ర గ్రంథం రాలేదు" అని చెప్పడంలో ఈ 'అష్టాధ్యాయి' పుస్తకం యొక్క విశిష్టత అవగతమౌతుంది.

మాక్స్‌ముల్లర్ మాటల్లో – "ప్రపంచంలోని అన్ని భాషలకు అనువర్తింప చేసుకోగలిగే గ్రంథం పాణిని రాసిన ఈ 8 అధ్యాయాల వ్యాకరణశాస్త్రం. ఆచార్య రవ్వా శ్రీహరి గారు అతి సామాన్యుడు కూడా అర్థం చేసుకొనే విధంగా

పాణిని రాసిన 8 అధ్యాయాల్ని 4,000 సంస్కృత సూత్రాల్ని తెలుగు లిపిలో యథాతథంగా ఇస్తూ, వాటికి వివరణల్ని, ఉదాహరణలతో రచించిన వ్యాఖ్యానం.

**అష్టాధ్యాయి – తెలుగు అనువాదం :** పాణిని అష్టాధ్యాయి అతి ప్రాచీనం అయినా, అత్యాధునికంగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం పాశ్చాత్య దేశాల్లో అభివృద్ధి చెందిన భాషాశాస్త్రం లోని అనేకాంశాలు అష్టాధ్యాయిలో కనబడడమే కారణం. అందుకే మరోసారి ఘంటాపథంగా చెప్పవచ్చు, అదేంటంటే పాణిని అష్టాధ్యాయి వంటి శాస్త్రీయం, సమగ్రం అయిన వర్ణనాత్మక వ్యాకరణం ప్రపంచంలో మరే భాషకూ లేదని. అష్టాధ్యాయి ఎనిమిది అధ్యాయాలుగా విభజించడం వల్ల దీనికి 'అష్టాధ్యాయి' అనే పేరు వచ్చింది. అష్టాధ్యాయికి ప్రసిద్ధమైన వ్యాఖ్యలు రెండు. 1. పతంజలి మహర్షి – మహాభాష్యం వ్యాఖ్యానం 2. వామన జయాదిత్యుడు – కాశికావృత్తి ఎక్కువ ప్రాచుర్యం పొందింది కాశికావృత్తి. రవ్వా శ్రీహరి గారు అష్టాధ్యాయితో పాటు కాశికా వ్యాఖ్యని కూడా తెలుగులోకి అనువాదం చేశారు. మొట్టమొదటి తెలుగు అనువాదం. తెలుగులోకి అనువాదం చేసిన పాణినీయ అష్టాధ్యాయి అనువాదం గ్రంథం 2100 పేజీలతో పెద్ద గ్రంథం అవ్వడం వల్ల దాన్ని రెండు సంపుటాలుగా తెలుగు అకాడమి, హైదరాబాద్ 2015లో ముద్రించింది. ప్రథమ సంపుటంలో అష్టాధ్యాయిలోని మొదటి నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. వాటిలోని వ్యాకరణాంశాలు ఇలా ఉన్నాయి :

**అధ్యాయం – 1**

1, 2, పాదాలు – సంజ్ఞలు, పరిభాషలు

3వ పాదం – ఆత్మనేపద, పరస్మైపద ధాతువుల ప్రక్రియ

4వ పాదం – విభక్తి రూపాలు, సమాసం, అవ్యయాలు

**అధ్యాయం – 2**

1, 2, పాదాలు – సమాసప్రక్రియ, సమాసభేదాలు

3వ పాదం – కారక విశేషాలు, 4వ పాదం – దశలకారాల ప్రక్రియ

**అధ్యాయం – 3**

1, 2, 3, 4 పాదాలు – కృతందరూపాలు

**అధ్యాయం – 4**

1, 2, 3 పాదాలు 4వ పాదంలో 75వ సూత్రం వరకు – స్త్రీ ప్రత్యయరూపాలు

76వ సూత్రం నుండి – తద్ధిత రూపాలు

రెండవ సంపుటంలో 5, 6, 7, 8 అధ్యాయాలున్నాయి.

**అధ్యాయం – 5**

1వ పాదం 76 సూత్రం నుండి

4వ పాదం చివరి వరకు – తద్ధిత రూపాలు

**అధ్యాయం – 6**

1వ పాదం – సంధి రూపాలు

2వ పాదం – స్వరవిధానం

3వ పాదం – ఆదేశాలు, అసాధారణ సమాసాలు

4వ పాదం – అర్ధధాతుక పరిణామాలు, ఆదేశకార్యాలు – లోపకార్యాలు

**అధ్యాయం – 7**

1-4 పాదాలు – స్వరవిధానం, ధ్వనిపరిణామాలు

అధ్యాయం – 8

1వ పాదం – సర్వనామాలు, స్వరవిధానం మొ॥.

2, 3, 4 పాదాలు – సంధి (అసిద్ధ సూత్రాలు)

రెండవ సంపుటం చివరిలో పెట్టిన సూత్రాను క్రమణిక, అధికారాలు, నిపాతాలు, సంజ్ఞలు పాఠకులకు చాలా ఉపయోగకరం.

**పాణిని అష్టాధ్యాయి :** పాణిని తనకన్నా ముందున్న పదిమంది వ్యాకరణకర్తల అభిప్రాయాలను ప్రస్తావించడం కన్పిస్తుంది. కానీ వారి గ్రంథాలు అలభ్యాలు. వారు : 1. ఆపిశలి, 2. కాశ్యపుడు, 3. గార్గ్యుడు, 4. గాలవుడు, 5. చాక్రవర్మణుడు, 6. భరద్వాజుడు, 7. శాకటాయనుడు, 8. శాకల్యుడు, 9. సేనకుడు, 10. స్ఫోటాయనుడు.

పై వ్యాకరణాచార్యుల సంప్రదాయాలను అధ్యయనం చేసి, వైదిక, లౌకిక సంస్కృత భాషలకు రెండింటికీ అద్వితీయమైన వ్యాకరణాన్ని రాశాడు. ఈ వ్యాకరణం ఎనిమిది అధ్యాయాల్లో రాయడం వల్ల "అష్టాధ్యాయి" అని పేరు పొందింది. అష్యాధ్యాయికే వేరే పేర్లు కూడా ఉన్నాయి. అవి : 'అష్టిక', 'అష్టకం', 'శబ్దానుశాసనం', వృత్తి సూత్రం. ఇందులో ప్రతి అధ్యాయం నాలుగు పాదాలుగా విభజించారు. అష్టాధ్యాయిలోని ప్రధానమైన సూత్రాల్ని 'సూత్రపాఠం'గా పిలుస్తారు. అష్టాధ్యాయికి ప్రాణం లాంటివి ప్రత్యాహారాలు. వీటిని పాణిని మహేశ్వరుని ఢక్కానాదం నుండి వెలువడినట్లు పండితుల విశ్వాసంగా చెపుతారు. అందువల్లే వీటిని మాహేశ్వర సూత్రాలు అని పిలుస్తారు. ఇవి మొత్తం 14. (పద్నాలుగు)

"నృత్తావసానే నటరాజరాజో
ననాద ఢక్కాం నవపంచవారం" (9+5=14)

ఉద్దర్తుకామ : సనకాదిసిద్ధాన్
ఏతద్విమర్శౌ శివసూత్రజాలం.

అష్టాధ్యాయిలోని 8 అధ్యాయాల్లో ప్రతిదానిలో 4 పాదాలు, 8 × 4 = 32, 32 పాదాల్లోని సూత్రసంఖ్య ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| | 1వ పాదం | 2వ పాదం | 3వ పాదం | 4వ పాదం | మొత్తం సూత్రాలు |
|---|---|---|---|---|---|
| 1వ అధ్యాయం | 75 | 73 | 93 | 110 | 351 |
| 2వ అధ్యాయం | 72 | 38 | 73 | 85 | 268 |
| 3వ అధ్యాయం | 150 | 188 | 176 | 117 | 63 |
| 4వ అధ్యాయం | 178 | 145 | 168 | 144 | 635 |
| 5వ అధ్యాయం | 136 | 140 | 119 | 160 | 555 |
| 6వ అధ్యాయం | 223 | 199 | 139 | 175 | 736 |
| 7వ అధ్యాయం | 103 | 118 | 120 | 97 | 438 |
| 8వ అధ్యాయం | 74 | 108 | 117 | 68 | 367 |
| | | | | మొత్తం = | 3981 సూత్రాలు |

ఆచార్య రవ్వా శ్రీహరి గారి కన్నా ముందు ఒద్దిరాజు సోదరులు అష్టాధ్యాయి అనువాదం చేశారు. కానీ వారి అనువాదంలో సూత్రం, అర్థం, ఉదానణం వరకే కన్పిస్తుంది. శ్రీహరి గారి అనువాదంలో కాశికతో సహా అనువదించారు. ఒక సూత్రం, అర్థం వివరణతో పాటు గ్రంథంపై జరిగిన చర్చలు, వాదనలు అన్నీ శ్రీహరి గారి అనువాదంలో కన్పిస్తాయి. చాలా కాలంగా సంప్రదాయ బద్ధంగా చదువుకున్న వ్యాకరణం నలుగురికీ పంచాలనే తపనతో శ్రీహరిగారి 'అష్టాధ్యాయి' అనువాదానికి పూనుకున్నారు. 'అష్టాధ్యాయి'కి వరరుచి మని వార్తికాలు, పంతజలి మహాభాష్యం, వామన జయాదిత్యులు కాశికా వృత్తి మొదలైన అనేక గ్రంథాలు వచ్చాయి.

అష్టాధ్యాయిలో పాణిని రచన చాలా ప్రత్యేకం. ఏదైనా ఒక అంశానికి చెందిన వాటిని క్రమపద్ధతిలో తెలుపుతూ సూత్రాలు రాశారు. ఉదా : గుణసంధి, వృద్ధి సంధులకు చెందిన సూత్రాలు, వాటి నిషేధాలు మొట్టమొదట కన్పిస్తాయి. అలాగే నకారానికి 'ణ'కారం వచ్చే సూత్రాలన్నీ ఒకచోట రాశారు. ఒక్కో అంశాన్ని తెలియజేసే సూత్రాలు ఒకచోట రాయడం, దానిలో పై సూత్రాల నుండి క్రింది సూత్రాలకు పదాల్ని అనువృత్తి చేసుకోవడం. ఉత్సర్గ అపవాద పద్ధతి. ప్రత్యాహారాన్ని ఉపయోగించి సూత్రాలను రాయడం. విస్తృతమైన అంశాల్ని సంక్షిప్తీకరించి సూత్రాలతో చెప్పడం.పదాలకు గుణపాఠాలు ఏర్పాటు చేయడం.

ధాతువువకు గణాలని ఏర్పరచడం వల్ల విస్తారమైన సంస్కృత భాషకు 3386 సూత్రాలతో బృహత్ వ్యాకరణం రాశాడు పాణిని. తర్వాత భట్టోజీ దీక్షితులు సంజ్ఞా, విభక్త్యర్థ ప్రకరణం, సమాస ప్రకరణం మొదలైన ప్రకరణ విభాగంతో సిద్ధాంత కౌముదీ రాశాడు. పాణిని రచనకన్నా ఎక్కువ ప్రజాదరణ పొందింది అన్నది కొందరి వాదన. అయితే భట్టోజీ దీక్షితులు సూత్రాల వరుసను మార్చడం వల్ల అనువృత్యాదుల వల్ల వచ్చే అర్థాన్ని, వార్తికాల, భాష్యాల వల్ల తెలుసుకునే విషయాల్ని కలిపి సూత్రాల్ని ఉదాహరణ ప్రత్యుదాహరణలను ఇవ్వడం వల్ల కౌముది వృత్తి వాక్యాల్ని కంఠస్థం చేయాల్సిన అవసరం వచ్చింది. పాణిని అష్టాధ్యాయి సూత్రాలను, సూత్రక్రమాల్ని మార్చకుండా అర్థవృత్తులతో, ఉదాహరణలతో రాసిన గ్రంథం కాశికావృత్తి. దీని గ్రంథకర్త వామన జయాదిత్యులు.

తెలుగు ప్రాంతాల్లో 1640 తర్వాత సిద్ధాంత కౌముది, దాని సంగ్రహరూపం – లఘు సిద్ధాంతకౌముది వచ్చేవరకు అంటే దాదాపు 900 సంవత్సరాల కాలం కాశికావృత్తి తెలుగులోకి ఎవరూ అనువదించలేదు. ఆ లోటును ఆచార్య రవ్వా శ్రీహరి గారు అనువదించడం మనందరి అదృష్టం. సంస్కృతం చదివేవారే తక్కువైన ఈ కాలంలో వ్యాకరణాధ్యయనం ఇంకా చాలా తక్కువ. ఎంతో కొంత ఆసకిస్త గలవారికి చదువుకుందామన్న గురువులు లేరని, ఉన్నా చాలా తక్కువని చెప్పొచ్చు. ఆ సమస్యలన్నింటి నుండి బయటపడడం కోసం వివరణలతో సహా అష్టాధ్యాయిని తెలుగు ప్రజలకి అనువాదం చేశారు ఆచార్య రవ్వా శ్రీహరి గారు., ఆచార్య రవ్వా శ్రీహరిగారి ఒక సూత్రానికి ఉదాహరణలను, సమన్వయాన్ని, ఉదాహరణల రూప ప్రక్రియను కూడా వివరిస్తూ అవసరమున్న చోట ప్రత్యుదాహరణలను కూడా ప్రక్రియతో వివరించారు. దీనివల్ల సామాన్య పరిచయం గల వారికి, చదివి మరిచిపోయిన వాళ్ళకీ కూడా సులభంగా అర్థం చేసుకోవడానికి ఈ 'అనువాదం' మార్గదర్శకమైంది.

**ఉదా :** శ్రీహరి గారు మొట్టమొదట వృద్ధి శబ్దం ప్రయోగించారు. బలభద్ర త్రిపాఠి రాసిన కాశికావృత్తిలో "ఇహమాభూత్ద్యోపన్థాః" అని కన్పిస్తుంది. శ్రీహరి గారు ఆ రూపాల్ని తయారు చేసిన "దివఔత్" అనే సూత్రంలో వృద్ధిపదం, "పథిమథ్యృభుక్షామాత్" అనే సూత్రంలో గుణశబ్దాన్ని వాడలేదు. కాబట్టి అక్కడ ఇకః అనే షష్ఠ్యన్తపదం చేరలేదని, అక్కడ ఇక్కులకు కాకుండా వేరే వర్ణాలకు వృద్ధిగణాలు వచ్చాయని రాశారు. కాశికావృత్తిలో గుణనిషేధం జరగని రూపాలను ఉదహరించలేదు. రూపసాధనతో రోరవీతి, లోలూవ అనే రూపాల్ని

ఉదహరించారు. అంతే కాకుండా మూలంలో లేని రూపాల్ని వివరించారు. ఉదా : 'అభాజి' అనే రూపప్రక్రియలో 'ఇకో గుణవృద్ధీ' అనే సూత్రం వల్ల గుణవృద్ధీ అనే పదానువర్తనం వల్ల, ధాత్వవయవలోప నిమిత్తమైన అర్ధధాతుకం పరంగా ఉన్నప్పుడే ఇక్కుకే గుణవృద్ధి నిషేధం జరుగుతుంది. కానీ 'అభాజీ' అనే దగ్గర ఈ సూత్రంచే వృద్ధి నిషేధం రాదని వివరించారు. అష్టాధ్యాయి ప్రథమాధ్యాయం ప్రథమ పాదంలో 5వ సూత్రం "క్జితిచ" 1.1.5. దీనికి మూలంలో వృత్తి ఇలా కన్పిస్తుంది, "నిమిత్త సప్తయ్యేషా, క్జిన్నిమిత్తేయే గుణవృద్ధీ ప్రాప్నుతః తేనభవతః, గకారోపి అత్రచర్త్వభూతో నిర్దిశ్యతే" అని. ఉదాహరణ : చియః, చితవాన్; స్తుతః, స్తుతవాన్, భిన్నః, భిన్నవాన్, మృష్టః, మృష్టవాన్. అలాగే "గ్లాజిస్థశ్చ గ్స్నుః" (3.2.139) సూత్రం గుర్తుకు చేసి, వాటికి ఉదాదహరణగా : జిష్ణుః భూష్ణుః చూపించారు. శ్రీహరి గరాఅ పైదానికి అనువాదంలో 'గిత్ కిత్ జిత్' వీటిని నిమిత్తంగా చేసుకొని వచ్చే ఇగ్లక్షణాలైన గుణవృద్ధులు రావు అని అనువదించారు. అయితే ఇక్కడ ఒక సంశయం వస్తుంది. అది ఏమిటంటే పై సూత్రంలో 'కిత్' కన్పిస్తుందే కానీ గిత్ లేదు కదా? అని. దానికి వృత్తిలో "గకార్కోంపి అత్రచర్త్వభూతో నిర్దిశ్యతే" అనే వివరణ ఉంది. దానికి శ్రీహరి గారు అనువాదంలో 'గ్, క్, జ్ ఏషాం సమాహారం' గ్క్జ్. కకారపూర్వమందున్న 'గ'కారానికి 'ఖరిచ' అనే సూత్రంచే చర్త్వంచే కకారమాదేశమై క్క్ఙితి అని ఔతుంది. గ్క్జ్ ఇత్ యస్య క్క్ఙితి అని ఏర్పడింది. క్క్ఙితి అనేది నిమిత్త సప్తమి గ్క్జ్ అనేవి ఇద్వర్ణాలుగా ఉన్న ప్రత్యయాల్ని నిమిత్తంగా చేసుకొని 'ఇకః' అనే షష్ఠ్యంత పదంతో విధింపబడే గుణవృద్ధులు రావని వివరించారు. జిధాతువుపై "గ్లాజిస్థశ్చగ్స్నుః" అనే సూత్రంతో 'గ్స్ను' ప్రత్యయం వస్తుంది. దీనిలో గకారమిత్తై లోపించగా జి + స్ను, ఏర్పడ్డాక, 'సార్వధాతుకార్ధ ధాతుకయోః' అనే సూత్రంతో 'జి'లోని ఇకారానికి గుణం ప్రాప్తిస్తుంది. పరంగా ఉన్న 'గ్స్ను' ప్రత్యయం 'గిత్తు' కావడం వల్ల తన్నిమిత్తమైన గుణం ఈ సూత్రంతో నిషేధింపబడింది. ఉదా : జిష్ణుః, భూష్ణుః.

గిత్, కిత్, జిత్ ప్రత్యయాలు పరమైనపుడు గుణవృద్ధులు రావు అని చెప్పినట్లయితే భిన్న భిన్న మొదలైన 'క్త' ప్రత్యయాంతరూపాల్లో గుణనిషేధం రాదు. ఛిద్ + త భిద్ + త అనే చోట్ల గుణం రావాల్సిన ఇక్(ఇ) వర్ణానికి కిత్తైన ప్రత్యయం అవ్యవహితపరంగా లేనందువల్ల (దకారంతో వ్యవధానమున్నది కనుక) గుణనిషేధం రాకుండేది. కనుక "క్జితి అనే చోట పరసప్తమి కాకుండా నిమిత్తసప్తమియే వస్తుందని, దానివల్ల బిన్నః ఏర్పడిందని వివరణ. అలాగే 'చినుతః' పదంలో 'అపిత్ సార్వధాతుకం జిద్వత్' అనే సూత్రంతో పకారేత్కాం కాని (పకారం ఇత్తుగా లేని) సార్వధాతుకం జిత్తులాగా అవుతుంది. తస్, థి మొదలైన అపిత్తులు కావడం వల్ల అవి ప్రథమ పురుష ద్వివచన రూపంలో పరమందున్న తస్ ప్రత్యయం అపిత్ ప్రత్యయం కావడం వల్ల జిద్వత్తు. కనుక 'క్జితిచ' అను సూత్రంతో గుణనిషేధం రావడం వల్ల చినుతస్ = చినుతః అని ఏర్పడిందని వీరి వివరణ ఇచ్చారు. తర్వాత మూలంలో వృత్తిలో 'ఇకఇత్యేవ-కామయతే' అని ఉంది. దానికి అనువాదంలో ఇగ్లక్షణాలైన గుణవృద్ధులు రావు అనడం వల్ల ఇకః అనే పదంతో విధింపబడిన గుణవృద్ధులకే దీనితో నిషేధం. కాబట్టి 'కామయతే' అనే రూపంలో వృద్ధినిషేధం రాదు. కమ్ అనే ధాతువుపై "కమేర్ణిజ్" (3.1.30) అనే సూత్రంతో ణిజ్ ప్రత్యయం (ఇ), "అతఉపధాయాః" (7.2.116) అనే సూత్రంతో వృద్ధిసంధి జరిగి కామి + అ + తే, రాగా కామయతే అని ఏర్పడింది. ఇక్కడ కమ్ ధాతువుకు పరమందున్న ణిజ్ జిత్తైనా ఇక్కడ వచ్చే వృద్ధి ఇక్కుకు కాదు. ఈ సూత్ర నిషేధం 'కామయతే' ఉదాహరణలో ప్రవర్తించదు అని చక్కగా వివరణ ఇచ్చారు. ఇంకా ఇలాగా అవ్యయీభావ సమాస ప్రకరణంలో అవ్యయం, విభక్తి అనే సూత్రానువాదంలో, చక్కని వివరణలతో వీరు సామాన్య పాఠకుణ్ణి కూడా దృష్టిలో పెట్టుకొని అనువాదం చేశారు. గురువే ప్రత్యక్షంగా శిష్యుని ముందట నిలబడి పాఠాలు బోధించినట్లు సులువుగా అర్థం చేసుకొనేలా వివరణలతో ఉదాహరణలతో అనువాదం సాగిందని చెప్పడంలో అతిశయోక్తి ఏమీ లేదు. అంతటి గొప్ప అష్టాధ్యాయి అనువాదంను గురించి ఒక పత్రంలో అందించడం అంటే కొండను అద్దమందు చూపినట్లు అవుతుంది. శాస్త్రాలకు, పైగా వ్యాకరణ శాస్త్ర చర్చలు అంటే సమయమే (రాత్రి, పగలు) తెలియదు, సరిపోదు. కాబట్టి అపరపాణినిగా పేరొందిన మహామహోపాధ్యాయ ఆచార్య రవ్వా శ్రీహరి గారి అనువాదంపై మాట్లాడగలిగే సాహసం చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

డాక్టర్ బాసెట్టి లత
అసోసియేట్ ప్రొఫెసర్, ఫోన్ : 96662 41858

## బహుమానం

**మిసిమి** అశ్వినీకుమార్ గారి ప్రేమ, ఆప్యాయతలు 'తైలధారల' వంటివి. అవిచ్ఛిన్నమైన ఆ ధార ఎన్నో నూతన సృజనలకు జీవం పోసింది. అటువంటి ధారల్లో నేనూ తడిసిముద్దయ్యాను. ఫలితంగా రసజ్ఞులైన పాఠకుల అభిమాన మాలికలను అందుకున్నాను, రాష్ట్రపతి పురస్కారాన్ని కూడా పొందగలిగాను.

2021లో ప్రచురించిన '**మిసిమి**' వ్యాసాలకుగాను 2023లో నాకు జాతీయ చలనచిత్ర విమర్శక పురస్కారాన్ని ప్రకటించినప్పుడు హైద్రాబాదు 'సత్కళాభారతి' వారు ఏర్పాటు చేసిన నా సన్మానసభకు అశ్వినీకుమార్‌గారు ఓ విశేష ప్రతిపాదనా వరాన్ని మోసుకు వచ్చారు. ఆయన ఎంతో ఆత్మీయంగా మాట్లాడుతూ సినిమా పాటలకు బలమైన పునాదిగా నిలచిన లలితగీతాల విలువలను కూడా ఈ తరానికి, ఏ తరానికైనా తెలియాల్సి వుంది కనుక లలిత గీతాల విశ్లేషణ కూడా రాస్తే బాగుంటుందని తన మనోభావాన్ని అందమైన మాటల్లో చెప్పారు. ఆయన ఏది చెప్పినా రాసినట్లుంటుంది, ఏది రాసినా చెప్పినట్లుంటుంది. సినిమా పాటలకున్న 'ఫాలోయింగ్' లలితగీతాలకు అంతగా ఉండదు గదా, అంత గొప్పగా ప్రజల్లోకి చొచ్చుకుపోదేమో అని కొద్దిగా జంకాను వేదికమీద ఉన్న పెద్దలంతా అశ్వినీకుమార్ గారి ప్రతిపాదనను బలపరుస్తూ, అందుకు తగిన సహకారమందిస్తామని భరోసా ఇచ్చారు. మరునాటినుండి ఈ సంగీతరచనా యజ్ఞానికి ఏర్పాట్లు మొదలుపెట్టాను. అప్పుడప్పుడు ఎ.కె గారి ప్రశ్నలు కొక్కాల్లా నామీద దాడిచేస్తూనే ఉన్నాయి. సినిమా పాటల వివరాలు లభించినంత సులభంగా లలితగీతాలు లభించవు. అలనాటి మహానుభావులను, వారి వారసులను పట్టుకోవాలి. ఈ వరసలో గొప్ప అనుభవశాలియైన ప్రముఖ కళాకారులు కలగా కృష్ణమోహన్‌గారు నాకు ఎంతో అండదండగా నిలిచారు. మధ్యమధ్య ఎదుర్కొనే అనారోగ్య అవాంతరాల దృష్ట్యా ఎన్ని పాటలు నాకు అందుబాటులోకి వస్తాయో వాటినే విశ్లేషించాలని తీర్మానించుకున్నాను. నేను సిద్ధం చేసుకున్న జాబితాలో 200కు పైగానే ఉన్నాయి. కాని అందులో కొన్ని మాత్రమే అన్ని వివరాలతో లభించాయి. వాటినే తీసుకుని విశ్లేషించాను. క్రొత్త సంవత్సరంలో దీన్ని ప్రారంభించాలన్న అశ్వినీకుమార్ గారి సంకల్పాన్ని నెరవేర్చగలిగాననే సంతోషాన్ని పొందాను. అనుకున్న అన్ని పాటలను రచనాపరంగా ముగించాను. వాటిని డి.టి.పి చేసే పనిలో ఉన్నాను. ఓ వారం రోజులలో ఆ పని కూడా పూర్తవుతుంది. వదాన్యులైన పాఠకుల సహకారం అందితే దీన్ని ఒక పుస్తకంగా వేయాలనుంది.

శుభంగా 2025 జనవరి నుంచే ఈ వ్యాసపరంపరను ధారావాహికంగా ప్రచురిస్తున్న అశ్వినీకుమార్ గారికి ఎన్ని ధన్యవాదాలు చెల్లించుకున్నా తీరేవి కావు. 2025 జనవరి సంచికలో అశ్వినీకుమార్ గారి "అమెరికన్ ఈగల్, అయ్యంగారి హంసలు" వ్యాసాలను చదువుతున్నప్పుడు వ్యాసాల్లాగా అనిపించలేదు. చక్కని కథలను చదువుతున్న అనుభూతి కలిగింది. ఆయన రచనాశైలిలో 'కథనశైలి' అద్భుతమైన సమ్మోహనవిద్య. అక్షరం మీదనుండి కళ్లు తిప్పుకోనివ్వదు. శంకరంబాడి సుందరాచారి గారి గురించి మరికొన్ని విశేష సంగతులను ప్రస్తావించడం ఎంతో సమంజసంగా ఉంది. 'మహారాణి మంగమ్మ' వ్యాసాన్ని అందించిన సుధారాణిగారు బహుధా ప్రశంసనీయులు. ఈ వ్యాసాన్ని చదవాగానే ఆ మంగమ్మగారి చరిత్రను 'పద్యనాటకం'గా రాద్దామా అనే ఆలోచన వచ్చింది. బోయిభీమన్నగారి పరిచయవ్యాసం ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంది. మధుజ్యోతి గారికి అభినందనలు. 'రాజ్యాంగ శాసనసభ చర్చ' వ్యాసం క్లుప్తంగా సాగినా ఎన్నో విశేషాలను వెలువరించింది. సాయిప్రసాద్ గారికి ధన్యవాదాలు. మిగతా పత్రికలలో కానరాని వైవిధ్యవిశేషం **మిసిమి**లో అట్టమీది, లోపలి చిత్రాలు, చిత్రకళకు **మిసిమి** చేస్తున్న అపూర్వ సేవ ఇది. అయితే, ఒక చిన్న సవరణను సూచించాల్సి వుంది. ముఖచిత్రం 'ఆదిత్యుడు'లో చిత్రీకరణపరంగా అంతా అందంగానే ఉంది. కాని, ఏడు గుర్రాల అమరికలో ఒక క్రమపద్ధతి సరిగా కుదరలేదనిపిస్తున్నది. రెండు ప్రక్కలా మూడేసి గుర్రాలను, మధ్యలో ఒక గుర్రాన్ని చిత్రిస్తే ఇంకా ఎంతో బాగుంటుందని తోచింది. అట్లాగే, రథాన్ని సూర్యుడే నడుపుతున్నట్లుగా చిత్రించారు. కాని సూర్యునికి 'అసూరుడు' అనే కాళ్లు లేని వ్యక్తి రథసారథిగా ఉంటాడని మన పురాణాలు చెబుతున్నాయి. అసూరుడు పూర్తిగా ఎదగకుండానే గ్రుడ్డులో నుండి పుట్టిన వినత కొడుకు. చిత్రంలో సూర్యుని వెనుక ఇంకెవరో నలుగురిని అనవసరంగా చిత్రించారని తోస్తున్నది. మరి ఈ సంచికలోని ఈ నాలుగు చిత్రాలను చిత్రించిన అజ్ఞాత కళాకారులకు అనేక ప్రణామాలు.

---

*డా. ఎమ్. పురుషోత్తమాచార్య, (జాతీయ పురస్కార గ్రహీత) నల్లగొండ. ఫోన్ : 939 661 1905.*

# సమీర పద్య తారావళి

**– ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి**

**పరిచితుండైన పవనుని చరిత కొంత**
**అంతు చిక్కని యనిలుని సుంత జేర్చి**
**సంకలించిన కృతి ఇద్ది అంకితమ్ము**
**ప్రాణవాయువు సమకూర్చు స్పర్శునునకు.**

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారి అద్భుత సృజనశక్తి నుండి అక్షరరూపమై జాలువారిన తారావళులలో ఏడవది, పంచభూత తారావళులలో అయిదవది సమీర వృత్త తారావళి. అంతు చిక్కని అనిలుని వృత్తాంతాన్ని కొంత జోడించి మనకు తెలిసిన పవనుని చరితను ప్రాణవాయువు సమకూర్చే సమీరునికే అంకితం కావించినారు. తెలుగు తల్లిపై భక్తిభావం, తెలుగు గడ్డపై మమకారం మెండుగా, దండిగా గుండె నిండిన సమున్నత విద్యాధికులు, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు. సనాతన, ఆధునికతలు సంగమించిన పాండితీమూర్తులు.

వృత్తిరీత్యా భౌతికశాస్త్ర పరిశోధకాచార్యులుగా అసమానకీర్తి ప్రతిష్ఠల నార్జించిన విద్వన్మూర్తి. ప్రవృత్తిరీత్యా తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలపై చెరగని ప్రభావ ముద్రవేసిన సారస్వతద్రష్ట, సాహితీ స్రష్ట, విమర్శనచణులు. జ్ఞానస్వరూపిణి అయిన నలువరాణికి పంచభూత తత్త్వాలను ఆవిష్కరించిన పద్యతారావళులను కంఠ మాలికలుగా అలంకరించిన వాగ్దేవీ సమర్చకులు. నిరంతరాధ్యయనశీలత, సంస్కృతాంధ్రసాహిత్య రసజ్ఞత ఫలవంతమై అనునిత్య కవిత్వ తపోవిభూతినందిన అంతశ్చరయోగి. 'సుగుణాఢ్య శతకం'లో ఆచార్యులవారు పేర్కొన్న ఒక విశిష్ట గుణం వీరికి స్వయంగా అన్వయిస్తుంది.

**"నిశ్చిత సంయమీంద్రులు వినీతులు గాంచు ననూనసిద్ధినే దుశ్చరసాధనల్ గొనక దూకొను భావరసప్రభా మనో నిశ్చలతన్ కవీంద్రు దనునిత్య కవిత్వ తపోవిభూతి నం తశ్చరయోగసంస్థితిని తాదృశముల్ సుగుణాఢ్యవర్తనల్** –5ప

నిరంతర కవిత్వసాధనే తపోదీక్షగా చేపట్టి అంతర్ముఖులై రససిద్ధినందినవారు అప్పాజోస్యులవారు. ఆధునికయుగంలో తుమ్మల, కరుణశ్రీ, జాషువా, మధునాపంతుల వలె ఛందోబద్ధమైన పద్యాన్ని వాహికగా స్వీకరించి పరమరమణీయమైన కావ్యరత్నాలను అందించిన కవిత్వ తపోవిభూతినందినవారు. పంచభూతాత్మకమైన ప్రకృతిని పరమాత్మయొక్క విరాట్ స్వరూపంగా వైదిక ఋషులు ప్రస్తుతించారు.

**"అగ్నిర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ**
**దిశశ్శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః**
**పద్భ్యాం భూమిరేష సర్వాంతరాత్మా"**
**– బృహదారణ్యకోపనిషత్తు**

విరాట్పురుషునికి అగ్ని శిరస్సుగా, చంద్రసూర్యులు నేత్రాలుగా, దిశలు శ్రవణాలుగా, వేదాలు వాక్కులుగా, భూమి పాదాలుగా ఏర్పడినవి. పరమాత్మ సర్వాంతర్యామి. పరమాత్మ స్వరూపమైన ప్రకృతి దర్శనం ద్వారా మహర్షులు తాత్త్వికచింతన కావించినారు. అగ్నిసూక్తం, ఇంద్రసూక్తం, నదీసూక్తం, ఉషస్సూక్తం, వాతసూక్తం ఇత్యాది వేద భాగాలలో ప్రకృతిదేవతలను, పంచభూతాలను ఆరాధించినారు.

పంచభూతాలైన పృథివ్యాపస్తేజోవాయ్వాకాశాల ఉనికిని, విశిష్టతను, వైభవాన్ని ఇతివృత్తంగా స్వీకరించి రచింపబడిన కావ్యాలు తెలుగు సాహిత్యంలో మృగ్యం. 'ఋతుసంహారం' పేరుతో షడృతువుల వర్ణనలు కావ్యరూపం సంతరించుకున్నాయి. ప్రబంధాలలో సాహిత్య ప్రేమికులను అలరించాయి. ప్రకృతి వర్ణనల రూపంలో

కవులు భగవదారాధన కావించినారు. అవి ఆయా కవుల కల్పనాచాతురికి, వర్ణనాకౌశలానికి నిలువెత్తు నిదర్శనాలై నిలిచాయి. పంచభూతాల చుట్టూ అల్లుకున్న ఆధ్యాత్మిక, తాత్త్విక, భౌతికాంశాలను సూత్రరూపంలో వేదాలు అభివర్ణించగా తాత్త్వికతతో పాటు వైజ్ఞానికతను, మరొకవంక పద్యనిర్మాణ కళానైపుణిని ఏకసూత్రంలో అనుసంధానించి పద్యతారావళులుగా ప్రకృతిమాతకు సమర్చన కావించినవారు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు. తెలుగు సాహిత్యచరిత్రలో ఇది ఒక విలక్షణమైన సన్నివేశం, సందర్భం. ఆచార్య అప్పాజోస్యులవారు మౌలికంగా ప్రకృతి ఆరాధకులు. మానవజీవన పరమార్థాన్వేషకులు. విశ్వాంతరాళంలోని సూర్యాది గ్రహ సంబంధమైన వైచిత్ర్యాలు, ఖగోళ శాస్త్రీయాంశాలపై పరిశోధనా పూర్వకమైన విజ్ఞాన సముపార్జన కావించిన శాస్త్రవేత్త. మరొకవంక సంస్కృతాంధ్ర సాహిత్య పారావార పారంగతులు. అపూర్వ పద్య నిర్మాణ శిల్ప మర్మజ్ఞతను కరతలామలకం కావించుకున్న ధీధిషణులు. త్రిముఖప్రసిద్ధమైన వీరి ప్రజ్ఞ తారావళి కావ్యరూపాలను ధరించి సాహిత్యావరణంలో తళుకులు విరజిమ్మింది.

సాహిత్యంలో వస్తుకళ, భావకళ, రచనాకళ అనే మూడు కళలు ప్రధానాంగాలు. కళ అంటే హృదయ పూర్వకంగా, ఆచరణీయమైన రీతిలో నిర్వర్తింపబడే విధి లేక ఏ పని అయినా అది కళ. అంతరంగం సాక్షిగా అంతరంగం నుండి ఆకృతి ధరించేది కళ. కొందరికి అతిథిపూజ కళ. కొందరికి గృహాలంకరణ కళ. కొందరికి సంగీత, సాహిత్యసేవ కళ. అదే విధంగా కావ్యరచనకు ఉపక్రమించిన కవి ఉదాత్తమైన వస్తువును ఎన్నుకోవటం వస్తుకళ. స్వీకృత వస్తువునకు కావ్యత్వశోభను అద్ది రససిద్ధిని కలిగించటం భావకళ. రచనా సంవిధానంలో, శైలి శిల్పంలో కవి చూపిన ప్రతిభయే రచనాకళ. అప్పాజోస్యుల వారి కావ్యాలలో ఈ మూడుకళలు మూర్తీభవించినాయి.

దివాకర వృత్త తారావళి 'ప్రత్యక్ష భగవానుడైన దివాకరుని వైభవాన్ని ఆవిష్కరించినది. 'మహాదేవీ మత్తేభ తారావళి' పరమేశ్వరీ రూప, గుణతత్త్వాలను అనుభూతి ప్రధానంగా అభివర్ణించిన సృజన. 'పావక, సుజల వృత్త తారావళు'లు విశ్వగమనంలో అగ్ని ప్రాథమ్యాన్ని, జలప్రాధాన్యాన్ని నిరూపించినవి. 'వసుంధరా, అంతరిక్ష వృత్త తారావళులు జీవి మనుగడలో ద్యావాపృథ్వుల దివ్యతత్త్వాన్ని రసవత్తరంగా చిత్రించిన కావ్యాలు. ఇక 'సమీర వృత్త తారావళి' జగతీక్షేమంకరుడైన అనిలుని విశిష్టతను హృదయాలకు స్పర్శింపచేసిన కావ్యతార.

**"ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ॥**

**పృథివ్యా ఓషధయః। ఓషధిభ్యః అన్నమ్। అన్నాద్ రేతః। రేతసః పురుషః। స వా ఏష పురుషః అన్నరసమయః"**–అన్న తైత్తిరీయోప నిషన్మంత్రాను సారం పంచభూతాలలో అంతరిక్షం నుండి ప్రప్రథమంగా విస్తరించినది సమీరమే.

పంచభూతాలు మహేశ్వరస్వరూపాలు. ఈశ్వరుని అష్టమూర్తులలో పంచభూతాలు మొదటివి. జీవికి ప్రాణాధారమైన వాయువు శబ్ద, స్పర్శగుణాత్మకం. వాయు ప్రత్యేకగుణమైన స్పర్శ మానవునిలో చర్మేంద్రియగుణంగా ఇమిడిపోయింది. ప్రాణధాతువైన వాయువు విశ్వేదేవతగా కీర్తింపబడినది.

**"విశ్వే దేవాః మరుతః ఇంద్రః అస్మాన్**
**అస్మిన్ ద్వితీయే సవనే న జహ్యుః**
**ఆయుష్మంతః ప్రియం ఏషాం వదంతః**
**వయం దేవానాం సుమతౌ స్యామ"**

– అథర్వవేదం. 6 కాండ. 5 అనువాకం 47 సూక్తం. 2 మంత్రం

విశ్వేదేవతలైన మరుత్తులు, వారి అధిపతి ఇంద్రుడు మధ్యాహ్న సవనానికి అధిపతులు. ఈ దేవతలకు ప్రియమైన, నుతశాస్త్రాత్మకమైన వాక్యాన్ని ఉచ్చరిస్తూ మేము వారి అనుగ్రహం వలన ఆయుష్మంతులమై ఆ దేవతల అనుగ్రహాత్మకమైన బుద్ధికి పాత్రులమగుదుము గాక ! అని పై మంత్రార్థం.

వాయుదేవుని వలన జీవులు ఆయుష్మంతులు కాగలరనే అంశాన్ని ఆచార్యులవారు ఎంత కవితాత్మకంగా అభివ్యక్తీకరించారో పరిశీలిస్తే వారి కవిత్వకళాసౌరభం ఎంత కమనీయమైనదో సుస్పష్టం అవుతుంది.

**పవనున్ దైవముగా పురాతనులు సంభావించి కైమోడ్చి యీ భువి సర్వంబు విభిన్న జీవ విలసన్మూర్తమ్ము గావించు ధా**

**తు వదాన్యంబులు పంచభూతములలోన్ స్తుత్యస్థితున్ జేసి రీ**
**శివతాతిన్ బలశాలి నున్మిషిత ధీశ్రీరాజితుల్ సంయముల్.**

"శివతాతి" పదానికి శుభంకరుడు, శివంకరుడు, పరమేశ్వరుడని అర్థాలు. పరమేశ్వరుని స్వరూపమే వాయువనే ధ్వని ఈ పద్యంలోని సొగసు. "పురాతన సంయములు, ఉన్మిషితధీశ్రీరాజితులు" – అద్భుతమైన విశేషణ ప్రయోగాలు. పవనుని దైవంగా పూజించేది సామాన్యులు కాదు. ధీశ్రీరాజితులు.

**"ఉపమా కాళిదాసస్య భారవే రర్థగౌరవమ్**
**దండినః పదలాలిత్యం మాఘే సన్తి త్రయో గుణాః"**

కాళిదాసాది మహాకవుల కవితాసౌందర్యాన్ని అభినుతించే ఆభాణకం ఇది. ఈ ఆభాణకంలోని త్రిగుణ స్వారస్యమూ అప్పాజోస్యుల వారి కవిత్వంలో పరిమళిస్తుంది.

**అరయన్ పొంకముగా పొరల్ పొరలునై వ్యాపించి నీరంధ్ర వి**
**స్తరమై కప్పుచు సంగరక్షకత వాతశ్రేణి రూపంబునన్**
**ధర వస్త్రాభముగన్ ఖరాంశు కిరణాధ్వవ్యక్త దీప్తోగ్ర దు**
**ర్భరతన్ లోగొని తేర్చు జీవుల నవిశ్రాంతమ్ముగా గాడుపుల్.**

భూమి ఉపరితలం నుండి ఎత్తులో ఉన్న దూరం ఆధారంగా పొరలు పొరలుగా ప్రకృతిలో గాలి వ్యాపించి ఉంటుంది. నేలపై నుండి పైకి ప్రయాణిస్తున్న కొద్దీ దాని సాంద్రత తగ్గుతూ ఉంటుంది. పొరలు పొరలుగా ఉన్న ఈ వాతశ్రేణి సూర్యుని తీవ్ర కిరణదుర్భరతను లోగొని భూమిని నిరంతరం రక్షిస్తూ ఉంటుంది. వస్త్రం మనిషి శరీరాన్ని కప్పి శీతోష్ణాలనుండి ఏ విధంగా రక్షిస్తుందో ఆ విధంగా వాయుశ్రేణి సమస్త భూమండలాన్ని రక్షిస్తుంది. శాస్త్రపరిజ్ఞానశూన్యులైన అతిసాధారణస్థాయి వ్యక్తులకు సైతం ఒక సుస్పష్టమైన రూపం ప్రత్యక్షం కావించే ఉపమాలంకారం ఈ పద్యసౌధానికి ఎత్తిన పతాకగా రెపరెపలాడింది. తెలుగులో నన్నయభట్టారకుని రచన శబ్దగుణ ప్రధానమైనది. తిక్కన సోమయాజిది అర్థగుణప్రధానమైన రచన. శబ్దగుణప్రధానమైన రచన చక్కగా చిక్కగా అల్లిన మల్లెపూదండలా సాగుతూ అర్థం సుగంధంలా వ్యాపిస్తుంది. అర్థగుణప్రధానమైన రచనలో శబ్దం పానకంలో తీపిలా ఉంటుంది. తీయనైన చక్కెర నీటిలో కరిగిపోయి పానకానికి తన గుణాన్ని సమర్పించి తన ఆకృతిని కోల్పోతుంది. తిక్కన రచనలో శబ్దాలు అర్థసమర్పణం చేసి అర్థంలో తాదాత్మ్యం చెందుతాయి. శ్రావ్యమైన శబ్దంద్వారా రమ్యమైన అర్థాన్ని హృద్యమైన అనుభూతిగా మలచే ప్రక్రియే కదా కవిత్వం.

**భువి ముప్పాళులు మించి సింధువు మహామూర్తిత్వమున్ దాల్చి యం**
**దవగాహాద్భుత జీవరాశికిని రక్షారామమై పర్వగన్**
**పవనుం దుర్వర కూర్ధ్వసాగరమునాన్ వర్తించు సర్వత్ర తా**
**నవికల్పంబగు ప్రాణశక్తి నొసగున్ వ్యాపించి సర్వంసహన్.**

శబ్దార్థాల శక్తిని స్వాయత్తం కావించుకున్న పద్య నక్షత్రం ఇది. భూమిపై మూడు వంతుల భాగం జలం సాగరరూపంలో ఆవరించి ఉంటుంది. సముద్రగర్భంలోని జీవరాశికి రక్షగా నిలిచి ఉంటుంది. అదే విధంగా పవనుడు పుడమికి ఉపరితలంలో వ్యాపిస్తూ ఊర్ధ్వ సాగరమో అన్నట్లు సర్వత్ర అవికల్పమైన ప్రాణశక్తిని జీవులకు ప్రసాదిస్తాడు. ఈ పద్యంలోని శబ్దశక్తి మునుముందుగా చెవులకు ఇంపుగా వినిపిస్తుంది. అనంతరం శబ్దం వెనుక దాగిన అర్థశక్తి రసలుబ్ధ హృదయాన్ని ఆకర్షిస్తుంది. అంతిమంగా నేలపైనున్న సాగరమూ, భూఉపరితలంపై వ్యాపించి జీవకోటిని సర్వత్ర సంరక్షిస్తున్న ఊర్ధ్వసాగరమూ సహృదయుని మనోనేత్రం ముందు చిత్రమై నిలుస్తుంది. విద్వత్కవి, శబ్దార్థ సంయోజనశిల్పి అయిన ఆచార్య అప్పాజోస్యులవారి కవితాత్మ ఇటువంటిది.

**ద్యుమణిద్యుత్తులు నీటి యావిరుల నుత్పాదించి మేఘావళ ల్**
**సమకట్టించు ఘనోష్ణవాయువుల నభ్రాట్టున్ మహావర్ష రూ**
**పమునన్ ధాత్రికి సొంపు గూర్ప పునరావర్తించుచుండున్, సమీ**
**రము తీక్ష్ణాంశు సహాయుడై సుజలచక్రం బిట్లు సాగించెడున్.**

వర్షం పుడమిని సస్యశ్యామలం కావించి హరిత వర్ణశోభలతో తీర్చిదిద్ది సమస్త జీవులకు ఆహారాన్ని సమకూర్చుతుంది. తీక్ష్ణాంశుడైన సూర్యుని ప్రజ్వలనతో భువిపై సాగరజలాలు ఆహుతి అయి నింగిలో మేఘ రూపాన్ని సంతరించుకుంటాయి. అక్కడ స్వచ్ఛత నందిన జలాలు వర్షరూపంలో భూమాతను అభిషేకిస్తాయి. ఈ ప్రక్రియ అనాదిగా సృష్టి ప్రారంభం నుండి సాగుతున్న మహాయజ్ఞం. ఈ ప్రక్రియలో సమీరుడే సూత్రధారి అనే సూక్ష్మాంశాన్ని చక్కని మత్తేభవృత్తంలో వినిపించారు కవి.

అథర్వవేదమంత్రద్రష్టలైన మహర్షులు –

**"ఉదప్రుతో మరుతస్తాం ఇయర్త**
**వృష్టిర్యా విశ్వా నివతస్పృణాతి**
**ఏజాతి గ్లహా కన్యేవ తున్నైరుం**
**తున్దానా పత్యేవ జాయా"**

– అథర్వవేదం. 6 కాండ. 3 అనువాకం. 22 సూక్తం. 3 మంత్రం అని మరుత్తులను ప్రస్తుతించినారు.

ఓ మరుత్తులారా! ఉదకప్రేరకములైన మేఘములను ప్రేరేపించండి. ఏ మేఘాలకు సంబంధించిన వృష్టి వ్రీహి, యవాదిసస్యములను తృప్తిపరచునో, ఆ వృష్టిని ప్రేరేపించండి. దారిద్ర్యాదులతో పీడితురాలైన కన్య మాతాపితరులను కంపింపచేసినట్లుగా భయోత్పాదకమైన వృష్టి కొఱకు మేఘములను కంపింపచేయండి. వెళ్ళుతున్న మేఘాన్ని పొంది ధ్వనిస్తూ గమన శీలమైన ఉదకాన్ని కురిపిస్తూ పతిసహిత అయిన సతి వలె అది ప్రవర్తిల్లుతుంది – అని పై మంత్రార్థం. అదే సందర్భంలో

**"ఊర్జంచ తత్ర సుమతిం చ పిన్వథ**
**యత్రా నరో మరుతః సిఞ్చథా మధు"**

–3 అనువాకం. 22 సూక్తం. 2 మంత్రం.




నాయకులైన ఓ మరుత్తులారా! మీరు ఎక్కడైతే మధురసాన్ని (వర్షపు నీటిని) సేచనం చేస్తారో అక్కడ బలవర్ధకమైన అన్నాన్ని, సుబుద్ధిని ఇచ్చి ప్రజలను పోషించుదురు– అని కూడా మహర్షులు వాయువును స్తుతించి ప్రసన్నం కావించుకొనినారు. సనాతన అభిభాషణమూ, శాస్త్రీయ నేపథ్యమూ సమ్యగనుసంధానం పొందిన పై పద్యం కవిగారి పద్యవిద్యకు నికషోపలం.

రాత్రివేళల్లో ఆరుబయట ప్రశాంతంగా శయనించి ఆకాశం వైపు చూస్తే తెల్లని నక్షత్రాలు నీలిరంగు ఆకాశవస్త్రంపై వివిధ రూపాలలో అద్దబడినట్లుగా కాన్పిస్తూ మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తాయి. కవులు తమ కావ్యాలలో శృంగార రసోద్దీపన విభావాలుగా చల్లని పిల్లగాలులను, నిర్మలమైన ఆకాశాన్నీ, వెన్నెలను, నక్షత్రాలను వర్ణించటం పరిపాటి. కొన్ని నక్షత్రాలు నింగి నుండి నేలకు రాలుతున్న దృశ్యాలు సుపరిచితమే. అవి నక్షత్రాలు కావు, ఉల్కలు (Meteors) అని ఖగోళశాస్త్రం నిర్ధారించిన సత్యం.

సూర్యాదిగ్రహాలు ఏర్పడిన తొలిరోజుల్లో గ్రహాల ఆకర్షణకు లోనుకాని కొన్ని వ్యర్థ ద్రవ్యలేశాలు, శిలలు, ధూళికణాలు గ్రహాలతోపాటు సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటాయి. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ ఈ శకలాలు ఉన్న ప్రాంతానికి చేరుకున్నప్పుడు భూమ్యాకర్షణ శక్తి వలన కొన్ని శకలాలు భూవాతావరణంలోనికి ప్రవేశిస్తాయి. ఆకాశం నుండి నిప్పులు కక్కుతూ గంటకు సుమారు 30వేల కిలోమీటర్ల వేగంతో ఇవి భూమిని ఢీకొంటాయి. ఇవి చాలావరకు భూమ్యాకాశాల మధ్యభాగంలోనే ఆవిరి అయిపోతాయి. ఇవి ఏ మాత్రమూ హానిచేయవు. వాటి చుట్టూ చిన్న నీటిబిందువులు ఏర్పడి వర్షం కురవటానికి సహాయపడతాయి. ఈ అంశాలు ఇక్కడ ఎందుకు ప్రస్తావించవలసివచ్చింది? నేలరాలే ఉల్కలను నడిమి భాగంలోనే మండించి దహించి వేసే ప్రక్రియకు ప్రేరకుడు సమీరుడు. వాయువు అగ్ని సఖుడు కదా.

పూర్తిగా వైజ్ఞానికత నిండిన ఈ ఖగోళ వాస్తవికతను అప్పాజోస్యుల వారు మనోహర దృశ్యంగా మలచి పద్యంలో బంధించి మనకు అందించారు.

**"రవిలోకగ్రహరాజి మధ్యమున వ్యర్థద్రవ్యలేశంబు**
**భువి వాతావరణంబు చొచ్చుకొనుచున్ పుంఖాను పుంఖంబులై**
**యవిరామంబుగ ముట్టడింప ప్రచురోల్కావృష్టులన్ తత్క్షణం**
**బవరోధించి దహించెదున్ పవను డుద్యత్ స్ఫాలనజ్వాలలన్.**

సంపూర్ణ అర్థగౌరవంతో మిరుమిట్లుగొల్పిన పద్యతార ఇది.

పంచభూతాలు పరస్పర సమన్వయంతో, సహకారంతో ప్రవర్తిల్లుతాయి. ఏ ఒక్కదానిని వేరుగా, ప్రత్యేకంగా భావింపననువుకాదు. సూర్యతాపం వలన సాగరజలాలు మేఘరూపాన్ని సంతరించుకుంటాయి. ఆ మేఘాలు

వర్షంగా కురిసి భూమికి పైరు పంటలను సమకూర్చుతాయి. జీవులకు ఆహారాన్ని ఏర్పరచుతాయి. ఈ విధానానికి సహస్ర కిరణుని వేడివెలుగులే మూలాధారాలు. అయితే ఆ దివాకరుని కాంతులకు కారకుడు సమీరుడే అని సాధారణ మానవుడు ఊహింపగలడా? అతి సూక్ష్మమైన శాస్త్రీయ నేపథ్యానికి శాస్త్రకవి ఆచార్య అప్పాజోస్యులవారు సరళమనోజ్ఞమైన పద్యరూపాన్నిచ్చి వివరించిన తీరు మిక్కిలి ప్రశంసనీయమైనది. శాస్త్రకవిగా తెలుగు సాహిత్య ప్రపంచంలో అద్వితీయమైన స్థానాన్ని అప్పాజోస్యులవారు సముపార్జించినారని పేర్కొనటం అతిశయోక్తికారు.

జలం కూడా వాయు రూపంలో ఉంటుంది. ఉదజని (హైడ్రోజన్) ప్రాణవాయువు (ఆక్సిజన్)ల సమ్మేళనమే జలం.



అప్పాజోస్యుల సత్యనారాయణ
ఎడమ ఉన్నది కోడూరి పుల్లారెడ్డి

**“జలమున్ గాలియు నగ్ని భూమి యనినన్ సామాన్య సంపత్తిగా**
**తలపన్ రాదవి జీవమంత్ర మయ విద్యాచుంచులు...”**
**సుజల వృత్త తారావళి.**

జలం, గాలి, అగ్ని, భూమి – ఇవి సామాన్య సంపదలు కావు. అవి జీవనం అనే మంత్ర మయమైన విద్యలకు నెలవు– అని ప్రతిపాదించిన తీరు ఆచార్యుల వారికే సాధ్యమైనది. అంతేకాదు –

**“అనలంబున్ పవనంబు నాత్మసములై యశ్రాంతమున్ నీడలై**
**యనుగుప్తంబుగ తోడు కూడగ ప్రచండాంశు ప్రభాకల్ప పా**
**వన మేఘోద్భవ నెంతు ...” (సుజల.2ప)**

భూగ్రహజీవులకు విశేష సంపత్తి అయిన పంచ భూతాలలో అగ్ని, వాయువు తోడుకూడగా ప్రచండాంశు వైన సూర్యకాంతులచే మేఘం వర్షిస్తుంది. ఈ అంశాన్ని మరింత విశ్లేషిస్తూ సూర్యకాంతికి అనిలుని శక్తియే మూలకందమని సుస్పష్టంగా సమీర వృత్త తారావళిలో కవి ఖగోళంలోని వైజ్ఞానిక విశేషాన్ని వివరించినారు. పాఠకులను ఆశ్చర్యచకితులను కావించినారు.

**“.. ఖరాంశుమండలా భ్యుదయ విశేష దీధితికి మూలము తానయి ప్రజ్వరిల్లెడున్”.**

**“వితతాకాశ మహాప్రపంచమున వైవిధ్య ప్రభల్ చిమ్ము మా**
**రుత సూక్ష్మాణు విభక్త శక్తిగణముల్ రూఢంబుగన్ తారకల్**
**ప్రతతాభీషువు సూర్యదేవరయు తారావర్మచైత్యంబులౌ**
**ప్రతి నక్షత్రపు దీప్తి మూలము నభఃప్రాణంబె యచ్చెర్వుగన్”**
**“శ్రీవిద్యుత్కణ విచ్ఛితిన్ సవిత్రు నర్చిష్మంతు గావించుచున్”**

వాయువును మానవుడు అత్యంత సహజంగా ఊపిరి పీల్చినంత సాధారణమైన వస్తువుగా భావించటం పరిపాటి. సమీర వృత్త తారావళిని ఆమూలాగ్రం అధ్యయనం చేసినట్లయితే ఆలోచనా పరిధి విస్తరిస్తుంది. శాస్త్రవిజ్ఞానజ్యోతి ప్రకాశిస్తుంది.

విజ్ఞానశాస్త్ర లక్ష్యం విజ్ఞాన సముపార్జనమే. కవిత్వం ఆనందంతో పాటు విజ్ఞానాన్ని సైతం ప్రసాదించ గల కళ. సంగీత, చిత్రలేఖన, శిల్పకళలు ప్రధానంగా ఆనంద ప్రదాయకాలు మాత్రమే. కవిత్వం సర్వశాస్త్రాలకు సారభూతమైన విజ్ఞానాన్ని పద్య రూపంలో అందిస్తుంది. ఈ కవిత్వ కళామర్మజ్ఞులైన ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు తెలుగువారికి అందించిన తారావళులు శాస్త్రరహస్యాలను, రసానుభూతిని కలిగిస్తూ కవిత్వ ప్రయోజనాన్ని సాకల్యంగా పరిపుష్టం చేస్తున్నాయి. మేధాసంపన్నుడైన మానవుడు ప్రకృతిశక్తులపట్ల, పంచభూతాలపట్ల, సనాతన ధార్మికాంశాలపట్ల వర్తింపవలసిన తీరుతెన్నులకు మార్గదర్శకసూత్రావళులు, రసవత్తరమైన కావ్య కళామర్మజ్ఞతకు నిదర్శనావళులు ఆచార్యులవారి పంచభూత తారావళులు.

**పరిచితుండైన పవనుని చరిత కొంత**
**అంతు చిక్కని అనిలుని సుంత జేర్చి**

సంకలించిన ఈ సమీర వృత్త తారావళిలోని ప్రతిపద్యశోభిత సౌందర్యమూ ఆస్వాదనీయమే.

ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి
9394113848

# ఇంగ్లీష్ రివియేరా

– డా. నిమ్మగడ్డ శేషగిరి రావు



ఇంగ్లీష్ రివియేరా

సముద్రంలో తేలియాడే వెన్న ముద్దలాంటి ఇంగ్లీషు దేశానికి తీర రేఖ ఏమి తక్కువ? కాకపోతే ఉత్తర ధృవానికి, ఆర్కిటిక్ సర్కిల్ కు చేరువలో ఉండే శీతల దేశం కాబట్టి సెప్టెంబరు చివరి అర్ధ భాగం నుండి మార్చ్ మొదటి అర్ధ భాగం వరకు ఇక్కడ చలి వణికిస్తుంది. వస్త్ర ధారణతో సహా జీవన విధానమంతా చలికి తగ్గట్టు మార్చుకోవాల్సిందే. ఇక అప్పుడు తీర రేఖ ఎంత ఉండి ఏమి లాభం? కాని ఇందుకేనేమో, చలి తక్కువగా ఉండే ఆరు నెలలు, అంటే మార్చ్ నెల మధ్య నుండి, సెప్టెంబర్ మధ్య వరకు ఈ దేశం ఉత్సవ వాతావరణంతో వెలిగి పోతుంది. మొదటిగా, తొలి చివుళ్ళు లేత ఎరుపులో పొటమరించటంతో, దేశం బద్ధకం వదిలించుకుని వేసవి సందడికి సన్నద్ధమవటం మొదలు పెడుతుంది. నవ నవలాడే నవ పత్ర హరిత హర్షావిష్కారాలు, మంచు స్నానాలతో పునీతమైన మరి కొన్ని వృక్షాల అతిశయం, పచ్చని పరకలమీద తుషార తునకల వజ్రపు మెరుపులతో వసంతం వెల్లి విరుస్తుంది. వసంతోత్సవ ఉత్సాహం ప్రజల మనసులలో క్రొత్త ఆశలు రేకెత్తిస్తుంది. రంగురంగుల పూలు తెస్తుంది. ఇదే వాతావరణం సంవత్సరం పొడుగునా ఉంటే ఇక్కడి ప్రజలను పట్టి ఉంచటం కష్టమేమోనని నాలాంటివారికి అనిపిస్తుంది.

ఈ కాలంలో, సూర్యుడి ప్రతాపం పెరిగిన కొద్దీ, సముద్ర తీర రేఖా ప్రాంతాలలో నిత్య సంబరం అంబరాన్నంటుతూ ఉంటుంది. ఎండాకాలం వారాంతాలలో సముద్ర తీరం వైపు సాగే రోడ్ల మీద కార్ల మీద చిన్న బోట్లు వేసుకుని, కార్ల నిండా పిల్లా జెల్లాతో సాగిపోయే వాళ్ళెందరో కనపడతారు. వెచ్చదనం, తేమ నిండిన గాలి కోసం సముద్ర తీరప్రాంతాలకు తరలి పోవటమనే సాంప్రదాయం ఇవ్వాల్టిది కాదు. బ్రిటిష్ వారితో సహా, మిగిలిన ఐరోపా సంపన్నులు ఆరోగ్య రీత్యా, నిత్య సముద్ర స్నానాలకోసం మధ్య ధరా తీరపు ఫ్రెంచ్ రివియేరాలో విడిది ఏర్పాటు చేసుకునే వారని చరిత్ర చెపుతోంది. 17 వ శతాబ్దంలో మొదలైన పారిశ్రామిక విప్లవ కాలంలో, బ్రిటిష్ సముద్ర తీరం, వేసవి విడిదిగా సామాన్యులకు అందుబాటులోకి వచ్చింది.

పారిశ్రామిక విప్లవంలో భాగంగా ఏర్పడిన రైలు రోడ్డు మార్గాలు, వంతెనల కట్టడాల వలన, బ్రిటిష్ సముద్ర తీర ప్రాంతానికి చేరుకోవటం సులభవటం కూడా ఇందుకు కారణమనుకోవచ్చు. తద్వారా బ్రిటన్ చుట్టూ ఉన్న సుదీర్ఘ తీర రేఖ వెంబడి ఎన్నో పట్టణాలు యాత్రీకులను ఆకర్షించుతూ, విస్తరించాయి. బ్రిటన్ ఒక చివర ఉన్న లాండ్స్ ఎండ్ నుండి ఉత్తరపు కొసన ఉన్న జాన్ ఓ గ్రోట్స్ వరకు 874 మైళ్ళ దూరం. అంతలోనే ఉత్తర దక్షిణ ప్రాంతాల మధ్య వాతావరణ వ్యత్యాసం చాలా ఎక్కువ. ఉత్తరానికి వెళ్ళే కొలది చలి ఎక్కువ. ఎన్నో పర్యావరణ కారణాల వలన, సముద్ర తీరం ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉంటుంది. కొన్ని చోట్ల బురదగా ఉంటే, కొన్ని చోట్ల గుండ్రటి గుండ్రాయిలతో నిండి ఉంటుంది. కొన్ని చోట్ల గులక రాళ్ళతోనూ, మరి కొన్ని చోట్ల రంగు రంగుల పూసల మాదిరిగా ఉన్న ఇసుక

ఉంటుంది. కొద్ది చోట్ల మాత్రమే, వేళ్ళ సందుల్లో నుండి జారి పోయే వెచ్చని స్వచ్ఛమైన ఇసుక కనపడుతుంది. పిల్లలకు, అటువంటి చోట్ల పిల్లలై పోయే పెద్దవాళ్ళకు సైకత శిఖరాలు, ప్రాకారాలు, కోటల నిర్మాణచాతుర్యాలను చాటుకోవటానికి ఈ ఇసుక నిండిన తీర ప్రాంతాలు రోజుల తరబడి చక్కని హాయిని అందిస్తాయి. మంచి వేసవి కాలంలో అక్కడికి వెళ్ళటం అందరూ ఎదురు చూసే తరుణం. అందునా అప్పుడే పిల్లలకు సెలవురోజులు కావటం చేత, తీర ప్రాంతంలో కుటుంబమంతా సేద తీరటం బ్రిటన్లో సాంప్రదాయంగా రూపుదిద్దుకుంది.

బ్రిటన్లో పుట్టి పెరిగిన నా సహోద్యోగులు చాలా మంది, వారి చిన్నతనంలో తీర ప్రాంతంలో వేసవి సెలవలు గడపటం గురించి ఉత్సాహంగా, ఉద్వేగంగా చెప్పుకోవటం నేను చాలా సార్లు వింటుంటాను. ఈ మధ్య, కోవిద్ కాలంలో నేను, యోర్క్ షైర్ లో ఉన్న క్లీవ్ లాండ్ వే నేషనల్ ట్రెయిల్ కు వెళ్ళినప్పుడు సాల్ట్ బర్న్ ఆన్ సీ, స్కార్ బరా, విట్ బీ, రాబిన్ హుడ్ బే మొదలైన ఎన్నో తీర పట్టణాలను చూశాను. ఇవన్నీ వివిధ కాలాల్లో చారిత్రాత్మకమైనవే. ఆ ప్రయాణంలోనే, స్థానిక బ్రిటిష్ కుటుంబాల లానే, ఒక మంచి తీర ప్రాంతానికి భార్యా పిల్లలతో కలసి ఎప్పుడైనా వెళ్ళాలనిపించింది.

ఒక 'మంచి' తీర ప్రాంతాన్ని విహార యాత్రకు ఎంపిక చేసుకోవటానికి ప్రాతిపదికలు ఎన్నో!! సాధారణంగా 'ఏళ్ళ తరబడి ఎక్కువ మంది గుమికూడే చోటు' చాలా మంచి ప్రదేశమనుకోవచ్చు. కాని ఈ ప్రాంతాలలో వసతి గృహాలన్నీ ఎంతో ముందే కేటాయించ బడిపోతాయి. ఇటువంటి చోట్ల వసతి చాలా ఖరీదుగా కూడ ఉంటుంది. సరే, బ్రిటన్‌లాంటి దేశాలలో, శెలవు కేంద్రాలకు వెళ్లాలనుకుని ఖరీదుకు వెరవటం, రోకట్లో తల పెట్టి రోకటి పోటుకు వెరవటం లాంటిదే అయినా, మన బడ్జట్ కు తగినట్టుగా పోవటం కూడ అవసరమే. చాలా సార్లు నిర్ణయం బడ్జెట్ కు, మనకు దొరికిన సమయానికి, ఆ ప్రాంత ప్రాశస్త్యాన్ని గురించి మనం విన్న దానికి మధ్యగా పోతుంది. కాని ఈ సారి మాత్రం నా వరకు నాకు మొదటి రెండూ ప్రాతిపదికలు కాలేదు.

ఇంగ్లాండ్‌లో 'డెవన్' అనే పేరు కొందరికి 'దేవలోకం' లా వినిపిస్తుంది. ముఖ్యంగా, వెచ్చటి ఎండ, మెత్తటి ఇసుక, 



బ్రిక్సామ్

నీలాకాశం ఉంటే చాలనుకునే వారికి. డెవన్, కార్న్ వాల్ రెండూ బ్రిటన్ కు నైరుతి మూలగా ఉంటాయి. ఇంగ్లీష్ ఛానెల్ తీర ప్రాంతం ఇది. వాతావరణం బాగున్న రోజు, కొన్ని చోట్ల ఇంగ్లీష్ ఛానెల్‌కు అవతలి వైపున ఉన్న ఫ్రెంచి తీరం కనపడుతుందంటారు. అంటే ఫ్రాన్స్ ఈ ప్రాంతానికి పొరుగు అన్న మాట. డెవన్, కార్న్ వాల్ రెండూ బ్రిటన్ లో స్థానిక పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన 84 కౌంటీలలో ఉన్నాయి. నైసర్గికంగా ఈ రెండూ ఆహ్లాదకరమైన ప్రాంతాలైనా, డెవన్ ముఖ్యంగా రెండు తీర ప్రాంతాలతో, వెచ్చని వాతావరణం, ఇంకా రకరకాల ఆల్చిప్పలు, శంఖువులు దొరికే శుభ్రమైన మెత్తని ఇసుకతో విశేషంగా ఆకర్షిస్తుంది. వీటితో పాటుగా, మిగిలిన సాగర్ తీరపు పట్టణాలైన బ్లాక్ పూల్, స్కార్ బరా, టెన్ బీ, మార్గేట్, బోర్న్ మత్, బ్రయిటన్ మొదలైనవి కూడ వేసవి శలవుల తావులుగా ప్రాచుర్యంలో ఉన్నా, వీటి ఘనత వీటిదే. ఎందుకో చూద్దాం.

22 సంవత్సరాల క్రిందట, వృత్తి పరంగా ఉన్నతిని వెతుక్కుంటూ బ్రిటన్ లో అడుగు పెట్టిన నాకు,తూర్పు యోర్క్ షైర్ లో శిక్షణ పొందే అవకాశం వచ్చింది. అప్పట్లో నా పని తీరును గమనిస్తూ, నన్ను వృత్తి పరంగా తీర్చి దిద్దటానికి, దిశా నిర్దేశం చేసేందుకు నియమితుడైన డాక్టర్ డేవిడ్ రయన్, ప్రతి సంవత్సరం వేసవిలో తన కుటుంబాన్ని డెవన్ సముద్ర తీరానికి తీసుకెళతానని చెప్పేవాడు. ప్రతి సారీ అక్కడకే వెళుతున్నా తన పిల్లలకు విసుగు ఉండదని ఆయన చెప్పేవాడు. పైగా ఆయన చిన్న తనంలో తన

తల్లిదండ్రులతో కలసి తను కూడ డెవన్ వెళ్ళేవాడినని, ఎంతో పారవశ్యంతో చెప్పేవాడు. అన్ని తరాలను, అన్ని సంవత్సరాల పాటు అలరించిన డెవన్ ప్రత్యేకత ఏమిటో నేను కూడా ప్రత్యక్షంగా చవి చూడాలని అప్పట్లో అనుకునే వాడిని. అంటే ఒక విధంగా ఇది నా చిరకాల వాంఛ.

బ్రిటన్‌లో ఉద్యోగస్తులకు జీతంతో కూడిన శెలవు ప్రకటించినప్పటి నుండి, వారు బ్రిటిష్ సముద్ర తీరాలలో సెలవులు గడపటం మొదలయింది. కాని దక్షిణ ఐరోపాలోని తీరపు పట్టణాల అభివృద్ధి కోసం, యాత్రికులకు చౌకగా, విమాన ప్రయాణ సౌకర్యం కలగటంతో బ్రిటిష్ తీర ప్రాంతం మీద మోజు కొంత తగ్గింది. అప్పటి వరకూ ఎంతో జనాకర్షణీయంగా ఉన్న, తీర పట్టణాలన్నీ వెలవెల పోవటం మొదలయింది. సరిగ్గా ఆ సమయంలోనే నేను బ్రిటన్ లో నిలదొక్కుకునే ప్రయత్నాలలో ఉన్నాను. వీలు దొరికినప్పుడల్లా ఉదయం వెళ్ళి, రాత్రికి తిరిగి వచ్చేసే వీలున్న బ్రిడ్లింగ్టన్, స్కార్ బరా, బోర్న్ మత్, బ్లాక్ పూల్ వంటి దగ్గర ప్రదేశాల బీచ్ లకు వెళ్ళొచ్చే వాళ్ళం. కాని, వెచ్చని వాతావరణంలో, తీరుబడిగా, పిల్లలతో కలసి సాగర తీరంలో సెలవులు గడిపే అవకాశం ఇప్పుడు వచ్చింది.

2021 ఆగస్టు నెలలో కోవిద్ ఆంక్షలు సడలించిన తరువాత కూడ, విమాన ప్రయాణాలు ఇంకా మామూలు అవలేదు. ఆగస్టు నెల మొదట్లో, వారాంతానికి బాంక్ హాలిడే తోడౌతుంది. ఆ మూడు రోజులు, డెవన్ లోని ఇంగ్లీషు రివియేరాలో గడపాలనుకున్నాము. ఇటాలియన్ భాషలో రివియేరా అంటే తీర ప్రాంతమని. కాని ఫ్రెంచ్ రివియేరా, ఇంగ్లీష్ రివియేరా అని మనం అంటున్నప్పుడు, ఆ పదం ఇంకా చాలా అర్థాన్ని మూట కడుతుంది. సమ శీతోష్ణ వాతావరణం, ఇసుక నిండిన సముద్ర తీరం, నీలాకాశానికి అద్దం పడుతున్నట్లుండే ఉన్మత్త సాగరం, వీటన్నిటితో జత కట్టిన చెట్టూ చేమా.. ఇవన్నీ కలిస్తేనే రివియేరా. వీటన్నిటినీ కలిపి మనకందించేదే ఇంగ్లీషు రివియేరా. డెవన్ ప్రాంతపు దక్షిణ తీరమంతా 22 మైళ్ళ పొడవున విస్తరించి ఉన్నదే ఇంగ్లీషు రివియేరా. దీని మీద టోర్కీ, పెయిన్టన్, బ్రిక్సామ్ అనే ముచ్చటైన మూడు పట్టణాలు చూడ దగినవి. మేము బయలుదేరిన రోజు, అదృష్టవశాత్తూ వాతావరణం చాలా బాగుంది. బ్రిటన్‌లో ఎటువంటి విలాస్ యాత్రకైనా ఇది చాలా ముఖ్యం. నేనుండే న్యూ బరీ పట్టణం బర్క్ షైర్‌లో ఉంటుంది. ఆక్స్ ఫర్డ్‌కు దక్షిణంగా, బ్రిస్టల్‌కు లండన్‌కు మధ్యలో, దాదాపు సమాన దూరంలో ఉంటుంది. ఇక్కడి నుండి ఇంగ్లీష్ రివియేరా చేరుకోవాలంటే మూడు గంటల ప్రయాణం. ముందుగా లండన్ నుండి బ్రిస్టల్ వరకు వెళ్ళే M4 (జాతీయ రహదారి లాంటి మోటార్‌వే. వీటి మీద, పాదచారులు, సైకిళ్ళ వంటి వాటికి ప్రవేశం ఉండదు.) మీదుగా బ్రిస్టల్ చేరుకుని అక్కడ దక్షిణ దిశగా ప్రయాణం మళ్ళించుకోవటానికి వీలుగా దానితో కలిసే M5 ఎక్కాము. ఎక్సిటర్ అనే పట్టణం దాటి తీరం వైపుకు సాగిన కొద్ది సేపట్లోనే, “ఇంగ్లీష్ రివియేరాకు సుస్వాగతం” అనే బోర్డు కనిపించింది. దానిని దాటి సాగిపోతుండగానే రోడ్డు పక్కన, తాటి, ఈత, పోక చెట్ల సంతతికి చెందిన పామ్ చెట్లు, బ్రహ్మజెముడు మొక్కలు కనిపించసాగాయి. వీటిని చూడటంతోనే, చల్లని బ్రిటన్ వదలి సమశీతోష్ణ ప్రాంతం చేరుకున్న వెచ్చని భావం కలిగింది మాకందరికీ. త్వరలోనే మా గమ్యం, టోర్కీ పట్టణం చేరి పోయాము.

టోర్కీ పట్టణం, సాగర తీరంలో, అందులో నుండి ఉద్భవించినట్లున్న కొండలమీద పరచుకుని ఉంది. ఇసుక నిండిన తీరం, చక్కని పూలతోటలు, తీరం వెంబడి సాగిపోయే రోడ్డు సముద్రాన్ని పట్టణంతో కలుపుతున్నాయి. సముద్రానికి అభిముఖంగా జనావాసపు సందడిని కలిగించే షాపులు, రెస్టారెంట్లు, వందలకొద్దీ పడవలు నిలిచిన రేవు చాలా చాలా దూరం పాటు కొలువు తీరి ఉన్నాయి. మా బస, టి.ఎల్.హెచ్. కార్ల్ టన్ రిసార్ట్ లో ఏర్పాటు చేసుకున్నాము. ఇక్కడున్న వారిలో చాలా మంది అరవైలు దాటిన వారే. బ్రిటన్ నలు మూలలనుండి ప్రత్యేకంగా నిర్వహించబడే టూర్ బస్సులలో ఇక్కడికి చాలా మంది వస్తారట. కుటుంబంతో పాటు కలసి ఉండటానికి అవసరమైన సదుపాయాలన్నీ ఇక్కడ చక్కగా ఉన్నాయి. ఇక్కడకు చేరుకోగానే, ఒక చక్కని సాగరతీరపు ‘హాలిడే’కు వచ్చిన ఆనందం మొదలయింది.

**హత్యానేర సాహిత్యానికి నేపథ్యం :** హాలిడే అనుకోగానే పిల్లలు, పెద్దవాళ్ళం అందరమూ ఆ ప్రాంతం గురించి

రిసెర్చ్ మొదలు పెట్టేస్తాము. ఇందులో భాగంగా తెలుసుకున్న దేమిటంటే, 1999లో నాభార్యతో కలిసి, లండన్ వెస్టెండ్ (ప్రపంచ ప్రఖ్యాత నాటక రంగపు, విశ్వ విఖ్యాత వేదికలుండే చోటు) లోని, సెయింట్ మార్టిన్ థియేటర్లో చూసిన నాటక రచయిత్రి సొంతూరు టోర్కీ అని. ఆ నాటకం, ది మౌస్ ట్రాప్. ఆ రచయిత్రి అగథా క్రిస్టీ. మనలో చాలా మందికి ఆమె గురించి ఎక్కువగా చెప్పనవసరం లేదు. కాని నాటక రంగం దాదాపు కనుమరుగై పోతున్న ఇండియా లాంటి దేశాలనుండి వచ్చిన నాలాంటి వారికి, ఒక నాటకం 1952 నుండి ఏకబిగిన లండన్‌లో ప్రదర్శించబడుతూనే (ఒక్క కోవిడ్ కాలంలో తప్ప) ఉండటం, వింతగా ఉంటుంది. దీర్ఘ కాలం పాటు ప్రదర్శించబడిన నాటకంగా ఇది ప్రపంచంలోనే ప్రథమంగా నిలుస్తుంది. చాలా సామాన్యమైన హత్యా ఉదంతం ఇది. హంతకుడెవరు? అని పసిగట్టటానికి అర డజను మంది నటీనటులతో నడిచే నాటకం ఇది. ప్రతి ప్రదర్శనకూ, ఒక్కొక్క పాత్రను దుష్ట హంతకునిగా చూపించగలగటమే, ఈ నాటక విజయ రహస్యమని చెపుతుంటారు. మా పిల్లలకు కూడ ఈ నాటకం ఏదో ఒక రోజు చూపించుతానని మాటిచ్చాను. ఇంగ్లీష్ మాట్లాడే వాళ్ళలో అగథా క్రిస్టీ అంటే తెలియనివారు ఉండరు. ఒక నాటకమైనా చూడకుండా, ఒక పుస్తకమైనా చదవకుండా, కనీసం ఆమె పుస్తకాల ఆధారంగా రూపొందించిన సినిమాలైనా చూడని వారు ఉండరు అంటే అతిశయోక్తి కాదు. ఆమె సృష్టించిన బెల్జియన్ గూఢచారి (డిటెక్టివ్), ఎర్క్యూల్ ప్రోరో (33 పుస్తకాలు), మిస్ మార్పుల్ (12 నవలలు, 20 కథలు), నిత్య నూతనంగా బ్రిటిష్ వారి హృదయాల్లో నిలిచి పోయారు. సినిమా కైతే జనం చూస్తేనూ, పుస్తకానికైతే జనం చదివితేనూ విజయవంతమైనట్లనుకుంటే అగథా క్రిస్టీ అత్యంత విజయ వంతమైన రచయిత్రి. ఆమె రచనల (85 పుస్తకాలు) అమ్మకాల స్థాయి రెండు బిలియన్లకు పైనే. ఇంతటి అమ్మకాల స్థాయిని చేరుకున్న మరొక రచయిత విలియమ్ షేక్ స్పియర్ మాత్రమే. అమ్మకాల దృష్ట్యా రెండవ స్థానంలో ఉన్న రచయిత అమ్మకాలు, అగథా క్రిస్టీ అమ్మకాలలో పావు వంతు మాత్రమే.



బ్రిక్షామ్ బాడ్జీలతో

19 వ శతాబ్దపు చివరి దశకంలో టోర్కీలో జన్మించిన అగథా క్రిస్టీ, 86 ఏళ్ళ పండు వయసులో 1976లో మరణించింది. ఒక విధంగా అగథా, టోర్కీకి గారాబు పట్టి. ఇక్కడ అడుగడుగునా ఆమె జాడలను సగర్వంగా పట్టి యాత్రికులకు చూపించు కుంటారు టోర్కీ ప్రజలు. వాటిలో కొన్ని మర్డర్ మిస్టరీ టూర్లు ఉన్నాయి. మేము మాత్రం ఆమె పుస్తకాల్లో తరచూ చోటు చేసుకునే గ్రాండ్ హోటల్, ఇంపీరియల్ హోటళ్ళ మధ్య ఉండే మైలు దూరపు నడక దారి (అగథా క్రిస్టీ మైల్) ని ఎంచుకున్నాము. ఈ దోవ పొడవునా ఆమె పుస్తకాలలో పాత్రలకు సంబంధించిన ప్రదేశాల ప్రత్యక్ష వీక్షణం కలిగింది. మర్డర్ ఆన్ ది ఓరియంట్ ఎక్స్ ప్రెస్, ది డెత్ ఆన్ ది నైల్ లాంటి, నాకు పరిచయమున్న రచనలను మననం చేసుకుంటూ, వాటి గురించి మాట్లాడుకుంటూ నడుస్తున్నప్పుడు. మౌస్ ట్రాప్ నాటకం చూడటానికి లండన్ కు తీసుకెళతానన్నానని మా పిల్లలు నాకు మరోసారి గుర్తు చేశారు. బ్రిటన్లో సమర్థులైన వంటవాళ్ళను కళాకారులంతగా గౌరవిస్తారు. అటువంటి కళాకోవిదుడైన సైమన్ హాల్ స్టన్ నడిపే రెస్టారెంటు టోర్కీలో ఉంది. దాని పేరు, ది ఎలిఫెంట్. బ్రిటన్ లో దొరకని, కనపడని వాటిని గొప్పగా ఊహించుకుని ఆరాధించే తత్వం, బ్రిటిష్ వాళ్ళకు అనాదిగా ఉందేమోనని నాకు అప్పుడప్పుడూ అనిపిస్తుంది. ఈ రెస్టారెంటు లోకి ప్రవేశం దొరకటం దుర్లభంగా కనిపించింది. వచ్చే రెండు నెలల వరకు ఖాళీ లేదట. ఎలాగో చివరకు, ఆఖరు నిముషంలో మారిన పరిస్థితుల వలన, మాకు లంచ్ చేయటానికి ప్రవేశం లభించింది.

'మాస్టర్ షెఫ్' అనే వంటకాల పోటీ, టి.వీ. ప్రేక్షకులలో బహుళ ప్రాచుర్యం పొందిన షో. మా ఇంటిల్లిపాదీ కలసి కూర్చుని చూసే ప్రదర్శన ఇది. ఆ షో లో చూపించే తరహా వంటకాలు కొన్ని ఇక్కడ మెనూ లో ఉన్నాయి. ఈ వంటకాలు రుచికి కాకుండా, చూడటానికి కూడ బాగుండాలి. అంటే ప్లేటులో వాటిని అమర్చి అందించే విధానానికి కూడ ప్రాధాన్యత ఉంటుంది. ఈ విషయంగా తప్పొప్పులు ఎంచేటంత సామర్థ్యం నాకు లేదు కాని, ఇవన్నీ రుచిగా ఉన్నాయని మాత్రం చెప్పగలిగాను. మంచి తాజా పదార్థాలతో మనం అడిగిన వాటిని అప్పటికప్పుడు తయారు చేసి ఇవ్వటంతో, అవి మరింత రుచిగా అలరించాయి. ఇక్కడ లభించే వంటకాలు, వంటగాని ఊహా లోకంలో జనించి ఉంటాయట. వాటి సంబంధించిన అన్ని అంశాలను వారు ఎంతో కాలంగా మనసులో మననం చేసుకుంటారన్న మాట. అనుకున్నట్లే పెద్ద బిల్లు వచ్చింది. కాని కుటుంబం కోసం అప్పుడప్పుడూ ఆ మాత్రం తప్పదనుకున్నాను. అప్పుడే కోవిద్ నిబంధనలను సడలిస్తూ ఉన్నారు. టోర్కీ యాత్రికుల సందడితో కళకళలాడుతూ ఉంది. వీరిలో ఎక్కువ మంది, ప్రపంచ యుద్ధాలు ముగిసిన కాలంలో, వాళ్ళ చిన్నతనంలో తల్లిదండ్రులతో కలసి ఇక్కడకు వచ్చిన వారై ఉంటారు. బాల్యపు అనుభవాలను వెతుక్కుంటూ వెళ్ళటం మానవ నైజమేమో. సాయంత్రమంతా అక్కడి ఇసుక బీచ్ లోనూ, గార్డెన్లలోనూ గడిపేశాము. సాయంత్రపు విశేషం ఇక్కడి, "ఫిష్ అండ్ ఛిప్స్". ఒక విధంగా దేశమంతా అర్రులు చాచే బ్రిటిష్ ఆహారం ఇదే. కాని ఇక్కడ మాత్రం, అక్కడి సముద్రంలో ఆ రోజు పట్టిన చేపలను, తాజాగా వండి మనకందించటంతో వాటి రుచి మరీ బాగుంది. మెరుస్తున్న సాయంత్రపు ఎండలో, అక్కడున్న సీ ఫుడ్ రెస్టారెంటు, "పియర్ పాయింట్" లో ఫిష్ అండ్ ఛిప్స్", నోట్లో ఇట్టే కరగిపోయిన "బ్రిక్సామ్ స్కాలప్స్"తో ఇంగ్లీషు రివియేరాలో మా మొదటి రోజు ముగిసింది.

**రివియేరాలో రెండవ రోజు :** బ్రిటిష్ రివియేరాలో మా రెండవ రోజు, మా హోటల్ రెస్టారెంట్లో బ్రేక్ ఫాస్ట్తో మొదలయింది. మనలో చాలా మందికి సుపరిచితుడైన ఇంగ్లీష్ రచయిత, సోమర్సెట్ మామ్ ఎక్కడో ఒకసారి అంటాడు, "ఇంగ్లాండ్లో 'సుష్టుగా తిన్నాము' అనుకోవాలంటే, ఇక్కడ రోజుకు మూడు సార్లు బ్రేక్ ఫాస్ట్ తినాలి" అని. యూరోపియన్లకు, ముఖ్యంగా అతిశయం పోయే ఫ్రెంచి వారికి, బ్రిటిష్ రుచులంటే చిన్న చూపు. కాని ఇంగ్లీషు 'బ్రేక్ ఫాస్ట్' మాత్రం విలక్షణంగా, వైవిధ్యంగా ఉంటుందని వారు కూడ ఒప్పుకుంటారు. నా వరకు నాకు కూడ ఇటువంటి అభిప్రాయమే ఉంది. తాజాగా వండి వేడిగా అందించడే బ్రిటిష్ బ్రేక్ ఫాస్ట్లో, సగం ఉడికిన గ్రుడ్లు, బేకన్ (సన్నగా తరిగిన సీమపంది మాంసపు ముక్కలు), మాంసంతో తయారు చేసే సాసేజ్ లు, బంగాళాదుంపల కోరుతో తయారయ్యే హాష్ బ్రౌన్ లు, వెన్నతో ఉడికించిన పుట్ట గొడుగులు, కాల్చిన టమాటోలు, రకరకాల బ్రెడ్లు, తాజా పండ్ల రసాలు, రక రకాల పండ్లతో ఒక మంచి సమతులాహారంగా ఈ బ్రేక్ ఫాస్ట్ ఉంటుంది. కొన్ని చోట్ల బ్లడ్ పుడ్డింగ్ అనే పదార్థాన్ని కూడ ఇస్తారు. చాలా వరకు స్థానికంగా దొరికే పదార్థాలతోనే వీటిని తయారు చేస్తారు. ఈ బ్రేక్ ఫాస్ట్లో మాంసకృత్తుల నిష్పత్తి ఎక్కువగా ఉండటంతో, చాలా సేపు ఆకలిని దరి చేరనీయదు. ప్రతి రోజు ఇటువంటి ఆహారాన్ని తీసుకోవటాన్ని నేను సమర్థించను. కాని అప్పుడప్పుడూ తీసుకోవటం ఫరవా లేదు. నాతో పాటు నా కవల పిల్లలు ఈ బ్రేక్ ఫాస్ట్ ను పూర్తిగా ఆస్వాదించినా, నా భార్య లాంటి శాకాహారులకు మాత్రం ఇక్కడ కొంచెం కష్టమే. పుట్టగొడుగులు, హాష్ బ్రౌన్లు, టొమాటోలు, గ్రుడ్లు, బ్రెడ్లతో సరిపెట్టుకోవాలి.

ఉదయపు ఉపాహారం తరువాత, హోటల్ నుండి బీచ్ వైపు నడుస్తుండగా దోవలో 'తోర్ అబీ' అనే పురాతన కట్టడం కనిపించింది. దాదాపు 800 సంవత్సరాల నాటి పురాతన క్రైస్తవ మత కేంద్రం (మొనాస్టరీ) ఇది. దీని చుట్టూ చక్కని పూలతోట ఉంది. ప్రస్తుతం ఇందులో క్రైస్తవ మత గురువులెవరూ ఉండటం లేదు. దీనిని ఒక ఆర్ట్ గ్యాలరీగా మార్చారు. దీని ప్రాంగణంలోనే మరొక భవనం ఉంది. దీని పేరు స్పానిష్ బార్న్. దాని ముందుంచిన బోర్డు మీదున్న సమాచారం ప్రకారం, 1588లో బ్రిటిష్ సైన్యం స్పానిష్ ఆర్మడా( మిలిటరీ నౌకాదళం) ను ఓడించిన తరువాత, చెరపట్టిన ఖైదీలను ఇక్కడ ఉంచారట. ఇక్కడే "ది పొటెంట్ ప్లాంట్ గార్డెన్" ఉంది. దీని విశేషాలు అగథా

క్రిస్టీ అభిమానులకు తెలిసే ఉంటాయి. ఆమె క్రైమ్ నవలల్లో రకరకాల విష పదార్థాలు, వాటి విరుగుడు గురించిన ప్రస్తావన ఉంటుంది. ఇక్కడ అటువంటి విషపు మొక్కలు, విరుగుడు మొక్కలు ఉన్నాయి. అంటే ఆమె నవలలో వ్రాసిన విషయాలు, ఈ విషయం మీద అవగాహనతో వ్రాసినవని తెలిశాక అగథా అంటే గౌరవం మరింత పెరిగింది.

తోర్ అబీ నుండి కొన్ని వందల గజాల దూరంలోనే, సముద్రపుటొడ్డున ప్రిన్సెస్ గార్డెన్స్ ఉన్నాయి. అక్కడ ఎడ్వర్డియన్ శైలిలోనిర్మించబడిన ఒక ఘనమైన మండపం (పెవిలియన్) ఉంది. (1901-1914 వరకు బ్రిటన్లో ఎడ్వర్డియన్ కాలంగా పరిగణించబడుతుంది. ఆ కాలపు నిర్మాణాలు కొంత నవీనంగా ఉంటాయి.) ఈ రెండు కూడ అగథా క్రిస్టీ, "ది ఎ బి సి ఆఫ్ మర్డర్స్'లో చోటు చేసుకున్నాయి. మా అమ్మాయిలు, ప్రిన్సెస్ గార్డెన్స్‌లో జయింట్ వీల్ ఎక్కాలని ముచ్చట పడ్డారు. మనసులో కొంచెం గాబరా పడుతూనే వారితో కూడ వెళ్ళాను. నా చిన్నతనంలో ఒకసారి జయింట్ వీల్ ఎక్కాను. ఎన్నో ఏళ్ళ తరువాత మళ్ళీ ఇప్పుడు. నేను ఊహించుకున్నంత భయంకరంగా అయితే లేదు ఇది. పైగా నెమ్మదిగా తిరుగుతున్న మహా చక్రం మమ్మల్ని పైకి తీసుకెళ్ళి, టోర్కీ, ఆ చుట్టు పక్కల ప్రాంతాన్నంతా చూపించింది.

టోర్కీలో తిరిగి చూస్తున్నప్పుడు రెజినా హొటల్ ముందు, నీలం రంగు బోర్డు మీద, "ఎలిజబెత్ బారెట్ బ్రౌనింగ్ : 1806-1861 : పొయట్ : లివ్డ్ హియర్ 1838-1841" అని కనిపించింది. నేను ఆ పేరు అంతకు ముందెప్పుడూ వినలేదు. అప్పుడు మేమ తెలుసుకున్న దేమిటంటే, ఈమె బానిస వ్యాపారంలో సంపన్నులైన బారెట్ కుటుంబానికి చెందినదని, తన జీవిత కాలంలో ఎన్నో కవితలు వ్రాసినా, బాల కార్మికుల విముక్తి కోసం ఆమె రచించిన కవితలు, ఆమె మరణానంతర కాలంలో ముఖ్యంగా అమెరికాలో ప్రాచుర్యం పొందాయని తెలిసింది. ప్రముఖ రచయిత్రి వర్జీనియా వూల్ఫ్, కవి టెన్నిసన్‌ల సమకాలీకురాలు ఈమె. ప్రముఖ ఇంగ్లీషు కవి రాబర్ట్ బ్రౌనింగ్‌ను వివాహ మాడిందని వినికిడి. కేవలం మూడు సంవత్సరాల పాటు మాత్రమే ఈ భవనంలో నివసించిన ఈ కవయిత్రి జ్ఞాపకాలను శాశ్వతం చేసుకున్న స్థానికులు గొప్పవారనిపించింది.

**ఆఫ్టర్ నూన్ టీ :** బ్రిటన్ 'టీ' ని ఆస్వాదించే దేశం. మిగిలిన ఐరోపాలో కాని, అమెరికాలో కాని ఇట్లా ఉండదు. ముఖ్యంగా ఇంగ్లీషు వారి 'ఆఫ్టర్ నూన్ టీ' తీసుకోకుండా డెవన్ ట్రిప్పు పూర్తి కాదంటారు. సాగరాభిముఖంగా, ఒక కొండ కొమ్ము మీద ఉన్న ఇంపీరియల్ హొటల్‌లో 'టీ' తీసుకోవాలనుకున్నాము. ఈ హొటల్ కూడ అగథా రచనలలో మనకు పదే పదే కనపడుతుంది. 'ఆఫ్టర్ నూన్ టీ' అనేది చాలా వివరంగా జరిగే సంప్రదాయక వ్యవహారం. ఇటాలియన్ శైలిలో అలంకరించబడిన ఈ హాలులో పాతకాలపు విలువైన సామగ్రిని ఉంచారు. గతకాలం తాలూకు వైభవపు చిహ్నాలు ఇక్కడ చాలా కనిపిస్తున్నాయి. ఛార్లెస్ డికెన్స్ నుండి బీటిల్స్ వరకూ ఆయా కాలాలలో పేరు పొందిన ఎందరో రాజవంశస్తులకు రాజకీయ ప్రముఖులకు ఆతిథ్యమిచ్చిన ప్రదేశం ఇది.

ఇంగ్లీషు వారి 'ఆఫ్టర్ నూన్ టీ' ఒక విలక్షణమైన సంప్రదాయం. మధ్యాహ్నం 2-5 గం.ల మధ్య, టీ తో పాటు రకరకాల తినుబండారాలెన్నిటినో తీసుకునే ఆచారమిది. విక్టోరియన్ టైమ్ (1837-1901)కు చెందిన 7వ బెడ్ ఫోర్డ్ డచ్చెస్, ఆనా, మొదటిసారిగా, ఈ ఆహారపు అలవాటును ప్రవేశ పెట్టింది. ఆ కాలంలో రాత్రి భోజనం కోసం ఎనిమిది గంటల వరకు ఆగ వలసి వచ్చేది. అందు వలన మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో, ఆకలి బాధను తట్టుకోలేక, వంట సిబ్బందిని టీతో పాటు, కేకు ముక్కలను కాని, బ్రెడ్ శాండ్ విచ్‌లను కాని తెమ్మని పురమాయించేది. కాల క్రమేణా, ఈ సమయంలో తన స్నేహితులను కూడ ఆ సమయంలో రమ్మని, వారందరికీ కూడ ఈ విధమైన 'ఆఫ్టర్ నూన్ టీ' తీసుకోవటం అలవాటు చేసింది. డచ్చెస్ ఆనా, క్వీన్ విక్టోరియాకు మంచి స్నేహితురాలు కూడ. రాను రాను, విక్టోరియన్ సామ్రాజ్యంలో.. రాజ వంశీయులు, చక్కని దుస్తులు ధరించి ఒక్కొక్క సారి ఒక్కొక్కరింట్లో కలుసుకోవటం, ఒక ముఖ్యమైన సంఘ జీవన ప్రక్రియగా మారింది. ఆతిథ్యమిచ్చే వారి తాహతును బట్టి, అభిరుచిని బట్టి రకరకాల తినుబండారాలను అందించినా, కీర దోసకాయ లతో స్టాండ్ విచ్‌లు, కేకులు, ఇంగ్లీషుపై, క్రీము నింపిన స్కోన్‌లు మాత్రం తప్పని సరిగా ఉంటాయి.

బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించిన దేశాలలో ఇప్పటికీ కొన్ని చోట్ల 'ఆఫ్టర్ నూన్ టీ' అందించే రివాజు ఉంది. సింగపూర్ లో రాఫెల్స్ హొటల్, హాంగ్ కాంగ్‌లో పెనిన్సులా హొటల్, న్యూ ఢిల్లీ లోని ఇంపీరియల్ హొటళ్ళలో ఇప్పటికీ ఆఫ్టర్ నూన్ టీ తీసుకోవచ్చు. ఇక బ్రిటన్ వచ్చిన అమెరికన్ సందర్శకులకు, లండన్‌లో కాని, ఇతర ముఖ్య నగరాలలో కాని ఆఫ్టర్ నూన్ టీ తీసుకోవటం, 'యాత్రలో తప్పనిసరిగా పొందవలసిన' అనుభవాల పట్టీలో ఉంటుంది. ముఖ్యంగా, డెవన్, కార్న్ వాల్ కౌంటీలు, గడ్డ కట్టిన మీగడ, జామ్‌లు పూసిన స్కోన్‌లను ఆఫ్టర్ నూన్ టీలో ముఖ్యమైన భాగంగా చేర్చాయి. చిన్న చిన్న కెఫేలలో కూడ వీటిని అమ్ముతారు. మహా రుచిగా ఉంటాయి. టీతో పాటు వీటిని తీసుకోవటం అదొక అనుభవం. స్కోన్, గోధుమ పిండితో తయారు చేసే తినుబండారం, ఏ విధంగా చూసినా కేక్ అంత ఘనంగా ఉండదు. కొంచెం పొడి పొడిలాడుతూ, గట్టిగా ఉంటుంది. దీనిని మధ్యకు కోసి, పై భాగాన్ని క్రింది భాగాన్ని వేరు చేస్తారు. తరువాత వీటి మీద ముందుగా క్రీమ్ పూయాలా? జామ్ ముందుగా పూయాలా అనే విషయం మీద, డెవన్, కార్న్ వాల్ జనుల మధ్య వాగ్యుద్ధాలు ఎడతెగకుండా జరుగుతాయట. డెవన్ వారు స్కోన్ మీద, ముందుగా క్రీమ్ పూస్తే, కార్న్ వాల్ వారు ముందుగా జామ్ పూస్తారట. ఎవరికి వారే వారిదే మంచి పద్ధతి అని చెప్పుకుంటుంటారు. ఇదెప్పటికీ తేలని సమస్య అని అందరికీ తెలుసు. పోనీ రాజ కుటుంబాలను జడ్జీలుగా తీసుకుందామా అంటే, బక్కింగ్ హామ్ ప్యాలెస్ కూడ ఈ విషయం ఇదమిత్థంగా, అధికారికంగా తేల్చి చెప్పదు. కాని, రాణీ గారి పూర్వపు ఆస్థాన వంటవాళ్ళు బయటకు చేరవేసిన విషయ మేమిటంటే, అక్కడ కార్నిష్ పద్ధతిలో జామ్ ముందు, క్రీమ్ తరువాత పూసుకుంటారట. ష్ ష్, నేనేమీ చెప్పలేదు. మీరేమీ వినలేదు. ప్రస్తుతం పెద్దగా సమస్యలేమీ లేని సమాజంలో, జాతీయ సమస్యలు ఇలానే హాస్యం చిందిస్తూ ఉంటాయనుకుంటా!

రెండు గంటలకు ఏర్పాటు చేసుకున్న ఆఫ్టర్ నూన్ టీ కోసం, 1.45 కల్లా ఇంపీరియల్ హొటల్ చేరిపోయాము. ఇంగ్లీషు వారికి సమయ పాలన ఇష్టం. ఉదయాన, ఇంగ్లీష్ బ్రేక్ ఫాస్ట్ తరువాత ఇంకేమీ తినలేదు కాబట్టి, అందరమూ మంచి ఆకలి మీద ఉన్నాము. పైగా ఈ టీ గురించి మేము విన్న దాని ప్రకారం, చాలా ఊహించుకుని ఉన్నాము. మా అంచనా తప్పలేదు. రకరకాల పదార్థాలతో మా టేబుల్ నిండి పోయింది. చేతికి జిడ్డు అంటకుండా తినే కుకుంబర్, పొగ పెట్టి వండిన సాల్మన్ చేప పొరలు, హామండ్ చీజ్ లతో నింపిన సాండ్ విచ్‌లు, బాటన్ బర్గ్, విక్టోరియా రకాల కేకులు, మాకరూన్‌లు, అప్పుడే ఓవెన్‌లో నుండి తీసినట్లున్న వెచ్చని స్కోన్‌లు, వాటితో పాటు గడ్డకట్టిన మీగడ, స్ట్రా బెర్రీ జామ్ ఇలా ఒకటేమిటి అదీ నలుగురికి ఎక్కాతక్కీ సరిపోయేటన్ని ఆహార పదార్థాలను మా ముందుంచారు. చూస్తేనే సగం కడుపు నిండి పోయింది. దీని గురించి అందరూ ఎందుకంత గొప్పగా చెప్పుకుంటారో కూడ అనుభవంలోకి వచ్చింది. అంత ఆకలి మీద లేకపోతే వీటన్నిటినీ ఖాళీ చెయ్యటం కూడ మాకు కష్టమయ్యేది. అప్పటికే డెవన్, కార్న్ వాల్ ల మధ్య నడిచే స్పర్ధ గురించి మేము కూడ చర్చించుకున్నాము కాబట్టి, నిష్పాక్షిక దృష్టితో, కొన్ని స్కోన్లను కార్న్ వాల్ పద్ధతిలో జామ్ ముందు, క్రీమ్ తరువాత పూసుకుని తింటే, మరి కొన్నిటిని డెవన్ పద్ధతిలో క్రీమ్ ముందు, తరువాత జామ్ పూసుకుని తిన్నాము. మేమంతా ఏకగ్రీవంగా డెవన్ వారినే బలపరచాము.

టోర్కీలో ఉన్న రెండు రోజులు, మనఃశరీరాలు తేలికగా, ఆనందకరమైన సంతృప్తిని అనుభవించాయి. కాలగమనం గురించిన స్పృహ లేదు. వత్తిడి అంతకన్నా లేదు. సముద్రపు అలల గలగల శబ్దం నిరంతరం చెవులలో, మనసులో నింపాదిగా వినిపిస్తూనే ఉంది. నలుగురం పిల్లలమై పోయాము. పిల్లలకు ఇసుకకు అవినాభావ సంబంధముంటుందనుకుంటాను. బీచ్‌లో నిదానంగా నడక, ఆల్చిప్పలు, రంగు రంగుల రాళ్ళు ఏరుకోవటం, నీలి సముద్రం మీద తేలే తెల్లని పడవలు, దూరంగా ఓడలు, నీళ్ళ మీద ఆటలాడే సాహసికులను చూడటం, మధ్య మధ్యలో అక్కడ దొరికే స్థానిక రుచులను ఆస్వాదించటం ఇదంతా మాకు 'నిర్విషీకరణ' (డి–టోక్సిఫికేషన్) లా అనిపించింది. అప్పుడే ఒకటి గమనించాను. ఇది వరకు బీచ్కి వెళ్ళినప్పుడు మా పిల్లలు

ఇసుకలో గూళ్ళు కట్టే వారు. ఈసారి అది జరగలేదు. వాళ్ళు పెద్దవాళ్ళయ్యారనిపించింది. అంతే కాకుండా కరోనా కాలం, మన జీవితాలలో రెండు సంవత్సరాల కాలాన్ని మింగేసింది. నిశ్శబ్దంగా మా పిల్లలు, బాల్యం దాటి, 13 సంవత్సరాల వాళ్ళయారు. దానితో పాటే వాళ్ళ అభిరుచులు కూడా.

ఆ సాయంత్రం, పెయిన్టన్ పట్టణానికి బోట్ ప్రయాణం చేశాము. అది మరొక చిన్న సైజు టోర్కీ లా ముచ్చటగా ఉంది. ఊరంతా తీర ప్రాంతానికి వచ్చిపోయే యాత్రికులకు అనుకూలంగా, రకరకాల ఆకర్షణలతో నిండి ఉంది. సముద్రపుటొడ్డున అన్నీ, సాగర దృశ్యాలు కనిపిస్తూ ఉండే వసతి గృహాలు. ఇవి చాలా ఖరీదుగా ఉంటాయి. ఇక్కడికి బోటులో వెళ్ళటం వలన, తీర రేఖ అందచందాలు చూస్తూ వెళ్ళ గలిగాము. ఇటునుండి చూడటంతో టోర్కీ పట్టణం పరచుకుని ఉన్న కొండ, సహజంగా జాలు వారి, సముద్రం మీదకు వాలి, ఒక శిలా తోరణంలా కనిపించింది. ఈ ఆర్చ్ క్రింద నుండి చిన్న పడవలు వెళ్ళొచ్చన్నట్లు ఉంది. స్థానికులు దీనిని లండన్ బ్రిడ్జ్ అని పిలుచుకుంటారట.

ఆ సాయంకాలం సూర్యాస్తమయం చూసి, వీధులను పరిచయం చేసుకుంటూ తిరిగాము. బెడ్ ఫోర్డ్ డచ్చెస్ ఆనా ఆనవాయితీ ప్రకారం, ఆఫ్టర్ నూన్ టీ తరువాత, రాత్రి 8 గం.కు భోజనం చేశాము. కాకపోతే ఆమెకున్నట్టు ప్రైవేట్ బట్లర్లు మాకు లేరు కాబట్టి, మా భోజనం లాస్ ఇగువానాస్ అనే రెస్టారెంటులో తీసుకున్నాము. టోర్కీ అన్ని విధాలా చాలా సురక్షితమైన ప్రాంతమనిపించింది.

**బ్రిక్సామ్ :** మూడవ రోజుకు, ఇంగ్లీష్ రివియేరాలా ఇక మిగిలింది బ్రిక్సామ్ పట్టణం. టోర్కీ నుండి 8-9 మైళ్ళ దూరం. ఇది పూర్వ కాలంలో ప్రధానంగా మత్స్యకారుల ప్రదేశం. ఇవాల్టికి కూడ ఇక్కడ ప్రధాన జీవనోపాధి మత్స్య పరిశ్రమే. టోర్కీ నుండి పెయిన్స్ మీదుగా బ్రిక్సామ్ వరకు వంపు తిరిగిన తీరం ఒక మంచి రేవు ప్రాంతం. బ్రిక్సామ్ ఊరు హార్బరు చుట్టూ ఉన్న కొండల మీద నుండి, క్రింద ఉన్న హార్బరు వరకు పరచుకుని ఉంటుంది. రంగు రంగుల ఇళ్ళు కొండల వాలుకు రంగులద్దుతూ ఉంటాయి. ఇటువంటి దృశ్యాలు పిక్చర్ పోస్టు కార్డుల మీద చూస్తూ ఉంటాము. హార్బరు సమీపాన ఉన్న ప్రాంతమంతా సందడిగా ఉంది. అక్కడున్న దుకాణాలు, సముద్ర జలపుష్పాల రెస్టారెంట్లకు అయస్కాంత శక్తి ఉన్నట్లు వాటి వద్ద జన సాంద్రత ఎక్కువగా ఉంది. బ్రిటన్ అంతటా బ్రిక్సామ్ పీతల గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. ఇక్కడ రోడ్డు పక్కన ఉన్న చిన్న రెస్టారెంట్లలో కూడ వీటి గుజ్జుతో చేసిన స్టాండ్ విచ్ లను అమ్ముతున్నారు. పీతలను పట్టటానికి ఉపయోగించే క్రాబ్ కేజ్‌లు కూడ అక్కడ కనిపించాయి. సర్ ఫ్రాన్సిస్ డ్రేక్ ఉపయోగించిన 'ది గోల్డెన్ హైన్డ్' నౌక నమూనా ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. ఇతను 16వ శతాబ్దానికి చెందిన నౌకాదళ అధికారి. డెవన్ కౌంటీకి చెందిన వాడు. మొట్ట మొదటగా భూమిని సముద్ర మార్గాన చుట్టి వచ్చిన బ్రిటిష్ వాడు ఇతడు. దీనికి గాను, అతడు వాడిన నౌక పేరు 'ది పెలికాన్'. ఐతే తరువాత కాలంలో, అతనిని ప్రోత్సహించిన సర్ క్రిస్టఫర్ హాటన్ (క్వీన్ ఎలిజబెత్ కాలంలో, ఇంగ్లండుకు అప్పటి లార్డ్ ఛాన్సలర్) గౌరవార్థం, ఈ నౌక పేరు మార్చాడట. గోల్డెన్ హైన్డ్ అంటే అర్థం, ఎరుపు రంగులో ఉండే ఆడ లేడి అని. హాటన్ దొరగారి రాజ చిహ్నంలో గోల్డెన్ హైన్డ్ ఉండేదట. సర్ ఫ్రాన్సిస్ డ్రేక్, క్వీన్ ఎలిజబెత్‌కు ఆంతరంగికుడు. ఆమె తరఫున స్పెయిన్ వారి నౌకలను దోచుకునే పనిలో ఆరి తేరిన వాడు. స్పెయిన్ వారికి సింహ స్వప్నం. స్పానిష్ నౌకా దళాన్ని ఓడించటంలో ఇతని పాత్ర ఎంతో ఉంది. గోల్డెన్ హైన్డ్ ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయింది. కొన్ని నమూనాలు మాత్రం అక్కడక్కడా ఉన్నాయి. వీటన్నిటిలో బ్రిక్సామ్ లో ఉన్నదే బాగుంటుందని ప్రతీతి.

బ్రిక్సామ్‌లో ఉన్నంత సేపు, దాని చారిత్రాత్మక వాతావరణం నన్ను విచలితుణ్ణి చేసింది. ఈ ప్రదేశం గతంలో ఎంత చూసిందా! అనిపించింది. హార్బర్ నుండి అర మైలు దూరంలో బ్రిక్సామ్ హెరిటేజ్ మ్యూజియమ్ ఉంది. నా పిల్లలు నాతో అక్కడకు రావటానికి ఉత్సాహం చూపించారు. బ్రిక్సామ్ చారిత్రక ప్రాధాన్యతను, కాలం వెంబడి అక్కడ జరిగిన ఘటనలను పొందు పరచటం ద్వారా చక్కగా తెలియచేసింది ఈ మ్యూజియమ్. దీనిని స్థానికులు స్వచ్ఛందంగా నిర్వహిస్తారట. ఇంకా ఇక్కడ క్రొత్తగా తెలిసినదేమంటే, నెపోలియన్ బ్రిటన్లో తొలిగా కాలిడింది బ్రిక్సామ్ లోనే నట. ఐరోపాలో ఎన్నో ప్రాంతాలను కైవసం చేసుకున్న నెపోలియన్, 19వ

శతాబ్దంలో బెల్జియమ్‌లోని వాటర్లూ వద్ద బ్రిటిష్ వారి చేతిలో పరాజితుడై, వారి బందీగా ఇక్కడకు తీసుకు రాబడ్డాడట. ఇక్కడ నుండి, ప్లిమత్ కు, తరువాత సెయింట్ హెలెనా ద్వీపానికి తరలించబడి అక్కడే మరణించాడట.

1688 బ్రిటిష్ చరిత్రలో ముఖ్యమైనది. నవంబర్ 5 వ తేదీన, నెదర్లాండ్స్ ప్రిన్స్ ఆఫ్ ఆరెంజ్, బ్రిటిష్ సింహాసనాన్ని చేజిక్కించుకోవటానికి లండన్ ప్రయాణమై, సైన్యాన్ని బ్రిక్సామ్ లో దింపి ఇక్కడి నుండి లండన్ కు నడిపించాడట. బ్రిటిష్ చరిత్రలో దీనిని, 'గ్లోరియస్ రివల్యూషన్' అని అంటారు. దీని తరువాతే ప్రపంచ గతిని మార్చిన ఎన్నో సామాజిక, రాజకీయ, పరిణామాలు బ్రిటిన్ పరిపాలనా పద్ధతుల్లో శాశ్వతంగా చోటు చేసుకున్నాయి. తద్వారా ఇవి ఇండియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజీలాండ్ లాంటి దేశాల్లో అనేక వ్యవస్థల రూపు రేఖలను కూడ మార్చివేశాయి. వీటిలో: ప్రొటెస్టెంట్ల ఆధిపత్యం, రాజ్యాంగ బద్ధమైన రాచరికం, పార్లమెంటు అధికారిక అత్యున్నత, పారదర్శక ఎన్నికలు, భావ ప్రకటనా స్వాతంత్ర్యం, మొదలైనవి మచ్చు తునకలు. ఇవన్నీ నేడు మనం చూసే వెస్ట్ మినిస్టర్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఏర్పడటానికి దోహదం చేశాయి. బ్రిక్సామ్ లో ప్రిన్స్ విలియం ఆఫ్ ఆరెంజ్ కాలిడిన ప్రదేశంలో అతని కాంస్య విగ్రహం భారీగా కనపడుతూ ఉంది. సాగరాలమీద సాగిన జాతి చరిత్రలో బ్రిక్సామ్ ఎంతో పాత్ర వహించింది. మధ్య యుగాలనుండీ ఇప్పటి వరకూ, ఇదొక మత్స్యకారుల ఉనికి పట్టు. ఈ సమాచారా న్నంతటినీ, ముందు తరాల వారికి తెలపటానికి, ఈ మ్యూజియమ్లో పొందు పరచి ఉంచారు. అక్కడి నిర్వాహకులు, మా పిల్లలిద్దరికీ ఒక క్విజ్ షీట్ ఇచ్చారు. దానిలో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు, మ్యూజియమ్ లోనే దొరుకుతాయి (శ్రద్ధగా చూస్తే). 90% సమాధానాలను సేకరించటంతో వాళ్ళిద్దరికీ బ్రిక్సామ్ బాడ్జ్ వచ్చింది. పిల్లల ఆసక్తిని కొనసాగించటానికి ఇదొక మంచి ప్రక్రియ అనిపించింది నాకు.

బ్రిటన్‌లో ముఖ్యంగా మెచ్చుకోవలసింది ఒకటుంది. ఏ ప్రాంతానికా ప్రాంతంలో, స్థానిక చరిత్రను మరుగున పడనివ్వ కుండా పరిరక్షించుకుంటారు. దేశం మొత్తంలో వందలకొలది చిన్న చిన్న మ్యూజియమ్‌లు ఉంటాయి. వారసత్వ సంపదను పరిరక్షించుకోవటంలో వీరి తరువాతే ఎవరైనా. వీటిలో బ్రిక్సామ్ మ్యూజియమ్ మరొక ఆణిముత్యం. మధ్యాహ్నానికల్లా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమయింది. అక్కడ 'బ్రిక్సామ్ ఫిష్ అండ్ ఛిప్స్' అనే బోర్డు కనపడింది. ఇదే చివరి రోజు కాబట్టి, మళ్ళీ ఇంత చక్కటి ఫిష్ అండ్ ఛిప్స్ మళ్ళీ ఎప్పటికి తింటామోనని, అటువైపు మళ్ళాము. గాలిలో వేగిన చేప తాలూకు సువాసనలు తేలి వస్తున్నాయి. ఆ షాపుకు ఎన్నో అవార్డులు వచ్చాయట. అందుకేనేమో మాలాంటి వాళ్ళు ఎందరో అక్కడ 'కొండవీటి చాంతాడంత' క్యూ ఉంది. దానిలో చేరక తప్పలేదు. అక్కడ ఖరీదులు కూడ ఎక్కువగానే ఉన్నాయి. కాని మా వంతు వచ్చేసరికి మాకందించిన కాడ్ ఫిష్ పరిమాణం చూసే సరికి అన్నీ మర్చి పోయాము. ఫిష్ తినటం పూర్తి చేసిన తరువాత ఛిప్స్ కు మా పొట్టల్లో ఎక్కువ ఖాళీ మిగలలేదు. అవన్నీ తినటానికి మామూలు కంటే చాలా ఎక్కువ సమయం పట్టింది. ఇక సాయంత్రమై పోయింది. వదలి వెళ్ళాలన్న భావం మనసులోకి రాగానే, ఇంగ్లీష్ రివియేరాలో మా మూడు రోజుల పండుగ మనసులో మెదిలింది. కుటుంబమంతా కలసి, చక్కని ఎండ, నీలి సముద్రం, శుభ్రమైన ఇసుక తీరం, మంచి భోజనం, వీటన్నింటితో పాటు, ఆ ప్రదేశపు చారిత్రక ప్రాధాన్యత, మనకు ముందు అక్కడ తిరిగిన ప్రముఖులను గుర్తు చేసుకోవటం ఇవన్నీ కలవటంతో మూడు రోజుల కాలం మాకు తెలియకుండా గడచిపోయింది. కోవిడ్ కాలంలో మనసును ఆవరించిన తెలియని బరువు ఈ మూడు రోజుల్లో తొలగిపోయి నట్లనిపించింది. మనఃశ్శరీరాల పునరుజ్జీవనం కలిగించిన యాత్రలన్నీ చేయవలసినవే.

బ్రిక్సామ్‌లో బయలు దేరిన అరగంట లోపే, M5 వాహనాల రహదారి ఎక్కేశాము. ఎక్సిటర్, బ్రిస్టల్ లాంటి పట్టణాలు దాటుకుంటూ, మళ్ళీ మా పని, స్కూళ్ళు వగైరాల దైనందిన జీవితం వైపు ఇనుమడించిన ఉత్సాహంతో దూసుకుపోయాము.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: జయశ్రీ అట్లూరి (స్టోక్ ఆన్ ట్రెంట్)
e-mail: jayasreeatluri@hotmail.com

# కవి అంతరంగం

**– అలజంగి మురళీధర రావు**

To call Spade a spade అని ఒక ఆంగ్ల జాతీయం ఉంది. అంటే ఉన్నది ఉన్నట్లు ముక్కు సూటిగా చెప్పడం అని అర్థం. రచయిత పి చంద్రశేఖర్ ఆజాద్ రచించిన ''కవి గారి అంతరంగాలు'' పుస్తకం చదువుతున్నప్పుడు ఈ జాతీయం ఒక్కసారి నా మదిలో తళుక్కున మెరిసింది. పుస్తకం చదివిన తర్వాత అతని ముక్కుసూటి తనానికి ఆశ్చర్యమేసింది. ఇంకా ఈ జాతీయానికి ఒక పర్ఫెక్ట్ ఎగ్జాంపుల్ దొరికిందని ఆనందం అయ్యింది. ఇలాంటి రచనలు చేయడానికి టన్నుల కొద్దీ ధైర్యం, తెగువ మాత్రమే సరిపోదు నమ్మిన సిద్ధాంతం పట్ల సంపూర్ణమైన నిబద్ధత కూడా ఉండాలి. ఇట్లాంటి పుస్తకాలను చదువుతున్నప్పుడే Franz kafka చెప్పిన A Book must be the axe for the frozen sea within us లాంటి వాక్యాలు గుర్తుకొస్తుంటాయి. 70 పేజీల ఈ చిన్న పుస్తకంలో విమర్శే కాదు ఆత్మ విమర్శ కూడా ఉంది. జీవితంలో అత్యంత సులువైనది విమర్శ, అత్యంత కష్టతరమైనది ఆత్మవిమర్శ!. చంద్రశేఖర ఆజాద్ కవిగా తను చేసిన ప్రయాణంలోని ఎగుడు దిగుళ్ళనే కాదు తన కాలం నాటి మరియు నేటి కవితా ప్రపంచాన్ని, సాహితీ ధోరణిని అత్యంత సూటిగా మన ముందు పరుస్తారు. ఈ "కవి గారి అంతరంగాలు" అన్న ఈ పుస్తకంలో. ఈ పుస్తకాన్ని చదువుతుంటే ఇద్దరు ప్రఖ్యాత వ్యక్తులు గుర్తుకొచ్చారు. ఒకరు గుడిపాటి వెంకటచలం మరొకరు లియో టాల్ స్టాయ్. చంద్రశేఖర్ ఆజాద్ శైలి ఇందులో చలం మ్యూజింగ్స్ని తలపిస్తే, ఎంపిక చేసుకున్న విషయ వివరణ లియో టాల్ స్టాయ్ "మై కన్ఫెషన్స్" అనే పుస్తకాన్ని గుర్తుకు తెస్తుంది.

తెలుగులో సాహితీ వాతావరణాన్ని ముఖ్యంగా కమ్యూనిస్టు భావజాలంతో ముడిపడి ఉన్న సాహిత్యాన్ని, అందులో మునిగి తేలిన రచయితలు, కవులు, వారిలో పొడచూపిన కాపట్యాలను, వైరుధ్యాలను ఎత్తిచూపుతూ గతంలో చలసాని ప్రసాదరావు "ఇలా మిగిలేము" గీతా రామస్వామి ఆత్మకథ "అడుగడుగునా తిరుగుబాటు" అలాగే ముప్పాళ్ళ రంగనాయకమ్మ రాసిన విమర్శనా పుస్తకాలు రాకపోలేదు. అయితే పి చంద్రశేఖర్ ఆజాద్ ''కవి గారి అంతరంగాలు'' పుస్తకం వాటికి భిన్నంగా ఒక్క తెలుగు కవిత్వ విభాగాన్ని ఎంచుకొని అందులో చోటు చేసుకున్న విపరిణామాలు, ఆయా కవుల ప్రవచనాలకి, ఆచరణలకు మధ్య గల అగాధాలను తలపించేటంతటి తేడాలను కొన్నిసార్లు సున్నితంగా, ఇంకొన్నిసార్లు నీళ్లు నములు కోకుండా సూటిగా చెబుతారు. ఇక తన వైయుక్తిక దోషాలను కూడా చెబుతూనే ఈ పుస్తకాన్ని ఎందుకు రాయాల్సి వచ్చిందో మొదటి పేరా లోనే ఇలా అంటారు, "కవులు హాలికులైన నేమి అన్నాడు పోతన/ కవులు ఆల్కహాలికులైన నేమి అన్నాడు శ్రీశ్రీ /ఇద్దరు మహానుభావులే, అప్పటిదాకా అమలులో ఉన్న వాటిని ప్రశ్నించిన వారే, పోతన చెప్పినట్టు నేను హాలికుడ్ని కాలేదు, ఆల్కహాలికుడిని అయ్యాను. దానికి ముందు ఒక క్రమం ఉంది. అవన్నీ కనీసం కొత్త కవుల ముందు పంచుకోవడం ఓ చారిత్రక అవసరమని నేను అనుకున్నాను"




ఈ నేపథ్యంతో ప్రారంభమైన ఈ పుస్తకం ఎన్నో ప్రశ్నలు, ఎన్నో తడుముకోవడాలతో సాగుతూ పాఠకుల ఆలోచనల్ని నిలబెట్టేస్తుంది. కవి సంధిస్తున్న ప్రశ్నలు ఎలా ఉన్నాయో చూడండి: "కవిత్వ నిర్మాణంలో ఇదివరకటి శ్రద్ధ ఉన్నదా? అధ్యయనం ఉందా? మనం సరికొత్త కవులని తయారుచేయగలంగాని కవిత్వ పాఠకులను తయారు చేయగలమా? కొత్తగా రాస్తున్న కవులు ఉన్నారు అలాంటి వారిని సంస్కరించి కవిత్వ యోధులుగా మనం మార్చగలుగుతున్నామా? కనీసం నాలుగు మంచి సూచనలు చేయగలుగుతున్నామా? అనంత ప్రశంసల తప్ప." ములుకుల్లా తగిలె ప్రశ్నలివి . ఇంకా, "కవిత్వం లోనే కాదు, రాజకీయాల్లోనే కాదు, జీవితంలోను మనం చేసిన తప్పుల గురించి, మనం సృష్టించిన సృజన గురించి మాట్లాడుకోవాలి, మరిన్ని తప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి" అనే ఒక మౌలిక ఆలోచన కూడా మన ముందు ఉంచుతారు. కవి అన్నవాడు ఎలా ఉండాలో ఆజాద్ మాటల్లోనే వినండి, "ఈ ప్రకృతి నాది, ఈ అభ్యుదయాలు, విప్లవాలు నాతోనే సాధ్యం అనుకునేవాడు నిజమైన కవి కాలేదు. కవులు నిరంతరం తమను తాము ఉత్సాహ పరచుకోవాలి, ఓటములను తట్టుకోవాలి, కొన్ని సంశయా

లను అట్టి పెట్టుకోవాలి. మనం మంచి జరగాలని ఆశించాలి. ఎలాంటి అపజయాలకైనా సిద్ధపడాలి"

ఇక ఒక వ్యక్తి కవిగా రూపొందుతున్న సందర్భంలో కవిగా ఉండాల్సిన రాజకీయ స్పృహ అవసరాన్ని గుర్తించమంటూనే, "వంద చీలికలున్న చోట తమకు సొంత గొంతు కావాలి, కవులు మనుషుల్ని కలపాలి" అంటారు చంద్రశేఖర్ ఆజాద్. దీనికి కొనసాగింపుగా "మనం రాసే కవితలన్ని గొప్పగా ఉండవు. వాటి పరిమితులు వాటికి ఉంటాయి. నిన్న నేడు రేపు కూడా మనం కవులుగా నిలబడాలంటే వ్యక్తీకరణలో, ముగింపులో, ధ్వనిలో, ప్రారంభంలోనూ కొత్తదనం ఉండాలి. వీటన్నిటికంటే ముఖ్యం కవి హృదయం" అంటూ అవసరమైన మాటలని చేరుస్తారు. కవులలో రెండు బలహీనతలను చూడవచ్చు ఒకటి ఎలాంటి కవిత్వం రాస్తే అచ్చౌతుందో అలాంటి కవిత్వాన్ని రాయడం, రెండు కవిత్వంలో సంచలనాలను సృష్టించాలనుకోవడం. ఈ రెండు ప్రమాదకరమైన ఆలోచనలని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చుతారు ఆజాద్ . ఇంకో సందర్భంలో కవిత్వం రాయడం వెనక ఉండాల్సిన ధర్మహేతువుని గురించి వివరిస్తూ "రోజుకో కవిత రాసేవారు ఉన్నారు, రోజుకి పది కవితలు రాసేవారు ఉన్నారు. ఒక కవి జీవితంలో వేలాది కవితలు ఉత్పత్తి చేయడం అంటే దాన్ని ఏమనాలో ఆలోచించాలి. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచబడుతుంది. కవిత్వం కూడా అంతే. కవిత్వం రాయటం ఓ మానసిక దౌర్బల్యం కాకూడదు. ప్రతి కవిత వెనుక ఓ స్కీమ్ ఉండకూడదు. స్వంత ఎజెండా ఉండకూడదు. కవిత్వాన్ని కవులు గౌరవించాలి, ఆరాధించాలి. కవులు వైద్యులుగా రూపాంతరం చెందాలి తప్ప రోగులు కాకూడదు." ఈ మాటలతో మనం మరోసారి ఆలోచనల్లో పడతాం.

"అస్తిత్వాల పేరుమీద కుచించకపోతున్నామా? విస్మృతం అవుతున్నామా?'' అంటూ నేడు సాహితీ వనములో వేళ్ళూనుకు పోయిన స్త్రీవాదం, దళితవాదం, బీసీ వాదం, ముస్లిం మైనారిటీ వాదం, ప్రాంతీయ వాదాల్లాంటి అస్తిత్వ ఉద్యమాల వలన ఐక్య కార్మిక సంఘటనలో పొడచూపుతున్న విభజన కోణాన్ని చూస్తూ బాధని వ్యక్తపరుస్తారు. సమీక్ష చేసుకుందాం, తగిన జాగ్రత్తలు తీసుకుందాం అంటారీ కవి.సాహితీ లోకం అనివార్యంగా ఆలోచించాల్సిన విషయం ఇది.

సాహితీ సంస్థల నిర్వాకం గురించి కుండ బద్దలు కొడుతున్నట్టుగా చెబుతూ స్వీయ విమర్శలోని అనివార్యతని గుర్తించే ఈ కవి సూచించే ఈ క్రింది మాటలు మనమంతా ఒకసారి విని తీరాలి, "కొంతమందిని గమనిస్తున్నాను వారు సభలకు తమను ఆహ్వానించమని అడుగుతారు, అడిగిస్తారు, సన్మానాలు చేయుచుంటారు. ఆహ్వాన పత్రంలో పేరు అచ్చు అవగానే ఇంకా చుక్కలు చూపించడం మొదలు పెడతారు. మరొక్కటి, ఎక్కడికక్కడ సాహితీ సంస్థలు ఈ తరహా ప్రముఖులను పిలిచి మేము కూడా సత్కరించుకున్నాం అని తృప్తి పడుతుంటారు. ఇలాంటి వారికి జీవన సాఫల్య పురస్కారాలు అందిస్తారు. ఈ బాపతు కవులు వేదిక మీద ఎంతమంది ఉన్నారు, వారు కూడా నాలుగు మాటలు చెప్పాలనుకుంటారనే ఇంగితం మర్చిపోయి మైకు చేతికి అందగానే రెచ్చిపోతారు. ఒక రకంగా ఇది వారి తప్పు కూడా కాదు, సంస్థలది, నిర్వాహకులది . ఇక కవులు చాలా సందర్భాలలో ఎవరు కవితను వారు చదివి మరొకరిని వినకుండానే వెళ్ళిపోతారు. ఎవరికీ సమయం ఉండదు. ఇది నగ్న సత్యం.''అలా అని ఆజాద్ తనను తాను spare చేసుకుంటున్నారా అంటే అదేమీ లేదు. తన విమర్శన ఖడ్గానికి తాను కూడా గురి కావాల్సిందే. అది ఎలాగో ఆయన మాటల్లోనే , "ప్రపంచ సాహిత్యంలో ఉన్న కవుల గురించి కవిత్వం గురించి కోట్ చేయడం వారిని చదవకపోతే మీ జీవితం వ్యర్థం అన్నట్లు చెప్పడం ఇలాంటి విన్యాసాలు నేను చేశాను, నా పాండితీ ప్రకర్షణ వేదికల మీద ప్రదర్శించాను, ఎవరికి అర్థం అయిందో అప్పుడు తెలియదు. మెల్లగా నాకు అర్థమైంది" అంటూ "నేను ఇప్పుడు నేను కాను, మనం ఇక్కడున్న నలుగురిలో ఒకరు మాత్రమే. అందరికీ సమయం ఇవ్వాలి, అందరూ మాట్లాడాలి, వంద పూలు వికసించటం అంటే ఇదే కదా" అని ముక్తాయిస్తారు. గుండెల్లో నిజాయితీ ఆలోచనలో ఒక బాధ్యత ఉన్నప్పుడే ఇట్లాంటి మాటలు ఉబికి వస్తాయి.

శత్రువుకి అవకాశాన్నిస్తూ మనలో మనం ఎలా ఉంటున్నామో చెబుతూ, "మనం విశాల విశ్వం గురించి మాట్లాడుతాం. మానవజాతి గురించి, ప్రపంచ దేశాలలో రావలసిన మార్పుల గురించి ,మొత్తంగా భూ ప్రపంచం కొత్త దిశగా ప్రయాణం చేయడానికి ఏమి చేయాలనే ఆశతోనే ముందుకు వస్తాం. తర్వాత కులం, మతం, ప్రాంతం, జెండర్ లాంటి అనేక సమస్యల్ని పరిష్కరించు కోలేక ఎవరైతే కలిసి పోరాటం చేయాలో వారే ఎదురెదురుగా నిలబడతాం. శత్రువు నరదాగా చూస్తుంటాడు, ఓ జాతి అంతర్యుద్ధంలో నిర్మూలనము

కావటం మించి వారికి కావాల్సింది ఏమిటి?" అంటూ మన ముందు ఒక ఆసలు సిసలు విషాదాన్ని పరుస్తారు, కలిసి కార్యాచరణలోకి దిగుదాం అంటారు చంద్రశేఖర్ ఆజాద్.

నేటి కవిత్వ క్షేత్రానికి పట్టిన చీడ పీడల్ని గురించి చెబుతూ, "నాకు ఒక్కోసారి అనిపిస్తుంటుంది మనకు సైంటిస్టులు ఉన్నారు, వారు అనేక ఆవిష్కరణలు చేస్తారు. అవన్నీ ఉమ్మడిగా మానవాళికి ప్రయోజనాన్ని కలిగించేవి. కొన్ని ప్రయోగాలు ప్రపంచాన్ని విధ్వంసంలోకి నెట్టేవి. అక్కడ ఇన్ని చీలికలు, ఇంతగా వైరుధ్యాలు ఉండవు. మన కవిత్వాలు, కథలు కులాలకు, మతాలకు, ప్రాంతాలకు పరిమితం." అంటారు.తెలుగు సాహితీ లోకం సీరియస్గా ఆలోచించాల్సిన ఒక పరిశీలన ఇది.

సమాజ ప్రయోజనమే సాహిత్య ప్రయోజనంగా సాహిత్య లక్ష్యంగా ఉండాలి. ఇదొక సార్వత్రిక సూత్రంగా అందరము అంగీకరించి సాహితీ సేద్యం చేయాల్సిన సందర్భంలో ఉన్నాం. కానీ దీనికి విరుద్ధంగా వాస్తవం ఎలా ఉందో ఆజాద్ పరికిస్తూ, పరిశీలిస్తూ, "మనలో కొంతమంది వ్యక్తులుగా మాత్రమే ఓ సంస్థ హోదా పొందుతున్నారు వారు ఎంత గొప్ప సారస్వతం సృష్టించిన అవి వ్యక్తిగత ఇమేజ్ ని పెంచడం తప్ప ఆచరణ రూపానికి రాలేవు. ఇది వయసు మీరిన వారి గురించి కాదు యువకులుగా ఉన్నప్పటి నుంచి వారు ఇలాంటి మార్గాన్ని ఎంచుకున్నారు" అంటారు. ఇదే సందర్భంగా, ఇంకా చెబుతూ, "ఇప్పుడున్న ఏ కవిత్వ ఉద్యమం,ధోరణీ ఇవన్నీ కొన్ని గ్రూపులు మాత్రమే నడుపుతున్నాయి. వీరందరూ చెప్పేవి ఇంకా రుజువు కావలసి ఉంది. ఇందులో ఉన్నవారు వీటిని విశ్వసిస్తున్నారా? ప్రచురణకు, పతనానికి, కెరీర్ కి మెట్టుగా చూస్తున్నారా? ఎంతమంది తమ పరిధిలో ఆచరణకు దిగుతున్నారు? అసలు ఈ ఉద్యమాల ఆచరణ ఏ రకంగా ఉండాలి? కవిత్వం రాయడంతో సరిపోతుందా ?ఓ సంస్థగా ఏర్పాటు అవుతారా? దాని నాయకత్వం ప్రజాస్వామ్యయుతంగా ఉంటుందా?" అంటూ సంస్థలకు ఉండాల్సిన సమ్మిళిత (Inclusive) స్వభావ అని వార్యత గురించి ఆలోచించమని ఓ మౌలిక అభిప్రాయాన్ని మన ముందు ఉంచుతారు.

Let us think అంటూ ఆయన సంధించిన మరో మూడు ప్రశ్నలు– కవిత్వం ఎవరికోసం? వర్ణం మారవచ్చు గాని వర్గం మారదు అంటారు అది వాస్తవమా? వర్ణ సంకరానికి ముందుకు వస్తున్న వారు వర్గ సంకరానికి ముందుకు వస్తారా? వీటికి అతను చెప్పుకున్న సమాధానాలు, చేసిన చర్చ ఈ పుస్తకం మొత్తానికి హైలెట్స్ గా నిలుస్తాయి.

కవిత్వం అంటే ధిక్కారం అనే ఒక బలమైన అభిప్రాయం సాహితీ వసారాల్లో గిరికీలు కొడుతూ ప్రచారంలో ఉండటం మనమందరం ఎరిగిందే కానీ ఆజాద్ చూపు వేరు. ఆయన అంటారు కదా, "కవిత్వం అంటే ధిక్కారమే అయితే అది ఓ చిన్న అంశం. కవిత్వం అంటే సమన్వయం. కవిత్వం అంటే మానవుల్ని, ప్రకృతిని అర్థం చేసుకోవడం. అలాంటిది లేనప్పుడు కవిత్వమే కాదు. ఏదైనా క్రమంగా మృతప్రాయం అవుతుంది. అందుకని అందరూ వీలైనంత మేరకు ఆత్మ విమర్శ చేసుకుంటే బాధామయులందరూ కలిసి మాట్లాడుకునే స్థితి వచ్చే మార్గం దొరుకుతుందేమో – కనీసం నిజాయితీ పరులకి".

తమ సుదీర్ఘ సాహితీ జీవితంలో ఎదురైన చేదు అనుభవాలు, భ్రమలు తొలగిపోవటాలు నేడు సాహితీ లోకం చేస్తున్న ఒక నిరాశమయ, భరోసా ఇవ్వని ప్రయాణాలు, జీవితానికి, సాహిత్యానికి మధ్య ఉండాల్సిన ఒక ఆశామయ బంధం తెగిపోతున్న చప్పుళ్ళు కవి హృదయాన్ని భగ్నం చేస్తున్నాయేమో మరి "ఈ ప్రపంచం ఏమైపోతేనేం, నేను నా కుటుంబం చల్లగా ఉంటే అదే పదివేలు కదా! అయ్యో ఇదేమిటి? ఇలాంటి వేదాంతమా అనిపిస్తుందా? ఇవే కదా వాస్తవాలు. మనం – కనీస మాత్రం ఇప్పుడు బతుకుతున్నది మన గతంలో, మన నోస్టాల్జియాలో,నిన్నటి మన కవిత్వాల మీద. ఇప్పటికీ రోజుకో, వారానికో కవిత కరుణిస్తున్నా అందులో "హృదయం" ఎక్కడుంది. ఇదో మాయోమేయ ప్రపంచం! ఈ మాయ పొరలని విప్పాలని ఆ సాలె గూటిలో ఇరుక్కు పోయిన కవిని నేను. నా అంతరంగం ఇప్పుడు బావురుమంటుంది. 70 పేజీలు ఉన్న ఈ పుస్తకం చిన్నదే , ఒక గంట రెండు గంటల్లో చదివేయవచ్చు. కానీ ఈ పుస్తక పఠనం మిగిల్చిన అనుభవం మాత్రం అంత చిన్నది ఏమి కాదు. కొన్ని నెలలు పాటు మనల్ని వెంటాడే పలుకులు ఈ ''కవి గారి అంతరంగాలు''. ఒక విస్తృతస్థాయి కవిత లోక పునర్నిర్మాణం జరగవలసిన సందర్భాన్ని ముక్కుసూటిగా, తడుముకోకుండా చెప్పిన పుస్తకం ఏదైనా ఈమధ్య కాలంలో వచ్చింది అంటే అది ఖచ్చితంగా ఈ "కవి గారి అంతరంగాలు" అని మనం చెప్పవచ్చు. సాహిత్య కారులంతా ఈ పుస్తకాన్ని ఒకసారి చదవాలి, వర్తమాన రచయితల చేత చదివించాలి, ఆత్మ విమర్శని స్వాగతిస్తూ, ఒక నూతన సాహిత్య లోక నిర్మాణానికి శ్రీకారం చెప్పాలి.

అలజంగి మురళీధరరావు
పాడేరు, సెల్ నెంబర్ 9440335461

# డా. పులిగడ్డ విజయలక్ష్మి

- డా. గిన్నారపు ఆదినారాయణ

తెలుగు సామాజిక, సాహిత్య అంశాలపై నిత్యం వ్యాసాలు రాస్తూ నేటి సాహిత్యకారులకు కొత్త జ్ఞానాన్ని అందిస్తున్న సరస్వతి సమ్మాన్, జీవన సాఫల్య పురస్కార గ్రహీత కవయిత్రి, రచయిత్రి, విమర్శకురాలు పులిగడ్డ విజయలక్ష్మి. సంప్రదాయ కుటుంబంలో జన్మించినప్పటికి ఆధునిక భావజాలంతో 1972లోనే స్వాతంత్ర్యానంతర ప్రజాకవిత్వాంశాలను వెలికితీసిన గొప్ప పరిశోధకురాలు. నేటికి సుమారు 82 సంవత్సరాల వయస్సు అయినప్పటికి సాహిత్య పుస్తక పఠనం, వ్యాసరచనా ప్రక్రియను కొనసాగిస్తూ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న సహృదయురాలు డా. పులిగడ్డ విజయలక్ష్మి.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఐదేళ్ళ ముందు 1942 అక్టోబర్‌లో గుంటూరులో భూ ప్రపంచానికి పరిచయం అయ్యారు. అప్పటికి మన ప్రాంత, దేశ పరిస్థితులు ఎలా ఉన్నాయో మనకు తెలిసిందే. ముఖ్యంగా విద్య అందరికి అందుబాటులో లేని కాలం. మరీముఖ్యంగా స్త్రీలకు విద్య అంటే ఏమిటో తెలియని స్థితి. అలాంటి పరిస్థితిలో కూడా విద్య కొనసాగించారు పులిగడ్డ విజయలక్ష్మి. సంవత్సర ప్రాయంలోనే తండ్రి ఆయలూరి సుబ్బారావు గారిని కోల్పోయి ఏటికి ఎదురీదిన ధీశాలి. అమ్మ ఆయలూరి లలితాదేవి ప్రోత్సహంతో చదువుకొనసాగించారు. 12 సంవత్సరాలకే తన మేనమామ పులిగడ్డ శివానందశర్మ గారితో బాల్యవివాహం అయ్యింది. చదువుకు వివాహం అడ్డుకాదని ఆనాటి కాలంలోనే నిరూపించి గుంటూరు ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాలలో స్నాతక విద్య పూర్తి చేశారు. ఆ తర్వాత ఎం.ఏ (తెలుగు) తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేసి స్వర్ణ పతకం సాధించిన మొట్టమొదటి విద్యార్థిని. తెలుగు బోధనకు ప్రణాళికలు రచించిన ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి ప్రత్యక్ష శిష్యురాలు.

ప్రముఖ భాషాశాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి, కోరాడ మహాదేవశాస్త్రి, పంగనామల బాలకృష్ణ మూర్తి, జీరెడ్డి చెన్నారెడ్డి గార్ల బోధనలను ప్రత్యక్షంగా విని జ్ఞానమేధస్సును పెంచుకొని నేటి తరానికి అందిస్తున్న సాహితీ విదుషీమణి పులిగడ్డ విజయలక్ష్మి. ఇంత గొప్ప పండితుల సమక్షంలో విద్యనభ్యసించి, విశ్వవిద్యాలయ స్థాయిలో స్వర్ణ పతకాన్ని సాధించారు. పి.జి పూర్తయ్యాక దాదాపు 30 ఏళ్ళకు పైగా తెలుగు అధ్యాపకురాలిగా, ఆ తర్వాత డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఈ క్రమంలోనే ఆచార్య అరిపిరాల విశ్వం గారి పర్యవేక్షణలో 'స్వాతంత్ర్యానంతర కాలమునందలి ప్రజాకవిత్వము' అనే అంశంపై 1979లో ఎం.ఫిల్ పూర్తి చేశారు. ఆ తర్వాత ఆచార్య ఎం. కులశేఖర రావు గారి పర్యవేక్షణలో 'తెలుగులో కావ్య నాయికలు' (ఇతిహాస, పురాణ, ప్రబంధాలు) అంశంపై పిహెచ్.డి., పూర్తి చేశారు. పదవీ విరమణ అనంతరం, సమయం సాహిత్యానికి కేటాయించి 82 సంవత్సరాల వయస్సు వచ్చినప్పటికి నేటికి దర్శనం, అష్టాక్షరి, శ్రీవేంకటేశం, సప్తగిరి, అక్షరాంజలి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఈనాడు వంటి వివిధ దిన, మాస పత్రికల్లో వ్యాసాలు రాస్తూ నిత్యం కొత్త విషయాలను మనతో పంచుకుంటున్నారు.

**రచన ప్రక్రియలు కొనసాగింపు :** శ్రీ మహాభాగవతం (వచనం) (దశమస్కంధం ఉత్తరభాగ ప్రతిపద్య భావ రచన)

తెలుగు సమాజంలో బమ్మెర పోతన రాసిన మహాభాగవతం పరిచయంలేని వారు ఉండరు. అయినప్పటికీ అందరికీ సులభంగా సహజంగా అర్థమయ్యే విధంగా ప్రతి పద్యాన్ని భావయుక్తంగా వచన రూపంలో రాశారు. ప్రాచీన సాహిత్యం మీద పట్టు ఉందనడానికి ఈ రచన నిదర్శనం. శ్రీవేంకటేశం అనే ఆధ్యాత్మిక మాసపత్రిక వీరు రాసిన ఈ పన్నెండు స్కంధాల భాగవతాన్ని ధారావాహికగా ప్రచురించింది. మొత్తం భాగవతాన్ని వివిధ పండితులచేత రాయిస్తూ దశమస్కంధం ఉత్తరభాగాన్ని విజయలక్ష్మి గారిచే రాయించి, శ్రీ రామకృష్ణ మఠం వారు ప్రచురించారు. 369 పేజీలతో 49 ఉపశీర్షికలుగా విభజించి రాశారు.

నారాయణ ద్విశతి (పద్య లఘు కావ్యం) (2010) మనం సహజంగా శతకాలు పరిశీలిస్తే మకట నియమం

అనేది పద్యం చివరి పాదంలో, చివరి పాదం చివరి పదంగానో ఉంటుంది. కాని పులిగడ్డ విజయలక్ష్మి ప్రతి పద్యంలో కూడా ఆది మకుటాన్ని ప్రవేశపెట్టి నారాయణ ద్విశతి రచనని కొనసాగించారు. ప్రతి పాదం మొదట ఆది మకుటాన్ని ఉంచి రెండు వందల పద్యాలను రాయడం చాలా గొప్ప విషయం. మకుటాన్ని మొదట్లో ఉంచడం వల్ల ప్రాస, యతి స్పష్టంగా కనబడుతుంటాయి. ఈ రచన వేంకటేశ్వర మంత్రపీఠం వారి సహకారంతో 2010లో ప్రచురితమైంది. దీనికి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు, వారణాసి వెంకటేశ్వరశాస్త్రి, ఆచార్య కులశేఖరావు గార్లు ముందుమాటలు రాశారు.

**పోతన భాగవతం - భక్తశిఖామణులు (2012) :** ఈ గ్రంథం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రచురించారు. తెలుగు ప్రజలందరి చేతిలోకి వెళ్ళిన గ్రంథంగా చెప్పవచ్చు. ఇందులో ధ్రువుడు, ప్రహ్లాదుడు, పరీక్షిత్తు, భీష్ముడు, రుక్మిణీదేవి, నారదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, కుచేలుడు వంటి పాత్రల ద్వారా భక్త శిఖామణుల భక్తితత్పరతను, వారి జీవిత విశేషాలను, పరమాత్మయందు వారి ఆత్మానుసంధానాన్ని, మహా భక్తులపట్ల భగవంతుడు ప్రదర్శించే వాత్సల్యాతిశయాన్ని వివరించే గ్రంథమే బమ్మెర పోతన మహాభాగవతం - భక్తశిఖామణులు. భక్తి తత్వంలోని వైశిష్ట్యాన్ని, మహాభక్తుల అనన్యమైన దైవచింతనను, మోక్షసిద్ధిని ప్రతిఫలింప చేయటమే ధ్యేయంగా కొనసాగిన రచన ఇది. 'దర్శనం' అనే ఆధ్యాత్మిక మాసపత్రికలో 10 సంవత్సరాల నుండి 'శివలీలలు' అనే శీర్షిక క్రింద శంకరుని అనేక లీలలు వ్రాసారు.

**స్వాతంత్ర్యోత్తర కాలమునందలి ప్రజా కవిత్వము (2023):** ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం ఇది. 1979లో ఈ పరిశోధన వ్యాసం పూర్తిచేశారు. ఇటీవల కాలంలో 2023 లో సాహితీ జిగీష సంస్థ హైదరాబాద్ వారు ప్రచురించిన ప్రథమ గ్రంథం. పరిశోధన చేసిన 45 సంవత్సరాల తర్వాత పుస్తకంగా ప్రచురించారు. అది కూడా వారి కుమార్తెల ప్రోత్సాహంతో వారి సంస్థ ద్వారా ముద్రణ జరిగింది. రాస్తూ వెళ్ళడమే తన పని అంటారామె. ఆధ్యాత్మిక భావజాలం ఉన్న విజయలక్ష్మి గారు అభ్యుదయ భావజాల అంశంపై పరిశోధన చేయడం అనేది కత్తిమీద సామే. అయినప్పటికి కూడా చాలా గొప్ప పరిశోధన గ్రంథాన్ని మనముందుంచారు. 1979లో అప్పటికి సాహిత్యంలో కొన్ని వాదాలు పుట్టనే లేదు. అప్పుడప్పుడే చిగురిస్తున్నాయి. అప్పటి తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలనలోని కొన్ని పరిస్థితులు ఇంకా అంటిపెట్టుకునే ఉన్నాయి. అలాంటి సందర్భంలో ఈ పరిశోధన చేశారు. గద్దర్‌గా ప్రాచుర్యం పొందిన విఠల్ రావు అప్పటికి యువకవిగా ఉన్నారు. వారిని మొదటిసారి సాహిత్యంలో పరిచయం చేసిన మొదటి వ్యక్తి బహుశ విజయలక్ష్మి గారే అని చాలా మంది అభిప్రాయం. అస్తిత్వ ఉద్యమాల కవిత్వాన్ని గురించి తెలుపుతూ దిగంబర కవులు రాసిన కవితలను చదివి "నీ వేల సంవత్సరాల గొడ్రాలి సంస్కృతిని / ఏ దేశమేగినా ఎందు కాలిడినా / కారం పోర్లించిన రోకళ్లతో / పట్టపగలు విషయించాలనుంది" అన్నప్పుడు దిగంబర కవులు గాడిదలు, గొర్రెలు, పందులు, కుక్కలనటం అనవసరమైన ఆవేశానికి తార్కాణాలు (పుట:163) అని కుండబద్దలు కొట్టినట్లు తెలిపారు.

స్వాతంత్ర్యోత్తర కాలంలో ఉన్న ప్రజా కవిత్వం మొత్తం కూడా తెలుగు ప్రజల మనుగడను తెలుపుతూ శ్రామిక, కర్షక జీవన విధానాన్ని ప్రజా కవిత్వంలో ప్రధానంగా సాంప్రదాయిక విలువలు, ఆధునిక సాంఘిక విలువలు, జాతీయభావన, ప్రజాస్వామ్య విశ్వాసం, మానవత దృక్పథం, సాంఘిక సమానతను గురించి తెలియజేసే అంశాలు ఎన్నింటినో ఈ పరిశోధనలో తెలియజేశారు.

**శతక మంజరి (ప్రతిపద్య భావ రచన) (2013) :** కానూరి లింగమూర్తి రాసిన తొమ్మిది శతకాలను అనువదించిన రచన ఇది. ఇందులో శ్రీ నరసింహ శతకము, శ్రీ కేశవ శతకము, నక్షత్రమాల, రంగ శతకము, శ్రీ కృష్ణోత్తర శతకము, కృష్ణరాగావళి, శ్రీ వేకటేశ్వరషోడశాష్టపది, భక్తామృతము, జానకిపతి శతకము వంటి తొమ్మిది శతకాలను కళాశాల స్థాయి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని ప్రతి పద్యానికి సులభమైన భావరచనను చేశారు. ఈ గ్రంథాన్ని సి.పి బ్రౌన్ అకాడమి వారు ప్రచురించారు.

**సాహితీ చంద్రిక (2024) :** 'సాహితీ చంద్రిక' వ్యాస సంపుటిని 2024లో సాహితీ జిగీష సంస్థ హైద్రాబాద్ వారు ముద్రణ చేశారు. ఇందులో 42 సాహిత్య, ఆధ్యాత్మిక

వ్యాసాలు ఉన్నాయి. ఈ వ్యాస సంపుటికి ఇదొక చంద్రకాంత దీపం పేరుతో వోలేటి పార్వతీశం, ఐ కాన్ ఆఫ్ దా క్లాసికల్ లిటరేచర్ పేరుతో ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ప్రస్తుత వైస్ చాన్సలర్ తెలుగు విశ్వవిద్యాలయం వారు ముందుమాటలు రాశారు. 408 పేజిలతో ప్రాచీన సాహిత్య ప్రధానాంశాలను, ఆధునిక నూతన ధోరణులను అద్దంలో కొండను చూపించినట్లు వివిధాంశాలను పరిచయం చేశారు.

గడిచిన 20 సంవత్సరాల కాలం నుండి రాస్తున్న వ్యాసాలన్నింటిని పుస్తకంగా తీర్చిదిద్దారు. ఈ గ్రంథం రావడం వెనక వారి పుత్రికలే ప్రధాన కారణం అని కవయిత్రి ముందుమాటలో చెప్పుకొన్నారు. వ్యాసాల క్రమం మనం గమనించినట్లయితే తన మొదటి వ్యాసాన్ని శ్రీ విఘ్నేశ్వర స్తుతితో ప్రారంభం చేసి శరణాగతి అనే వ్యాసంతో ముగిస్తారు. ఇందులో ప్రధానంగా ఎనిమిది ఆధునిక సాహితీ వేత్తలు, వారు రాసిన రచనలపై వ్యాసాలు ఉంటే, మూడు సామాజిక అంశాలకు సంబంధించిన వ్యాసాలు మినహాయిస్తే మిగిలిన వ్యాసాలు మొత్తం కూడా ఇతిహాస, పురాణాల గురించి అందులోని పాత్రల గురించిన వ్యాసాలే మనకు కన్పిస్తాయి. సాహితీ చంద్రిక వ్యాస సంపుటిలో పులిగడ్డ విజయలక్ష్మి భావజాలం, విమర్శనా కోణం అధికంగా కన్పిస్తాయి. కొన్ని పత్రికల్లో వారు రాసిన ఆధ్యాత్మిక అంశాలకు సంబంధించిన వ్యాసాలను నేను చదివాను. కాని ఈ గ్రంథం చదివాక వారి లోతైన దృష్టికోణం మనకు అర్థమవుతుంది. శివతత్త్వం అనే వ్యాసం చదివితే తెలుగు సాహిత్యంలో శివకవుల యుగంగా గుర్తింపు పొందిన 12 వ శతాబ్దంలో అనేక రకాలైన మార్పులు కన్పిస్తాయి. శివతత్త్వాన్ని గురించి రచయిత్రి శివతత్త్వం బోధపడితే, శివుని ఏకాగ్ర చిత్తంతో ఆరాధిస్తే శివసాయుజ్యం తప్పక లభిస్తుంది అంటూ శివుని కన్న ఇతరమైనది ఏదీ లేదని, ఇతరమేదీ శివుని కన్న భిన్నమైనది కానరాదని తెలుసుకుంటే శివతత్త్వం బోధపడినట్లే అని అంటుంది. ఇంకా శివుని గురించి చెబుతూ శివుడికి మొదలు, తుదీ ఉండదు. బంధువని, శత్రువని ఉండరు. విధినిషేదాలు ఉండనే ఉండవు. జనన మరణాలు లేదు. భవుడూ ఆయనే, అభవుడూ ఆయనే అని శివుడి కీర్తిని గురించి తెలుపుతుంది.

అలాగే అనువాద విన్యాసం అనే వ్యాసంలో భాగవతం గొప్ప తనాన్ని గురించి తెలుపుతూ ఇలా అంటుంది. భగవంతుడంటే ఎవరు? భగవంతుడు ఏం చేస్తాడు? ఏమిస్తాడు? ఎలా రక్షిస్తాడు? ఎవరెవరిని రక్షించాడు? మనల్ని కూడా రక్షిస్తాడా? మనకు కనపడడేం? ఎక్కడున్నాడు? ఆయన దగ్గరకు వెళ్ళడం ఎలా? ఏం చేయాలి? ఏం చేస్తే ఆయన రానిస్తాడు? అసలు రానిస్తాడా మనకు కనపడతాడా? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్పే గ్రంథమే భాగవతం. భాగవతం భక్తిని నేర్పుతుంది. జ్ఞానాన్ని ఇస్తుంది అని తెలుపుతుంది.

శివకవియుగం అనే వ్యాసంలో శైవయుగ ప్రాముఖ్యత, ప్రశస్తిని గురించి తెలుపుతూ ఇలా అంటుంది. వీర శైవమత వీర విజృంభణానికి సమాజంలోని విభిన్న మనస్తత్వాలు ఎంత దోహదపడ్డాయో శివకవుల వీరావేశ కవితలు అంత సహాయ కారకాలైనాయి. శివకవుల సాహిత్యం ఆనాటి సామాజిక వ్యవస్థకు మణిదర్పణమే కాక సమాజాన్ని తనతో పాటు తీవ్ర దిశలో నడిపించదనే చెప్పాలి. ఈ మహాకవుల కవితా సృష్టి సమాజాభివృద్ధికే నిలిచిందా? అని ప్రశ్న వేసుకుంటే ఒకరకంగా అవుననిపిస్తుంది, వేరొకరకంగా కాదేమోననిపిస్తుంది. సామాజిక పురోగమన తిరోగమనాలు రెండూ శివకవుల సాహిత్యంలో దర్శనమిస్తాయి అంటుంది రచయిత్రి. ఇలా అంటూనే పెరుగుట విరుగట కొరకే మరి అని కూడా తెలిపారు. పాల్కూరికి సోమన కావ్య గుణాలు పలువురిచే ప్రశంసింపబడ్డాయే కాని, అతని మతాభిమానము సర్వజన సమ్మతం కాలేకపోయింది. 'అన్ని కులాలవారు సమానము' అన్న శివకవుల ఆదర్శం అందరి మెప్పునూ పొందింది కాని, తక్కిన మతాల కన్న శైవమొక్కటే గొప్పదన్న వారి ప్రచారం ఆదరణ పొందలేక పోయింది. సాహితీ సృష్టిలో గాని, భక్తి తత్త్వంలో గాని సమాజాభివృద్ధి సాధించిన శివకవియుగం, సర్వమత సామరస్యంలో వెన్నుపోటు తిని ప్రజాదరణకు పాత్రం కాలేకపోయింది. 'దేశి మార్గాచార్యుడ'ని వినుతించిన ప్రజలే సోమనాథుని మతావేశానికి అసహనం పాలయినారు అని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. అలాగే బోయి భీమన్న రచనల్లోని పౌరాణిక పాత్రలు అనే వ్యాసంలో భీమన్న వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ వారి పాత్రల చిత్రణ అద్భుతం

అంటూ ఆధునిక భావజాలంలో ప్రాచీన సంప్రదాయాలను జీర్ణం చేసుకున్న మనిషి భీమన్న అంటూ వారు రాసిన నాలుగు నాటకాల్లో ఏకసూత్రత కన్పిస్తుంది. కులనిర్మూలన విధానం, సర్వజన సమైక్య సంధానం అంతర్లీనంగా చోటు చేసుకున్నాయి అంటుంది. అలాగే తన గురువు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గురించి చెబుతూ పింగళి వారు వాగ్దేవి వరప్రసాదులే కాదు, సాక్షాత్తు సరస్వతి దేవికి ఎదురుగా నిల్చి మనోహరమైన కవిత్వం చెప్పగల మహామనిషి. పింగళి మాటల్లోనే వింటే వారి మనోధైర్యం, వాగ్ధాటి, కవితాశక్తి, అనిర్వచనీయమైన ప్రతిభా పాటవాలు మన చెవులలో మార్మోగుతాయి. ఆ పలుకులు మన హృదయాలపైన చెరగని ముద్ర వేస్తాయి అంటుంది. ఇలా వారి వ్యక్తిత్వాన్ని సాహిత్య అభివ్యక్తిని గురించి చాలా చక్కగా వివరించారు. అలాగే ఇందులో కొన్ని ఇతిహాస, పురాణ పాత్రలైన భీష్ముడు, సిరియాళుడు, అత్రి మహర్షి, అగస్త్యుడు, పరశురాముడు, ద్రౌపది, అదితీదేవి, దితీ దేవి, దమయంతి, లకుమ మొదలైన పాత్రలను చాలా అద్భుతంగా వివరించారు రచయిత్రి. ఒక్కొక్క పాత్ర ఒక పరిశోధనా పత్రంగా కన్పిస్తుంది. ఆ పాత్రలలో ఉన్న సామాజిక నేపథ్యాన్ని తెలుపుతూ ఆ పాత్ర సమాజానికి ఎలా ఆదర్శంగా నిలుస్తుంది అనే విషయాలను కూడా చెప్పారు రచయిత్రి. డా. పులిగడ్డ విజయలక్ష్మి ఆధ్యాత్మిక భావజాలంతో భారత, భాగవతంలోని వివిధ పాత్రలను చాలా అద్భుతంగా వివరించి తెలిపారు. భక్తితోపాటు రక్తి కట్టించే అనేక అంశాలను విమర్శనా కోణం నుండి రాశారు. అందులో ప్రధానంగా పురాణాల్లో పతివ్రతలు ఈనాడు ఆదర్శప్రాయాలేనా (సావిత్రి, దయమంతి) అనే వ్యాసం కానీ, శృంగార శృతి మించింది నాడా? నేడా? అనే కొన్ని వ్యాసాలు కానీ చదివితే భక్తి గురించి గొప్పగా చెప్పిన రచయిత్రి శృంగార, అద్భుత రసాలను కూడా చాలా సహజంగా వివరించారు అని అనిపిస్తుంది. సామాజిక బాధ్యత దృష్టి కోణం ఉన్న వారు ఏ విషయానైనా ఉన్నతంగా చెప్పగలరు అనడానికి ఉదాహరణ విజయలక్ష్మి గారు.

ముగింపు : పులిగడ్డ విజయలక్ష్మి ప్రతి రచన కూడా నేటి సాహితీవేత్తలకు ఎంతో ఉపయోగపడతుంది. పైన చెప్పిన రచనలే కాకుండా పాల్కురికి సోమనాధుని కవితా ప్రాభవం నాటి పురాణం నేటి సమాజం - బ్రహ్మవైవర్త పురాణం, కోకిలమ్మ పిలుపు, భీష్ముడు వంటి రచనలు కూడా మన ముందుంచారు. ఇలా వీరు ఆకాశవాణిలో 25 సంవత్సరాలు అనేక కార్యక్రమాల నిర్వహణ చేసి, దూరదర్శన్ లో వివిధ ప్రసంగాలు చేశారు. ఇలా వీరు చేసిన సాహితీ కృషికి గాను విశ్వభూషణ్ అవార్డు, ఐకాన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం, జీవన సాఫల్య పురస్కారం, తెలుగు భాషా రత్న అవార్డ్, సరస్వతి సమ్మాన్ అవార్డు, వంటి పురస్కారాలను పొందారు. ఎన్ని అవార్డులతో వీరిని అనేక సంస్థలవారు సత్కరించినా వీరు సౌమ్యంగా, సాదాసీదా సాహితీవేత్తగా నిగర్విగా ఉండడం వారి గొప్పతనం చెప్పవచ్చు.

డా. గిన్నారపు ఆదినారాయణ
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విశ్వవిద్యాలయం,
పి.జి కళాశాల, సికింద్రాబాద్, ఫోన్ : 9949532456,

## కమ్మతెమ్మెరలు

**మిసిమి** 2025-జనవరి-సంపాదకీయం- డైరీలో-భరతమాత కన్న బిడ్డలు విదేశీ తల్లులకు దారదత్తం చేసే కన్న తల్లిదండ్రుల కడగండ్లను కళ్ళకు కట్టారు. మీ సన్నూ డాటరూ! గ్రీను కార్డు హోల్డర్లట కదా! మా వాడికీ ఈ మధ్యనే గ్రీనుకార్డు వచ్చిందని గొప్పలు చెప్పుకొనే వారికి ఈ కథనం కనువిప్పు కావాలి. పెండ్లి నిర్వచనం మారిపోయి పెళ్ళిల్లు మూణ్ణాల్ల ముచ్చటే అయిందని కొన్నాళ్ళు - కొన్నేళ్ళు- మరికొన్నాళ్ళని చక్కటి వాక్యాలతో యువతకు చురకలంటించారు. జాతీయ సదస్సులో గౌరవ అతిథిగా పాల్గొనడమే గాక అక్కడ జరిగిన సదస్సు ముఖ్యాంశాలను సంగ్రహంగా ప్రస్తావించారు. గౌరవ అతిథిగా గవర్నర్ గారిచే సత్కారం పొందినందుకు అభినందనలు.



*డా. సగిలి సుధారాణి, ఫోన్ : 9490428825*

# రెంటాల కూనలమ్మ పదాలు

– పేపకాయల ప్రసాద్

“ప్రాచీన తెలుగు సమాజంలోని ప్రజలకు వినోదాన్ని, విలువలను పంచి, ఒకనాటి సాహిత్యంలో వాడుకలో ఉండి కాలగర్భంలో కలిసిపోయిన కూనలమ్మకు పునః సృష్టి చేసిన కవి, పరిశోధకులు శ్రీ ఆరుద్ర 1964లో కూనలమ్మ పదాలు వెలువరించారు. ఆరుద్ర గారి కూనలమ్మ సొగసుకో, నడకకో ముచ్చటపడి ఆయన తరువాత మరెందరో కవులు వారిలా రాయాలని ప్రయత్నం చేసారు. మకుటాన్ని మార్చి మరీ తమ ముద్రను వేరుగా నిరూపించుకోవాలని తహతహలాడారు ! అయినా అవేవీ ఆదరించబడినట్టు లేదు ! ఆరుద్ర కూనలమ్మ పుట్టిన రెండు తరాలకు కొత్తగా అదే మకుటంతో రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారు సృజించినవి ఈ కూనలమ్మ పదాలు. రెంటాల వారు తమ గజల్స్ ద్వారా తెలుగు సాహిత్య ప్రియులకు పరిచితులు. రచయితగా, విమర్శకునిగా, అనువాద రచయితగా, వక్తగా – ఆధునిక తెలుగు సాహిత్య రంగాన తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్న సాహితీమూర్తి. రెంటాల కూనలమ్మ పదాలను పరిచయం చేయటం ఈ వ్యాస ఉద్దేశం.

కూనలమ్మ పదం ఆకారంలో చాల చిన్నది. చూడగానే ముచ్చటేసేలా ఉంటుంది. మాత్రా ఛందస్సులో నడుస్తూ – వినటానికి మరింత ముచ్చట గొలిపే ఈ పదంలో 4 పాదాలు ఉంటాయి. మొదటి మూడు పాదాల్లో పదేసి మాత్రలు, మకుటం ఉండే చివరి (నాలుగవ) పాదంలో 8 మాత్రలు ఉంటాయి. పై రెండు లేదా మూడు పాదాల ఆరంభంలో (అచ్చు / హల్లు సామ్యంతో) యతి మైత్రి ఉండాలి. యతి మైత్రి కుదరని పక్షంలో ప్రాసయతి ఉంటుంది. మూడు పాదాల చివరన ప్రాస ఉండాలి. ఇదంతా కూనపదం యొక్క ఆంతరిక స్వరూపం. శబ్దగతమైన, పదగతమైన, ఛందోగతమైన నిర్మాణానికి సంబంధించినది. అయితే ఆంతరిక శిల్పం ఒక్కదానినే పరిశీలించి, పద సౌందర్యాన్ని గూర్చి – విషయపరమైన నిర్మాణంలో భాగంగా కవి తాను చెప్పదలచుకున్న భావాన్ని మలచుకున్న తీరును గూర్చి చెప్పకుండా విడిచిపెడితే ఈ విమర్శ ఆరుద్ర చెప్పినట్లు గుబ్బ యెముక పరీక్ష లాంటిదే అవుతుంది! కనుక ఈ వ్యాసంలో అవసరం మేరకు రెంటాల కూనపదాల బహిరంతస్స్వరూపాలను రెంటినీ విశ్లేషించి చెప్పే ప్రయత్నం చేస్తాను .

రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు గారి చేతుల మీదుగా ఇపుడు వికసించిన ఈ కూనపదాల తోటకు మూడు దశాబ్దాల కిందటే వారు అధ్యాపక వృత్తిలో ఉన్న రోజుల్లో బీజాలు పడ్డాయి. 1990లలో రాస్తూ మధ్యలోనే వదిలివేసిన కూనపదాలను – మళ్లీ ఇన్నేళ్ళకు సన్నిహిత మిత్రులు, శ్రేయస్కాముల ప్రోత్సాహంతో పూర్తి చేసిన కవిగారు ఫిబ్రవరి 2024లో ఈ పుస్తకాన్ని పాఠకుల చేతుల్లోకి తీసుకు రాగలిగారు. 150కి పైగా పదాలున్న ఈ పుస్తకం రెంటాల వారి సామాజిక స్పృహను, పలు అంశాలపై వారికున్న దృక్పథాన్ని వెల్లడిస్తుంది.

కూనలమ్మ పదాల వంటి చిన్న కవితా రూపాలు రెంటాల లాంటి భాషా ప్రేమికులు, ఛందో రహస్యవేత్తల చేతిలో పడితే అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని ఇముడ్చుకుని ఎంతగా వెలగగలవో ఈ రచనలోని పలు పదాలను అనుభూతి చెందినపుడు పాఠకులకు అర్థం అవుతుంది.

**రెంటాల వారి కూనలమ్మ – ఆరుద్ర ప్రభావం :** కూనలమ్మ పదాలను కొత్తగా ఎవరు రాసినా ఆరుద్ర ప్రభావం నుంచి తప్పించుకోవడం ఒకింత కష్టమే. ముద్ర ఆరుద్రుడిది అని రెంటాలే కాదు..కూనలమ్మ కవులు ఎవరయినా అనవలసిందే!

కూనలమ్మను చిరనిద్ర నుంచి మేల్కొలిపిన శ్రీ ఆరుద్ర ప్రభావం పాత సీసాలో కొత్త సారా పోసాను అని చెప్పుకున్న రెంటాల మీద బలంగానే ఉంది. ఆరుద్ర లాగే రెంటాలది కూడ సామ్యవాద దృష్టి. ఈ కవులిద్దరూ మతం కనులు కప్పుతుందని, అది ఓ కనికట్టు అని భావించిన వారే ! వేమన, కృష్ణశాస్త్రి, బాపు తదితర సాహితీ మూర్తులు వీరిద్దరికీ అభిమాన పాత్రులు. ఆంధ్రుల ఆరంభ శూరత్వాన్ని గురించి ఆరుద్ర చింతిస్తే – సాటి ఆంధ్రుడి గొప్పతనాన్ని గుర్తించలేని తెలుగోడి జబ్బును తలచుకుని రెంటాల కలత చెందారు! తెలుగు సాహిత్యంలో కొత్త

పోకడలను స్వాగతించలేని వారిని ఆరుద్ర వెక్కిరిస్తే - సొంతదనం కొంచెమైనా లేకుండా కాకుల్లా వదరే వట్టి అనుకరణ కవులనీ , ఊకదంపుడుకు అలవాటు పడిన ఉత్తుత్తి కవులనీ రెంటాల తూర్పారబట్టారు. కూనలమ్మ పదాల ద్వారా ఇద్దరూ సమకాలీన సామాజిక సమస్యలపై కలమెత్తారు. అయితే ఆరుద్ర కాలంతో పోలిస్తే వర్తమానంలో ప్రజాస్వామ్యం మరింత ప్రమాదంలో పడినట్లు అనిపిస్తోంది. ఆ ఆలోచనల ప్రభావమే ఈ రచనలో చాల చోట్ల కనిపిస్తుంది. మచ్చుకు ఓ కూనపదం చూద్దాం.

**బొంకాడితే తప్పు/నిజం చెబితే ముప్పు**
**ఎలా చావం చెప్పు?**

మన సంఘంలో భావప్రకటన స్వేచ్ఛ ఎంత ప్రమాదంలో పడిందో రెంటాల రాసిన పై కూనపదం స్పష్టంగా చెప్తుంది. ఆరుద్ర కూనలమ్మ లాగే ఖండ గతి (5o5) లో రెంటాల కూర్చిన పదాలు అద్భుతమైన తూకంతో వినడానికి హాయిగా అనిపిస్తాయి. ఈ పదాన్ని చూడండి.

**చిటిపొట్ట చిటిరెక్క/చిరుగింజ చిరుగుక్క**
**పిట్ట బతుకెంచక్క/ఓ కూనలమ్మ**

పై పదంలోని గమ్మత్తును గమనించారా ?

రెండవ పాదం లోని 'చిరు గింజ , చిరు గుక్కలతో తూకం సరిపడేలా చిట్టిని చిటిగా తేల్చి పలకటం ఇక్కడ (ఛందస్సు పరంగా కూడ...) చాల అవసరం. అక్కటాదుల జడ్డకు లోపంబు విభాషనగు అనే బాలవ్యాకరణ సూత్రం ద్వారా లభించిన ప్రయోగ సౌకర్యాన్ని వాడుకుని - చిటి అనే మాట ద్వారా చిన్ని పిట్ట ఆకారాన్ని ఎంచక్కా పాఠకుల కళ్ల ముందు నిలపగలిగారు కవి. ఇలాంటి గమ్మత్తు ప్రయోగాలను ఎన్నైనా చెప్పుకోవచ్చు ఈ కవి రచనల్లో !

**కూనలమ్మ పదాలు - రెంటాల విన్యాసాలు :** ఏ చిన్న అవకాశం దొరికినా చక్కని భావాన్ని పదాల్లో చెక్కడంతో పాటు పదాల కూర్పులో అద్భుతమైన విన్యాసాలు సైతం చేసారు కవి. ఈ పదాన్ని చూడండి.

**వినువాని వెనువెంట/చని, వాని తినుచుంట**
**జిహ్వా చపలతె అంట**

జిహ్వా చాపల్యాల్లో ఎన్నో రకాలుంటాయని బీ తమ మాట వినే మనిషి వెంటపడి, అతడి బుర్ర తినేయటం కూడ ఓ రకమైన జిహ్వా చపలతే అవుతుంది అని నిరూపించటం కోసం కేవలం ఎ అనే నిశ్చయార్థకాన్ని చపలత అనే మాటతో కలిపి చెప్పటం ద్వారా కవి భాష మీద తనకున్న అధికారాన్ని ప్రదర్శించారు ఈ పదంలో .

**రికైతే నోటు/అవుతున్నదో లోటు**
**అతడు ఉన్నా లేటు**

ఇత్యాదిగా సాగే రెంటాల వారి మరో కూనపదం పేదల దుర్భర జీవితాలకు అద్దం పడుతుంది. ఉన్నా లేనట్లే అని చెప్పవలసిన చోట భావంలో ఏ మాత్రం వెలితి రానీయకుండా అతడు ఉన్నా లేటు అని చెప్పడంలో ఈ కవి గడుసుతనాన్ని చూడవచ్చు.

**వలపు కుప్పగ చెయ్యి /పగయు మద్యము పొయ్యి**
**తెలుగు ఫిల్ము అనెయ్యి**

అంటూ ఈ కవి చెప్పిన మరో పదం ఈనాటి సినిమాల తీరుకు మంచి ఉదాహరణ.

ఈ పుస్తకం లోని...

**అందనపుడు మోజు /అంతు పట్టక ఫోజు**
**కుర్రతనపు రివాజు**

వంటి పదాలు ప్రేమ పేరుతో వెంటపడి, పెళ్లయ్యాక ఇబ్బందులు పడుతున్న, అపార్థాలతో విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతున్న ఈ తరం యువతను స్ఫురణకు తెస్తాయి. ప్రకృతి పట్ల ఈ కవికి ఉన్న అనురక్తిని చాటే పదాలు ఈ పుస్తకంలో చాల ఉన్నాయి.

మచ్చుకు ఇది చూడండి.

**ప్రకృతి ఆహ్వానాలు /పంచు పసిహస్తాలు**
**కనకాంబరం పూలు**

ఈ కూనపదం చదువుతున్నపుడు - రెంటాల వారే రాసిన ఓ గజల్ లోని అదిగో పచ్చని గుబురు మధ్యన ఎర్రగా తానే పెరటిలో కనకాంబరం పువ్వు విచ్చినట్టుంది " అనే పంక్తులు గుర్తుకు రాక మానవు !

**పేద చనిపోతాడు /పెద్ద అట్లా పోడు**
**స్వర్గస్థుడౌతాడు**

అంటూ చెప్పిన మరో పదంలో " పెద్ద మనుషుల"కు లేని ఘనతను ఆపాదిస్తూ మన సంఘం చేసే కృతకమైన భాషా మర్యాదలపై కవి కరకుగా విసిరిన వ్యంగ్యాస్త్రపు పదను వేమన గారి ఆటవెలది పద్యాల్లోని మూడవ పాదాన్ని గుర్తుకు తెస్తుంది. పొట్ట నిండిన తర్వాత తత్వాలు చెప్పే వారి తీరును అపహసిస్తూ తెలుగు పుట్టిన చోట తెలుగూ లేక - ఇంగ్లిష్ రాక - నానా తంటాలు పడే చదువరులను చూసి నొచ్చుకుంటూ బీ కలం చెడుకు విపక్షం కావాలని ప్రబోధిస్తూ బీ ఫ్లెక్సీలు - నేతల స్టాచ్యూల

రూపంలో ఊళ్లకు పట్టిన కొత్త జాడ్యాలను చూడలేక విసుక్కుంటూ పలు సమస్యలపై కలం కదిలించి రెంటాల రాసిన కూనలమ్మ పదాలు వారి నిశిత దృష్టిని, నిబద్ధతను చాటి చెప్తాయి. ఇంకా ఇలాంటివే మరెన్నో కూనపదాలు సమాజంలోని కుళ్లును ఎండగడతాయి.

"కూనలమ్మ పదాల్లో పై రెండు పంక్తుల్నీ మూడో పంక్తి ముగించడమే కాదు వెలిగించాలి అన్నారు ఈ కవి.

**బ్రతుకు బ్రతుకొక గురువు /ప్రతి అనుభవం చదువు**

**విద్యార్థులే కరువు** లాంటి చోట్ల రెంటాల కూనపదాల్లో ఈ వెలుగును గమనించగలం.

అంత్య ప్రాసలు, వస్తువు, పదం ఎత్తుగడ , ముగింపు లోని మెరుపు వంటి కీలకమైన లక్షణాల్లో ఆరుద్ర ప్రభావం ఉన్నా ఈ రచనలో రెంటాల స్వంత ముద్రే ఎక్కువగా కనిపిస్తుంది. ఈ కవి గారి బహుముఖీన ప్రజ్ఞల్లో చిత్రకళా రచన ఒకటి. ఈ పుస్తకంలో పలు కూనపదాలకు అదనపు అందాలద్దిన చిత్రాల కోసం ఎపుడో మూలన పడేసిన పెన్సిల్ కు పనిచెప్పారు కవి. సగం చిత్రాలను కవే స్వయంగా గీయగా మిగిలిన సగం హంపి గీసారు. కూనలమ్మ పదాల్ని పునః సృష్టి చేసిన ఆరుద్ర కూడ మంచి చిత్రకారుడు !

**కూనలమ్మ - రెంటాల ప్రయోగాలు :** భాషా ఛందోలంకారాది విశేషాలు సైన్సుకి లాగే కవిత్వానికి కూడ ప్రయోగాలు లేనిదే అభివృద్ధి లేదు అన్నారు శ్రీశ్రీ. (మహాప్రస్థానం : పుట 171) చేపట్టిన సాహిత్య ప్రక్రియ ఏదైనా, అభివ్యక్తిలో తనకుగా దానికి ఓ ప్రతికూలతని కల్పించే రెంటాల కూనలమ్మ పదాల్లో ప్రయోగాలు చేయడంలో ఆశ్చర్యం ఏముంది? రెంటాల కూన పదాల్లో పాశ్చాత్య సాహిత్య మర్యాదలు కొన్ని కనిపిస్తాయి! ఈ పదాల్లో కవి చేసిన ప్రయోగాలు ఎక్కువ శాతం ఛందస్సుకి సంబంధించినవే కావడం విశేషం. యతి ప్రాసలకు సంబంధించినవే కాకుండా వారి చమత్కార విన్యాసాలు సైతం కొన్ని ఈ పదాలలో అక్కడక్కడా తారసపడి, చదువరులను ఆశ్చర్యపరుస్తాయి.

ఛందస్సుకి సంబంధించి రెంటాల చేసిన ప్రయోగాలను మొదట చర్చిస్తాను. కన్నడ, తెలుగు భాషల్లోని దేశి ఛందస్సుల్లో పద్యాన్ని లగతో - ఆరంభించడాన్ని వర్జించారు. లగతో మొదలుపెడితే పద్యం నడక బాగుండదని, లయ చెడుతుందని - ఆరుద్ర సైతం చెప్పారు. కాని కవి ఈ పుస్తకంలో తొలి కూనపదాన్ని లగతోనే మొదలుపెట్టారు ! ఛందో వేత్తలు వద్దన్న గణాన్నే పదాదిన స్వీకరించి, లయ తప్పనీయకుండా మెప్పించారు. ఈ పుస్తకం లోని ఆ తొలి కూనపదం ఇదే..

**బలే ఛందోవేత్త/ప్రజా మానస హర్త**

**తొలి కూనపద కర్త**

అంత్య ప్రాసల్లో - గజల్స్ విధానాన్ని అనుసరించిన ఈ కూనపదాన్ని చూడండి.

**ప్రతి చెట్టు చెట్టాయె /ప్రతి పిట్ట పిట్టాయె**

**ప్రతి మనిషి మనిషాయెనా?**

స్థూలదృష్టికి కవి రెండు పాదాల్లో చెట్టాయె, పిట్టాయె అని అంత్య ప్రాస పాటించి, మూడవ పాదం చివర మనిషాయెనా ? అనే మాటతో అంత్యప్రాసను వదిలేసినట్టు అనిపిస్తుంది. కాని...ఇక్కడ అంత్యప్రాసకు ముఖ్యమైన స్వరం ఆయె. ఆ విధంగా చూచినపుడు ఈ పదంలో మూడు పాదాల్లోనూ అంత్య ప్రాసను పాటించినట్లే అవుతుంది ! ఈ విధమైన అంత్యప్రాస ఆరుద్రలోను ఉంది కాని బహూ స్వల్పం. మూడు పాదాల్లో రెండింటికి మాత్రమే అంత్యప్రాసను పాటించి ఒక పాదాంతాన ప్రాసను పాటించక వదిలేసినట్టు భ్రమింపజేయడంతో పాటు అర్ధప్రాసను వాడటం కూడ రెంటాల వారి కూనలమ్మ పదాల్లో అక్కడక్కడా కనిపిస్తుంది. ఉదాహరణకు:

**అని తెలిసి విడడు కసి/విక్రమూరుడు మనిషి**

పై రెండు చరణాలను జాగ్రత్తగా పరిశీలిస్తే కసి - మనిషి అన్నపుడు రెండిటి చివరి ధ్వనిలో భేదం స్పష్టంగా వినిపిస్తుంది. దీనినే అర్ధప్రాస అంటారు! పాశ్చాత్య సాహిత్యంతో పాటు, గజల్స్‌లో కూడ అర్ధప్రాసల్ని (ఈ పేరుతో కాకపోయినా) ఉపయోగించటం ఉంది. పద్యంలోని పూర్వపు పంక్తి చివర విరామం లేకుండా ఒక పంక్తిని మరొక పంక్తిలోకి కొనసాగించడాన్ని పాదాంత వ్యాప్తి అంటారు. (మన ఉపజాతి పద్యాల్లోని గునుగు సీసాలదీ ఇదే లక్షణం.) ప్రాచీన గ్రీకు, రోమన్ సాహిత్యాల్లో పుట్టి, పాశ్చాత్య సాహిత్యంలో ఇప్పటికీ కనిపించే ఈ లక్షణం రెంటాల కూనలమ్మ పదాల్లో కూడ కనిపిస్తుంది. ఈ క్రింది పదంలో దానిని గమనించవచ్చు.

**సృష్టి పూర్ణము కాదు/స్వీయ రక్షణ లేదు**

**చెట్ల కిది సరికాదు**

*(సశేషం)*

# ఒగ్గుకథ



– డా. ధరంసోత్ సరిత

నేడు ప్రసిద్ధ జానపద కళారూపం అయినా ఒగ్గుకథల ద్వార వివిధ పథకాల ప్రచారం జోరుగా సాగుతుంది. వీటిలో అవినీతి నిర్మూలన, ఓటర్లజాగరణ,ప్రకృతిమాత, స్వతంత్ర ఉద్యమం, పరిసరాలు పరిశుభ్రత, కుంటుంబ నియంత్రణ మొదలైన పథకాలను ప్రసిద్ధ ఒగ్గుకళాకారుడు చుక్కాసత్తయ్య ఒగ్గుకథాగానద్వారా ప్రచారం చేసిన ఈక్రింది అంశాలను గురించి వివరిచడం జరిగింది.

**సామాజికాంశాలు :** ఒగ్గుకథ కళారుపానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడానికి ప్రధానకారకులు చుక్కాసత్తయ్య, కురుమకులంలో జన్మించి కుల సంబంధంగా కథాగానం నేర్చుకొని యక్షగానధోరణిలో కథాగాన ప్రదర్శనలో వివిధ మార్పులు చేశారు. తద్వారా ఒగ్గుకథకు ప్రజల నుండి విశేషమైన ఆదరణ లభించింది. అనంతరం అనేక ప్రభుత్వ పథకాలను ఒగ్గుకథ బాణీలలో విరివిగా ప్రచారం చేశారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యుడిగా ఎంతోమంది విద్యార్థులకు ఒగ్గుకథగానంలో శిక్షణ ఇచ్చారు. సుమారు యాభైకి పైగా వివిధ కథాంశాలను ఆశువుగా పాత్రోచిత స్వరంతో, ధీరగంభీరంగా, లలితలాలిత్యంగా ఒగ్గుకథలను గానం చేయడంలో నిష్ణాతులైన చుక్కాసత్తయ్య అంశం ఏదైనప్పటికీ దాన్ని ఆశువుగా ఒగ్గుకథగా మార్చి గానం చేయగలరు. ఎంతటి క్లిష్టమైన విషయమైన సాధారణ జనానికి అర్థమయ్యే భాషలో గేయాత్మకంగా, కథాకథనాత్మక వ్యాఖ్యానంతో ఒగ్గుకథా గానంగా చెప్పేవారి నైపుణ్యం ప్రేక్షకులను అబ్బుర పరుస్తుంది. పలుకు పలుకులో, ప్రతీపాదంలో సహజమైన ప్రాస వెల్లివిరుస్తుంది. సహజ లయాత్మకంగా సాగే వారి గానం ప్రేక్షకుల మనసును కథావిషయంపట్ల కేంద్రికరింప జేస్తుంది. అందువలన చుక్కాసత్తయ్య గారు ఒగ్గుకథాగానంలో పద్ధతులు ప్రచారం చేసిన ప్రతిఅంశం ప్రజలకు మిక్కిలి చేరువైంది. చుక్కాసత్తయ్య ఇరువైగంటల ఎల్లమ్మ ఒగ్గుకథను, ఇరువైనిమిషాల వరకట్న దురాచారానికి సంబధించిన ఒగ్గుకథను ఒకేవిధంగా రక్తి కట్టించ గల ప్రదర్శనానైపుణ్యం కలవారు. వారు ప్రదర్శించిన వివిధ ప్రచారపథకాలలో “ఇందిరమ్మ ఇరువైసూత్రాల పథకం ఒగ్గుకథ” విశేష జనాదరణ పొందింది. తెలంగాణా ప్రాంతం నుండి ప్రజాప్రతినిధులు ఎన్నికై భారతప్రధాని పదవిచేపట్టిన ఇందిరాగాంధీపట్ల ఇక్కడి ప్రజలలో విశేషమైనఆదరాభిమానాలుఉండేవి. ఇందిరాగాందీ ప్రవేశపెట్టిన అనేక పథకాలలో ఇరవైసూత్రాల పథకం కూడా ఒకటి. భారాతదేశంలో పేదరిక నిర్మూలన కోసం వివిధ ప్రభుత్వ యంత్రాంగాలను సమన్వయపరచి రూపొందించిన ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి చుక్కాసత్తయ్య ఒగ్గుకథ ఎంతో ఉపయోగపడింది. ఇందిరమ్మ ఇరవైసూత్రాల పథకం ఒగ్గుకథను చుక్కసత్తయ్య సుమారు ఆరువేల ప్రదర్శనలుగా గానం చేశానని పేర్కొన్నారు. ఇది వారికథగానానికి ఉన్న విశేష ప్రజాదరణను తెలుపుతుంది.

**“అమ్మమ్మ జగదంబ అంబ జగదంబ –కరుణించు మాతల్లి కనకదుర్గమ్మ**
**ఏడుపాయలలోన వెలసినవమ్మ– ఎంటముప్పై మూడు శక్తులోయమ్మ**
**ఏపాయ చూసినా నీపాయకలదమ్మా– ఎంటముప్పై మూడు శక్తులోయమ్మ**
**రాజకీయరంగముల పుట్టి పెరిగిందిరా–భారతప్రధాని ఇందిరమ్మ తల్లిరా**
**బలహీనవర్గాల చూసింది ఇందిరమ్మ– బ్యాంకులు జాతీయం చేసింది**
**పాడిపంటల కొరకు నీటికాల్వలు తెచ్చి–ప్రాజెక్టులేన్నెన్నో కట్టించినాదన్న**
**చేనేత పరిశ్రమపట్టు, పాలిస్టరు –ఉత్పత్తులెన్నెన్నో పెంచినాదన్న**

**ఇరువది సూత్రాలు చేపట్టి ఇందిరమ్మ- ఎన్నెన్నో పథకాలు నెలకొల్పింది ఇందిరమ్మ**
**దున్నేవారికి భూములిచ్చింది ఇందిరమ్మ-మిగులు భూములు పంచిపెట్టింది ఇందిరమ్మ**
**నీడలేనటువంటి నిరుపేదలను చూసి-వెన్నుతట్టి ప్రజల రక్షించినాదంట"**
**(చుక్కాసత్తయ్య ఇందిరమ్మ ఇరవైసూత్రాల పథకం ఒగ్గుకథ)**

సాధారణ ఒగ్గుకథవలె దైవప్రార్ధనతో ప్రారంభమైన ఈఒగ్గుకథగానం ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఇరవై సూత్రాల పథకంతోపాటు ఇందిరాగాంధీ వ్యక్తిత్వాన్ని, అభివృద్ధిని ఆవిష్కరించడం జరిగింది. దైవప్రార్ధనలలో భాగంగా ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ ప్రాంతంలోని ఏడుపాయల దుర్గభవానిని ప్రార్ధించడంలో ఔచిత్యం కనిపిస్తుంది. భూసంస్కరణలతో పాటు కుటీర పరిశ్రమలకు చేయూత, బ్యాంకుల జాతీయకరణ ఇలా అంశం ఏదైనప్పటికీ దానిని ఒగ్గుకథ బాణీలో గానం చేయడం విశేషం. ఇదే అంశాన్ని ఉపన్యాస రూపంలో చెప్పిన దానికన్నా ఒగ్గుకథగానం చెప్పడం వలన ప్రజలలో విశేషంగా ప్రాచుర్యం పొందే అవకాశం కలిగింది. అందుకే ఒగ్గుకథలను వివిధ ప్రచారాల కోసం ఎంచుకోవడం జరిగింది. సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి రావడానికి ముందు ఇలాంటి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయడానికి ఒగ్గుకథను మాధ్యమంగా చేసుకున్నట్లుగా నేడు అనేక రాజకీయ సామాజిక ప్రచారాల కోసం ఒగ్గుడోలు నృత్యాన్ని ఉపయోగించడం విశేషం. చుక్కాసత్తయ్య ఇందిరమ్మ ఇరవైసూత్రాల పథకంతో పాటు వరకట్న నిషేధం, మద్యపాననిషేధం, కుటుంబ నియంత్రణ, పచ్చదనం పరిశుభ్రత, అక్షరదీపం వంటి అనేక ప్రభుత్వ పథకాలను ఒగ్గు కథగా ప్రదర్శించి గానం చేస్తూ ఆయా అంశాలపట్ల ప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించారు.

**తగ్గుతున్న ఆదరణ-కారణాలు :** మారుతున్న మానవ జీవనవిధానం వంటి వివిధ పరిణామాల నేపథ్యంలో ఒకప్పుడు ప్రజావినోద సాధనాలుగా ఉన్న విశిష్ట జానపద కళారూపాల్లో ఒకటైన ఒగ్గుకథ క్రమంగా తెరమరుగై కనుమరుగై పోతున్నాయి. దీనికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. వాటిలో ప్రపంచీకరణ ప్రభావం, సాంకేతిక విప్లవంతో వివిధరకాల సామాజిక వినోదాంశాలు అందరికి అందుబాటులోకి రావడంవల్ల వర్తమానకాలంలో ఒగ్గుకథ నానాటికీ బలపడుతుంది.

**ప్రపంచీకరణ వల్ల నష్టాలు :** ప్రపంచీకరణ ప్రభావంతో వర్తమాన సమాజం అనేక మార్పులు సంభవించాయి సమాజంలో అన్నిరంగాల పైనా ప్రభావం చూపిన ప్రపంచీకరణ వలన జానపద సాహిత్యానికి కొంతమేలు, మరికొంత కీడు కలిగింది. ఒకదేశంలో పుట్టిన ఒక సాంకేతిక ఆవిష్కరణ మరో దేశానికి ప్రయాణించడం, దానివలన జరిగే ఫలితాలు జాతిభేదం లేకుండా అందరికీ అందుబాటులోకి రావడమనేది ప్రపంచీకరణలో ఒక భాగం. 1990తరువాత చెప్పబడుతున్న ప్రపంచీకరణ ప్రధానంగా అర్థికరంగానికి సంబంధించినదే అయినప్పటికీ సామాజిక కోణంలో ఆలోచిస్తే ప్రపంచీకరణ అనేది చాలా విస్తృతమైంది. ఒకదేశంలో పుట్టిన జానపదకళ గాని, జానపదకళారీతి గాని మరోదేశానికి ప్రయాణించడం, అక్కడ స్థిరపడటం కూడా ప్రపంచీకరణమే అవుతుంది.

ఈ అభిప్రాయాన్ని పరిశీలించినప్పుడు ఒకదేశంలోని కళారూపం మరోదేశంలో స్థిరపడటంతో పాటు ఒక ప్రాంతానికి, సమాజంలోని ఇతర వర్గాల వారికి అందుబాటులోకి రావడం కూడా ప్రపంచీకరణ అవుతుంది. తెలంగాణ ప్రాంతంలో కురుమ యాదవుల కులహద్దులలో ప్రారంభమైన ఒగ్గుకథ ప్రదర్శన కళారూపం కులహద్దులు దాటి సామాజిక వేదికల మీద ప్రదర్శింపబడి అన్నీ వర్గాల వారికి వినోదాన్ని కలిగిస్తూ, క్రమంగా ఇతర ప్రాంతాలలో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇతర దేశాల్లోనూ ప్రదర్శింపబడి విశిష్టమైన గుర్తింపును పొందగలిగింది. ప్రపంచీకరణ ప్రభావంతో అందరికీ అందుబాటులోకి వచ్చి ఎన్నో జానపద కళారూపాల అంతర్ధానానికి పరోక్ష కారణమైన టెలివిజన్ 1996 నాటికి వివిధ ప్రైవేటు సాటిలైట్ ఛానల్లు ప్రారంభమై గ్రామీణుల తీరిక సమయాన్ని కబళించి వేసింది. టెలివిజన్ అందుబాటులోకి రావడం అందులో నిత్యం సినిమాలు, సీరియల్స్ వంటి అంశాలు గ్రామీణ సామాజిక జీవితం మీద, జానపద ప్రక్రియల మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపాయి. గతంలో శ్రమ జీవనంలో అలసిపోయినా జానపదులకు వివిధ జానపద కళారూపాలు వినోదాన్ని అందించి సేద తీర్చేవి. వృత్తి కళారూపాలతో పాటు సామూహికంగా వివిధ రకాల జానపద ఆటపాటలతో గ్రామీణులు తమ తీరిక సమయం గడిపేవారు. టెలివిజన్ రాకతో ఈ తీరిక సమయమంతా జానపద కళారూపాల నుండి టెలివిజన్ వైపు మళ్ళించడం జరిగింది.

ఈ పరిణామం సాంకేతిక విప్లవం ఫలితంగా ఏర్పడిన సెల్ఫోన్ రాకతో, స్మార్ట్ ఫోన్ల రాకతో మరింతంగా పెరిగింది. జానపదుల తీరిక సమయాన్ని పూర్తిగా కబలించిన ఇలాంటి సాంకేతిక ఆవిష్కరణల వలన కీడుతో పాటు కొంతవరకు మేలు కూడా కలిగింది. ఒక ప్రాంతానికి చెందిన కళారూపాలు గురించి ఇతర ప్రాంతీయులు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడింది. వీటివలన సినిమా మాధ్యమం సామాన్యులకు అందుబాటులోనికి రావడంతో అనేక జానపద కళారూపాల ప్రదర్శనలో సినిమా ప్రభావం చోటుచేసుకుంది. ముఖ్యంగా వేషధారణ, భాషా ప్రయోగం ప్రదర్శనలలో ఈ ప్రభావం ఎక్కువై ఆయా కళారూపాల మౌలిక లక్షణాన్ని సైతం దెబ్బతినే ప్రమాదం కలిగించాయి.

ఇలాంటి ప్రపంచీకరణ ప్రభావం వలన ఏర్పడిన విషమ పరిస్థితులను తట్టుకొని నిలబడిన జానపద ప్రదర్శన కళారూపం ఒగ్గుథ ప్రదర్శన. ఒకవైపు మౌలికమైన ప్రదర్శన నియమాలను, సంవిధాన నైపుణ్యాలను కాపాడుకుంటూ భాషలో ఇతివృత్తంలో, ప్రదర్శనలో సమాజానికి అనుగుణమైన మార్పులను సంతరించుకున్నది. అందువలన ప్రపంచీకరణ, ప్రభావంవలన ఎన్నో కళారూపాలు కాలగర్భంలో కలిసి పోయి కనుమరుగైనప్పటికీ, ఒగ్గుకథ ప్రదర్శన మాత్రం నేటికీ అన్ని తరాల వారిని, అన్ని వర్గాల వారిని అలరిస్తూ, సామాజిక వినోదాన్ని కలిగించే కళారూపంగా ప్రత్యేకతను చూపుతుంది.

**పరిరక్షణ మార్గాలు –తీసుకోవాల్సిన చర్యలు:** ప్రపంచీకరణ ప్రభావమనేది అన్ని సాంప్రదాయక కళల మీద పడటం చూస్తున్నాం. మరి ప్రధానంగా సోషల్ మీడియా ఇప్పుడు దుమ్ముదులుపుతుండటంతో కళను ఆదరించేవారి సంఖ్య బహిరంగంగా తగ్గింది. కళలను కాపాడుకోవడం అనేది మీడియా ప్రకటనల వరకూ మాత్రమే పరిమితమైంది.

మానవ జీవనాన్ని ప్రతిబింబించేది కళ. ఎందుకంటే తన హావభావాలను వ్యక్తం చేసేయడానికి తన తోటివారికి ఆనందాన్నివ్వడానికి సృష్టించుకోబడినది కళ. కాబట్టి దీనికి చావు అంటూ ఉండదు. ఒకతరం నుండి మరొకతరానికి వ్యక్తి కారణాలు మారుతున్నప్పుడు కొన్నిటి అవసరం లేదనుకుంటాం. అసలు కళయొక్క ప్రాధాన్యతను వివరించడంలోమన పరిశోధకులు, పూర్వీకులు కొన్ని విషయాలు మరిచిపోతున్నారు. కళ మానసిక వికాసం కలుగజేస్తుంది. బాధల్ని పోగొడుతుంది. శారీరక వ్యాయామం దీనిద్వారా సాధ్యం. అలాగే ఒకతరంలోని విషయాలను, సంస్కృతిని, సాంప్రదాయాన్ని ప్రవహింప చేస్తుంది ప్రసరిస్తుంది. కాబట్టి కాపాడాల్సిన అవసరం ఉంది. జర్మనీలో జనం మన సాంప్రదాయ సిద్ధాంతాల్ని పాటిస్తూ నేటికీ సంపూర్ణ ఆయుర్దాయం కలిగియున్నారంటే వారు దేన్ని కాపాడుతున్నారో తెలుసుకోవాలి.

**తీసుకోవాల్సిన చర్యలు :** 1. జానపద కళలు,క్రీడలు పాఠ్యాంశాల్లోనే కాకుండా ప్రదర్శనలకు తావిచ్చే ప్రయోగ విధానాలు రూపకల్పన చేయాలి. 2.ఉదయం, సాయంత్రం ఆయా కాలాలననుసరించి జానపదుల జీవనవిధానాలు సృష్టిపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. 3. సాంప్రదాయ స్థితుల ప్రయోజనాలు, సంస్కృతి ప్రసరణ మారుతున్న సాంకేతిక విధానాల వల్ల కళలకు కలిగే నష్టం, మరియు ప్రయోజనం తెలియజేయాలి. 4. ప్రభుత్వం జానపద విజ్ఞానం, కళలకు సంబంధించిన మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. 5. ఏదైనా మాధ్యమం ప్రవేశించినప్పుడు దాని వల్ల కలిగే నష్టాలను ముందుగానే అంచనావేసి, సాధకబాధకాలను వివరించే ఏర్పాటు చేయాలి. 6. ప్రపంచీకరణ అనగానే కేవలం వ్యాపార దృక్పథం అని తెలిసినప్పుడు, భోగి పిడకల్ని ఆన్లైన్లో అమ్మి వ్యాపారం చేస్తున్నప్పుడు, వినోదాత్మక అంశాలు, వస్తువులు, ప్రదర్శనల విషయంలో ప్రభుత్వాలు నిర్మాణాత్మక నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలి. 7. టిక్ టాక్, ఇన్స్టా గ్రామ్, ఫేస్ బుక్, యుట్యూబ్ వంటి దృశ్యమాధ్యమాలలో పాతపాటలకి అభినయం చేస్తున్న ప్రజలు త్వరిత గతిన సాంప్రదాయాల వైపు వస్తారనే నమ్మకాన్ని ఏర్పాటు చేస్తునాయి. 8. ప్రపంచీకరణ ప్రభావం గత రెండు దశాబ్దాల పాటు కొనసాగుతున్న మాట వాస్తవమే అయినా దీనివల్ల జీవన విధానాలో ఎడతెగని అవరోధాలు, ఆటంకాలు కలుగుతున్నాయని భారత ప్రభుత్వం ఇప్పటికైనా గమనించాలి. కరోనా వంటి వైరస్‌ల త్వరిగతిన ప్రబలినప్పుడు సాంకేతికత ఎంతవరకూ రక్షించింది. ఏ దేశము వ్యాపార లావాదేవీలను కొనసాగించనివ్వలేదు. అదే సాంప్రదాయ జీవనవిధానంలో భారతదేశం దానికి విరుగుడును కనిపెట్టే పనిని చేపట్టింది. కాబట్టి జానపద విజ్ఞానమనేది మనకున్న నిండైన సంపదగా భావించాలి. 9. జానపదులు జీవన కథల్ని మనకు అందించిన దైవాలుగా భావించాలి. అప్పుడే మనం వీటిని తర్వాతి తరాలకు అందించగలం.

డా.ధరంసోత్ సరిత
హైదరాబాద్, 6300428155

# ప్రజలు, సమాజమే నా సాహిత్య పాఠ్యపుస్తకాలు

– జూకంటి జగన్నాథం

నేను సిరిసిల్ల పౌర గ్రంథాలయం మరియు సినారే అంతేవాసి హనుమాజీపేట నివాశి కనపర్తి సార్ యొక్క ఇంటి గ్రంథాలు, జక్కని వెంకట రాజం సార్ తెప్పించే నెలనెలా వార ప్రత్యేక సంచికలు నా పఠనా స్థలాలు. అంతే కాకుండా మిక్కిలి ప్రభావితం చేసిన నిజాం వెంకటేశం సార్ సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా తెచ్చి ఇచ్చే అప్పటికే పేరు ప్రఖ్యాతి గల కవులు రచయితల పుస్తకాలు ఇలా ఎన్నెన్నో గ్రంథాలు చదివిన సోయితో నేను కవిగా రచయితగా గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్నా నాలో బీజ ప్రాయంలో ఉన్న సాహిత్య జిజ్ఞాసతో రోజు పొద్దున్న పనికి పోయి వచ్చి సాయంత్రం పుస్తకం తెచ్చుకొని మా మానేరు వాగులో చదివే వాడిని. కొన్ని పుస్తకాలు నన్ను కన్నీటి పర్యంతం చేస్తే మరికొన్ని పుస్తకాలు అనేక ప్రశ్నలు నా ముందు నిలిపినాయి.

మా ఊరు తంగళ్ళపల్లి మానేరు ఇవతలి వైపు ఉంటే, అవుతలి ఒడ్డుకు సిరిసిల్ల ఉంటది. మధ్యలో వాగు మాత్రమే అడ్డంగా ఉండేది. ఆ రోజుల్లో అంటే 1970 దశకం చివరలో మా ఇంట్లో కరెంటు ఉండేది కాదు. గ్యాస్ నూనె ఎక్క దీపం వెలుతురులో ఒకే దఫా ఎన్నెన్నో పుస్తకాలు కళ్లలో వత్తులు వేసుకొని చదివాను. మంచి చెడ్డ పుస్తకాలు అనేక చదివి అందులో నుంచి మంచి సాహిత్య పుస్తకాలను ఎన్నిక చేసుకోవాల్సి వచ్చేది . ఒకానొక సందర్భంలో 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి చెందిన మిత్రుడు చెప్పగా ఆ ఊరుకి సైకిల్ మీద పోయి పుస్తకం తెచ్చుకొని అధ్యయనం చేసిన రోజులూ ఉన్నాయి. ఎక్క దీపం పొగ ముక్కులోకి పోయే నల్లని మసిని తుడుచుకొని చదువుకున్న కాలం అది. ఇప్పుడు 50 ఏళ్ల వెనక్కి తిరిగి చూసుకుంటే, నా సాహిత్య వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన వారిని తలుచుకోవాల్సిందే మరి. అప్పుడు పత్రికలు విజయవాడ నుండి వస్తుండేది. ఆంధ్రప్రభ ఆదివారం సోమవారం సాహిత్య పేజీల కోసం సిరిసిల్ల పెద్ద మోరి పక్కన ఉండే మోచీ మల్లయ్య డబ్బా చూరుకు నాకోసం చెక్కి ఉంచేవాడు. ఇకపోతే ఆంధ్రజ్యోతి ఆదివారం సోమవారం సాహిత్య సంచికలు బ్రదర్స్ టైలర్ నరసయ్య షాప్ లో ఎక్కడో ఒకచోట నాకోసం దాచి పెట్టేవాడు. బస్టాండులో పేపర్లు అమ్మే లక్ష్మీ రాజం వేప చెట్టు కింది డబ్బా దగ్గర కొంచెం కొంచెం చూసి చూడనట్టు చదువుకోనిచ్చేవాడు. ఇట్లా చెప్పుకుంటూ పోతే పెద్ద పైస కూడా నా జేబులో లేని రోజుల్లో నా సాహిత్య వ్యక్తిత్వ వికాసం దారిలో చాలా మైలురాళ్ల లాంటి సామాన్యులు చాలామంది యాది చేసుకోవలసి ఉంటుంది. నాకు బుద్ధి తెలిసిన తర్వాత వాళ్ల కాళ్లకు మొక్కుదామంటే వాళ్లలో కొందరు ఇప్పుడు శాశ్వతంగా లేరు. వాళ్ళ జ్ఞాపకాలు తడి తడిగా ప్రతిరోజు ఇప్పటికీ నన్ను పట్టి కుదిపి కదిపి వేస్తున్నాయి. గురజాడ, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి చలం రాజేశ్వరి ఓ పువ్వు పూసింది కథలో అనితర సాధ్యమైన వాక్యాలు, శ్రీ శ్రీ మహాప్రస్థానం, గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర రావిశాస్త్రి భూషణం కథలు బుచ్చిబాబు చివరకు మిగిలేది. రచయిత్రులు పత్రికల్లో సీరియళ్లు రాస్తున్న కాలం. కాళోజి వరవరరావు దాశరథి సి నారాయణ రెడ్డి గద్దర్ శివసాగర్ మొదలగువారి కవిత్వం వారు పోయిన కొత్త పోకడలు సాహిత్యంలో నెలకొల్పిన తమవైన స్వంత మార్గాలు నిర్మించిన విలక్షణమైన దారుల పాద ముద్రలు చాలా ఉన్నాయి. గాంధీ జీవిత చరిత్ర నెహ్రూ ఇందిరకు రాసిన లేఖలు బుద్ధుడు పూలే అంబేద్కర్ చింతనలు పుచ్చలపల్లి సుందరయ్య బద్దం ఎల్లారెడ్డి రావి నారాయణరెడ్డి తదితరుల జీవిత చరిత్రలు తరిమెల నాగిరెడ్డి రాసిన తాకట్టులో భారతదేశం పౌరాణిక భాగోతాలు హరికథలు పటం కథలు తోలుబొమ్మలాటలు గోత్రాల నరసయ్య చుట్టూ రేకులు మధ్య వేసే నాటకాలు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది కవులు రచయితలు వారి వారి పుస్తకాలు నన్ను నేను సాన పట్టుకోవడానికి ఎంతో తోడ్పాటును అందించాయి. అత్యంత ప్రభావితం చేశాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే సామాజిక తాత్విక అధ్యయన గ్రంధాలు మరొక ఎత్తు. మార్క్స్ లెనిన్ కమ్యూనిస్టు మేనిఫెస్టో పెట్టుబడిదారీ విధానం అదనపు విలువ కార్మికులు రైతులు యజమానులు లాభనష్టాల తీరుతెన్నులను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టు చూపిన తీరు నా సాహిత్య ప్రయాణానికి తెలివిడికి చేకూర్చు. నా చీకటి వెలుగుల దారిలో సరికొత్త కాంతులను ప్రసరింప చేశాయి. ఇవీ రేఖామాత్రంగా నా సాహిత్య యాత్రలో అధ్యయనానికి

సంబంధించిన విషయా విషయాలు. ఇవి ఇలా ఉండగా తెలిపిన విషయాలు మాత్రమే నన్ను తీర్చిదిద్దాయని అనుకుంటే పొరపాటు అనిపిస్తున్నది వీటికన్నా మిక్కిలి ఇంకా ఇంకా ఏవో ప్రభావితం చేసినయి ఉన్నాయి అనిపిస్తుంది. అనిపించడమే గాక నా గ్రహింపు లోకి వస్తున్నవి. నా చుట్టూ ఉన్న నా స్థలకాలాల సమాజం మనుషులు ఎగుడు దిగుళ్లు, ఎత్తు పంపులు కన్నీళ్లు కష్టాలు సంతోషాలు దిగులు వలసలు నా సాహిత్య వివేచనకు మిక్కిలి దోహదకారిగా పని చేశాయని ఇప్పుడు అనిపిస్తున్నది. అంతే కాకుండా నా చుట్టూ పక్కల ఉత్తర తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న ఉద్యమాలు పోరాటాలు ఆరాటాలు ఆకాంక్షలు లక్ష్యాలు తృణప్రాయంగా ప్రాణాలను ప్రజల కోసం అర్పించే త్యాగాలు నన్ను నా సాహిత్య నిమ్నోన్నతాలలో నిరంతరం నన్ను జాగరూకుతతో మెలిగేలా చేశాయి.

తీరా నా ఈ 70వ వయస్సు పడిలో సుదీర్ఘకాలం వెను తిరిగి చూసుకుంటే సమీక్షించుకుంటే పుస్తకాల కన్నా ఎక్కువగా నన్ను మెచ్చిన నచ్చిన ప్రభావితం చేసిన గ్రంథాల కంటే ఎక్కువగా నిచ్చెన మెట్ల సమాజంలో శ్రమ జీవన సౌందర్యాన్ని నింపుకొన్న తేజవంతమైన మనసులు నన్ను మిక్కిలి అత్యంత ప్రభావితం చేసి నన్ను ఎల్లకాలం సాహిత్య ప్రవాహంలో కొనసాగేలా చేశాయి. నిశ్చయంగా ప్రజలు సమాజమే సాహిత్య పాఠ్యపుస్తకాలు, జీవగ్రంథాలు అనిపిస్తున్నది.

జూకంటి జగన్నాథం
ఫోన్ : 9441078095

## జీవితం తెలిసిన కవి

తీగలు బిగించి పెట్టిన విపంచిలాంటిది కవి హృదయం. గాలి సోకితే చాలు గంధర్వగానాన్ని వినిపించడానికి తీగలుమోగుతాయి. అలాంటి సుకుమార మనస్వి భర్తృహరి. ఆయన మూడు శతకాలను రచించాడు. వాటిని సుభాషితత్రిశతి అని అంటున్నాం. మానవ జీవనానుభావాలను శాసించే ధర్మార్థ కామమోక్షాలకు ఈ త్రిశతి ఒకవేదిక, కరదీపిక. ఇందులో ధర్మార్థాలను నీతిశతకం ద్వారా, కామాన్ని శృంగార శతకం ద్వారా, మోక్షాన్ని వైరాగ్యశతకం ద్వారా చెప్పాడు కవి. నీతి శతకంలో పరంపరాగతంగా వస్తున్న నీతులు కూడా కొన్ని చేరాయి. "సర్వేజనాః కాంచన మాశ్రయన్తి" వంటి మాటల్లో ప్రాచీన సూక్తులు తొంగి చూస్తాయి. భర్తృహరి క్రీస్తుశకం 600- 650 మధ్యకాలంలో ఉండేవాడని పరిశోధకులు భావించారు. ఒకప్పుడు ఒక ముని అమరత్వాన్ని ఇచ్చే పండును ప్రసాదంగా భర్తృహరికి ఇచ్చాడు. భర్తృహరి తనకు ఇష్టమైన స్త్రీకి ఇచ్చాడు. ఆమె తన విటునికి ఇచ్చింది ఆ విటుడు తన ఉంపుడు కత్తెకు ఇచ్చాడు. ఆమె భర్తృహరికి ఇచ్చింది. ఈ పండు గురించిన వృత్తాంతం అంతా తెలిసిన భర్తృహరికి సంసారం పట్ల విరక్తి కలిగింది. ఇది ఆయన ఆలోచనలను మలుపు తిప్పిన సంఘటనగా ఐతిహ్యం.

**యాం చింతయామి సతతం మయి సా విరక్తా / సాప్యన్యమిచ్ఛతి జనం సజనోన్య సక్తః**
**అస్మత్కృతే చ పరితుష్యతి కాచి దన్యా / ధిక్తాంచ తం చ మదనం చ ఇమాం చ మాంచ**

"నేను ఎవరి గురించి రాత్రీపగలూ చింతిస్తున్నానో, ఆమెకు నాపట్ల మనసు లేదు. ఆమె వేరొకడిని ఇష్టపడుతుంది. వాడికి మరోస్త్రీమీద ఇష్టం ఉంది. మరో స్త్రీ నాకోసం ఆరాటపడుతూంది. ఛీ!ఛీ! ఆమెపట్ల, వాడిపట్ల, మన్మధుని పట్ల, ఈమె పట్ల, నాపట్ల జుగుప్స కలుగుతుంది". మానవ జీవితాన్ని దారి మళ్ళించే రహస్య ప్రేరణలు ఇవి. ఈ విరక్తి ఆయనలో చింతనార్ణవాలను పొంగించింది. భర్తృహరి మాటల్లో జీవితం పట్ల ఒక అవగాహన ఉంది. సాటి మనుషులపట్ల సానుభూతి ఉంది. రసపూర్ణమైన మనుగడను గమనించ మని చెప్పే ఒక సౌందర్య ఆరాధన ఉంది.. ఇదంతా శాశ్వతం కాదు అని తెలిసిన ఒక యోగి అంతరంగం ఉంది. ఇవన్నీ కలబోసిన ఒక విశిష్టమైన కవి మనస్సు ఉంది. త్రిశతిని ఆరంభిస్తూ ఆయన అన్నాడు:


భర్తృహరి.

**బోద్ధారో మత్సరగ్రస్తాః / ప్రభవః స్మయ దూషితాః**
**అబోధోపహతాశ్చాన్యే / జీర్ణమంగే సుభాషితం**

"తాను ఎన్నో చెప్పాలను కుంటున్నాడు. వాటిని చెబితే పండితులైన వారు అసూయతో మాత్సర్యంతో తోసిపడేస్తారు. వినరు." వీడా మాకు చెప్పేది" అని అంటారు. పోనీ రాజులకు వినిపిస్తేనా, వారు "మమ్ములను మించిన సర్వజ్ఞులు లేరు" అని గర్వంతో కూరుకుపోయి ఉన్నారు. ఈ ఇద్దరికీ కాకుండా వేరే ఎవరికైనా చెబుదామనుకుంటే వారికి నేను చెప్పేది అర్థంకాదు. గ్రహించలేరు. నేను చెప్పదలచుకున్నదంతా నాలోనే కరిగిపోతూ ఉంది."-అయినా రచించాడు. తన అంతరంగాన్ని అందరికీ పంచాడు. ఎన్నో జీవన రహస్యాలు ప్రవచించాడు. ఆయనభర్తృహరి.

**- ఆచార్య పి హరినాథ్**

# అందమే ఆనందం

**– రాయవరపు సత్యన్నారాయణ**

“ఎక్కడ ఏది అందంగా ఉన్నా అది ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుంది” అని జాన్ కీట్స్ (1795–1821) రెండు శతాబ్దాల క్రితం ఒక సుందరమయిన ఆహ్లాదకర పద్యంలో ప్రస్తావన చేశాడు. A thing of beauty is joy forever. హైస్కూల్లో మనమందరం చదువుకొన్న ఈ పద్యం నిస్సందేహంగా మన మనస్సులపై చెరగని ముద్ర వేసింది. శ్రీ సముద్రాల జూ. (రామానుజాచార్యుల) తమ ప్రథమ సినీ గీతాన్ని ఈ ప్రతిపాదనలతో పల్లవిస్తూ అందమె ఆనందం – ఆనందమే జీవిత మకరందం అనే పాట రచించి తండ్రికి తగిన తనయుడు అనిపించుకున్నాడు. మన ఘంటసాల మాస్టారు ఈ పాటను తన గానామృతంలో ముంచి హృద్యంగా పాడి అజరామరం చేశారు. ఆనంద మకరందాన్ని సేవించడం మానసిక, శారీరక ఆరోగ్యానికి మంచిదని ఈ పాట ద్వారా వారు మనకు చక్కని బ్రతుకు తెరువును చూపి మార్గదర్శి అయ్యారు. ఆంధ్రదేశం ఈ పాటను మనసారా పాడుకొని ఆనందించింది, తరించింది. ఈ సందర్భంలో ఎన్నో సీతాకోకచిలుకల వంటి అందమయిన మౌలిక ప్రశ్నలు నా మస్తిష్కంలో ఎగురుసాగాయి. ఏది అందం? ఏది అందం కాదు? ఇంతకీ అందం అంటే ఏమిటి?... లాంటి తీయని సందేహాలు మనస్సులో అలజడులు రేపాయి. నాలోని జరుగుతున్న మేధో మధనాన్ని మీ ముందుంచడమనే ఈ వ్యాస ఉద్దేశ్యముతో ముందడుగు వేస్తాను.

**అందానికి నిర్వచనం?** అందానికి నిర్దుష్ట నిర్వచనం ఇప్పటి వరకు దొరకలేదు. అలాని ప్రయత్నాలు జరుగలేదని చెప్పలేము. ఒక అజ్ఞాత ఆంగ్లేయుడు చూసేవాని కళ్ళల్లో అందం ఉంటుందని ప్రవచించి ఇదమిత్థంగా తేల్చకుండా తప్పించుకున్నారు. (Beauty lies in the eyes of the beholder). మనవాళ్ళు ఏమి తక్కువ తినలేదు. “తావలచింది రంభ” అని వలచింపబడిన ప్రతి వనిత ప్రియునికి రంభంత అందంగా కనిపిస్తుంది, అని అందాన్ని పరోక్షంగా చూపించారు. అందం అంటే ఇది అని చెప్పలేదు. అసలు మనకి అందం నిర్వచనం అవసరమా? నిర్వచనం ఉండి అంటే మనం దానిని ఎక్కువగా పట్టించుకొనే వాళ్ళము కాదేమో? ఇలాంటి విషయాల్లో ఊహ ఎంతో సంతృప్తిని ఇస్తుంది. “సృష్టికర్త, శృంగారం, సౌందర్యం” వంటి పదాలకు సూటి వివరణలు లేకపోవడం వల్ల వీటిని గురించి తమ శక్తి మేరకు ఊహించుకొని జనం ఆనందం పొందుతున్నారు. అంతా మన మేలు కొరకే!

**అందానికి లెక్క ఉందా?** నా ప్రకారం లెక్క ఉంది. గాఢంగా ప్రేమించిన ఒక ప్రియుడు తన ప్రియురాలిని పొగడ్తలతో ముంచెత్తుతూ నీలాంటి సౌందర్య రాశి లక్షలలో ఒక్క అమ్మాయి కూడా ఉండదు అని నా గాఢ నమ్మకం అని ఘోషించాడు ఈ పొగడ్తలో ఒక గణాంకశాస్త్ర సూత్రం నర్మగర్భంగా ఉంది. ఉదాహరణకు చంచాలాక్షులు గల ఒక సుందరీమణి వందలో ఒక్కర్తె అనుకుందాం. అలాగే సంపెంగ పువ్వు లాంటి ముక్కు గల అందాల రాశి వందలో ఒక ఆమె. ప్రాబబిలిటి (సంభావ్యత) ప్రకారం సంపెంగ లాంటి ముక్కుతో చంచాలాక్షులుగల అందమయిన అమ్మాయి పది వేలల్లో ఒక్కర్తె ఉంటుంది. అలా లెక్కలేసుకొంటే అన్ని సౌందర్య లక్షణాలున్న ప్రబంధ కన్య కొన్ని లక్షలమ్మాయిల్లో బహు కొద్దిమంది ఉండటం సంభవం కావచ్చు. ఇది నా ఊహా జనిత లెక్క. ఇది మీ లెక్కల దరిదాపులో ఉంటుందని నా ఊహ.

**ఏది అందం?** అందం గురించి అందరి మనస్సుల్లో ప్రథమంగా స్ఫురించేది మహిళా సౌందర్యమే. మన తెలుగు సాహిత్యంలో కూడా తరుణిల సొగసుల వర్ణనలే ఎక్కువ. సహజం కూడా. మహిళలు రంభ, ఊర్వశి, తిలోత్తమ లాగ అందరూ ఉంటే బావుంటుంది కానీ అది అసాధ్యం. అవసరం లేదు కూడా. ప్రతి నాయుడు బావకి ఎంకి, రంభ తుల్యం అని మన పెద్దలు (బల్లగుద్ది) మరీ చెప్పారు. మనకు రంభా ఊర్వశి మేనకలు నిజంగా ఎలా ఉంటారో తెలియదు. బహుశా వైజయంతిమాల, హేమమాలిని, మాధురీ దీక్షిత్ వంటి సుందరాంగులను ఆ దేవాంగనల ప్రతి రూపాలుగా ఊహించి తృప్తి చెందం తప్ప గత్యంతరం లేదు. ఇటువంటి విషయాల్లో లోకో భిన్న రుచి అని ఒప్పుకోవాలి. చూసే కనులు ఉండాలి గానీ ప్రతి వనితలో ఏదో ఒక ఆకర్షణ ఉంటుంది. అందువల్లే రవి వర్మ, బాపులు పుంఖానుపుంఖాలుగా సాటిలేని మేటి చిత్రాలు సృజన చేశారు. అవి వారసత్వ సంపద కావడం మన అదృష్టం. మీకు ఈ అందాల గురించి మరికొంత స్పష్టత కావాలంటే **మిసిమి** ముఖచిత్రాలలో కనిపించే ముద్దుగుమ్మలను చూస్తే చాలు.

**ప్రకృతి సౌందర్యం :** వనిత సౌందర్యం గురించి ఇంత ప్రస్తావించిన తరువాత ఉత్పన్నమయ్యే ప్రశ్న “మరి ప్రకృతి మాట ఏమిటి? ఈ ప్రశ్నలో చిన్న మెలిక ఉంది. మన పూర్వీకులు పృథ్వీ సహజ ద్వంద్వాన్ని ప్రకృతి – పురుషుడుగా ప్రతిపాదించారు. అంతమాత్రాన స్త్రీ సౌందర్యమే ప్రకృతి అందచందాలు అనటం సబబు కాదు. శతాబ్దాలుగా ఎంతో మంది లబ్ద ప్రతిష్టులయిన కవులు తమ కావ్యాలను అద్భుత ప్రకృతి వర్ణనలతో సుసంపన్న చేశారు. మనలను ఆనందంలో ముంచెత్తారు. పచ్చదనానికి ఆలవాలయిన అడవులు, వాతావరణ సమతుల్యాన్ని రక్షించే

అరణ్యాలు, జీవనదులు, గలల పారే సెలయేళ్ళు, కాశ్మీర తివాసీలను తలపింపచేసే పచ్చిక బయళ్ళు, పాల నురుగులుగా భ్రమింప చేసే జలపాతాలు, సరస్సులు, పూదోటలు, పక్షుల కిలకిలా రావాలు ప్రకృతి శోభకు ప్రతీకలే. చెప్పుకుపోతుంటే అలాంటివి అంతులేని ప్రకృతి సౌందర్యానికి ప్రత్యక్ష సాక్షాత్కారాలు.

**అందానికి మరోకోణం :** ప్రకృతి సౌందర్యమే కాకుండా అందానికి మరో ప్రత్యేక కోణం ఉంది. ఆ కోణాన్ని వీక్షించాలంటే మన తరపున కొంత అనుకూల స్పందన ఉండాలి. ఎక్కడ నైపుణ్యం ఉంటుందో అక్కడ ఎంతోకొంత అందం కూడా ఉంటుంది. నైపుణ్యం నిత్య చేతనం. ఆనాటి రోజుల్లో (అంటే 50-70ల్లో) ఉన్న నైపుణ్యానికి నేటి పరిస్థితులకు తేడా ఉంది. చిన్నప్పటినుంచీ కొత్త విషయాలను కొంత లోతుగా పరికిస్తూ ఆనందాన్ని పొందటం నాకు ఇష్టం. నాటి రోజుల్లో అటువంటి సంతోషాన్ని ఇచ్చిన సంఘటనలు చాలా చోటుచేసుకున్నాయి. అలాంటి మరువలేని ముఖ్యమైన రెండు మూడు సంఘటనలు క్లుప్తంగా ప్రస్తావిస్తాను. ఇంట్లో వడ్రంగం పని జరుగుతుంటే అవకాశం దొరికినప్పుడల్లా తన్మయత్వంతో వాళ్ళ పనిని చూస్తుండేవాణ్ణి. తాటి దూలాలను ఇంటికి తరలించి వాటిని వడ్రంగి గొడ్డలి, పొడుగాటి హ్యాండిల్ ఉన్న చేబాడిదలతో చాకచక్యంగా ఇంటి కప్పుకి వాసాలుగా మార్పు చేసే పద్ధతిని చూసి మైమరచిపోయేవాడిని. వారి కౌశలానికి వర్ణించడానికి మాటలు చాలవు. ఇంటికి కావలసిన గుమ్మాలు, కిటికీలు తలుపులు తయారు చేయడం ఆ రోజుల్లో ఒక ప్రత్యేక ప్రక్రియ. దులాల్ని తలుపులుగా, బీరువాలకు పొడవాటి పలకలుగా, గుమ్మాలకు కమ్మీలుగా రూపాంతరం చేసే వడ్రంగి వాళ్ళ నైపుణ్యం చూసి ఎంతో ఆశ్చర్యపోవడం నా వంతు అయింది. లోతైన సుమారు 8×8×8 అడుగుల లోతు గొయ్యి తవ్వి అడ్డంగా ఒక దులాన్ని అమర్చేవారు. దానిమీద క్రాస్గా (+లాగ) కోయవలసిన దులానిని పెట్టి గోతిలో ఒక మనిషి, దూలం పైన ఇంకో మనిషి ఉండి పొడవాటి రంపంతో వడ్రంగి చెప్పినట్లు చేదన చేసేవారు. వారి కాకష్టం, కౌశలం కళ్ళారా చూసిన ఈ సంఘటన నా బాల్య మనస్సుపై చెరగని ముద్ర వేసింది. టేకు, మద్ది పలకలపై నగిషీలు చెక్కుతున్నప్పుడు వడ్రంగి చేతుల్లో అవి మైనపు ముద్దలేమో అనిపించేవి. ఆ మార్పు అబ్బురం. వడ్రంగి కలపశిల్ప కళాకారుడుగా కనుపించేవాడు.

**కమ్మరి కళ** కూడా ఎంతో అందమయింది. శిల లాంటి ఇనుమును కొలిమిలో ఎర్రగా కాల్చి తగు సమ్మెట దెబ్బలతో పనిముట్లుగా, కళాత్మక వస్తువులుగా రూపకల్పన చేసే కళాకారుడు కమ్మరి. ఆ రోజుల్లో ఎద్దు బళ్ల చక్రాలకు ఇనుప చట్రం తాపడం చేసేవారు. వ్యాసంలో చక్రంకంటే కొద్దిగా తక్కువున్న ఇనుప చట్రాన్ని నేలమీద పిడకలతో కప్పి ఎర్రగా కాల్చేవారు. వేడి చట్రాన్ని చక్రానికి బిగించి చుట్టూ నీళ్ళు పోస్తే బిగుసుకు పోయేది. ఉత్కంఠతో సాగే ఈ ఘటనలో ఏదో అందం ఆనందం కలగలిపి ఉన్నాయి. జానపద నృత్యాలలో మనకు అగుపించే వేషభాషలు, వినిపించే గీతాలు మనలను ఉర్రూత లూగించేవవి. ఆ ఆటపాటలు నేత్రపర్వంగా వినసొంపుగా ఉంటాయి. ఆ మాటకొస్తే ఉపాధి సంబంధించిన పనులను పరిశీలించినప్పుడు ఎంతో కొంత సౌందర్యం, ఆనందం తప్పక మనం పొందగలుగుతాము.

**వింతయిన అందం :** నాలుగు దశాబ్దాల క్రితం జరిగిన చిన్న సంఘటన గురించి క్లుప్తంగా చెపుతాను. నా మిత్రుని కూతురు అపస్మారక స్థితిలో ప్రసిద్ధ జస్లోక్ ఆసుపత్రిలో చేరిన సందర్భంగా పరామర్శ కోసం వెళ్లాను. రూం బయట అక్కడి హెడ్ నర్సు మాతో మాట్లాడుతూ ఆ హాస్పిటల్ సర్జన్ గురించి పొగుడుతూ ఇలా అంది. “ఆయన సర్జరీలు ఎంత బాగా చేస్తాడంటే వాటిని చూడటం అదృష్టంగా అనిపిస్తుంది. సర్జరీ పూర్తి అయ్యాక ఆ పుండుకు బ్యాండేజ్ వెయ్యకుండా గాలి తగిలేట్లు చేస్తే త్వరగా మానుతుందని అలాగే వదిలేస్తాడు. ఆ పుండు ఎంత క్యూట్గా ఉంటుందో చెప్పలేను” అని చెపుతూ తన ముఖాన్ని తన దోసిటలో ఉంచుకొని మురిసిపోయింది. ఈ ఘటన ఎప్పుడు గుర్తొచ్చినా దాని అంతరార్థం అస్పష్టంగా ఉండేది. లోతుగా ఆలోచించినప్పుడు మరో కోణం తెలియ వచ్చింది. నైపుణ్యాన్ని అర్థం చేసుకొని ఎప్పుడయితే ఆరాధ్యభావంతో చూడగలుగుతామో దానిలో ఎన్నో అందాలు కనుపిస్తాయి. హెడ్ నర్సు ఆ సర్జన్ చేసే సర్జరీల నైపుణ్యాన్ని ఆరాధనా భావంతో చూడగలిగింది. సర్జరీ తరువాత మానే దశలో ఉన్న పుండు ఆమెకు క్యూట్గా కనిపించింది. నిజంగానే, చూసే కళ్ళు బట్టి అందం ఉంటుంది.

**నేటి అందాలు :** ఈ రోజుల్లో భవన నిర్మాణాలలో కనివిని ఎరుగని మార్పులు చూస్తున్నాము. అంతస్తుల సంఖ్యలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. దూరం నుంచి చూస్తే వెలిగిపోతున్న స్థంభాలుగా, గోడలుగా అవి కనిపించు తున్నాయి కానీ భవనాలుగా తోచటం లేదు. అవి అద్భుతంగా, ఆశ్చర్యపరిచేట్లు ఉన్నప్పటికీ అందం విషయంలో మన సంప్రదాయ కట్టడాలకు తీసికట్టుగా ఉన్నాయి. ఆధునిక కట్టడాలకు వ్యక్తిత్వం లేదు. అస్థిత్వత లేదు. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో పాతకాలం గొప్ప - కొత్త కాలం దిబ్బ” అనే ధోరణి వ్యక్తం అవుతోంది. ఏ కాలాల ప్రత్యేకతలు వాటివే. దేన్ని వదులుకోలేము. నాటి తరానికి చెందిన వాడిని కాబట్టి ఆనాటి అందాలంటే నాకు కాస్త ఎక్కువ మక్కువ.

# నాట్య శాస్త్రం

**నాట్య శాస్త్రం-ఆంగ్లపు రసం-లో-సంస్కృతాంధ్రపు-పప్పు-వేణుగోపాల రాగమయం**

On A Recent Book launch of NATYA SASTRA,Misimi with an audience ASTRA.

NATYA SASTRA-With SamsodhiniVyakhya—A Book Launch, At 5.30 PM on 26.12.2024

A publication of Indica by Dr.PappuVenugopala Rao D.Litt (Sanskrit, Telugu, English & Indology). University of Silicon Andhra వారి ఆదరణాప్యాయతపు-ఆధ్వర్యంలో 'సప్తపర్ణి ' బంజారా హిల్స్ సాంస్కృతపు చీర చాటు-మాటులో డా. పప్పు వేణుగోపాలరావు గారి పర్యవేక్షనపు-సిలికానాంధ్ర విశ్వవిద్యాలయపు ఆచార్యుల /శిష్య /స్నేహిత /సన్నిహిత బృందపు టీమ్(డాక్టరేట్స్-వసంత లక్ష్మి, యశోద, సంప్రీతి, సింధుజ, యామినీ అమ్మలు & వంశీ గీసిన భంగిమలు) - ఈ నాట్యశాస్త్ర - సంశోధిని వ్యాఖ్యాంగ్లీకరణ డ్రీమ్-మూడు వాల్యూమ్‌ల - ఇండికా - ఉదారంగు బౌండ్ గ్రంధాలుగా అవతరించడం - ఆ గోపాలుని వేణువు ఊద లేదుగా - మధుర ద్వారక బృంధావనపు గాలుల నాట్యలీలా తరంగాలుగా!.


శ్రీమాన్ పప్పు వేణుగోపాల రావు

**మిసిమి**-అశ్వనీ కుమారుల చంకలో తోడునంచిగా-పామరసంచార-ప్రేక్షకకనులలో-ఈ బుక్ పరిచయం-పాండిత్యపు యోగ్యత లేకున్నా- Dance is nothing - But a wing of Drama to ever sing by any being! (Ref. NATYA SASTRA-Volume-1,2&3)- అమరపు ఆ పప్పు గారి చివరి గడియల- చనువు పరిచయపు అనురక్తితో కొంచెం చెబు(ప్పు) తున్నాను::

**మిసిమి**ని చూసి-"రండి-రండి" అన్న ఆహ్వానపు కనులలో కూచిపూడి-కృష్ణలయపుతడి-వడి-ఘోషా-తరంగాలయాన- ఆ Dr.AshodaThakore-డా.యశోదమ్మ-తాకేయేరులా, శ్రీ రాజు చామర్తి-సిలికానాంధ్రసంకీర్తి, "శ్రీ పప్పుసార్" తనతో లేరన్న ఆర్తితో-కన్నీరు సంకేతంగా-అకాలపు వర్షం వచ్చి ఆరుబయట-ఈ 'నాట్య శాస్త్ర'- పుస్తకావిష్కరణ కార్యక్రమం సప్తపర్ణి 'ప్రాంగణంలో కాకుండా తన పూబంతుల దాగిన-భవంతిలో కొనసాగేలా చేసినది.

ముందరగా డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ(అ.ప్రొ.తెలుగు-యూ.సిలికానాంధ్ర) తన ముప్పదిలలో-వామనుడి-తెనుగు సుడుల-గుడిగంటలగా మ్రోగించి-సిలికానాంధ్ర తెలుగుబడి-హైదరాబాదు మదిని గమ్మత్తుగా-చివరిదాకా అచేతన-చేతబడి గావించినారు. సిలికానాంధ్ర సంగీతపు ప్రొపెసర్ మేడమ్- మధుర గానంతో ఆ వటపత్ర సాయిని బయటనుండి సప్తపర్ణి భవంతి లోపల ఆశీనుడయ్యేలా గానం చేశారు.

గౌ. శ్రీ. యల్.వి. సుబ్రహ్మణ్యం-ఐ ఏ.యస్ గారు నాట్య శాస్త్ర- పుస్తకావిష్కరణ పలుకులుగా కొన్ని కొత్త పరిపాలనా కేంద్రీయ విద్యాపాలసీలో తెలియని హక్కులు & అవకాశాలు-ప్రతి విద్యార్థి/విద్యార్థిని -ఎలా అవసరపు ఇంజినీరింగ్-ఇతర కోర్సులు కొనసాగిస్తూ మద్యలో తమతమ ఐచ్ఛిక వివిద కళాశాస్త్రాలు అభ్యసించి-మెయిన్ బ్రతుకు బండికై-సాఫ్ట్ వేరో-హార్డ్ వేరో-మరో జీరో పెరిగేపరుగుల నేర్పరితనంతో పోటీబడి-ఓర్పరితనంతో కొంచెం కళలను కలుపుకొని సాంస్కృత సమతుల్యతా జీవనయానంతో ముందుతరాలకు అందించేలా ఉపన్యసించారు:

("శ్రీ పప్పు సార్-తను ప్రథమంగా సైన్స్ గ్రాడ్యేటుగా కడు పేదవిద్యార్థిగా-స్కాలర్ షిప్‌తో (నెలకు తొమ్మిది రూపాయిల నుండి 60 రూపాయిల వరకు-విజయనగర రాజసంస్థానం మిగిలిన సేవాతత్పరతగా) అమాయిక తొలి జీవన-నాందీ ప్రస్థానం-ఎన్ని కళారంగుల ఇంద్రధనుస్సు- వైవిధ్యంగా నిత్య-విద్యార్థిగా మనకు నైవేధ్యంగా చూపడం-సాహసమా లేక కారణజన్మమా!-ఓ స్టాండర్డ్ కేస్ స్టడీగా అన్నితరాలు తరించగలరు")

గెస్ట్ ఆఫ్ ఆనర్ మరియు సభాకర్షణగా శ్రీ. వోలేటి పార్వతీశం గారు-" నాట్య శాస్త్ర" పై కొన్ని అభినయపు మాటలు ఉటంకంచి-అసలు శ్రీ పప్పు గారితో తన నాలుగుదశాబ్దాల దూరదర్శన్ వృత్తిలో కొన్ని పరిచయపు సంఘటనలు ఉదహరిస్తూ-బహుముఖ శాస్త్ర పారంగతులుగా ఉంటూ-శ్రీ పప్పు గారు ఎంత నిస్వార్థంగా- 1980/ 90లలో-నాట్యశాస్త్రపు సందేహ/విమర్శనాత్మక/ సందిగ్ధ వాదోప సమావేశాలలో- ప్రముఖ నాట్యాచారులు శ్రీ.నటరాజ రామకృష్ణ మరియు ఉద్దండ నాట్యశాస్త్ర పండితులు శ్రీ.పి.యస్.ఆర్ అప్పారావు గార్ల నడుమ నాట్యశాస్త్ర చర్చలలో మధ్యవర్తిగా వేణుగోపాలునిగా రాయబారి అన్నట్లు తమ ఉడికిన పప్పుతో ఆవకాయ-వెన్నకలయిక ముద్దలు తినిపించి -తేలని శాస్త్ర సమస్యలను తన నివృత్తులతో చల్లారేలా గాంచి-తమ సొంత ఖర్చులతో (వేరే రాష్ట్ర ప్రభుత్వ టి.యే లు వర్తించవు కదా!) రాను-పోను-మద్రాస్ వెళ్ళిన విధానం అందరినీ అవక్కాయ్యేలా-రియల్ డ్రామా-భ్రమభరితం చేసినది. అవును-నాట్యం అనగా జీవన గమన నాటకంగా-శ్రీ పప్పు గారి జీవితపు-ఉప్పు-"నాట్య శాస్త్ర'లో అభినయించే భరతముని రగిలించే నిజపు నిప్పుగా-ఆ వేణు గోపాలుడిచ్చిన-జ్ఞానాభిమానపు వేడిని-హరికథగా భావించడమే-నాట్యశాస్త్రలో మానవ గానమేమో!-వదిలిన-పాద ముద్రలను తాకుతూ అందరూ ఆ వేణువు (శ్రీపప్పు)-నాట్యనడక-సంభాషణగా కొనసాగించారు.




"నాట్య శాస్త్ర" బుక్ రివ్యూలో-ఉపన్యసిస్తూ-తమ నాట్య శాస్త్ర-విశ్వవిద్యాలయం, తమతమ విభాగంలో ఆనంద వదనగా, సందేహ నివృత్తిగా-"నేనున్నాను!"-యని ప్రతిప్రత్యక్షంతో-విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కేరింతలు తిప్పామా యని కన్నీరుతో గొంతులో తెలియవు అని అంటూనే-అనేకం-చేశారు- రాయాలంటే మరో పుస్తకం-

పండిత డా.ఎస్.టి.జి వసంతలక్ష్మి గారు ఆంగ్లీకరణ- టీమ్ మెంబర్స్, సిలికానాంధ్ర అనేక వేల శ్లోకాలను ఎలా మదనగా గాక-శ్రీ పప్పు సార్ 24×7 ఆకస్మికంగా-ఓ యజ్ఞంలా ముగించి, సిలికానాంధ్ర గొట్టి-ఆ వేణు గానాన్ని పాలపుంతల వైపు పలుకులు జామ్ కావడం-తనకు ఏమి పదాల తడి మడితో-మమ్ములను మమేకం "నాట్యశాస్త్ర- ఆంగ్లం-మేకింగ్"గా-వారి టీమ్ సిలికానాంధ్రవిశ్వవిద్యాలయం చేయగల మనవి.

శ్రీ పప్పు గారి పుత్రులు శ్రీ పతంజలిశాస్త్రులు-తన కన్నతల్లితండ్రులు ఒకే ఏడాదిలోనే కాలం చేయడం-తన తెనుగు గొంతు ఎడారిగా మారిందని-తన మామగారు మరియు అంకుల్సుతో-శ్రీ పప్పుగారిని కుచేలుడుగాంచిన కృష్ణునిగా తము పొందినవి-పొర్లించారు.

అకస్మాత్తుగా మాటల గమ్మత్తు డా. గంగిశెట్టి కాలేచివరివత్తూ-వదలా అంటూ-"ఇది నాట్యం!మాది పాఠ్యం" భావనగా-ప్రేక్షునిగా ఆసీనులైన **మిసిమి** అశ్వనీకుమారులను-శ్రీ పప్పుగారి **మిసిమి** అనుబందంపై కొంచెం పంచుకో మన్నారు, ఎప్పుడో రాసి మరచిన తెనుగుని-**మిసిమి** పత్రికలను చదివించి శ్రీ పప్పుసార్‌తో కొత్తగా వ్రాయించిన -అనేక వ్యాసాల విధానం-ముఖ్యంగా ఉపనిషత్తులు, నృత్యభారతి, తెనుగువాన-అందెశ్రీ-"అగ్రజా-ఈ 'నిప్పులవాగు' శాంతికై అమృతలహరి వాఖ్యానం-ఆదిశంకరుల-'సౌందర్యలహరి' తెనుగించవా"యని అడగ్గానే కళాజ్యోతిలో రూపం చేసి శ్రీ అందెశ్రీ గారికే అంకితం గావించి-ఆత్మీయతసుస్థిరత అనే బందపు పురుషపుంగవుడిగా ఎక్కడో విజయనగరంలో పుట్టి-మద్రాస్-చెన్నపట్టణాన్నేజీవనాన్ని గడిపినా-అన్నగా తెలంగాణ కవి-దిగుడుబావి నీటిఊట తేటకై-మాటగా

చెబుతూ-అశ్వనీ గారు-తనగొంతులో తడితో ఆగినారు. తనతో గత ఐదు సంవత్సారాలు-ఉదయం ఆరుగంటలుకు-"గుడ్ మార్నింగ్-అశ్వనీ" అని అనేక-ఇప్పుడు చెప్పలేని విషయాలు తప్పక పంచుకొనేవారన్నారు-బహుశా తనకంటే వయస్సులో 'పెద్దని' లేక ఏదో తెలియని 'ముద్దని'-చెప్పలేను యని-తన ఆఖరి కలయికగా హైదారాబాద్‌లో-కొన్ని నెలలు కాలం చేసే ముందు-సందర్భంలో-ఈ వ్యాసకర్త-తోడుగావెళ్ళిన-సాక్షిగా-నన్ను చూపించారు, కర్ణాటక సంగీతసామ్రాట్ బాలమురళీ కృష్ణంతాయన (ఇంతకుముందు శ్రీ పార్వతీశం గారన్నట్టు), శ్రీ పప్పుగారు పరిచయం పిదప- ఏ గ్రంథం చదవలేదట-రిఫరెన్స్‌కై-ఈ వేణువుని మీటే వారట! అలాగే మద్రాస్ సంగీత అకాడమీ సంబంధం, అనేక ప్రముఖ-సాహితీ-కళా-ఇలీట్స్‌తో రసమయ జీవితమిళితం-ఇంకా కొంత జీవితం సాగిస్తే -ముందుతరాలకు మరికొన్ని గ్రంధాలు తెచ్చుకొనే వారిమేమో!-అన్న దిగులు మిగులతో **మిసిమి** అశ్వని గారు ముగిస్తూ ఉంటే-మనతో మాయమైన శ్రీ పప్పు గారి మూర్తిని ఊహించుకొంటూ-ఈ "వ్యాసకర్త" తనకున్న ఎంతో విలువైన చెప్పుకోలేని-పప్పుసార్ కొద్దిగంటల చూపులు పరిచయంతో 'క్యాబ్' ఎక్కుతూ-సప్తపర్ణి బయట-వెలసినవర్షపు-శీతాకాలపు ఆకసంలో మెరుస్తున్న పెద్దస్టార్‌ను అనుకోకుండా గమనిస్తూ-

నిశ్శబ్దంగా-"బహుశా మన 'పప్పుసార్'-తను వచ్చిన పని సమాప్తమని ఆ బహుముఖ శాస్త్ర పారంగతులుగా-ఈ "నాట్యశాస్త్ర"-వేలసంస్కృత శ్లోకాలను-సంశోధిని వాఖ్యగా-ఆంగ్లంలో విశాలంగా తనమది తుది తాండవంగా-జీవనమే-ఓ సాహిత్యసంగీతపునాట్యంగా-నిజం భూతకాలప్రిజంలో ఓ దేవదాసీ రసానయం-ప్రథమ ప్రపంచ యుద్ధాంతర-గాంధీ-ఉప్పుసత్యాగ్రహారంభ-స్వేచ్ఛ రగిలిన నిప్పు భారతికాలంలో-అడయార్ అనిబిసెంట్-ఆల్ కెమీ-బ్రాహ్మణీకం-ఓ ఆంగిక అభినయం-రుక్మిణీ అరండాల్ అరంగ్రేటం-రవీంద్రుని కుంచె కాంతి వీపువెనుక నివ్వగా-ఆ దివ్యపు 'హలాల్ హవా-కళాక్షేత్రపు పరిమళాల గాలితరంగ తాకిడి-ఉనికి-ఓమామూలు గుజరాతీ టీచర్ 'నీతా దలాల్-నీతాఅంబానీగా భరతనాట్యాభినయంలో పలికి, మరో మహారాణి పూసపాటి రాజవంశపు పయనం-మద్రాస్ సిమ్మెంట్ పచ్చటి అంటు-రిషివాలీ స్కూల్ స్వేచ్ఛా జిడ్డు కృష్ణపూ- గాలి-"సంధ్యారాజు భైర్రాజు" (శ్రీ పప్పుగారి కొప్పెలో కదిలిన ఓశిష్యపు ముత్యపు మెప్పు) తన అంతర ఘోషను నృత్యపు-సత్యపుభాష గా'నాట్యం' చలనచిత్రం చేసేవరకు, అలా 'నాటునాటు' తెలుగునాట-'నాచో నాచో' హిందీబేసిన్-బూంది నృత్యకారం-భావాంతరం- ఫ్రెంచ్-బాలె(Ballet)తో రెంచ్ (Wrench) త్రిప్పితే-ఓగ్రీకు-జోర్బా-గాలా-మల్లెలమాల-సైలెన్స్-డాన్స్-చార్లీ చాప్లిన్-మూన్ వాక్-మైకేల్.జాక్-ఆఫ్రికన్-సన్-నరాల నిగ్రహ(నీగ్రోగుహ) చిక్కటిచీకటి-"మాటుమాటు" స్వదేశీ-బీట్-అన్నిటా-అదే హీట్-కన్నీట-మన ప్రసాదంగా భరతముని జ్ఞానగని-భూగోళం సుస్థిర గమనానికై-తమ నాట్య పరిశోధనా ప్రగతి ప్రతిని తదుపరితర అభ్యాసకుల అవయవపు వయ్యారపు గమనాలకు వదిలి-తన రాద-జయకై-పతీసహగమనంగా?

"వైకుంఠం వైపు-ఓ అడుగు, కైలాసం వైపు-మరో అడుగు, అది అనంత నృత్యపు పరుగు, లేదు-ఏ మృత్యపు మడుగు!".

Those who listen to this Natya Sastra pronounced by Brahma, present it or study its practices shall attain the divine abode which is attained by Vedic scholars, those who perform Yajnas and those of charitable nature. It has been said that great merit is obtained by participating in charity, Showcasing Natya is greater even than those of charitable acts (37.26-27&37.28-page 2809, Volume 3)

---

*ఐ.వి.రామరాజు, 9912644386, పిప్పర. (మిసిమి పత్రిక తరుపున)*

# అరికాళ్ళకింద మంటలు

**– శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి**

**కా**ళ్ళ కింద నిప్పులు పొయ్యటం అన్నది వాడుక. దాన్ని మరింత బలంగా అరికాళ్ళకింద మంటలు అన్నారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు. అంటే మనిషిని నిలవనియ్యకపోవటం అన్నమాట. ఈకథలో అలా నిలవనియ్యనిది ఎవరో కాదు, ఆ ఇంటి ఆడబిడ్డ రుక్కునే. అలా చేసింది పరాయివాళ్ళు కాదు. ఆ ఇంటి మనుషులే. ఈ కథని శ్రీపాదవారు 1935లో రాశారు.

రుక్కు బాల వితంతువు. పదిహేడో ఏడు నడుస్తోంది. ఆ కాలంలో బాల వితంతువుల మీద ఎన్నో ఆంక్షలు, ఆచారాల దౌష్ట్యాలు, క్రౌర్యాలు. ఆ జీవితం నిత్యనరకం. ఇవన్నీ వితంతువు పవిత్రంగా ఉండటం కోసం ఏర్పరచినవే. ఆమెకి అలంకారాలన్నీ దూరం. అంతే కాకుండా వీలున్నంత అనాకర్షణగా ఉండేలా చూసేవారు. జుట్టు ఉంటే అందంగా కనపడుతుందని గుండు చేయించేవారు. వీటన్నింటికన్నా హింస ఇంటి చాకిరి. వితంతు వంటే చాకిరీ కోసమే అనే పద్ధతులు. ముఖ్యంగా సనాతన బ్రాహ్మణ కుటుంబాలలో. కథ రుక్కుని గంధం తియ్యమనటంతో ఆరంభమవుతుంది. తియ్యమన్నది అమ్మమ్మ. ఆవిడా వితంతువే. పోత చేతిలో ఇంటి పెద్దరికం, అధికారం ఉన్నావిడ. గంధం ఎవరికోసం అంటే యాభైల వయసు దాటిన తల్లీతండ్రి శృంగార సౌఖ్యం కోసం. గంటసేపు గంధం చెక్కని అరగతీస్తేనే కానీ కప్పుడు గంధం రాదు. చేతులు లాగేస్తాయి. ఆరోజు ఆ ఒక్కపనే కాదు రుక్కుకి. ఇంట్లోని అందరు తలో పని పురమాయిస్తున్నారు. చివరికి రుక్కు కన్నా చిన్నవాళ్ళైన తమ్ముడు, చెల్లెలుతో సహా. పెద్దక్క కూతురుకి జుబ్బా కుట్టాలి, చిన్నక్కకి రవిక, అమ్మమ్మ అప్పచెప్పిన నాలుగు కంచాల కందులు బాగు చెయ్యాలి, ఇవికాక పశు వులకొట్టం, పాలు తియ్యటం లాంటి రోజూ వారి పనులు. ఇవి చాలవన్నట్టు సాయంత్రం వంటపని అదనంగా పురమాయించింది కన్నతల్లి.

ఒక్కమనిషి పదిహేడేళ్ళ పసిది ఇంత చాకిరీ ఎలా చేస్తుంది? అసలు ఎందుకు చెయ్యాలి? అన్న అక్కర ఏ ఒక్కరికీ లేదు. వితంతువంటే ఆ రోజుల్లో చాకిరీ చేసే యంత్రం. అనాకారిలా చరించాల్సిన జీవచ్ఛవం. కడుపునిండా తినకూడదు. ఒంటిపూటలు. ఎక్కువ తింటే ఒళ్ళు బలిసి చెడిపోవచ్చు. అది ఆచారం, సంప్రదాయం. ఇదంతా చచ్చి ఎక్కడున్నాడో తెలియని ఆ భర్తా, ఆ ఇంటి కుహనా పరువు నిలబెట్టటానికే. అందుకే వితంతువులకి శరీరం, మనసు డస్సిపోయే చాకిరి. వీరికి తిరిగి పెళ్ళి చేసి ఈ నరకం తప్పించొచ్చు. కానీ వితంతు వివాహం, సంప్రదాయ విరుద్ధం. ఈ దురాచారాన్ని వ్యతిరేకించి వీరేశలింగం పంతులు గారు వితంతు వివాహాలు చెయ్యటం ఆరంభించారు. అదో మహోద్యమం. ఆయన సంఘ సంస్కరణ కేంద్రం రాజమహేంద్రవరంలోనే రుక్కూ ఉన్నది ఆ ఊరే. ఆరోజు మొత్తం ఇంటి పనంతా పూర్తి చేసేటప్పటికి రాత్రి పదకొండు దాటింది. ఒళ్ళంతా పులిసిపోయింది. మనసూ బాగోలేదు. దానికి కారణం సాయంత్రం అమ్మమ్మ, తండ్రి మధ్య సాగిన సంభాషణ. రుక్కుకి జుట్టు తీయించి గుండు చేయించాలి, అది సంప్రదాయం అని ఆ ముసలి వితంతువు పట్టు. రుక్కు తండ్రి ఎటూ చెప్పలేక నీళ్ళు నమిలాడు. ఎల్లుండి తెల్లారగట్టు ఆ తంతు ఖాయం చేశారు. ఆ సంభాషణ వింటున్నప్పుడే రుక్కుకి గుండెలు అదిరాయి. అందరూ నిద్రపోతున్నారు. ఒంటరిగా అనిపించింది రుక్కుకి. కళ్ళు మూసినా, తెరచినా గాఢాంధకారంలాగే. ఇంట్లో అందరూ పీడకలలా కళ్ళముందు కనిపించారు. ఇంక పడుకోలేక పోయింది. చాపమీంచి ఒక్కదుటున లేచి, వీధితలుపు తెరచి బైటికొచ్చింది. పెద్దవెర వీడినట్లైంది. ముందుకు నడిచింది.

చీకట్లో కొంచెం భయపడింది. అక్కడున్న జట్కాబండి వాడు "బండి కావాలా?" అనడిగాడు. రుక్కు వాలకం బాగా అర్థమైంది అతనికి. అతనికి ఇంట్లో రుక్కులాంటి ఆడపిల్ల ఉంది. "పంతులుగారి తోటకా?" అనడిగాడు. అవునన్నట్టు తలూపింది. తోటకైతే నాకేం ఇవ్వక్ఖర్లేదు రండి అమ్మాయిగారు అని ఎక్కించుకున్నాడు. బండి పరుగు పెడుతుంటే, తోటలో జరిగిన పెళ్ళిళ్ళ గురించి, సిద్ధంగా వున్న మంచి సంబంధం గురించి చెప్పాడు. "మీ బతుక్కి అంతా సుఖమే, భయపడకండి" అని రుక్కులో ధైర్యం పోశాడు. ఆ మంచి సంబంధం రుక్కుకే అన్న సూచన. త్వరలో తన కూతుర్ని తోటకే తెస్తానన్న జట్కావాడి ఆనందం, మంచితనం. జట్కా మలుపు తిరిగేసింది అని కథ ముగించారు శ్రీపాద. అంటే రుక్కు జీవితం సరైన మలుపు తిరిగినట్టే. శ్రీపాద వారి కథలు చాలావరకూ పూర్తి సంభాషణలతోనే నడుస్తాయి. ఈ కథా అంతే. వాటిలోనే ఆనాటి జీవితం, మనుషులు, సంప్రదాయాలు, మూఢాచారాలు, సంస్కరణలూ అన్నీ ఉండటం గొప్ప విశేషం. అంతేకాదు కథకి ఎక్కడా, ఏ మాత్రం నాటక వాసన అంటనివ్వకపోటం, ఆయనకే చెల్లింది. సహజ జీవిత భాగాలు ఆ కథలు. ఈ కథ ఆకోవలో మరీ ప్రత్యేకం.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

# ఒక మంచి ప్రేమ కల

(**ఒ**క మంచి ప్రేమ కథ-ఓ సినిమా ప్రివ్యూ-**మిసిమి**-హెూం-టీం-వ్యూ) “ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూలో మిసిమి తన సీట్ ప్రక్కన కూర్చుండబట్టే సమయంలో- ఎప్పుడో మావూరు టూరింగ్ ధియేటర్-ఆఖరి బెల్-హల్లుతో గల్లుగా వినడం- హాలులో వెండితర కరగడం-ఆట ముందరగా-పేర్లు-కదలడం-మేము మాతో ఆహ్వానిత ప్రేక్షకులు మొత్తంగా- మౌనపు చూపులతో ఆగిపోవడం (సినిమా అంటే అందరూ కూర్చుని కనే కలగా) సినిమా పేరు-“ఒక మంచి ప్రేమ కథ”గా-ఏదో మామూలు-కుర్ర లవ్ (ఏదో ప్లస్-మైనస్, ప్లస్-ప్లస్ ,మైనస్-మైనస్) లేక ముదిరిన బుర్రలవ్వో? అందరూ అనుకొంటూ చూడనారంభించినాము. హీరో ఎవరు! - ఎవరు హీరోయిన్ ! తప్పక తేల్చుకోవలసినది-మన ప్రేక్షక మహాశయులే-ఈ ప్రత్యేక ప్రేమ సినిమా-రిలీజ్ అయ్యాక.




ప్రస్తుత కొనసాగుతున్న అర్బన్-అర్బక-అంటీ అంటనీ కార్పోరేట్-మేట్స్, అన్నిపోరాట జీవితాల పర్యావరణవాతావరణం-కథ, మాటలు & మరియు పాటలు-మన మెదళ్ళ- పొదళ్ళలో మెరిసే పోయిన ఆభరణంగా- రచయిత్రిగా-శ్రీమతి వోల్గా-మనలను సినిమా ఆరంభంలో నిదానంగా -Conflict- అన్ని పాత్రలలో-ప్రాంతాలుగా (గ్రామ/పట్టణాలలో)-కాయిస్తూ-Robert Frost, JohnKeats & P.Bshelly' essence-romance-dance మన దాచుకొన్న చల్లని అడవి కాసిన వెన్నెల బాల్యపు అమాయకపు-ఫ్రాస్ట్-ఐస్ గడ్డ గుడ్డలలో కీట్స్-స్వీట్స్ తాయినాలు, షెల్లీ-లిరికల్-రొమాన్స్ కిళ్ళీలు-నాయక ‘సముద్రఖని’ (ఈశ్వర్) మరియు నాయిక ‘రోహిణి (సుజాత)’ పోటాపోటి నటనలో-దర్శకులు అక్కినేని కుటుంబరావులు -సకలకుటుంబం-అన్ని రోజులు సంక్రాంతిగా-మరో కొత్తరసం-సినిమా ధియేటర్‌లలో ఆస్వాదించేలా చాకచక్యపు స్క్రీన్ ప్లేతో అందించారు.

కొన్ని పంచ్ డైలాగులు-అమ్మాయిలు అబ్బాయిలు తమతో పంచుకొని-పట్టుకోగలరు-ప్రేమ ‘ఫిక్స్ డు డిపాజిట్‘గా చేసుకొనేది కాదు-పెరిగేది కాదు-తరగాలి-పెరగాలి-ఎగరాలి!-నీరు/పన్నీరు/కన్నీరు-ధారతో పోషించుకోవాలి- తమ తోటి మొక్కను-అనే భావంలో, అనేక ఓల్గా -గోదారి అలల-గలలు దాగున్నాయి.

రోహిణీ హట్టంగడి-తల్లి-రంగమణిపాత్ర-గతరంగపు పాతసెంట్ మెంట్ ఏమాత్రం రంగరించక- సాగతీతగా-కాక-ఓకొత్తతరంగపు తల్లి- కొత్త కేక, మన అమ్మ కోక-ఒక మంచి ప్రేమకథ సినిమాని-ఓ నెక్స్టలెవెల్-ప్రేమ థెరపీకు తీసుకొని వెళ్ళి ప్రేక్షకులందరిని తన ప్రేమబడిలో-కె.యమ్ రాధాకృష్ణన్ సంగీతంతో ‘గడియ’ వేసిందని చెప్పక మానలేము. అన్ని తరాలు- బూమర్స్ నుండి జూమర్స్ వరకు తాకే- పెద్దహిట్ సినిమా, ‘సీతారామయ్యగారి మనవరాలు’-అప్పటి సినిమా గమనం తీరు-వేరు,-ఒక మంచి ప్రేమ కథ-ఇప్పటి రాబోయే సినిమా-మన వనవృక్షపువేరు! ఫోటోగ్రాఫర్-మధు అంబట్,ఎడిటర్-బి లెనిన్స్ తమ శాఖల నిపుణత-ఆక్స్ ఫర్డ్ మనవరాలుగా అనన్య పాత్ర ఆశ్చర్య పడేలా చేయడం-ప్రేక్షక కుటుంబాలన్నీ-నిర్మాత-హిమాంసు పోపూరిని-గారని-మన్నించక ఉండలేరేమో! **మిసిమి** చదువరులు (సారీ! కొంచెం చనువు-స్వేచ్ఛతో చెబుతున్నందులకు) ధియేటర్స్‌లో మిస్ కాకుండా కుటుంబసమేతంగా చూడగలరు! నేను రెండవసారి కుటుంబ సమేతంగా-నా కోసం మరోసారి తాగుతాను-ఒక మంచి ప్రేమ కథ-వెండితెర చిత్రపు రసంగా!

అశ్వనీకుమారులు-**మిసిమి**-మేము తిరుగు వెళ్ళే కదిలే క్యాబ్‌లో-కామెంట్‌గా-మొదట భాగం-“కద”-కదిలింది-రెండవ భాగం-“కల” మనం-కనింది” యని నాకు కళగా వివరంగా-చెప్పడం-డ్రైవర్-ఏమి సినిమా-సార్ అనడం, మనదిగా-తననూ-సినిమా రిలీజ్ అయ్యాక చూసి పంచుకోమని చెప్పడం.

*కథ, మాటలు, పాటలు : శ్రీమతి ఓల్గా, సినిమాటోగ్రఫీ : మధు అంబట్, ఎడిటింగ్ : బి. లెనిన్, డైరెక్టర్ : అక్కినేని కుటుంబరావు, ప్రొడ్యూసర్ : హిమాంసు పోపూరి, నటీ నటులు : రోహిణి హటంగళ్, రోహిణి, సముద్రకని, అనన్య నన్నపనేని.*

*- ఐ.వి రామరాజు-పిప్పర. 9912644386-( మిసిమి తరుపున)*

## మన సినిమా -ఫస్ట్ రీల్

మనందరకూ చరిత్ర ఎవరైనా రాస్తే చదువుతాం. అది పాశ్చాత్యులు రాస్తే మరీ మంచిదని గుడ్డిగా నమ్మేస్తాం మనకు సంబంధించిన అనేక అంశాల మూలాలు తెలుసుకునే ఓపిక ఏమాత్రం లేని వారెవరంటే తెలుగువారం విచిత్రమేమిటంటే తెలుగు వారికి సినిమా అంటే ప్రాణం. కానీ తొలి తెలుగు సినిమా ఏదంటే దిక్కులు చూస్తాం. అయితే దేన్నయినా పిచ్చిగా ప్రేమించే కొందరుంటారు. వారు మాత్రం పట్టువదలని విక్రమార్కులై తమ గమ్యం వైపో, లక్ష్యం వైపో సాగుతుంటారు. అందులో ప్రధమ స్థానంలో ఉంటారు సినీ జర్నలిస్ట్ డా.రెంటాల జయదేవ సినిమా రివ్యూలకు, ప్రత్యేక సంచికలకు పరిమితమై పోకుండా తన జిజ్ఞాసను మూకీ, టాకీ చరిత్ర వైపు మళ్ళించి,అనేక ఆసక్తికరమైన విషయాలు పుస్తకంగా వెలువరించారు.అదే "మన సినిమా ఫస్ట్ రీల్." నిజానికి ఈ ప్రయత్నం ఏ భారతీయ భాషలోనైనా జరిగిందా అంటే అనుమానమే. అలాగే జయదేవ హిందీ, తెలుగు,తమిళం, మళయాళం,కన్నడ భాషల్లో మూకీ చిత్రాలు ఎప్పుడొచ్చాయి, అవి టాకీలుగా ఏవిధంగా మారాయి ఇత్యాది అంశాలపై జరిపిన ఈ పరిశోధన కొన్ని నెలలు కాదు.. కొన్ని సంవత్సరాల తరబడి చేస్తూ వస్తున్నానని చెప్పారు..




ఇప్పటికే జయదేవ మొదటి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద రిలీజ్ డేట్ అందరూ అనుకునే సెప్టెంబర్ 15,1931కాదు ఫిబ్రవరి 6,1932అని ఆధారాలతో సహా నిరూపించిన సంగతి తెలిసిందే.ఇందులో సమగ్రంగా ఆ సమాచారాన్ని పొందుపరిచారు. ఆ తొలి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద తెరవెనుక సంగతులుగా మరో పుస్తకం తేబోతున్నారు. అది పక్కన పెడితే మరో ఆసక్తికరమైన అంశం మనముందుకు తెచ్చారు. అదేమిటంటే 1931 అక్టోబర్ 31న విడుదలైన "తమిళ -తెలుగు టాకీ కాళిదాస్"ని మనం విస్మరించామని, తమిళులు దానిని తమ సొంతం చేసుకున్నారని, అది తప్పని ఆధారాలతో చెబుతారు. అందులో ముఖ్య పాత్రలు తెలుగులో మాట్లాడాయని, తమిళ పాటలు, త్యాగరాజ స్వామి కీర్తనలున్నాయన్న కొత్త సంగతులు గుదిగుచ్చి మనకందిస్తారు. గుచ్చిగుచ్చి నొక్కి వక్కాణిస్తారు. అలాగే తొలి టాకీ ఆలం ఆరా ప్రభావం తెలుగు, తమిళ మూకీ చిత్రాలపై ఏవిధంగా ఉంది, ఆలం ఆరా దర్శక నిర్మాత అర్దేషిర్ ఇరానీ దగ్గర పనిచేసిన దర్శక నిర్మాత హెచ్.ఎమ్.రెడ్డి.ఎలా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో టాకీలు నిర్మించిన తొలి దర్శకుడయ్యారో పూసగుచ్చినట్టు చెబుతారు. తొలి రోజుల టాకీల్లో ముప్పాతిక భాగం పాటలుండేవి.అవన్నీ ఆయా నటీనటులే చిత్రీకరణ సమయంలోనే పాడాల్సి వచ్చేది. అలా సింక్ సౌండ్ ఆరోజుల్లోనే మొదలయ్యిందని అంటారు. అలాగే తొలినాళ్లలో టాకీలన్నీ సింగీ లే అని చమత్కరిస్తారు. ఇంత పెద్ద పుస్తకంలో అక్షర దోషాలు లేకపోవటం రచయిత, ప్రచురణకర్తల శ్రద్ధను తెలియచేస్తుంది.

సినిమాపై వెలువడ్డ పుస్తకాలకు నాణ్యమైన ప్రొడక్షన్ చాలా ముఖ్యం. దాదాపు ఆరు వందల పేజీలున్న ఈ పుస్తకంలో ప్రతి పేజీని నాలుగు ఛాయాచిత్రాలతో అలంకరించి తను సేకరించిన సమాచారానికి ఒక సాధికారతను చేకూర్చారు రచయిత.ఇందులో ఆనాటి నటీనటులు, ఆరోజుల్లో సినిమా పబ్లిసిటీ క్లిప్పింగ్స్, ఒకప్పటి థియేటర్ల ఛాయాచిత్రాలు.. ఇవి కూడా ఉండి పుస్తకాన్ని పరిపుష్టం చేశాయి. అయితే తొలి రోజుల్లో తెలుగు సినిమాకు ఎంతో సేవ చేసిన రఘుపతి వెంకయ్య గురించి ఒక చాప్టర్ కేటాయించి ఉంటే బావుండేదేమో...దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు జ్ఞాపకాలు, సినీనటి శారద అనుభవాలు, ఈతరాన్ని ప్రభావితం చేసిన దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి, దక్షిణాది భాషల నటుడు ప్రకాష్ రాజ్ ల అభిప్రాయాలు సినిమా చరిత్రను రికార్డు చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేసినా తెలుగు సినిమా స్వర్ణయుగం ఎప్పుడో అంతరించిపోయింది. ప్రస్తుతం ఫాన్ వార్స్, కలెక్షన్ వార్స్ తో కొట్టుమిట్టాడుతున్న తెలుగు సినిమాకు మహారాజ పోషకులయిన యువతకు మనసినిమా ఫస్ట్ రీల్ ఎలా పుట్టిందో తెలుసుకోవాలన్న తపన ఉన్నదా అన్న ప్రశ్న రావటం సహజం.. ఆ ప్రశ్నకు సమాధానం ఈ పుస్తకాన్ని ఆంగ్లంలోకి తర్జుమా చేయగలిగితే తప్పకుండా లభిస్తుందన్న నమ్మకం ఈ సమీక్షకుడికి ఉన్నది.. తెలుగు సినిమాయే కాదు తొలినాటి భారతీయ సినిమా చరిత్రను అత్యద్భుతంగా రికార్డు చేసిన రెంటాల జయదేవకు అభినందనలు... తొలి దక్షిణ భారత టాకీ కాళిదాస్ విడుదలై తొంభై మూడేళ్ల సందర్భంగా ఈ గ్రంథాన్ని ప్రచురించిన ప్రచురణకర్తలు ఎమెస్కో వారికి అభినందనలు..

*రచన: రెంటాల జయదేవ, వెల: 750/-, పేజీలు : 566, ప్రతులకు: సాహితీ ప్రచురణలు, ఫోన్ : 91 98499 92890*

*- సి.యస్.రాంబాబు*

# చదవండి...

**- మిసిమి**

📖 **పడమటి సినిమా పరిమళం - పులగం చిన్నారాయణ:** సినిమా అంటే చూస్తున్నవారందరూ ఒకచోట కూర్చుని - ఒక కల ఒకేసారి కలగనటం! నాకు తెలిసి ఇలాంటి ఔచిత్యంగల అర్థాన్ని సినిమాకి ఆపాదించింది - సినిమాను - సినిమా పాటను ఎంతగానో ప్రేమించి తన జీవితంలో ఎంతో భాగాన్ని అందుకు కేటాయించిన రవిగారు మాత్రమే చెప్పగలరు! 'పడమటి సినిమా పరిమళం' పుస్తకానికి ముందుమాట రాస్తూ వారు పైన చెప్పిన నిర్వచనం ఇవ్వడమే గాక - తెలుగు సినిమా రంగానికి చెందిన ఇరవై ముగ్గురు పేరు గల వారు వారికి నచ్చిన సినిమా - అది ఎందుకు నచ్చిందో వివరిస్తూ రాసినవే ఇవన్నీ- తొంబయి ఏళ్ల సింగీతం శ్రీనివాసరావు మొదలు నేటి రచయిత, దర్శకులు త్రివిక్రమ్ - సుకుమార్‌లు - కథా రచయిత వంశీ దార్శినకత - నటులు కమలహాన్ వీరి కథనాలు - సినిమా గురించి చదివి తెలుసుకోవాల్సిందే - పులగం చిన్నారాయణ - చేయి తిరిగిన సినీ రచయిత. వారి సంకలనం ఇది - పేజీలు : 144, వెల : 100, ప్రతులకు : ఫోన్ : 0866 - 2436642/43, 8121098500




📖 **సప్తశతి - సుధామ:** తెలుగు వారికి కొత్త ప్రక్రియలంటే ఆసక్తి ఎక్కువ. ఎప్పుడూ ప్రోత్సహిస్తారు కూడ. అలాంటి ప్రక్రియలను సృష్టించినవారు కవి సుధామ. సప్తపది ఒక కోణం. ఆ శీర్షికలో ఏడు పదాల లఘు కవిత ప్రక్రియకు రూపకల్పన చేశారు. దాదాపు రెండు సంవత్సరాలుగ ఈ ప్రక్రియ కొనసాగుతోంది. సప్తపది పేరుతో ఒక వాట్సాప్ గ్రూప్ నడుపుతున్నారు. ఈ సప్తపదుల్లో ఎంపిక చేసిన 700 సప్తపదులను సప్తశతిగ తీసుకొచ్చారు. ప్రాసతో మొదటి రెండు పదాలుండాలి, తర్వాతి ఐదు పదాల్లో భావం తొణికిసలాడుతూ చివరిపదం మొదటి రెండు పదాల అంత్య ప్రాసను కలిగుండాలి.




ఈ ఉత్సాహం సాగినంత కాలం ప్రక్రియ నిలబడుతుంది. కవితాత్మకంగ వాక్యాలుండటం కొంచెం కష్టమే.
పేజీలు : 219, వెల : 250/-, ప్రతులకు : ఫోన్ : 9849297958.

📖 **వైజయంతి - విహారి:** చారిత్రక నామధేయాలలో, చారిత్రక ప్రదేశాలలో వెలువడే సాహిత్యంలో ఎక్కువ భాగం ఊహాజనితమే. అయినా ఆ స్థల కాలాలను ఎంతో కొంత ప్రతిబింబిస్తాయి. ప్రముఖ రచయిత విహారి పండిత జగన్నాథరాయలుపై ఒక చారిత్రక ఊహాజనిత నవల వెలువరించారు. 17వ శతాబ్దానికి చెందిన పండిత జగన్నాథ రాయలు మొగలు సామ్రాజ్యాధినేత షాజహాను కొలువులో వుండటం ఒక గొప్ప విశేషం. ఆ నవలపై ప్రముఖుల అభిప్రాయాలను వ్యాసమాలికగా రూపొందించి వైజయంతిగా అందిస్తున్నారు విహారి. ఈ వ్యాసాలు చదివితే తప్పకుండా పండిత జగన్నాథరాయల పుస్తకం కోసం తప్పకుండా వెతుకుతారు మీరు.
పేజీలు : 184, వెల : 200/-, ప్రతులకు : ఫోన్ : 9848025600




📖 **మనలో మాట - డా. వై. రామకృష్ణారావు :** తెలుగు భాషలో చమత్కారాలెక్కువ. మనకు తెలియకుండానే నిత్యజీవితంలో వాడే ఈ పదాల చమత్కారాలను, విరువులను వివరిస్తారు కవి, రచయిత డా. వై. రామకృష్ణారావు. చామనఛాయ అంటూ ఉంటారు కదా. చామన పదం తెలుగులోకి ఎలా వచ్చిందో రచయిత వివరిస్తారు. ఇలాంటి అనేక ఆసక్తికర విషయాలతో కూడిన పుస్తకం మనలోమాట. మనం మర్చిపోతున్న మాటలను ఒకసారి గుర్తు చేసుకుందాం.
పేజీలు : 158 వెల : 150/-, ప్రతులకు : ఫోన్ : 8985743964



# మిసిమి
మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపేతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు | మిసిమి పార్థసారథి వ్యాసాలు | చిత్రకళా నీరాజనం | దూరతీరాలలో... | బహుముఖ బనారస్ | ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం



పురస్కార సాహిత్యం | వ్యాస మంజూష | సారస్వత వ్యాసాలు | చార్లీ చాప్లిన్ | రజ్జు సర్ప భ్రాంతి | బైరన్ | యాత్రా కథనాలు



షెల్లీ జీవిత కథ | దోసిట చినుకులు | నృత్యభారతి | పారిజాతం | సిద్ధార్థ | సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.